
'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 84

శనివారం 9-12-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



గెలిస్తేనే సిరీస్‌లో నిలిచేది

నేడు ఇంగ్లండ్ మహిళల జట్టుతో భారత్ రెండో టీ20 మ్యాచ్ - 13లో



అయిదోసారీ అక్కడే..

6.5 శాతంగా రెపో రేటు కొనసాగింపు.. ఆర్థిక వృద్ధి 7 శాతానికి పెంపు - 13లో



మిజోరం సీఎంగా లాల్దుహోమా

మిజోరం నూతన సీఎంగా జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) నేత లాల్దుహోమా (73) శుక్రవారం ప్రమాణం చేశారు.

వివరాలు 6లో ▸



జడ్జిలు బోధనలు చేయరాదు

అప్పీల్‌లో న్యాయ అంశాలనే పరిశీలించాలని, జడ్జిలు వ్యక్తిగత అభిప్రాయాలను వ్యక్తపరచి, బోధనలు చేయరాదని సుప్రీం కోర్టు పేర్కొంది.


వివరాలు 6లో ▸



ఉల్లి ఎగుమతులపై కేంద్రం నిషేధం

దేశీయంగా ఉల్లి ధరలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో వాటి ఎగుమతులపై నిషేధం విధిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.


వివరాలు 6లో ▸



దోచిన ప్రతి పైసా కక్కిస్తాం

ప్రజల నుంచి గతంలో మీరు దోచుకున్న ప్రతి పైసానూ కక్కించి దాన్ని ప్రజలకు తిరిగిస్తానని విపక్షాలను ప్రధాని మోదీ హెచ్చరించారు.

వివరాలు 6లో ▸



బాబు కోర్టు ధిక్కారం

- బెయిల్ షరతులు ఉల్లంఘించి మరీ ఉపన్యాసం
- తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనలో తన కేసు గురించి ప్రస్తావన
- స్కిల్ స్కాం గురించి మాట్లాడకూడదని చెప్పిన హైకోర్టు, సుప్రీంకోర్టు
- కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా ప్రసంగం
- తప్పు చేయకుండా తనను జైల్లో పెట్టారంటూ వ్యాఖ్యలు
- బెయిల్ షరతులు చంద్రబాబు ఉల్లంఘించినందున బెయిల్ రద్దును కోరవచ్చంటున్న న్యాయ నిపుణులు

10 లో

అండగా నేనున్నా

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు సీఎం జగన్ ఓదార్పు

- ఈ నష్టం, కష్టం చెప్పలేనంత బాధ కలిగిస్తోంది.. ఏ ఒక్కరినీ నష్టపోనివ్వం
- తిరుపతి, బాపట్ల జిల్లాల్లో పర్యటించి పంట నష్టం పరిశీలన
- దెబ్బతిన్న వరి పొలాలను చూసి చలించిపోయిన సీఎం.. 80 శాతం సబ్సిడీతో రైతన్నలకు విత్తనాల సరఫరా
- కోతకు గురైన స్వర్ణముఖిపై రూ.30 కోట్లతో హైలెవల్ బ్రిడ్జికి ఆమోదం
- నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటానని భరోసా
- రోడ్ల మరమ్మతులు, పునరుద్ధరణకు రూ.32 కోట్లతో ప్రతిపాదనలు

2 లో



బాపట్ల జిల్లా బుద్దాం గ్రామంలో వర్షానికి తడిసిన వరి కంకులను పరిశీలిస్తూ రైతులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అపోహలొద్దు.. ఆదుకుంటాం

సంక్రాంతి లోపు రైతన్నకు ఇన్‌పుట్ సబ్సిడీ: సీఎం జగన్

2 లో

80 శాతం సబ్సిడీతో వెంటనే శనగ విత్తనాలు.. జూన్ నాటికి రైతు భరోసాతోపాటు ఇన్సూరెన్స్ చెల్లిస్తాం

బాపట్ల జిల్లాలో పంట నష్టాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి

ఇటు ప్రకటన.. అటు సాయం..

3 లో

పునరావాస కేంద్రాలకు రాకున్నా తుపాను సాయం

ప్రతి కుటుంబానికి రూ.2,500 చొప్పున ఇవ్వాలని సీఎం జగన్ ఆదేశం

నిరుద్యోగులకు మరో శుభవార్త

- గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల చేసిన ఏపీపీఎస్సీ
- 81 పోస్టులు భర్తీ చేయనున్న కమిషన్
- జనవరి 1 నుంచి 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- మార్చి 17న ఆఫ్‌లైన్‌లో ప్రిలిమ్స్ నిర్వహణ.. నెలాఖరులోగా మరిన్ని నోటిఫికేషన్ల విడుదలకు ప్రణాళిక

3 లో





జారిపడ్డ కేసీఆర్

బాత్రూంలోకి వెళ్లే క్రమంలో లుంగీ కాళ్లకు తగలడంతో పడిపోయిన తెలంగాణ మాజీ సీఎం

తుంటి ఎముక విరగడంతో యశోద ఆస్పత్రిలో హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ నిర్వహించిన వైద్యులు

- వివరాలు 10లో



వైద్యశాఖలో 170 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్

విడుదల చేసిన ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు

డీఎంఈ పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, విమ్స్‌లో ఖాళీల భర్తీ

- వివరాలు 3లో



మహువాపై వేటు

లోక్ సభ సభ్యత్వం రద్దు

నోటుకు ప్రశ్నల ఉదంతంలో స్పీకర్ నిర్ణయం

మూజువాణి ఓటుతో సభ ఆమోదం


తీవ్రంగా తప్పుబట్టిన విపక్షాలు, తృణమూల్

6 లో

ఇదం జగత్



ఈసారి సమావేశాల్లో చికెన్ బిర్యానీ, మటన్ కర్రీ, ఫిష్‌ఫ్రై, వగైరా వగైరా పెట్టి వాళ్లకి ధీటుగా సమాధానం చెబుదాం!



సోమశిల..జలకళ

బి.కొత్తకోట: మిచాంగ్ తుపాను ప్రభావంతో అన్నమయ్యజిల్లాలో కురిసిన భారీ వర్షాలకు సుమారు రెండు టీఎంసీల వరద జలాలు సోమశిల ప్రాజెక్టులోకి చేరాయి. జిల్లాలో నీటి నిల్వకు అవకాశం లేకపోవడంతో స్థానికంగా సద్వినియోగం చేసుకునే పరిస్థితి లేకపోయింది. ఈనెల 4–5 తేదీల్లో జిల్లాలో మిచాంగ్ తుపాను ప్రభావం తీవ్రంగా చూపింది. జిల్లా తూర్పు ప్రాంతాల్లో మాత్రమే భారీ వర్షాలు నమోదయ్యాయి.

నిండుగా నదులు

మిచాంగ్ తుపానుకు జిల్లాలోని నదులు నిండుగా ప్రవహించాయి. తిరుపతిజిల్లా తిరుమల పైనున్న పాపవినాశం డ్యామ్ నిండింది. అక్కడినుంచి వాగేటివాగులో కలిశాక నీటి ప్రవాహ ఉధృతి పెరిగింది. డ్యామ్ నుంచి 8–10 వేల క్యూసెక్కుల నీళ్లు ప్రవహించగా కోడూరు దాటాక గుండాల ఏరు, గుంజానా నది కలిసిన ప్రాంతంలో నీటి ప్రవాహ సామర్థ్యం 20వేల క్యూసెక్కులకు పెరిగింది. కేవిపల్లె మండలంలోని ఝరికోన ప్రాజెక్టు నిండింది. దీంతో పింఛానదిలో 1,200 క్యూసెక్కుల నీళ్లు ప్రవహించాయి. నిమ్మనపల్లె మండలం నుంచి బాహుదా నదిలో 1,300 క్యూసెక్కులు, చెయ్యేరు నదిలో 5,600 క్యూసెక్కులు, అన్నమయ్య నుంచి 5,400 క్యూసెక్కుల నీళ్లు ప్రవహించాయి. ఈ నదుల నుంచి ప్రవహించిన వరద జలాలు అనంతరాజుపేట వద్ద చెయ్యేరు నుంచి పెన్నా నదిలోకి చేరిన ప్రవాహం చివరగా సోమశిల ప్రాజెక్టులోకి చేరాయి. పాపవినాశం డ్యామ్ నుంచి అత్యధికంగా అర టీఎంసీ నీళ్లు ప్రవహించాయి. మిచాంగ్ తుపానుతో పెద్దేరు, ఝరికోన ప్రాజెక్టులు నిండగా మొత్తానికి రెండు టీఎంసీల దాకా వరద జలాలు జిల్లా నుంచి సోమశిలకు చేరాయి. వర్ష ప్రభావం వెలిగల్లు ప్రాజెక్టుపై చూపలేదు. ఈ ప్రాజెక్టులోకి చుక్కనీరు చేరలేదు.

కోడూరులో 356 మి.మీ వర్షం

జిల్లాలోని 30 మండలాల్లో.. తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో మిచాంగ్ తుపాను ప్రభావం తక్కువ. మిగిలిన మండలాల్లో అత్యధిక వర్షపాతం కోడూరులో నమోదైంది. ఈనెల 4 నుంచి 6 వరకు కోడూరులో 356.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చిట్వేలిలో 292.6, పెనగలూరులో 259.2, నందలూరులో 153.6, చిన్నమండెంలో 103.4, సంబేపల్లెలో 114.4, టి.సుండుపల్లెలో 131.8, రాజంపేటలో 146.2, పుల్లంపేటలో 108.2, ఓబులవారిపల్లెలో 184.4, కలకడలో 101, కేవిపల్లెలో 133.2, పీలేరులో 117.6, కలికిరిలో 121.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గాలివీడులో 75 మి.మీ, రాయచోటిలో 83, లక్కిరెడ్డిపల్లెలో 66.2, రామాపురంలో 76, వీర బల్లిలో 88.6, తంబళ్లపల్లెలో 55.4, పెద్దమండ్యంలో 91, గుర్రంకొండలో 87.2, కురబలకోటలో 63.6, పెద్దతిప్పసముద్రంలో 43.2, మదనపల్లెలో 49.6, నిమ్మనపల్లెలో 50.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

4 మండలాల్లో అత్యల్పం

తుపాను ప్రభావంలోనూ నాలుగు మండలాల్లో అత్యల్ప వర్షం కురిసింది. పెద్దతిప్పసముద్రంలో 12.2 మిల్లీమీటర్లు, రామసముద్రంలో 9.8, ములకలచెరువులో 11.8, బి.కొత్తకోటలో 27.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కాగా జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైన మండలాల్లో భూగర్భ జలాలు వృద్ధి కానున్నాయి. వ్యవసాయం, తాగునీటికి ఇబ్బందులు ఉండవు.

వెలిగల్లు నుంచి పెన్నాలోకి 24 టీఎంసీలు

తుపానులు, భారీ వర్షాలు కురిసినప్పుడు జిల్లాలో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసుకునే పరిస్థితి లేకపోవడంతో నీళ్లన్నీ పెన్నా పాలవుతోంది. వర్షపునీళ్లు రెండు టీఎంసీల దాక పెన్నాలో కలిసి సోమశిలకు చేరాయి. గత ఏడాదిలో పరిస్థితిని పరిశీలిస్తే..తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల నుంచి (ఎగువన కర్ణాటక నుంచి వచ్చే నీళ్లు కలుపుకుని) ప్రాజెక్టులోకి 25 టీఎంసీల నీరు చేరింది. ఈ స్థాయిలో నీరు నిల్వ చేసుకునే పరిస్థితి లేకపోవడంతో జలవనరులశాఖ వెలిగల్లు ప్రాజెక్టు నుంచి 25.913 టీఎంసీల నీళ్లు విడుదల చేయగా పెన్నా నదిలో కలిసిపోయాయి. ఇంతటి స్థాయిలో నీటిని జిల్లాలో సద్వినియోగం చేసుకోవడం, నిల్వ చేసుకునే ప్రాజెక్టులు లేకపోవడంతో నీళ్లన్ని పెన్నాలోకి వదలాల్సి వస్తోంది.

వైవిధ్య 'వరి'వడి

విభిన్న వంగడాలతో వినూత్న వ్యవసాయం

ఏటా కొత్త కొత్త వరి వంగడాలతో సాగు

ఇప్పటికే 50కి పైగా దేశీయ వంగడాలతో వ్యవసాయం

పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు

రైతులకు స్ఫూర్తినిస్తున్న అట్లూరి బాలసత్యనారాయణ



ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మైసూర్ మల్లిక రకం దేశీయ వరి వంగడం పొలం

కృష్ణాడెస్క్: నేల తల్లిని నమ్ముకున్న సాధారణ రైతుకు ఎప్పటికప్పుడు వినూత్న పోకడలు, నూతన అన్వేషణలతో సాగు చేపట్టడం ఒకింత కష్ట సాధ్యమే. అయితే బాపులపాడు మండలం వైకుంఠ లక్ష్మీపురానికి చెందిన రైతు అట్లూరి బాల సత్యనారాయణ ఏటా సరికొత్త దేశీయ వరి వంగడాలతో వ్యవసాయం చేస్తూ తనకంటూ ఓ ప్రత్యేకతను సొంతం చేసుకున్నారు. 27 ఏళ్లుగా రకరకాల వరి వంగడాలతో సాగు చేస్తూ తోటి రైతులకు స్ఫూర్తిగా నిలిచారు. ఏటా కొత్తరకం వరి రకాలను ఎంపిక చేసుకోవటం, ఆ విత్తనాల కోసం అన్వేషించడం ఆయనకు సర్వసాధారణం. అందరిలా ఒకే రకం వరి విత్తనాలను సాగు చేయటం కంటే ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ ఆరోగ్యకరమైన పంటను అందించే వంగడాలను ఎంపిక చేసుకోవటం ఎంతో మేలనే తలంపుతో ఆయన వ్యవసాయం సాగిస్తున్నారు.

9 ఏళ్లలో 50కిపైగా కొత్త వంగడాలు..

అట్లూరి బాల సత్యనారాయణ తనకున్న నాలుగు ఎకరాల పొలంలోనే ఏటా నాలుగైదు రకాల దేశీయ వరి వంగడాలతో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. మూస ధోరణిలో ఏటా ఒకే రకం ధాన్యాన్ని పండించడం కంటే పూర్వకాలం నుంచి అందుబాటులో ఉన్న ఎన్నో రకాల దేశీయ వంగడాలను సాగు చేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన ఆయనకు వచ్చింది. 1996 నుంచి ఆ దిశగా అన్వేషణ సాగించి, ఏటా కొత్త కొత్త వరి వంగడాలను సాగు చేస్తున్నారు. వీటి కోసం ఆయన ఏపీతో పాటుగా పొరుగు రాష్ట్రాల్లోనూ సొంత ఖర్చులతో తిరిగి ఎంతో శోధించారు. ఎక్కడ కొత్త దేశీయ వరి వంగడం ఉందని తెలిసినా వెంటనే ఆ గ్రామానికి వెళ్లి అక్కడి పంట తీరు పరిశీలించటం, ఆ రైతు అనుభవాలు తెలుసుకోవటం బాల సత్యనారాయణకు అలవాటుగా మారింది. ఈ నేపథ్యంలోనే 2015లో తూర్పుగోదావరి జిల్లా సర్పవరంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై సుభాష్ పాలేకర్ నిర్వహించిన ఎనిమిది రోజుల శిబిరానికి వెళ్లిన అట్లూరి బాల సత్యనారాయణ దేశీయ వంగడాల సాగుపై మరింత మక్కువ పెంచుకున్నారు. దాదాపు 50కి పైగా విభిన్న రకాల వరి వంగడాలను ఆయన సాగు చేశారు. తొమ్మిదేళ్లలో 54 రకాల దేశీయ వరి వండగాలను సాగు చేశారు. ఈ ఏడాది మణిపూర్ బ్లాక్ (నల్ల బియ్యం), మా పిళ్లై సాంబ (ఎరుపు రంగు బియ్యం), గోదావరి ఇసుకలు, మైసూర్ మల్లిక రకం దేశీయ వంగడాలను సత్యనారాయణ సాగు చేశారు.



వివిధ రకాల వరి ధాన్యం

సగటున 22 బస్తాల దిగుబడి..

ఏటా తాను సాగు చేసిన వరి వంగడాల పేర్లు, సాగులో చేపట్టిన పద్ధతులు, పంట కాలం, దిగుబడి వివరాలను ఎప్పటికప్పుడూ డైరీలో పొందుపర్చటం అట్లూరి బాల సత్యనారాయణకు అలవాటు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించటం వల్ల పంట కాలం 130 నుంచి 155 రోజులు పడుతోందని, ఎకరాకు సగటున 22 బస్తాల ధాన్యం దిగుబడి వస్తోందని బాల సత్యనారాయణ తెలిపారు. తనను కలిసిన ఔత్సాహిక రైతులకు దేశీయ వరి వంగడాల విత్తనాలు అందిస్తూ, సాగు విధానాలను వివరిస్తున్నానని పేర్కొన్నారు. విభిన్న రకాల దేశీయ వరి వంగడాలు, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల వినియోగంపై ఆసక్తి చూపుతున్న వినియోగదారుల డిమాండ్ ఉండటం వల్ల తనకు మార్కెటింగ్ ఇబ్బంది లేదని చెప్పారు.

సేద్యంపై మక్కువతోనే..

వ్యవసాయ కుటుంబం కావటంతో చిన్నప్పటి నుంచి కొత్త పద్ధతులలో సాగు చేయటంపై ఆసక్తి ఏర్పడింది. ఇప్పటి వరకూ 54 రకాల దేశీ వరి వంగడాలను సాగుచేశాను. కొత్త కొత్త దేశీయ వరి వంగడాల కోసం అన్వేషణ సాగిస్తున్నాను. నేను సాగుచేసిన దేశీయ రకం వరి విత్తనాలను ఔత్సాహిక రైతులకు అందిస్తున్నాను. పూర్తిగా గో ఆధారిత, ప్రకృతి వ్యవసాయ పద్ధతులలోనే సాగు చేస్తూ ఎకరానికి కనీసం 22 బస్తాలకు తగ్గకుండా దిగుబడి సాధిస్తున్నా. నాతో పాటుగా మరికొంత మంది రైతులకు ఈ విధానం నేర్పించాలని నా కోరిక.

– అట్లూరి బాల సత్యనారాయణ, వైకుంఠ లక్ష్మీపురం

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

అద్దె ఇంటి బాధలు తప్పాయి



నెల్లూరు జిల్లా గూడూరు మున్సిపాలిటీలోని చవటపాళెంలో ఆరేళ్లుగా అద్దె ఇంట్లో భారంగా నివసించేవాళ్లం. నా భర్త షరీఫ్ కారు డ్రైవర్. వచ్చే కొద్దిపాటి ఆదాయంలో సగానికిపైగా అద్దెకు పోయేది. మిగిలిన డబ్బులతో నెల మొత్తం తినీతినక గడుపుతూ వచ్చేవాళ్లం. సొంతిల్లనేది ఉంటే మాకు బాధలు తప్పుతాయనుకొనేవాళ్లం. దీంతో గత ప్రభుత్వంలో నివాసన స్థలం కోసం చాలా సార్లు నాయకులు, అధికార్లను సంప్రదించాం. కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేదు. అయితే జగన్‌అధికారంలోకి వచ్చిన తర్వాత నియమించిన వలంటీర్ నేరుగా మా ఇంటికి వచ్చి నివేశ స్థలం ఇస్తారని చెప్పారు. దరఖాస్తు చేయగానే మంజూరైందనే కబురు చెప్పారు. పక్కా ఇల్లు కూడా వచ్చిందని చెప్పడంతో నమ్మలేక పోయాము. తర్వాత గృహ నిర్మాణ శాఖ అధికారులు స్థలం, పొజిషన్ సర్టిఫికెట్‌తో పాటు పక్కా గృహం మంజూరు పత్రాన్ని అందజేయడంతో సంతోషించాం. గాంధీనగర్ ప్రాంతంలోని జగనన్న అర్బన్ లేఅవుట్‌లో ఒకటిన్నర సెంటు స్థలం ఇవ్వడంతోపాటు పక్కా ఇల్లు కట్టుకోవడానికి అనుమతిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలే కాకుండా మా దగ్గర ఉన్న కొంత డబ్బుతో ఇంటిని అందంగా కట్టుకున్నాం. బెడ్‌రూమ్, హాల్, కిచెన్, వరండా, బాత్‌రూం నిర్మించుకున్నాం. ఇప్పుడు మాకు చాలా సౌకర్యవంతంగా ఉంది. మా సొంతింటి కల నెరవేరింది.

– షేక్ నూర్జహాన్, చవటపాలెం.
(పి.రవి, విలేకరి గూడూరు రూరల్)

పెట్టుబడి సాయం ఆదుకుంది..



నాది నిరుపేద కుటుంబం. నా భార్య శాంతమ్మ, నేను కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకునే వాళ్లం. ఈ క్రమంలో కూలి పనులు చేయలేక గత 20 సంవత్సరాలుగా ఆరు ఎకరాల భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నా. మూడు ఎకరాల భూమిలో వరి, మరో మూడు ఎకరాల మెట్ట భూమిలో పత్తి పంటను సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించడంతో పాటు మా ఇద్దరు పిల్లల వివాహాలు కూడా చేశాను. 4 సంవత్సరాల క్రితం వరకు వ్యవసాయ సీజన్ వస్తోందంటే భయమేసేది. ప్రతి సంవత్సరం వ్యవసాయ పనులను ప్రారంభించేందుకు నా భార్య మెడలో పుస్తెలు తాకట్టు పెట్టి వడ్డీకి డబ్బు తెచ్చుకుని పంట సాగు ప్రారంభించే వాళ్లం. ప్రస్తుత ప్రభుత్వం ప్రతి సంవత్సరం కౌలు రైతులకు పెట్టుబడి సాయంగా రూ 13,500 నగదు అందజేస్తోంది. దీంతో నాలుగేళ్లుగా ఆ డబ్బుతో వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను కొనుగోలు చేసుకుంటున్నా. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పుస్తెలు తాకట్టు పెట్టే పరిస్థితి రాలేదు. పంట నష్టపోతే ప్రభుత్వం నష్టపరిహారం కూడా అందిస్తోంది. కౌలు రైతులను కూడా ప్రోత్సహిస్తున్న ప్రభుత్వానికి నాలాంటి కౌలు రైతులందరూ రుణపడి ఉంటారు. ప్రస్తుతం నేను రూపాయి అప్పు లేకుండా వ్యవసాయం చేసుకోగలుగుతున్నా. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలవడం చాలా బాగుంది.

– పాపట్ల కోటేశ్వరరావు, కేతవీరునిపాడు, నందిగామ మండలం, ఎన్టీఆర్ జిల్లా
(మొవ్వా అనిల్‌కుమార్, విలేకరి, నందిగామ)

నా బిడ్డకు ప్రాణం పోశారు



నా కుమార్తె మూడు రోజులు ఆస్పత్రిలో ఉలుకు పలుకు లేకుండా పడి ఉంది. ఆపరేషన్ అవసరమని వైద్యులు చెప్పారు. మాది మధ్యతరగతి కుటుంబం. గుంటూరులోని కొత్తపేట మంగళబావి వీధిలో నివసిస్తున్నాం. నేను దివ్యాంగురాలిని కావడంతో ఏ పని చేయలేను. మా ఆయన డ్రైవర్. మాకు ఇద్దరు ఆడపిల్లలు. ఆయనకు వచ్చే అరకొర ఆదాయంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. ఇంతకూ ఏం జరిగిందంటే.. 2022లో పదో తరగతి పరీక్షలు రాసిన పెద్ద కుమార్తె రూపసాయిశ్రీ నంబూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడింది. తలకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తం ఆగలేదు. ఏం చేయాలో పాలుపోలేదు. మంగళగిరి ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చేర్పించాం. ఎంత ఖర్చు అవుతుందోనని ఆందోళన చెందాం. బిడ్డ ప్రాణాలతో తిరిగి వస్తే చాలనుకున్నాం. తలకు గాయం కావడంతో ప్రత్యేక శస్త్ర చికిత్సలు చేయాలని వైద్యులు సూచించారు. సుమారు రూ.4 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. అంతమొత్తం ఎలా అని భయపడ్డాం. ఆ సమయంలో ఆరోగ్య శ్రీ ఆదుకుంది. ఈ పథకం ద్వారా రూపాయి ఖర్చు లేకుండా మెరుగైన వైద్యాన్ని అందించి వైద్యులు నా బిడ్డ ప్రాణాలు కాపాడారు. ఈ రోజు ఆమె మాతో ఉందంటే అదంతా సీఎం జగన్ చలువే. అమ్మ ఒడి అందడం వల్ల నా చిన్న కుమార్తె చక్కగా చదువుకుంటోంది. నాకు ప్రతి నెల రూ.3 వేలు దివ్యాంగ పింఛను అందుతోంది. అందరం ఆనందంగా ఉన్నాం.

– కుమార్తెలతో దళవాయి లక్ష్మీప్రసన్న, కొత్తపేట, గుంటూరు
(పి.ప్రశాంత్ (నాని), విలేకరి, పట్నంబజారు)

మానవత్వంతో స్పందించిన సీఎం

ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఇద్దరికి తక్షణ ఆర్థిక సాయం



సీఎం జగన్‌కు కష్టాలు చెప్పుకొంటున్న కవిత



జేసీ చేతుల మీదుగా చెక్కును అందుకుంటున్న కవిత

సాక్షి, తిరుపతి: ఆర్థిక సాయం కోసం ఆపన్న హస్తం కోరిన వారికి మానవత్వంతో స్పందించి వెంటనే ఆర్థిక సాయం అందించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డిని సీఎం జగన్ ఆదేశించారు. స్థానికుల నుంచి వినతులను స్వీకరించి వాటినీ పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. తుపాను వల్ల పంటలు నష్టపోయిన బాధితులతో ముఖాముఖి కార్యక్రమంలో శుక్రవారం తిరుపతి జిల్లా వాకాడు మండలం బాలిరెడ్డి పాళెంకు సీఎం వచ్చారు. ఆయనను కుటుంబ యాజమానులను కోల్పోయి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పి.రమణమ్మ, ఐ.కవిత కలిసి తమకు సాయం చేయాలని కోరారు. దీంతో సత్వరమే స్పందించిన సీఎం..తిరుపతి జిల్లా కలెక్టర్ కే వెంకట రమణారెడ్డిని ఇరువురికీ ఆర్థిక సాయాన్ని అందజేయాలని ఆదేశించారు. సీఎం సూచనల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ ఇద్దరు మహిళలరూ రూ.లక్ష వంతున చెక్కులను అందజేశారు.



రమణమ్మ సమస్య తెలుసుకుంటున్న సీఎం వైఎస్ జగన్



జేసీ చేతుల మీదుగా చెక్కును అందుకుంటున్న రమణమ్మ



బాధితుల కష్టాలు విని వారిని ఓదార్చుతున్న ముఖ్యమంత్రి జగన్



స్వర్ణముఖి నది కోత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



చిన్నారులతో ఆప్యాయంగా..

అండగా నేనున్నా

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు సీఎం జగన్ ఓదార్పు



తిరుపతి జిల్లాలో తుపాను నష్టానికి సంబంధించిన ఫొటో గ్యాలరీని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి తిరుపతి: అధైర్యపడొద్దు.. అండగా నేనున్నానంటూ తుపాను బాధితులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారు. మిచాంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం తిరుపతి, బాపట్ల జిల్లాల్లో పర్యటించి బాధితులను స్వయంగా కలుసుకుని పరామర్శించారు. పంట చేతికొచ్చే సమయంలో రైతన్నకు జరిగిన అపార నష్టాన్ని చూసి చలించిపోయారు. ఖరీఫ్ సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని, పంట నష్టపోయిన రైతులకు 80% రాయితీతో శనగ విత్తనాలను సరఫరా చేస్తామన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తీసుకొచ్చిన వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అందరినీ ఆదుకుంటామని హామీ ఇచ్చారు. విపత్తు వేళ అధికార యంత్రాంగం వెంటనే అప్రమత్తమై బాధిత ప్రాంతాల్లో విద్యుత్తు పునరుద్ధరణకు చర్యలు తీసుకుందన్నారు. గన్నవరం నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న సీఎం జగన్ తొలుత తిరుపతి, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిలాల్లోని తుపాన్ బాధిత ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. అనంతరం కోట మండలం విద్యానగర్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామానికి చేరుకుని కోతకు గురైన స్వర్ణముఖి నది, వరి పంటలను పరిశీలించారు. స్వర్ణముఖి కోతకు గురి కావటానికి కారణాలను ఆరా తీశారు. బాలిరెడ్డిపాళెంలో తుపాను బాధితులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

చెప్పలేనంత బాధగా ఉంది..

ఈ ప్రాంతంలో కురిసిన వర్షాలు జిల్లా మొత్తం సగటుతో పోల్చుకుంటే అందులో సగం ఈ నాలుగైదు రోజుల్లోనే కురిసింది. దాదాపు 40 – 60 సెంటీమీటర్ల వర్షం కురిసిన పరిస్థితి. మనందరికీ జరిగిన ఈ నష్టం, కష్టం చెప్పడానికి కూడా సాధ్యపడనంత బాధ కలిగిస్తున్నాయి. ఇక్కడ దాదాపు 92 సహాయ శిబిరాలను ఏర్పాటు చేసి 8,364 మందిని తరలించాం. 25 కిలోల రేషన్ బియ్యం, కేజీ కందిపప్పు, బంగాళాదుంపలు, ఉల్లిగడ్డలు, లీటరు పామాయిల్ చొప్పున దాదాపు 60 వేల మందికి పైగా బాధితులకు అందచేశాం. ఏ రాష్ట్రంలోనూ లేని వ్యవస్థ మన రాష్ట్రంలో ఒకటి ఉంది. అది.. వలంటీర్ వ్యవస్థ, సచివాలయాల వ్యవస్థ. అందువల్ల ఎవరికి ఎక్కడ ఏ నష్టం జరిగినా ఆందోళన చెందాల్సిన పనిలేదు. ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని ప్రతి ఒక్కరికీ భరోసా ఇచ్చి చెబుతున్నా. నాకు నష్టం జరిగింది.. కానీ ఎదుటివాడికి మాత్రమే సాయం వచ్చింది.. నాకు రాలేదని అనుకోవాల్సిన పని లేదు. ఏ ఒక్కరినీ నష్ట పోనివ్వం. ప్రతి ఒక్కరికీ మంచి చేసే కార్యక్రమం జరుగుతుంది. పంపిణీ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. 62 వేల కుటుంబాలకు రేషన్ కిట్లు పంపిణీ చేస్తున్నాం. ప్రతి ఇంటికీ రూ.2,500 చొప్పున డబ్బులు ఇచ్చే కార్యక్రమం జరుగుతుంది. దానివల్ల ఇళ్లలోకి నీళ్లు వచ్చిన వారికి, సామాన్లకు నష్టం జరిగిన వారికి, ఇబ్బందులు ఎదుర్కొన్న వారికి కాస్తో కూస్తో ఉపశమనం కలుగుతుంది. ఇవాళ మొదలు పెడితే మరో నాలుగు రోజుల్లో ప్రతి ఇంటికీ వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది వచ్చి ప్రతి ఇంట్లోనూ రూ.2,500 చొప్పున డబ్బులిచ్చే కార్యక్రమాన్ని చేసుకుంటూ వెళతారు. ఈ జిల్లాల్లో స్టాండింగ్ క్రాప్ లేదు కాబట్టి కాస్తో కూస్తో ఊరట. పంటలు వేసి నష్టపోయిన వారికి 80 శాతం సబ్సిడీతో విత్తనాలను అందచేస్తాం. అన్నీ దగ్గరుండి కలెక్టర్లు పర్యవేక్షిస్తారు. ఈ రోజు నుంచి వారంలోగా ప్రతి ఒక్కరికీ జరగాల్సిన మంచి జరుగుతుంది.

రెట్టించిన వేగంతో యంత్రాంగం

తుపాన్ ప్రాంతాల్లో విద్యుత్తును చాలా వేగంగా పునరుద్ధరించారు. యంత్రాంగం అంతా ఇక్కడే నిమగ్నమై రెట్టించిన వేగంతో పని చేస్తున్నారు. ఇంకా కొన్ని కాలనీల్లో విద్యుత్తు లేని పరిస్థితి ఉంటే వలంటీర్ల ద్వారా వివరాలను సేకరించి కలెక్టర్లు సమస్యను పరిష్కరిస్తారు. ఈ ప్రభుత్వం అన్ని రకాలుగా మీకు తోడుగా ఉంటుందని మరోసారి చెబుతున్నా.

> **ఈ ప్రభుత్వం మీదే..**
>
> ఇక్కడికి రాకముందు స్వర్ణముఖి నదిలో కోత కారణంగా ఎలాంటి నష్టం జరిగిందో స్వయంగా చూశా. దానికి శాశ్వత పరిష్కారం వెతకాలని చెప్పా. హైలెవల్ బ్రిడ్జి కడితే బాగుంటుందని, అందుకోసం రూ.30 కోట్లు ఖర్చవుతుందని చెప్పారు. ఈ సమస్యను తీరుస్తూ హైలెవల్ బ్రిడ్జిని శాంక్షన్ చేస్తున్నా. జిల్లాలో 110 చెరువులు ఉండగా కొన్ని చోట్ల కోతకు గురయ్యాయి. రోడ్ల మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుడతాం. రోడ్లు, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతుల కోసం రూ.32 కోట్ల ప్రతిపాదనలు అందాయి. యుద్ధ ప్రాతిపదికన దీన్ని చేపట్టే కార్యక్రమాలు జరుగుతాయి. ఈ ప్రభుత్వం మీది అనే విషయాన్ని గుర్తు పెట్టుకోండి. ఈ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ మంచే జరుగుతుంది. అంతేకానీ చెడు అనేది ఎప్పుడూ జరగదు. ఏ చిన్న సమస్యైనా, వాళ్లకు రావాల్సింది రాని పరిస్థితి ఎక్కడైనా ఎవరికైనా ఉంటే వెంటనే 'జగనన్నకు చెబుదాం' 1902 నంబర్‌కు ఫోన్ కొట్టండి. నా ఆఫీస్‌కే ఫోన్ వస్తుంది. తుపాన్ బాధిత ప్రాంతాల్లో అందరికీ అన్నీ అందించే బాధ్యతను కలెక్టర్ తీసుకుంటారు. నాలుగైదు రోజుల్లో వారి దగ్గర నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటా.

పాల్గొన్న మంత్రులు, ప్రజా ప్రతినిధులు

సీఎం పర్యటనలో ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, తానేటి వనిత, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్యేలు వరప్రసాద్, కిలివేటి సంజీవయ్య, మేకపాటి విక్రమ్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్సీలు చంద్రశేఖరరెడ్డి, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, మేరిగ మురళీధర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి, నెల్లూరు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, స్వచ్ఛాంధ్ర రాష్ట్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవసేనమ్మ, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

అపోహలొద్దు.. ఆదుకుంటాం

- సంక్రాంతి లోపు రైతన్నకు ఇన్‌పుట్ సబ్సిడీ: సీఎం జగన్
- 80 శాతం సబ్సిడీతో వెంటనే శనగ విత్తనాలు
- జూన్ నాటికి రైతు భరోసాతో పాటు ఇన్సూ్యరెన్స్ చెల్లిస్తాం
- ఈ నష్టం అపారం.. వేగంగా పారదర్శకంగా సాయం అందిస్తాం
- బాపట్ల జిల్లాలో పంట నష్టాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి



బాపట్ల జిల్లాలో తుపాను నష్టానికి సంబంధించిన ఫొటో గ్యాలరీని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తుపాన్‌తో పంటలు నష్టపోయిన అన్నదాతలందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని, ఈ విషయంలో ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్ ముగిసేలోగా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని, పంట నష్టపోయిన వారికి 80 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలు వెంటనే అందిస్తామని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం పాతనందాయపాలెం, బుద్దాం గ్రామాల్లో దెబ్బతిన్న మిరప, వరి పంటలను పరిశీలించిన అనంతరం బాధిత రైతులను సీఎం జగన్ ఊరడించారు. ఎన్నడూ లేనంతగా నాలుగు రోజుల వ్యవధిలో భారీ వర్షాలు కురిశాయన్నారు. ఇంత బాధాకరమైన పరిస్థితులు వచ్చినా ఈ ప్రభుత్వం తోడుగా ఉంటుందన్న నమ్మకం ఇక్కడి రైతన్నల్లో కనిపిస్తోందన్నారు. ఈ ప్రభుత్వం మీది.. మీ ప్రభుత్వంలో అందరికి మంచే జరుగుతుందని కచ్చితంగా చెబుతున్నానన్నారు.

నాలుగు రోజుల్లో..

ఏ రాష్ట్రాలలోనూ లేనిది, మన రాష్ట్రంలోనే ఉన్న గొప్ప వ్యవస్థ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలు. ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా, నష్టం జరిగినా చేయి పట్టుకుని నడిపించే గొప్ప వ్యవస్థలుగా అవి నిలిచాయి. వివక్షకు తావులేకుండా, ఆఖరికి మనకు ఓటు వేయని వారికి నష్టం జరిగినా ఈ ప్రభుత్వం అందరికి తోడుగా నిలుస్తోంది. జరిగిన నష్టాన్ని పారదర్శకంగా గుర్తించి, జాబితాను సచివాలయాల్లో సోషల్ ఆడిట్ కోసం ప్రదర్శిస్తున్నాం. ఎక్కడైనా పొరపాటు జరిగి ఉంటే దాన్ని సరి చేసుకుని మరీ సహాయాన్ని అందిస్తున్న ప్రభుత్వం మనదే. గతంలో కరువులు, వరదలు వచ్చినా పట్టించుకునే పరిస్థితులు లేవు. ఏ రోజు ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుందో, అసలు ఎంతమందికి వస్తుందో కూడా తెలియని దుస్థితి ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మారింది. వరదతో నిండిన గ్రామాల్లో ప్రతి ఒక్కరిని ఆదుకుంటూ రేషన్‌తో పాటు ప్రతి ఇంటికి రూ.2,500 ఇచ్చిన చరిత్ర గతంలో ఎప్పుడూ లేదు. దాదాపు 12 వేల మందికి వారికి 25 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు పామాయిల్, కిలో చొప్పున ఉల్లిపాయలు, బంగాళ దుంపలతోపాటు ప్రతి ఇంటికీ రూ.2,500 ఇస్తున్నాం. ప్రతి ఇంటికీ వలంటీర్ వచ్చి అందచేస్తారు. 4 రోజుల్లో ప్రతి ఇంటికీ పంపిణీని పూర్తి చేస్తాం.



ముఖ్యమంత్రి బాపట్ల ప్రాంతానికి వస్తున్నారని తెలిసి కష్టాలు చెప్పుకొనేందుకు ఓ అవ్వ అక్కడికి చేరుకుంది. సీఎం రానే వచ్చారు. ఆయనను కలిసే హడావుడిలో అవ్వ చేతిలోని సంచి జారి కిందపడిపోయింది. దీనిని గమనించిన సీఎం జగన్.. తన హోదాను పక్కనపెట్టి కిందికి వంగిమరీ ఆ సంచిని తీసుకుని అవ్వ చేతికి అందించారు. ఆ తర్వాత ఆమె చేతిలోని వినతిపత్రాన్ని తీసుకుని చదివి.. సమస్య పరిష్కారానికి భరోసా ఇచ్చారు.

ఇన్సూ్యరెన్స్‌పై 'ఈనాడు' దిక్కుమాలిన రాతలు

మనం యుద్ధం చేస్తున్నది మారీచులతో. ఒక్క చంద్రబాబుతో మాత్రమే కాదు! అదేపనిగా అబద్ధాలనే చూపించే, ప్రచురించే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 లాంటి దుర్మార్గులతో యుద్ధం చేస్తున్నాం. వారు ఉన్నది లేనట్టుగా, లేనిది ఉన్నట్టుగా, జరగనిది జరిగినట్టుగా చూపించి భ్రమ కల్పించే కార్యక్రమాలు చేస్తున్నారు. ఈనాడులో ఇన్సూ్యరెన్స్ గురించి సిగ్గుమాలిన, దిక్కుమాలిన రాతలు రాశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో నష్టం జరిగితే.. మళ్లీ ఖరీఫ్ సీజన్ వచ్చేలోపే ఇన్సూ్యరెన్స్ ఇచ్చింది ఈ ప్రభుత్వంలోనే అన్న సంగతి గుర్తుంచుకోవాలి. జూన్ నాటికి రైతు భరోసాతోపాటు ఈ ఖరీఫ్‌కు సంబంధించిన ఇన్సూ్యరెన్స్ డబ్బులు ఇస్తాం. గతంలో ఇన్సూ్యరెన్స్ ఎప్పుడొస్తుందో, ఎంత మందికి వస్తుందో తెలియదు. అటువంటి పరిస్థితుల నుంచి ఇప్పుడు ప్రతి ఎకరానూ, ప్రతి సచివాలయం పరిధిలో ఈ–క్రాప్ ద్వారా నమోదు చేసి ఏ ఒక్క రైతు మిస్ కాకుండా వారు కట్టాల్సిన ప్రీమియం సొమ్మును కూడా ప్రభుత్వమే చెల్లిస్తూ అన్నదాతలకు ఇన్సూ్యరెన్స్ ఇస్తున్న చరిత్ర దేశంలో ఎక్కడైనా ఉందంటే అది మన రాష్ట్రంలో మాత్రమే. గతంలో చంద్రబాబు పాలనలో వరుసగా కరువు కాటకాలే తాండవించినా ఐదేళ్లలో 35 లక్షల మందికి కేవలం రూ.3,400 కోట్లు మాత్రమే ఇన్సూ్యరెన్స్ కింద ఇచ్చారు. ఇప్పుడు మన ప్రభుత్వంలో ఎక్కడా కరువు కాటకాలు లేకపోయినా నాలుగేళ్లలో 55 లక్షల మందికి రూ.7,800 కోట్ల ఇన్సూ్యరెన్స్ డబ్బులు అందచేశాం. ఈ ఖరీఫ్‌లో రైతన్న ఇబ్బంది పడితే వచ్చే ఖరీఫ్ నాటికి ఇన్సూ్యరెన్స్ కచ్చితంగా వస్తోంది. దేశంలో ఎప్పుడూ చూడని విధంగా ఈ సీజన్‌లో నష్టం జరిగితే ఈ సీజన్ ముగిసేలోగానే ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇచ్చి రైతన్నను ఆదుకుంటున్నది మన ప్రభుత్వమే.

> "పంట నష్టానికి సంబంధించి ప్రతి రైతన్నకూ ఒక్కటే చెప్పదల్చుకున్నా.. ఎవరైనా మీకు ఇన్‌పుట్ సబ్సిడీ రాదనో, ఇంకొకటి రాదనో చెబితే దయచేసి నమ్మవద్దు. ఇక్కడ ఉన్నది మీ బిడ్డ ప్రభుత్వం కాబట్టి ఎటువంటి పరిస్థితుల్లోనూ మీకు అన్యాయం జరగదు"
>
> – బాపట్ల పర్యటనలో సీఎం జగన్

పారదర్శకంగా పంట నష్టం వివరాలు

తుపాను విపత్తు వేళ కలెక్టర్లు అందరూ వెంటనే స్పందించి ఎన్యుమరేషన్ మొదలు పెడుతున్నారు. ఎన్యూమరేషన్ పూర్తైన తర్వాత 15 రోజులు సమయం ఇచ్చి గ్రామ సచివాలయాల్లో జాబితాను పారదర్శకంగా ప్రదర్శిస్తారు. ఈ జాబితాలో ఎవరైనా రైతు మిస్ అయితే, వారి పేరు మళ్లీ చేర్చుకునే అవకాశం ఉంది. వచ్చే నెలలోనే సంక్రాంతిలోపు అర్హులు అందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చేస్తుంది. ఇది కేవలం ఇప్పుడు మాత్రమే కాకుండా గత నాలుగేళ్లుగా ఏటా ఇలానే అమలు చేస్తున్నాం.

డబ్బులిచ్చి.. తగినంత సమయం

ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఏ రకంగా ఇబ్బంది పడే పరిస్థితులు వచ్చినా.. సీఎం హోదాలో నేను వచ్చి జరుగుతున్న పనులను చెడగొట్టి, అధికారులను నా చుట్టూ తిప్పుకుని, ఫొటోలకు పోజులిస్తూ టీవీల్లో, పేపర్లలో రావాలని తాపత్రయపడే వ్యక్తిని కాదు. గతానికి, ఇప్పటికి తేడా అదే. ఏదైనా సంఘటన జరిగితే మీ బిడ్డ కలెక్టర్లకు ఆదేశాలు ఇస్తున్నాడు. ముందుగా కలెక్టర్ల చేతుల్లో వెంటనే డబ్బులు పెట్టి వ్యవస్థను మొత్తం యాక్టివేట్ చేస్తున్నాడు. వారికి సరిపడా వారం రోజులు సమయం ఇచ్చి ఆ తర్వాత బాగా జరిగిందా లేదా? అనేది నిర్ధారించుకునేందుకు స్వయంగా వచ్చి ప్రజలనే నేరుగా అడుగుతున్నాడు. మా కలెక్టర్ బాగా పనిచేశాడు, గొప్పగా పనిచేశాడనే మాట ప్రజల నుంచి రావాలని అధికారులకు చెప్పా. గతంలో చంద్రబాబు కలెక్టర్లకు నిధులు ఇచ్చేవారు కాదు. అసలు 'టీఆర్ 27' అనే పదానికి అర్థమే ఆయనకు తెలియదు. కలెక్టర్లు, తహసీల్దార్లు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల వరకు ప్రతి ఒక్కరూ విపత్తు సమయంలో పరుగులు తీస్తూ ప్రజలకు మంచి చేస్తున్న కార్యక్రమం ఈ ప్రభుత్వంలోనే జరుగుతోంది. ఇప్పుడు జరిగిన నష్టం అపారం. చేయాల్సిన సాయం అంతా పారదర్శకంగా, వేగంగా జరుగుతోంది. గత ప్రభుత్వాల కంటే కచ్చితంగా ఎక్కువే జరుగుతుందని గుర్తుంచుకోవాలి.

పాల్గొన్న మంత్రులు, ప్రజా ప్రతినిధులు

కార్యక్రమంలో మంత్రులు కాకాని గోవర్ధనరెడ్డి, తానేటి వనిత, మేరుగ నాగార్జున, ఎంపీలు నందిగం సురేష్, మోపిదేవి వెంకట రమణారావు, ఎమ్మెల్యేలు కోన రఘుపతి, కరణం బలరాం, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, పోతుల సునీత తదితరులు పాల్గొన్నారు.



నేవీ విన్యాసాలు అదుర్స్..!



బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): నేవీ డేను పురస్కరించుకొని ఆదివారం జరగనున్న వేడుకలకు సంబంధించి రిహార్సల్స్‌తో విశాఖ తీరం హోరెత్తింది. యుద్ధ విమానాల పరాక్రమణ, ఉగ్రవాదుల దాడులను తిప్పికొట్టడం, ఆపదలో ఉన్నవారికి సహాయం అందించడం వంటి ప్రదర్శనలతో నేవీ విన్యాసాలు అదుర్స్ అనిపించాయి. తూర్పు నావికాదళంలో దాగి ఉన్న ఆయుధ సంపదను ఈ సందర్భంగా ప్రదర్శించారు. వీటిని చూసేందుకు నగర వాసులు, నేవీ సిబ్బంది, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నేవీ డే ఏర్పాట్లను తూర్పు నౌకాదళాధిపతి రాజేష్ పెంధార్కర్ పరిశీలించారు. ఆదివారం నిర్వహించనున్న తుది వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పాల్గొంటారు.

‘జాగ్వర్’లు వచ్చేశాయ్..!



సాక్షి, విశాఖపట్నం : విశాఖ విమానాశ్రయంలో శుక్రవారం జాగ్వర్‌లు సందడి చేశాయి. జాగ్వర్‌లంటే అడవుల్లో కనిపించేవి కావు... గాల్లో దూసుకుపోతూ శత్రువులను వణికించే పులులు. వీటినే వైమానిక దళ పరిభాషలో జాగ్వర్ ఎయిర్‌క్రాఫ్ట్స్ అంటారు. ఇప్పటికే భారత నౌకాదళంలో తిరుగులేని సేవలందిస్తున్న జాగ్వర్ ఎయిర్ క్రాఫ్ట్స్ శుక్రవారం తూర్పు నౌకాదళం అమ్ముల పొదిలో చేరాయి. నేవల్ ఎయిర్ స్టేషన్ ఐఎన్ఎస్ డేగాకు మొత్తం నాలుగు జాగ్వర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను కేటాయించారు. అత్యాధునిక సింగిల్ సీట్, మోనోప్లేన్ ట్విన్ ఇంజిన్‌తో ఇవి నడుస్తాయి. టేకాఫ్‌లో 15 టన్నుల గరిష్ట బరువు, ఏకకాలంలో 850 కిలోమీటర్ల దూరం దూసుకెళ్లగల సామర్థ్యం వీటి సొంతం. జాగ్వర్‌ల రాకతో తూర్పు నౌకాదళం మరింత బలోపేతమైందని నౌకాదళ వర్గాలు చెబుతున్నాయి.

క్లుప్తంగా...

కేబినెట్ భేటీ 14కు వాయిదా

సాక్షి, అమరావతి: ఈ నెల 11న జరగాల్సిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం డిసెంబర్ 14కు వాయిదా పడింది. 14న సచివాలయంలో ఉదయం 11 గంటలకు కేబినెట్ భేటీ జరుగుతుందంటూ సీఎస్ జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ఈ సమావేశానికి తీసుకువెళ్లాల్సిన ప్రతిపాదనలను 12న సాయంత్రం 4 గంటల్లోపు సాధారణ పరిపాలన శాఖ కేబినెట్ విభాగానికి పంపాలని అన్ని శాఖలను ఆదేశించారు.

ఉద్యాన వర్సిటీ పీజీ, పీహెచ్‌డీల్లో 71 సీట్లు భర్తీ

తాడేపల్లిగూడెం: హార్టీకల్చర్ పోస్ట్ గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించింది. పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో 50 సీట్లు, పీహెచ్‌డీ కోర్సుల్లో 21 సీట్లు భర్తీ చేశారు. ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని వెంకట్రామన్నగూడెం, అనంతరాజుపేట ఉద్యాన కళాశాలల్లో ఈ కోర్సులు ఉన్నాయి. పీజీ విద్యార్థులకు నెలకు రూ.5వేలు, పీహెచ్‌డీ విద్యార్థులకు నెలకు రూ.7వేల చొప్పున స్టయిఫండ్ అందజేస్తారు.

20, 21 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, అమరావతి: ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్స్(ఐపీఓ), ఏపీ గ్రౌండ్ వాటర్ విభాగంలో టెక్నికల్ అసిస్టెంట్ (జియో ఫిజిక్స్), మైనింగ్ అండ్ జియాలజీలో టెక్నికల్ అసిస్టెంట్, జిల్లా ప్రొహిబిషన్ ఆఫీసర్ (గ్రేడ్-2) పోస్టులకు నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల వివరాలను సర్వీస్ ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఆయా అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాలను ఈ నెల 20వ తేదీన పరిశీలించనున్నట్టు కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్, జూనియర్ ట్రాన్స్‌లేటర్(తెలుగు) పోస్టులకు సంబంధించి అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ఈనెల 21న పరిశీలించనున్నట్టు ప్రకటించారు. అభ్యర్థులు ఆయా తేదీల్లో విజయవాడలోని కమిషన్ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov.inలో చూడాలని ఆయన పేర్కొన్నారు.

తమిళనాడులో స్వల్ప భూ ప్రకంపనలు

సాక్షి, చెన్నై: తమిళనాడులోని చెన్నై శివారులోని చెంగల్పట్టు, తిరుపత్తూరు జిల్లాల్లో కొన్ని చోట్ల శుక్రవారం ఉదయం 7.33 గంటలకు భూమి స్వల్పంగా కంపించింది. భూకంపం వచ్చేసిందన్న ఆందోళనతో జనం ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. శుక్రవారం ఉదయం 7.33 గంటల సమయంలో చెంగల్పట్టు జిల్లా పరిధిలోని కొన్ని ప్రాంతాలలో, తిరుపత్తూరు జిల్లా పరిధిలోని మరికొన్ని ప్రాంతాల్లో స్వల్పంగా భూమి కంపించడాన్ని ప్రజలు గుర్తించారు. భూ కంపం వచ్చేసిందన్న ఆందోళనతో తమ ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. రెండుమార్లు సెకన్ల పాటు భూమి కంపించడంతో ఉత్కంఠ నెలకొంది. భూ పొరలలో పది కి.మీ దూరంలో భూమి స్వల్పంగా కంపించినట్టు పరిశోధకులు గుర్తించారు. రిక్టర్ స్కేల్‌పై 3.2గా భూమి కంపించిన సమాచారం నమోదైంది. ఎటువంటి నష్టం వాటిల్లలేదని అధికారులు పేర్కొన్నారు.

నిరుద్యోగులకు మరో శుభవార్త

గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల ● 81 పోస్టులు భర్తీ చేయనున్న ఏపీపీఎస్సీ



సాక్షి, అమరావతి: ఇప్పటికే 897 పోస్టులతో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేసిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిరుద్యోగులకు మరో శుభవార్త చెప్పింది. రాష్ట్ర స్థాయిలో అత్యున్నత సర్వీసులైన గ్రూప్-1 పోస్టుల భర్తీకి శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 81 గ్రూప్-1 పోస్టులను భర్తీ చేయనున్నట్టు ప్రకటించింది. గురువారం గ్రూప్-2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన వెంటనే మరో నోటిఫికేషన్ విడుదల అవ్వడం పట్ల ఉద్యోగార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రూప్-1 అభ్యర్థులు తమ వన్ టైమ్ ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ (ఓటీపీఆర్) ఆధారంగా జనవరి 1 నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కమిషన్ పేర్కొంది. కొత్త అభ్యర్థులు తొలుత కమిషన్ వెబ్‌సైట్‌లో తమ ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేసుకుని, ఓటీపీఆర్‌తో దరఖాస్తు చేసుకోవాలి. ప్రిలిమినరీ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో మార్చి 17న ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్నట్టు సర్వీస్ కమిషన్ పేర్కొంది. డిస్క్రిప్టివ్ విధానంలో జరిగే మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను త్వరలో ప్రకటించనుంది. కమిషన్ ప్రకటించిన గ్రూప్-1 విభాగంలో 9 డిప్యూటీ కలెక్టర్లు, 18 అసిస్టెంట్ ట్యాక్స్ కమిషనర్స్ పోస్టులు, 26 డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్స్, ఆర్టీవో, గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్స్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి వంటి ఉన్నత స్థాయి పోస్టులు ఉన్నాయి. గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో రెండు పేపర్లు సైతం ఆఫ్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ విధానంలోనే నిర్వహించనున్నారు. మొత్తం పోస్టులు, వేతనం, అర్హతలతో కూడిన పూర్తి సమాచారం కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov.inలో ఉంచినట్టు కార్యదర్శి ప్రదీప్ కుమార్ తెలిపారు. కాగా, ఇప్పటికే ఆర్థికశాఖ అనుమతినిచ్చిన మరికొన్ని పోస్టులకు ఈ నెలాఖరులోగా నోటిఫికేషన్లు ఇచ్చేందుకు ఏపీపీఎస్సీ ప్రణాళిక సిద్ధం చేసింది.

వివాదరహితంగా పోస్టుల భర్తీ

గతంలో ఉండే అనేక న్యాయపరమైన వివాదాలను, చిక్కులను పరిష్కరించి ప్రభుత్వం సర్వీస్ కమిషన్‌లో సంస్కరణలు తీసుకొచ్చింది. దాంతో గతేడాది ఏపీపీఎస్సీ ఇచ్చిన గ్రూప్-1 నోటిఫికేషన్ ద్వారా ఎలాంటి వివాదాలకు తావులేకుండా 11 నెలల కాలంలో పూర్తి పారదర్శకంగా మెయిన్స్, ఇంటర్వ్యూలు కూడా పూర్తి చేసింది. గ్రూప్-1 పరీక్షలు, మూల్యాంకనం, అభ్యర్థుల ఎంపిక సమర్థవంతంగా నిర్వహించి, హేతుబద్ధంగా అభ్యర్థుల వాస్తవిక నైపుణ్యాన్ని అంచనా వేసి ఎంపిక చేశారు. ఈ నియామకాలు అతి తక్కువ సమయంలోనే కమిషన్ పూర్తి చేసింది. ఇదే తరహాలో ఇప్పుడు ప్రకటించిన నోటిఫికేషన్లలో ఇచ్చిన పోస్టులు సైతం సమర్థవంతంగా, సత్వరం భర్తీ చేసేందుకు కమిషన్ ఏర్పాట్లు చేస్తోంది.

వైద్యశాఖలో 170 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య శాఖలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలో ఉండే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 144, విశాఖపట్నంలోని విమ్స్‌లో 26 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్ ద్వారా శాశ్వత, కాంట్రాక్ట్ పద్ధతుల్లో పోస్టుల భర్తీ చేయనున్నట్టు బోర్డ్ మెంబర్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బోధనాస్పత్రుల్లో వివిధ స్పెషాలిటీలలో ఖాళీగా ఉన్న 144 పోస్టుల్ని శాశ్వత ప్రాతిపదికన (డైరెక్ట్/లేటరల్) భర్తీ చేయనున్నారు. ఈ పోస్టుల భర్తీకి ఈనెల 18, 20 తేదీల్లో విజయవాడలోని డీఎంఈ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వాక్‌ఇన్ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తారు. ఇక విమ్స్‌లో 26 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయడం కోసం ఈనెల 15న విశాఖపట్నంలోని విమ్స్‌లోనే వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్ చేపట్టనున్నారు. అర్హులైన అభ్యర్థులు ఆయా తేదీల్లో నిర్ణీత ప్రదేశాలకు స్వయంగా హాజరు కావాల్సి ఉంటుంది. అర్హత, ఇతర నియమనిబంధనలతో కూడిన సమగ్ర నోటిఫికేషన్‌ను https:// dme.ap.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

వైద్యపోస్టుల భర్తీకి బిడ్డింగ్

తమ పరిధిలోని ఆస్పత్రుల్లో శాశ్వత, కాంట్రాక్టు విధానంలో స్పెషలిస్ట్ వైద్యుల నియామకానికి వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్‌తో పాటు గిరిజన ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల ఖాళీలను బిడ్డింగ్ విధానంలో అధిక వేతనంతో నియమించేందుకు కూడా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారులు శుక్రవారం ప్రకటించారు. ఖాళీల భర్తీకి ఈ నెల 11వ తేదీ నుంచి తాడేపల్లిలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కార్యాలయంలో వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్ నిర్వహించనున్నారు. బిడ్డింగ్ విధానంలో నియామకానికి ఆసక్తి చూపే వైద్యులు నిర్ణీత తేదీల్లో వాకింగ్ రిక్రూట్‌మెంట్ వేదిక వద్ద తమ కొటేషన్లను సీల్డ్ కవర్లో ఇవ్వాలని సూచించారు. ఈ విధానానికి సంబంధించిన సవరించిన నోటిఫికేషన్ cfw.ap.gov.in, hmfw.ap.gov.in వెబ్‌సైట్లలో ఉంచారు.

ఇటు ప్రకటన.. అటు సాయం..

- పునరావాస కేంద్రాలకు రాకపోయినా తుపాను ఆర్థిక సాయం
- ప్రతి కుటుంబానికి రూ.2,500 చొప్పున ఇవ్వాలని సీఎం ఆదేశం
- వేగంగా కొనసాగుతున్న నిత్యావసరాల పంపిణీ



పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలిలో ఫీవర్ సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

సాక్షి, అమరావతి: తుపాను బాధితులకు నిత్యావసరాల సరుకులతోపాటు ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణకు ఉపక్రమించింది. ప్రతి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తామన్న ముఖ్యమంత్రి జగన్ ప్రకటనకు అనుగుణంగా రెవెన్యూ శాఖ శుక్రవారం సాయంత్రం జీవో ఆర్‌టీ నెంబర్ 67 జారీ చేసింది. ఇప్పటివరకు పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన బాధితులు ఇళ్లకు తిరిగి వెళ్లేటప్పుడు కుటుంబానికి రూ.2,500 చొప్పున అందిస్తూ వస్తున్నారు. తాజాగా పునరావాస కేంద్రాలకు రాని బాధిత కుటుంబాలకు సైతం ఈ ఆర్థిక సాయాన్ని ఇవ్వాలని సీఎం ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నిత్యావసర సరుకుల పంపిణీ మాదిరిగానే ఈ ఆర్థిక సాయం అందించాలని కలెక్టర్లకు సూచించారు. తిరుపతి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఈ పంపిణీ చేపట్టాలని స్పష్టం చేశారు. ఇప్పటికే 10 వేల కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని పంపిణీ చేయగా మిగిలిన కుటుంబాలకు కూడా అందించాలని కలెక్టర్లను ఆదేశించారు.

2,068 గ్రామాలపై ప్రభావం

మిచాంగ్ తుపాను 15 జిల్లాల పరిధిలో 240 మండలాల్లోని 2,068 గ్రామాలపై ప్రభావం చూపినట్లు తేలింది. ఆయా గ్రామాల్లో బాధితుల కోసం 494 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 31,628 మందికి ఆశ్రయం కల్పించారు. 1,32,569 ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. 3.71 లక్షల మంచినీళ్ల ప్యాకెట్లను సరఫరా చేశారు. తక్షణ వైద్యం కోసం 355 శిబిరాలను ఏర్పాటు చేసి చికిత్స అందించారు. మరోవైపు నిత్యావసరాల పంపిణీ ముమ్మరంగా సాగుతోంది. దెబ్బతిన్న ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం, కేజీ చొప్పున కందిపప్పు, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, లీటర్ వంట నూనె అందించారు. ఇప్పటివరకు 1,02,844 కుటుంబాలకు నిత్యావసరాలు అందించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో తుపాను ప్రభావిత 16 మండలాల్లో రెండో రోజు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 22 వైద్య శిబిరాలు నిర్వహించి 1,500 మందికి వైద్యసేవలు అందించారు. జ్వర పీడితులను గుర్తించేందుకు ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. పొలాల్లో ముంపు నీటిని తొలగించేందుకు 1,080 మంది ఉపాధి కూలీలను వ్యవసాయ సహాయక చర్యలకు వినియోగించారు. వరద నీటితో యనమదుర్రు డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పరీవాహక ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు.

తడిచిన ధాన్యం కొనుగోలు

తడిచిన ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో శుక్రవారం 6,252 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. దీనిలో చాలా వరకు తేమ ఉన్న ధాన్యం కావడం గమనార్హం. కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ నపూర్ అజయ్, సివిల్ సప్లయిస్ జిల్లా అధికారి సుధాసాగర్‌లు ధాన్యం కొనుగోలును పర్యవేక్షిస్తున్నారు. మేజర్ డ్రెయిన్లలో పూడిక తొలగింపు పనులను వేగవంతం చేశారు.

గుండ్లకమ్మకు ‘చంద్ర’ గండం!

నాటి తప్పులే.. నేడు గేట్లకు తుప్పు

- వరద ఉధృతికి రెండో గేటు అడుగున కొట్టుకుపోయిన ఓ భాగం
- రిజర్వాయర్ నిర్వహణను గాలికొదిలేసిన టీడీపీ సర్కార్
- మరమ్మతులు, రంగుల పేరుతో రూ.5.15 కోట్లు స్వాహా
- తుపాను ప్రభావంతో ప్రకాశం జిల్లాలో విస్తారంగా వర్షాలు
- కొట్టుకుపోయిన రెండో గేటు స్థానంలో నేడు పూర్తి స్థాయి స్టాప్‌లాగ్ గేటు
- పది గేట్లకు రూ.9.14 కోట్లతో మరమ్మతుల టెండర్ పిలిచిన సర్కార్



విరిగిపోయిన గేటు నుంచి వెళ్తున్న నీరు



మరమ్మతులు చేస్తున్న అధికారులు

సాక్షి, అమరావతి/ఒంగోలు సబర్బన్: సాగునీటి ప్రాజెక్టుల పట్ల చంద్రబాబు సర్కారు నిర్లక్ష్యం శాపంలా పరిణమించింది! గత సర్కారు నిర్వాకాలతో గుండ్లకమ్మ రిజర్వాయర్ రెండో గేటులో దిగువన తుప్పు పట్టిపోయిన భాగం (8.4 మీటర్ల వెడల్పు, నాలుగు మీటర్ల ఎత్తు) శుక్రవారం రాత్రి వరద ఉధృతికి కొట్టుకుపోయింది. రిజర్వాయర్ గేట్ల మరమ్మతులు, రంగులు పేరుతో టీడీపీ హయాంలో 2014 -2019లో పనులు చేయకుండానే రూ.3.57 కోట్లు దిగమింగేయడం దీనికి కారణం. సుందరీకరణ పేరుతో మరో రూ.1.58 కోట్లు వెరసి రూ.5.15 కోట్లు స్వాహా చేశారు. గేట్లకు రంగులు పూయకపోవడం వల్ల తుప్పు పట్టి బలహీనంగా మారాయి. దీంతో వరద ఉధృతికి గతేడాది ఆగస్టు 31న మూడో గేటు కొట్టుకుపోగా తాజాగా రెండో గేటులో అడుగు భాగం కొట్టుకుపోయింది. చంద్రబాబు హయాంలో నిధులు కాజేయకుండా గేట్లకు మరమ్మతులు చేసి ఉంటే ఈ దుస్థితి దాపురించేది కాదని అధికారవర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

మరమ్మతు టెండర్ ఖరారైన రోజే..

గతేడాది మూడో గేటు కొట్టుకుపోయినప్పుడు యుద్ధప్రాతిపదికన స్టాప్ లాగ్ గేటును ఏర్పాటు చేసిన ప్రభుత్వం రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేసి రైతుల ప్రయోజనాలను కాపాడింది. మరో రెండు గేట్లు బలహీనంగా ఉండటంతో యుద్ధప్రాతిపదికన రూ.1.11 కోట్లు వెచ్చించి మరమ్మతు చేసింది. మిగతా 10 గేట్ల మరమ్మతులు, రంగులు పూయడం, దెబ్బతిన్న గేట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు, కొత్త వైర్ రోప్‌లు, గ్యాంట్రీ క్రేన్ ఏర్పాటు పనులకు రూ.9.14 కోట్లతో టెండర్లు పిలిచింది. వాటిని అధికారులు శుక్రవారం ఖరారు చేశారు. రివర్స్ టెండరింగ్ పద్ధతిలో ఆ పనులను రాజస్థాన్‌కు చెందిన హార్డ్‌వేర్ టూల్స్ అండ్ మెషినరీ సంస్థ దక్కించుకుంది. గేట్ల మరమ్మతు టెండర్ ఖరారైన రోజే వరద ఉధృతికి రెండో గేటు కొట్టుకుపోయింది.

టీడీపీ సర్కార్ అవినీతితో

ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలంలోని కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టును జలయజ్ఞం కింద చేపట్టిన దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 2008 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం జిల్లాలో 80,060 ఎకరాలకు నీళ్లందిస్తున్నారు. విభజన తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ సర్కార్ ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేసింది. గేట్ల మరమ్మతులు, రంగులు పూయడం పేరుతో నిధులు కాజేసింది. దీంతో గేట్లు తుప్పు పట్టిపోయాయి. దీని ఫలితంగానే పులిచింతల ప్రాజెక్టులో ఒక గేటు, గుండ్లకమ్మలో రెండు గేట్లు కొట్టుకుపోయాయి.

యుద్ధప్రాతిపదికన స్టాప్‌లాగ్ గేటు

గుండ్లకమ్మ ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 24.380 మీటర్లు కాగా నీటి నిల్వ సామర్థ్యం 3.86 టీఎంసీలు. ప్రాజెక్టు స్పిల్ వేకు 8.4 మీటర్ల వెడల్పు, 12 మీటర్ల ఎత్తుతో కూడిన 12 గేట్లను అమర్చారు. మిచాంగ్ తుపాన్ ప్రభావం వల్ల ప్రకాశం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకూ పది వేల క్యూసెక్కుల ప్రవాహం ప్రాజెక్టులోకి వచ్చింది. గేట్లు బలహీనంగా ఉండటంతో 2.30 టీఎంసీలను నిల్వ చేస్తూ వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు వదిలేస్తున్నారు. ఈ సమయంలో రెండో గేటు, పదో గేటు మరీ బలహీనంగా ఉన్నట్టు గుర్తించిన అధికారులు ముందు జాగ్రత్త చర్యగా ఒక్కో స్టాప్ లాగ్ ఎలిమెంట్‌ను అడుగు భాగంలో దించారు. అయితే బలహీనంగా ఉన్న రెండో గేటులో 4 మీటర్ల ఎత్తుతో కూడిన ఒక భాగం వరద ఉధృతికి కొట్టుకుపోయింది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 2.30 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. కొట్టుకుపోయిన రెండో గేటు స్థానంలో శనివారం పూర్తి స్థాయి స్టాప్ లాగ్ గేటు అమర్చి నీటిని నిల్వ చేసి ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడతామని సీఈ మురళీనాథ్‌రెడ్డి చెప్పారు.

యథాస్థితికి విద్యుత్ వ్యవస్థ

- మిచాంగ్ తుపాను దెబ్బకు అతలాకుతలమైన విద్యుత్ వ్యవస్థ
- యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు
- ఈపీడీసీఎల్, సీపీడీసీఎల్ పరిధిలో వంద శాతం పూర్తయిన పునరుద్ధరణ
- తీవ్రంగా దెబ్బతిన్న ఎస్పీడీసీఎల్ పరిధిలో నిరంతరాయంగా పనులు



విజయానంద్

సాక్షి, అమరావతి: మిచాంగ్ తుపానుకు అతలాకుతలమైన విద్యుత్ వ్యవస్థను విజయవంతంగా యథాస్థితికి తీసుకొచ్చామని విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు వెల్లడించాయి. ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య పంపిణీ సంస్థల (ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్) పరిధిలో పునరుద్ధరణ పనులు వంద శాతం పూర్తయ్యాయని తెలిపాయి. తీవ్రంగా ప్రభావితమైన దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) పరిధిలో మరమ్మతు పనులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని ఇంధన శాఖకు డిస్కంలు శుక్రవారం నివేదించాయి. ఈ సందర్భంగా జరిగిన టెలీకాన్ఫరెన్స్‌లో తుపానును ఎదుర్కోవడం, పునరుద్ధరణ ప్రణాళిక అమలులో సమర్థవంతంగా పని చేసిన విద్యుత్ సంస్థలను ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అభినందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మార్గదర్శకత్వంలో ఏపీ విద్యుత్ శాఖ సిబ్బంది రేయింబవళ్లు శ్రమించి విద్యుత్ మౌలిక సదుపాయాల పునరుద్ధరణ పనులను విజయవంతంగా పూర్తి చేశారని ఆయన వెల్లడించారు. భారీ గాలులు, వర్షం వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ ఏపీజెన్‌కో ఎండీ, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కేవీఎన్ చక్రధర్ బాబు, డిస్కంల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మాజనార్దన రెడ్డి, కె. సంతోషరావు క్షేత్రస్థాయిలో పునరుద్ధరణ చర్యలను పర్యవేక్షించారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదనే లక్ష్యంతో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, పడిపోయిన విద్యుత్ స్తంభాలను తిరిగి ఏర్పాటు చేయడం, పాడైన ఇన్సులేటర్ల మార్పిడి, విరిగిన కండక్టర్లను సరిచేయడం వంటి పనులను శరవేగంగా పూర్తి చేయించారని తెలిపారు. జిల్లా కేంద్రాల నుంచి తుపాను ప్రభావిత ప్రాంతాలకు అవసరమైన స్తంభాలు, కండక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామాగ్రితో పాటు ప్రత్యేక బృందాలు, ఇతర అన్ని రకాల సామగ్రిని వేగంగా సమకూర్చుకొని పనులు పూర్తి చేశాయని పేర్కొన్నారు. కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి, జిల్లా కేంద్రాల నుంచి క్షేత్రస్థాయి అధికారులను, సిబ్బందిని నిరంతరం పర్యవేక్షించడం వల్ల మరమ్మతు పనులు వేగంగా జరిగాయని తెలిపారు. దెబ్బతిన్న 17 ఫీడర్లలో 14 ఫీడర్లను పునరుద్ధరించామని, తమిళనాడులో విద్యుత్ టవర్ కూలిపోవడం వల్ల మూడు ఫీడర్ల పనులు ఇంకా కొనసాగుతున్నాయని ట్రాన్స్‌కో గ్రిడ్ డైరెక్టర్ ఏవీకే భాస్కర్ వెల్లడించారు. అయినప్పటికీ విద్యుత్ సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని వివరించారు.



“ ఈ అఖిల బ్రహ్మాండంలో గల జడ–చేతనారూపమైన చరాచర జగత్తు సర్వమూ ఈశ్వరవ్యాప్తమై ఉన్నది. ఇది గ్రహించి ఆ ఈశ్వరుడ్ని వెంట వుంచుకునే త్యాగపూర్వకంగా ఐహిక భోగాలు అనుభవించు.

– ఈశావాస్యోపనిషత్తు

సాక్షి

శనివారం, 9 డిసెంబర్ 2023

న్యాయాన్యాయాలు

న్యాయం చేయటమే కాదు... చేసినట్టు కూడా కనబడాలంటారు. శుక్రవారం తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రాను బహిష్కరిస్తూ లోక్‌సభ మూజువాణీ ఓటుతో తీర్మానం ఆమోదించిన తీరు ఈ మౌలిక సూత్రాన్ని విస్మరించింది. మొయిత్రాపై వచ్చిన ఆరోపణల్లోని నిజానిజాలేమిటి, వాటి తీవ్రత ఎంత... ఎథిక్స్ కమిటీ ఆ ఆరోపణలను పరిశీలించవచ్చునా లేదా వంటి సందేహాల వరకూ పోనవసరం లేదు. అసలు బహిష్కరణకు గురయ్యే సభ్యులు ఆ నిర్ణయం పై సభలో తమ స్వరం వినిపించటానికి అవకాశం ఇవ్వకపోవటం సబబేనా? మొన్న 4న మొదలైన పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఈనెల 22వ తేదీ వరకూ సాగుతాయి. నివేదికపై శుక్రవారం అధికార, విపక్షాల మధ్య వాగ్యుద్ధం నడిచింది. ఆమెకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవటాన్ని నిరసిస్తూ విపక్షం వాకౌట్‌చేసింది. ఎథిక్స్ కమిటీలో మొయిత్రాకు అవకాశమిచ్చామని, కానీ అడిగిన వాటికి జవాబులివ్వకుండా ఆమె దూషణలకు దిగారని కమిటీ చైర్మన్ వినోద్‌కుమార్ సోంకార్, కమిటీలోని బీజేపీ సభ్యులు ఇప్పటికే ఆరోపించారు. ఫిర్యాదుకు సంబంధంలేని ప్రశ్నలతో వేధించారని, తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా ఆ ప్రశ్నలున్నాయని మొయిత్రా కూడా ప్రత్యారోపణ చేశారు. ఒకవేళ మొయిత్రా చేసిన ఆరోపణలన్నీ అబద్ధమే అనుకున్నా... అంతమాత్రాన సభలో తన వాదన వినిపించేందుకు ఆమె అనర్హురాలవుతారా? చట్టసభల్లో జరిగే చర్చలు, వాటి ప్రత్యక్ష ప్రసారాలు పాలక, విపక్ష సభ్యుల్లో ఎవరు ఎవరికంటే బాగా మాట్లాడుతున్నారో నిర్ణయించటానికి కాదు. తాము ఎన్నుకున్న సభ్యులు చర్చిస్తున్నదేమిటో, తీసుకుంటున్న నిర్ణయాలేమిటో, వాటిలోని మంచిచెడ్డలేమిటో తెలుసుకోవటం కోసం. మొయిత్రా కావొచ్చు...మరొకరు కావొచ్చు - చర్చ సందర్భంగా అప్రామాణికంగా లేదా అసంబద్ధంగా మాట్లాడితే వారి వాదనలోని డొల్లతనాన్ని ప్రజలే గ్రహిస్తారు. అది పాలకపక్షానికే మంచిది. సభలో అధికారపక్షానికి కావలసినంత మెజారిటీ వుంది. కనుక మొయిత్రాకు అవకాశమిచ్చినంత మాత్రాన కలిగే నష్టం ఏమీ లేదు. అసలు ఎథిక్స్ కమిటీ నివేదికను పార్లమెంటు శీతాకాల సమావేశ ప్రారంభం రోజైన ఈనెల 4నే ప్రవేశపెట్టాలి. కానీ పాలక పక్షం శుక్రవారానికి వాయిదా వేసింది. అయినా ఈ వ్యవహారం ఇలా ముగియటం మన పార్లమెంటరీ వ్యవస్థ లోపాన్ని తెలియజెబుతోంది. నివేదికను కమిటీలోని ఆరుగురు అంగీకరించగా, నలుగురు దాన్ని వ్యతిరేకించారు. ఎథిక్స్ కమిటీ నిర్ణయం సబబే కావొచ్చు... అది మెజారిటీ ప్రకారమే తీసుకుని వుండొచ్చు. కానీ సభలో మొయిత్రాకు అవకాశమీయటంవల్ల ఎంపీగా ఆమె ప్రవర్తనలోని గుణదోషాలను పౌరులు తెలుసుకునే అవకాశం వుంటుంది కదా! దాన్ని నిరాకరించటం ఏం సబబు?

మొయిత్రాపై వున్న ఆరోపణల పూర్వాపరాలు పరిశీలిస్తే పార్లమెంటు సభ్యురాలిగా ఆమె తన పరిమితులు అతిక్రమించారా అన్న సందేహాలు కలుగుతాయి. సభలో వేయదల్చుకున్న ప్రశ్నలను సభ్యులు ఎక్కడి నుంచి అయినా ఎన్ఐసీలో లాగిన్ అయి, నేరుగా స్పీకర్‌కు చేరే విధంగా పోస్ట్ చేయొచ్చు. ఆ ప్రశ్నల అర్హతను స్పీకర్ నిర్ణయించాక అవి సంబంధిత మంత్రిత్వ శాఖలకు వెళ్తాయి. అనర్హ ప్రశ్నలను తొలగిస్తారు. ఇదంతా ఆమె నేరుగా చేసివుంటే ఇంత రచ్చయ్యేందుకు ఆస్కారం వుండేది కాదు. తన స్నేహితుడైన దుబాయ్ రియల్ ఎస్టేట్ వ్యాపారి హీరానందానీకి తన పార్లమెంటు లాగిన్, పాస్‌వర్డ్ అందజేసి అందులో ప్రశ్నలు పోస్ట్ చేయించమని చెప్పారు. తన నియోజకవర్గ పనుల్లో తీరిక లేకుండా వున్నందున ఇలా చేయించానని మొయిత్రా సంజాయిషీ. మామూలుగా ఇది సబబు అనిపించదు. కానీ 800మంది ఎంపీల్లో అత్యధికులు ఇలాగే చేస్తున్నారని, ప్రతిదీ వారే చేయాలంటే అసాధ్యమని ఆమె చెబుతున్నారు. దీనికి సంబంధించి ప్రత్యేక నిబంధనేదీ లేదంటున్నారు. ఒకరిద్దరు సభ్యులు సైతం తామూ అలాగే చేస్తున్నామని చెప్పారు. ఎథిక్స్ కమిటీ మాత్రం ఇది దేశ భద్రతకు ముప్పు తెచ్చే చర్య అంటున్నది. పైగా లంచం తీసుకుని అదానీ సంస్థలపై ఆమె ఈ ప్రశ్నలు వేశారని బీజేపీ సభ్యుల ఆరోపణ. ఈ సందర్భంగా 2005లో ఆన్‌లైన్ పోర్టల్ 'కోబ్రా పోస్ట్' నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్ గురించి ప్రస్తావించుకోవాలి. 11మంది ఎంపీలు ప్రశ్నలు అడిగేందుకు తాము ఇవ్వజూపిన డబ్బు తీసుకున్నారని ఆ పోర్టల్ తేల్చింది. వీరిలో బీజేపీ, కాంగ్రెస్, ఆర్‌జేడీ, బీఎస్పీలకు చెందినవారున్నారు. ఇందులో 10 మంది లోక్‌సభ సభ్యులు, మరొకరు రాజ్యసభకు చెందినవారు. ఇదంతా ఒక చానెల్‌లో ప్రసారమైంది. ఆ ఎంపీలను సభ నుంచి బహిష్కరిస్తున్న సందర్భంలో మాట్లాడిన బీజేపీ సీనియర్ నేత అద్వాణీ ఇందులో అవినీతికన్నా ఎంపీల బుద్ధిహీనత వెల్లడవుతోందన్నారు. అందుకు బహిష్కరణ శిక్ష విధించటం క్రూరమైన చర్యగా అభివర్ణించారు. మొయిత్రా విషయంలో దీన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదా?

అసలు మొయిత్రాపై వచ్చిన ఆరోపణలకు విడిపోయిన ఆమె సహచరుడు జైఅనంత్ దేహద్రాయ్ బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబేకు రాసిన లేఖ ప్రాతిపదిక. మొయిత్రా, దేహద్రాయ్‌లకు బోలెడు తగువులున్నాయి. పెంపుడు కుక్క విషయం మొదలుకొని ఎన్నిటిపైనో పరస్పరం కేసులు పెట్టుకున్నారు. అందువల్ల ఆ లేఖకు ఎంతవరకూ ప్రాధాన్యమీయవచ్చో ఆలోచిస్తే బాగుండేది. అలాగే ప్రభుత్వంపై మొయిత్రా తరచు నిశిత విమర్శలు చేస్తుంటారు గనుక, ఆ కారణంతోనే చర్య తీసుకున్నారన్న అపప్రద రాకుండా చూసుకోవాల్సింది. అసలు ఆమెకు సభలో మాట్లాడే అవకాశమిస్తే ఆదరాబాదరాగా చేశారన్న నిందకు అవకాశం వుండేదే కాదు.

ఎన్నికల ఫలితాలు చెబుతున్నదేమిటి?

సందర్భం



జోయా హసన్

హిందీ ప్రాంతంలో ఇటీవలే ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పొందిన ఘోర పరాజయం, తెలంగాణలో దాని అద్భుతమైన విజయాన్ని మరుగున పడేసింది. 2018లో తాను గెలిచిన మూడు రాష్ట్రాలలో (మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్) కాంగ్రెస్‌కు ప్రస్తుతం అతిపెద్ద దెబ్బ తగిలింది. బీజేపీ సమగ్ర విజయానికి కారణం, ఈ మూడు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో మద్దతు లభించడం. అయితే కాంగ్రెస్ ఓడిపోయినప్పటికీ తన ఓట్ల వాటాను మాత్రం నిలుపుకోగలిగింది. బరిలో నిలిచిన ఇతరుల కారణంగా బీజేపీ అధికంగా ప్రయోజనం పొందింది. ఏదేమైనా, ఈ విజయాలతో 2024లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు, అత్యంత కీలక ప్రాంతంలో బీజేపీ తన ఆధిపత్యాన్ని మరింత విస్తరించుకోగలిగింది.

ఉత్తరాది రాష్ట్రాల్లో ఇటీవలే ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పొందిన ఘోర పరాజయం, తెలంగాణలో దాని అద్భుతమైన విజయాన్ని మరుగున పడేసింది. అయితే కాంగ్రెస్ ఓడిపోయినప్పటికీ మధ్యప్రదేశ్‌లో 40.4 శాతం, రాజస్థాన్‌లో 39.5 శాతం, చత్తీస్‌గఢ్‌లో 42.23 శాతం ఓట్ల వాటాను నిలుపుకోగలిగింది. ఫలితం ఎలా ఉన్నప్పటికీ, లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు లభించిన ఓట్ల శాతానికి గుర్తించదగిన ప్రాముఖ్యత ఉంది.

ముఖ్యంగా రాష్ట్రాల ఎన్నికల్లో స్థానికంగానూ, సార్వత్రిక ఎన్నికల్లో జాతీయంగానూ ఓటర్లకు విజ్ఞప్తి చేయాలనే ఆశతో నిరుద్యోగం, కులవివక్ష వంటి అంశాలను ఎత్తిచూపడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించింది. అయితే, హిందూ జాతీయ వాదం, మతతత్వ రాజకీయాల సమ్మేళనం అనేవి కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం అనేవాటికంటే ఎక్కువ ఆదరణ పొందాయి. హిందూ జాతీయవాద ఏకీకరణతో బీజేపీ సాధించిన విజయాలు, కీలకమైన రాష్ట్రాల్లో అది అస్వాదిస్తున్న గొప్ప ప్రతిధ్వనిని ఎత్తి చూపుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగాన్ని, పుష్కలమైన ఆర్థిక వనరులను ఉపయోగించడం, ఆరెస్సెస్ కేడర్ శక్తిమంతమైన పునాదిగా ఉండటంతో బలమైన దేశం, అభివృద్ధి, సంక్షేమవాదాన్ని కోరుకునే పార్టీగా, హిందూమత ఛాంపియన్‌గా తనను తాను ప్రమోట్ చేసుకోవడానికి బీజేపీకి అవకాశం దొరికింది.

బీజేపీ ఎన్నికల ప్రచారం బలమైన రాష్ట్ర నాయకులను పక్కకు నెట్టివేసి, మొదటి నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పైనే దృష్టి పెట్టింది. ఎన్నికలకు వెళ్లిన ఏ రాష్ట్రంలోనూ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రతిపాదించకూడదని ఆ పార్టీ నిర్ణయించింది. దీనర్థం ఏమిటంటే, అశోక్ గెహ్లోత్, భూపేష్ బఘేల్ వంటి కాంగ్రెస్‌కు చెందిన ప్రముఖ రాష్ట్ర నాయకులు తమ స్థానిక బీజేపీ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా కాకుండా మోదీకి వ్యతిరేకంగా పోటీ పడ్డట్టయింది. ఉత్తర, మధ్య భారతదేశంలో ప్రధానికి ఉన్న భారీస్థాయి ప్రజాదరణ, ఈ నాయకుల పట్ల ప్రజామోదాన్ని తటస్థింపజేసింది.

కర్ణాటకలో స్థానిక నాయకుల ప్రాచుర్యం, ప్రాముఖ్యత తెచ్చిన ఫలితాల అనుభవాన్ని ప్రాతిపదికగా తీసుకొన్న కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వం, ఆ రాష్ట్ర నాయకులపై స్థిరమైన అంచనా వేసుకుంది. వారికి స్వేచ్ఛా హస్తాన్ని అందించింది. అయితే, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో వారి నాయకుల అంతర్గత పోరు, మితిమీరిన ఆకాంక్షలు ఈ వ్యూహానికి చెల్లుచీటి పలికాయి. రాష్ట్ర నాయకత్వంలో చీలికలు అనేవి ఈ రెండు రాష్ట్రాల్లోనూ దీర్ఘకాలంగా ప్రదర్శితమవుతూ వచ్చాయి. ఎన్నికలకు కొన్ని నెలల ముందు వరకు కాంగ్రెస్ నాయకులు ఒకరిపై



ఒకరు ఆరోపణలు చేసుకుంటూనే ఉన్నారు. ఇది ఇంటినే సక్రమంగా ఉంచుకోలేని పార్టీ అని ఓటర్లకు సందేశం పంపింది. రెండు రాష్ట్రాలలో పోరాడుతున్న నాయకుల మధ్య ఎట్టకేలకు ఒక ఒప్పందం కుదిరింది. కానీ అప్పటికే ఆలస్యమైపోయింది.

ముఠాతత్వానికి తోడుగా రాష్ట్ర నాయకత్వానికీ, అధిష్ఠానానికీ మధ్య సఖ్యత, ఏకాభిప్రాయం కనబడలేదు. దాంతో కాంగ్రెస్ ప్రచారానికి పొంతన లేకుండా పోయింది. వారి గడ్డపై ఎలాంటి జోక్యాన్నీ శక్తిమంతమైన రాష్ట్ర నాయకులు ఇష్టపడలేదు. దీనికి విరుద్ధంగా, బీజేపీ ప్రచారం తీవ్రంగా సాగింది. తన దృష్టినంతా కేంద్రీకరించింది. పైగా ఆ పార్టీ ఒకే స్వరంలో మాట్లాడింది. ఇది ఆశ్చర్యకరం కాదు, ఎందుకంటే సమకాలీన బీజేపీ అత్యంత కేంద్రీకృతమైన పార్టీగా ఉంది. అదే సమయంలో కాంగ్రెస్ తన గతం నుండి బయటపడటంలో భాగంగా సాపేక్షంగా వికేంద్రీకరణకు గురైంది.

పరిస్థితిని మరింత దిగజార్చుతూ, రాష్ట్ర ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాల మధ్య ఎటువంటి ఒప్పందం జరగలేదు. బీజేపీతో పోరాడటానికి కలిసి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని 28 పార్టీలతో కూడిన ఇండియా గ్రూప్ పార్టీల మధ్య సఖ్యత రాష్ట్ర ఎన్నికలలో కనిపించలేదు. ప్రతిపక్షాలు ఇచ్చిపుచ్చుకునే స్ఫూర్తితో రాష్ట్ర ప్రత్యేక పొత్తులు, సీట్ల సర్దుబాటుపై చర్చలు జరిపి ఉండాలి. చేయడం కంటే చెప్పడానికి ఇది సులభంగా ఉంటుంది. ఏమైనా, సీట్ల పంపకం జరగలేదు. ఇది కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమిని కూడా దెబ్బతీసింది. దీన్ని ఓటర్లు విభజించబడిన ఇల్లుగా భావించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, ఇతర పార్టీల భవితవ్యం... బీజేపీకి వ్యతిరేకంగా ఐక్యంగా ఉన్నప్పుడే దాన్ని ఎదుర్కోగలవని స్పష్టం చేస్తోంది.

ఓబీసీలలో బీజేపీకి ఉన్న మద్దతును తగ్గించడానికి కాంగ్రెస్ చేసిన పెద్ద పోరాటమే, కుల ఆధారిత జనాభా గణన. కానీ అది 'నో–బాల్'గా మారింది. ఇదేమీ ప్రయోజనం ఇవ్వలేదు. ఈ పిలుపునకు క్షేత్రస్థాయిలో పెద్దగా ప్రభావం లేకుండా పోయింది. ఓబీసీ ఓట్లలో బీజేపీ వాటా పెరగడమే దీనికి నిదర్శనం. ఏమైనప్పటికీ, కుల గణన కోసం డిమాండ్ అనేది, హిందూ గుర్తింపు రాజకీయాలకు స్ఫూర్తిదాయకమైన లేదా ప్రభావవంతమైన ప్రతిఘటనా అంటే సందేహాస్పదంగా ఉంది. స్పష్టమైన రాజకీయ పార్శ్వం, లేదా దాని సందేశాన్ని తెలియజేయడానికి సమర్థవంతమైన ప్రచారం, సైద్ధాంతిక స్పష్టత, సంస్థాగత సమన్వయం లేకుండా... ఈ రాష్ట్రాలలో బీజేపీ రాజకీయాలకు వ్యతిరేకంగా పనిచేయడానికి కుల రాజకీయాలు, సామాజిక న్యాయ ఆలోచనలు సరిపోవు.

రాష్ట్ర, జాతీయ ఎన్నికల మధ్య సంబంధం ఉంటుందనే దానికి పరిమితమైన రుజువు మాత్రమే ఉంది. అయినప్పటికీ, వరుస పోటీలలో బీజేపీ చేతిలో కాంగ్రెస్ నిర్ణయాత్మక ఓటమి దాని విశ్వసనీయతను దెబ్బతీసిందనడంలో సందేహం లేదు. పైగా లోక్‌సభ ఎన్నికలు కేవలం ఐదు నెలల దూరంలో ఉన్న కీలక సమయంలో ఈ ఓటమి ఆ పార్టీని నిరుత్సాహపరుస్తుంది కూడా. అయితే, ఈ క్లిష్టమైన రాష్ట్రాల్లో మెజారిటీ ఓటర్లు బీజేపీయేతర పార్టీలను ఎంచుకున్నందున మొత్తంగా ఆశ పోలేదని కూడా చెప్పవచ్చు.

కాంగ్రెస్ ఈ ప్రాతిపదికన నిర్మాణం కావాలి. ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలంటే, అది స్పష్టమైన సైద్ధాంతిక కథనాన్ని ప్రదర్శించాలి. అలాగే దాని సొంత రాజకీయాలను వ్యక్తీకరించాలి. మొదటగా, అది బీజేపీని 'మరింత హిందూ' పార్టీగా అధిగమించడానికి ప్రయత్నించకూడదు. దానికోసమే అయితే, ఓటర్లు బీజేపీనే ఎంచుకునే అవకాశం ఉంది. సైద్ధాంతిక ప్రతిఘటన అనేది తప్పనిసరిగా హక్కుల ఆధారిత సంక్షేమం, ప్రత్యేకించి సామాజిక సామరస్యంతో ముడిపడి ఉన్న ఉపాధి హామీలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధికి సంబంధించి విభిన్న నమూనాను ప్రతిబింబించాలి. మొత్తానికి, కాంగ్రెస్ తన రాజకీయ చర్చను పునఃప్రారంభించాలి. పాలకపక్ష పాలనలోని ప్రతికూల అంశాలు, వాటినుండి గ్రహించిన తప్పులు, వారు ప్రచారం చేసిన రాజకీయాలపై దృష్టి పెట్టడం కంటే... ఓటర్లను ఉత్తేజపరిచే సానుకూల ఎజెండాను సమర్థించడం ద్వారా మేలు జరుగుతుంది.

వ్యాసకర్త ప్రొఫెసర్ ఎమెరిటా, సెంటర్ ఫర్ పొలిటికల్ స్టడీస్, జేఎన్‌యూ ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అంతా నావాళ్లే!



భారత్‌లోని నా 41 మంది దత్త పుత్రులను (ఉత్తరాఖండ్ సిల్‌క్యారా సొరంగంలో చిక్కుకున్న వాళ్లు) అద్భుతంగా కాపాడగలిగిన రెస్క్యూ బృందంలో నా ఉడుత సాయం గురించి దయగా మాట్లాడిన నా ప్రధానమంత్రి ఆంథోనీ ఆల్బనీస్‌కు (ఆస్ట్రేలియా) ధన్యవాదాలు.

– ఆర్నాల్డ్ డిక్స్, డిజాస్టర్ స్పెషలిస్ట్

ప్రజాస్వామ్యం తీరు



అంటే, మహువా మొయిత్రా కేసులో 104 పేజీల తన రిపోర్టును ఎథిక్స్ కమిటీ మధ్యాహ్నం 12 గంటలకు సమర్పించింది. సరిగ్గా రెండింటికి, అంటే రెండు గంటల్లో దానిమీద 'చర్చ'ను ఖరారు చేశారు. గంట తర్వాత, మాట్లాడే అవకాశం కూడా ఇవ్వకుండా ఈ తృణమూల్ ఎంపీని బహిష్కరిస్తున్నట్టు నిర్ణయం తీసుకున్నారు.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

తప్పు జరిగింది!



కాంగ్రెస్ హయాంలో బహిష్కృత ఎంపీలకు పార్లమెంటులో మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. కానీ మహువా మొయిత్రాకు ఎథిక్స్ కమిటీ ముందు మాట్లాడే అవకాశం ఇచ్చారు. ఆమె కమిటీ సభ్యులను నిందించి, ఆయాసంతో రొప్పుతూ బయటకొచ్చారు. అన్నట్టూ, తన పాస్‌వర్డ్‌ను ఇతరులకు ఇచ్చినట్టు ఆమె అంగీకరించారు.

– రణ్‌దీప్ సిసోడియా, రచయిత

అదీ తేడా!



యూఎస్ – ఇండియా సంబంధంలోని సమస్య రెండు దశల్లో ఉంది. ప్రపంచ మీద తాను ఆధిపత్యాన్ని కోల్పోయానని అంగీకరించలేని స్కిజోఫ్రెనిక్‌లా యూఎస్ వ్యవహరిస్తోంది. అదే సమయంలో ఇండియా భిన్న అధికార కేంద్రాలుండే బహుముఖ ప్రపంచాన్ని స్వాగతిస్తోంది.

– జొరావర్ దౌలత్ సింగ్, కాలమిస్ట్

అరుస్తుంది!



ఒకవేళ తీవ్రవాదిగా యూఎస్ ప్రకటించిన మనిషి ఇండియా కేంద్రంగా యూఎస్ కాంగ్రెస్, అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు వ్యతిరేకంగా బెదిరింపులకు పాల్పడుతున్నప్పుడు, అతడిని బాధ్యుడిని చేయడానికి ఇండియా సిద్ధంగా లేకపోతే యూఎస్ ఎలా స్పందిస్తుంది?

– బ్రహ్మ చెల్లానీ, విశ్లేషకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

హక్కుల కోసం...

మానవుల మాన ప్రాణాలకు భరోసా కల్పించేవి 'మానవ హక్కులు.' ఇవి ఎవరో ఇస్తే వచ్చేవి కాదు. పుట్టుకతో ప్రతి వ్యక్తికి లభించే హక్కులు. ఐక్యరాజ్యసమితి 1948 డిసెంబర్ 10న 'విశ్వ మానవ హక్కుల ప్రకటన' ద్వారా మానవ హక్కుల ప్రాధాన్యతను ప్రపంచానికి తెలిపింది. ఒక మనిషి – జాతి, వర్ణ, లింగ, కుల, మత, రాజకీయ లేదా ఇతర కారణాలతో ఏ విధమైన వివక్షకు గురైనా అది మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుంది. వివక్షకు గురైన వ్యక్తి గానీ, అతని బంధువులు గానీ లేదా ఏదైనా స్వచ్ఛంద సంస్థ గానీ ఆ వ్యక్తికి జరిగిన అన్యాయంపై మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసుకోవచ్చు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం కోసం కోర్టులతో పాటు మానవ హక్కుల కమిషన్లు, అంతర్జాతీయ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఏర్పాటు చేయబడ్డాయి. వీటికి పౌరుల పట్ల రాజ్యం, వ్యక్తులు సాగిస్తున్న అణచివేతను ప్రశ్నించి, శిక్షించే అధికారం ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా మహిళలపై, బాల బాలికలపై, పేదవారిపై, కిందిస్థాయి ఉద్యోగులపైన అనేక రకాలుగా మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నట్లుగా ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ అధ్యయన సంస్థ తెలుపుతోంది.

క్రీ.శ. 1215లో విడుదలైన మాగ్నాకార్టా మొట్టమొదటి మానవ హక్కుల ప్రకటన. భారతదేశంలో 1994 జనవరి 8 నుండి 'మానవ హక్కుల పరిరక్షణ చట్టం అమలులోకి వచ్చింది. చిత్రహింసలు, క్రూరత్వం నుండి రక్షణ పొందటం; బానిసత్వం వంటి దురాచారాల నుండి రక్షణ పొందటం, వివక్షకు గురికాకుండా ఉండటం, నిర్బంధం లేకుండా జీవించడం; స్వేచ్ఛగా స్వదేశంలో, విదేశాల్లో పర్యటించగలగటం వంటి హక్కులతో పాటూ జీవించే హక్కు, సామాజిక భద్రత హక్కు, భావ స్వాతంత్రపు హక్కు వంటివన్నీ మానవ హక్కులే. వీటిని రక్షణ కోసం అనేక ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి.

– డా॥ గుబ్బల రాంబాబు, రాజమహేంద్రవరం

(డిసెంబర్ 10 అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం)

మంచి జీవనశైలే రక్షిస్తుంది!

అభిప్రాయం



డా॥ ఎం. అఖిల మిత్ర

మారుతున్న కాలానికి అనుగుణంగా మనిషి పరుగులు తీయాల్సి రావడంతో అనివార్యంగా అనేక వ్యాధులకు గురికావలసి వస్తోంది. ముఖ్యంగా అధిక బరువు, ఊబకాయం వంటివి ప్రమాదకర దీర్ఘకాలిక జబ్బులకు దారితీస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. నిజానికి అధిక బరువు, ఊబకాయాలకు నిర్దిష్ట లక్షణాలు లేవు. అధిక శరీర ద్రవ్యరాశి సూచిక (బీఎమ్ఐ) ఆధారంగా వీటిని నిర్ధారించవచ్చు. బీఎమ్ఐ అనేది బరువు, ఎత్తు ఆధారంగా శరీర కొవ్వును కొలవడం. ఇది కేవలం స్క్రీనింగ్ టూల్ అని తెలుసుకోవడం ముఖ్యం.

అధిక బరువు, ఊబకాయం ఒక నిర్దిష్ట వ్యక్తికి కలిగించే ఆరోగ్య ప్రమాదాలను బాగా అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయి. శరీరంలో కొవ్వు పంపిణీని కొలవవచ్చు. సాధారణ బీఎమ్ఐ ఉండవచ్చు, కానీ పెద్ద నడుము చుట్టుకొలత ఉంటే, పొత్తికడుపులో ఇతర ప్రాంతాల కంటే కొవ్వు ఎక్కువ ఉండేమో అని అర్థం. పురుషులకు, అనారోగ్యకరమైన నడుము చుట్టుకొలత 40 అంగుళాల కంటే ఎక్కువగా ఉంటుంది. మహిళలకయితే 35 అంగుళాల కంటే ఎక్కువగా ఉంటుంది. కొవ్వు కణజాలం శరీరంలోని వివిధ భాగాలలో కనిపిస్తుంది. ఈ కణజాలం హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది, కీళ్లలో కుషన్ లా పని చేస్తుంది. అలాగే శక్తిని నిల్వ చేస్తుంది. పొత్తి కడుపు లోపల కనిపించే కొవ్వు కణజాలాన్ని విసిరల్ లేదా పొత్తికడుపు కొవ్వు అంటారు. శరీరం విసిరల్ కొవ్వును సృష్టించడానికీ, నిల్వ చేయడానికీ కారణమేమిటో తెలియదు. కానీ ఈ రకమైన కొవ్వు శరీరం యొక్క ఎండోక్రైన్ రోగనిరోధక వ్యవస్థలో జోక్యం చేసుకుంటుంది. ఇది వాపును ప్రోత్సహిస్తుంది. గుండె జబ్బులు, మధుమేహంతో సహా ఊబకాయం సంబంధిత అనేక సమస్యలకు దోహదం చేస్తుంది.

అధిక బరువు, ఊబకాయం కారణాల సంగతి కొస్తే ... కొన్నిసార్లు ఇతర వ్యాధుల కోసం తీసుకున్న మందులూ, అప్పటి పరిస్థితులూ అధిక బరువు, ఊబకాయాలకు దారి తీయవచ్చు. ఈ పరిస్థితులు లేదా మందులు మనం శక్తిని నిల్వ చేసే విధానాన్ని నియంత్రించే హార్మోన్‌ల సున్నితమైన సమతుల్యతను దెబ్బ తీస్తాయి.

'కుషింగ్స్ సిండ్రోమ్' అనేది శరీర ఒత్తిడి హార్మోన్ 'కార్టిసాల్'ను అధికంగా ఉత్పత్తి చేసినప్పుడు సంభవించే రుగ్మత. 'హైపో థైరాయిడిజం' అనేది శరీరం



తగినంత థైరాయిడ్ హార్మోన్‌ను ఉత్పత్తి చేయని పరిస్థితి. ఇది జీవక్రియ అని పిలువబడే శరీరం యొక్క శక్తి (ఆహారం) వినియోగాన్ని నెమ్మదిస్తుంది. 'పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్'(పీసీఓఎస్) అనేది అండాశయాలను ప్రభావితం చేసే ఒక పరిస్థితి. ఇది హార్మోన్ అసమతుల్యతకు దారితీస్తుంది. తీసుకొనే ఆహారం, చేసే శారీరక శ్రమ, ప్రవర్తనలో తగిన మార్పులు చేసుకొని మంచి జీవన శైలిని అనుసరించడం ద్వారా స్థూలకాయాన్ని తగ్గించుకోవచ్చు.

పండ్లు, కూరగాయలు, లీన్ ప్రొటీన్లు, తృణ ధాన్యాలు వంటి సంపూర్ణ, అధిక పోషక విలువలున్న ఆహారాలపై దృష్టి పెట్టాలి. అతిగా తినడం నివారించేందుకు దారితీసే పరిణామాలను నియంత్రించాలి. అంటే భోజనం చేస్తూ టీవీ, మొబైల్ ఫోన్‌లు వంటివి చూడకుండా తినే ఆహారంపైనే శ్రద్ధపెట్టాలి. ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర పానీయాలు , అధిక కేలరీల స్నాక్స్ తీసుకోవడం పరిమితం చేయాలి.

ఏరోబిక్ కార్యకలాపాలూ (వాకింగ్, జాగింగ్, స్విమ్మింగ్ వంటివి), స్ట్రెంగ్త్ ట్రైనింగ్ వ్యాయామాలూ రెండింటినీ మేళవిస్తూ రోజూ వ్యాయామంలో పాల్గొనాలి. వారానికి 2 లేదా అంతకంటే ఎక్కువ రోజులలో కండరాలను బలోపేతం చేసే కార్యకలాపాలలో పాల్గొనాలి. వారానికి కనీసం 150 నిమిషాల మితమైన – తీవ్రత ఉన్న ఏరోబిక్ యాక్టివిటీ లేదా 75 నిమిషాల తీవ్రమైన ఏరోబిక్ యాక్టివిటీని లక్ష్యంగా పెట్టుకోవాలి. రోజంతా పుష్కలంగా నీరు తాగాలి, ఎందుకంటే ఇది ఆకలిని నియంత్రించడమే కాక మొత్తం ఆరోగ్యానికి తోడ్పడుతుంది. అలాగే ప్రతి రాత్రీ తగినంత నిద్రపోవాలి. నిద్ర లేకపోవడం హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తుంది. బరువు పెరగడానికి దోహదం చేస్తుంది. ఏమి తింటున్నారు, ఎంత తింటున్నారు అనే దానిపై శ్రద్ధ వహించాలి. నెమ్మదిగా తినాలి. ఆహారాన్ని ఆస్వాదించాలి. అది కడుపు ఎప్పుడు నిండిందో మీ శరీరం గుర్తించేలా చేస్తుంది.

బరువు పెరగడానికి దీర్ఘకాలిక ఒత్తిడి దోహదం చేస్తుంది. విశ్రాంతి తీసుకోవడానికి సహాయపడే ధ్యానం, బలంగా శ్వాస తీసుకోవడం, యోగా వంటి ఒత్తిడిని తగ్గించే పద్ధతులను ప్రాక్టీస్ చేయాలి. శీతల పానీయాలు, జంక్ ఫుడ్, ఫేడ్ డైట్‌లు లేదా విపరీతమైన పరిమితుల నుంచి దూరంగా ఉండండి, ఎందుకంటే అవి నిలకడలేనివి. పోషకాహార లోపాలకు దారి తీయవచ్చు.

ఆహారం లేదా వ్యాయామ దినచర్యలో గణనీయమైన మార్పులు చేసే ముందు, ఆరోగ్య స్థితీ, వ్యక్తిగత అవసరాల ఆధారంగా వ్యక్తిగతీకరించిన మార్గదర్శకత్వాన్ని అందించగల ఆరోగ్య సంరక్షణ నిపుణులు లేదా నమోదిత డైటీషియన్‌ను సంప్రదించడం మంచిది.

వ్యాసకర్త వైద్యురాలు, గౌతమ్ బుద్ధ ప్రకృతి చికిత్సాలయం, అనంతపురం

ప్రకృతి నియమాలు

ప్రపంచం కొన్ని నియమాలను అనుసరించి నడుస్తోంది. అందులో మొదటిది కార్యకారణ సంబంధాన్ని సూచించే కర్మ సిద్ధాంతం. కర్మ ఎలాంటిదైతే, ఫలితం అలాంటిదై ఉంటుంది అని దీని సారాంశం.

రెండో నియమం ప్రారబ్ధ కర్మకు సంబంధించినది. పూర్వ జన్మలో చేసిన కర్మల వల్ల ఏర్పడిన సంస్కారాలు, ఈ జన్మను ప్రభావితం చేస్తాయి. ఇక మూడోది మహత్యాలకు సంబంధించినది. గాలిలో ఎగరటం, నీటిలో నడవటం లాంటివి మహత్యాలు అనిపించుకొంటాయి. మహత్యాలు ప్రకృతిలో ఉండే సాధారణ నియమాలకు విరుద్ధంగా ఉన్నాయని అనిపిస్తుందిగానీ, అది నిజం కాదు. బాహ్యంగా కనిపించే భౌతిక జగత్తు ఏ విధంగా ఉన్నదో, ఆంతరంగికమైన సూక్ష్మ జగత్తు



జ్యోతిర్మయం

కూడా ఆ విధంగా ఒకటి ఉన్నది. ఆధ్యాత్మికంగా పై మెట్టులో ఉన్న వారు మాత్రమే ఆంతరంగికమైన సూక్ష్మ జగత్తును దర్శించగలరు. వారు ఆ జగత్తులో ఉన్న నియమాలను తెలివిగా, నేర్పుతో ఉపయోగపెట్టినప్పుడు, మనం వాటిని మహత్యాలు అంటున్నాము. అయితే ఆ మహత్యాలను మనం మనకు తెలిసిన ప్రకృతి సూత్రాలు, నియమాల ప్రకారం వివరించలేము, సమర్థించలేము.

వేటినైతే మనం ప్రకృతి నియమాలు, మహత్యాలు అని అంటున్నామో అలాంటి అన్ని విధాలైన నియమాలను అధిగమించినదీ, నియంత్రించగలిగినదీ ఒకే ఒక్కటి ఉన్నది. అదే భగవంతుని నిర్వ్యాజ ప్రేమ, అవ్యాజ కరుణ. దేనినైనా మనం మహత్యం అని అనాలంటే, అలా అనతగ్గది ఒక్క దైవానుగ్రహం మాత్రమే. ఇక్కడొక ప్రశ్న ఉదయిస్తుంది. భగవంతుడు మహత్యాలు చేస్తాడా అని. దానికి సమాధానం ఏమంటే, భగవంతుడు అన్నీ చేస్తాడు, అదే సమయంలో ఏదీ చెయ్యడు అని. ఇంకా చెప్పాలంటే, భగవంతుడు చేసిన ఒకే ఒక్క మహత్యం సమస్త విశ్వాన్ని సృష్టించటమే. ఆ ఒక్కటి మహత్యాల్లోకెల్లా మహత్యం. అంతకు మించిన మహత్యం ఇంకేం ఉంటుంది? సృష్టిలో ఏ అతి చిన్న అణువును చూసినా, అది మానవ మేధస్సుకు అందని వింతల్లోకెల్లా వింతగా తోస్తుంది. విశ్వంలో అటువంటి అణువులు అసంఖ్యాకం.

భగవంతుడు అన్నీ చేస్తాడు అనీ, ఇంకో అర్థంలో ఏదీ చెయ్యడు అనీ చెప్పవచ్చు. భగవంతుడు స్వయంగా ఏదీ చెయ్యకపోయినా, ప్రేమతో, సర్వార్పణ బుద్ధితో ఎవరైతే తనను ఆశ్రయిస్తారో, వారు ఆధ్యాత్మికంగా అన్ని లాభాలు పొందుతారు, భగవంతుడు కల్పించుకొని ప్రత్యేకంగా ఏమీ చేయకపోయినా. ఆ విషయంలో భగవంతుని గంధపు చెట్టుతో పోల్చవచ్చు. ఆ చెట్టు అన్ని దిక్కులకూ తన సుగంధాన్ని నిరంతరం వెదజల్లు ఉంటుంది. దాని దగ్గరకు వెళ్లినవారు ఆ సుగంధాన్ని ఆఘ్రాణిస్తారు. దగ్గరకు రానివారికి సుగంధం లభించదు. అలాగే భగవంతుడు కూడా అన్నీ చేస్తాడు, ఏదీ చెయ్యడు. అన్నీ ఇస్తాడు, ఏదీ ఇవ్వడు.

– దీవి సుబ్బారావు


గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.ద్వాదశి తె.5.13 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** చిత్త ఉ.9.10 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** ప.3.08 నుండి 4.48 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.21 నుండి 7.50 వరకు, **అమృతఘడియలు:** రా.1.20 నుండి 3.02 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.22, **సూర్యాస్తమయం:** 5.22.

ఒక వ్యక్తికి ఒక ఓటే ఉండాలి

ఎక్కువ ఓట్లు కలిగి ఉండటం నిబంధనలకు విరుద్ధం

- ఫాం–6 ద్వారా కొత్తగా నమోదు చేసుకునేటప్పుడు ఎక్కడా ఓటులేదని డిక్లరేషన్ ఇవ్వాలి
- 20 ఏళ్లు దాటిన వాళ్లు ఫాం–6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకుంటే విచారణ చేపట్టండి
- తప్పుడు డిక్లరేషన్‌తో ఓటు నమోదుకు దరఖాస్తు చేస్తే జైలుశిక్ష
- కలెక్టర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశాలు
- వైఎస్ఆర్‌సీపీ ఫిర్యాదుపై స్పందించిన ఎన్నికల కమిషన్



సాక్షి, అమరావతి: ఒక వ్యక్తికి ఒకేచోట మాత్రమే ఓటు హక్కు కలిగి ఉండాలని, తప్పుడు సమాచారంతో పక్క రాష్ట్రంలో ఉన్న వారు ఓటరుగా నమోదు చేసుకుంటే వారిపై పీపుల్స్ యాక్ట్ సెక్షన్–31 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల కమిషన్ హెచ్చరించింది. డూప్లికేట్, డబుల్ ఓట్లపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి.. జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు అందుకు సంబంధించిన ఆదేశాలు జారీచేశారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు రాష్ట్రాల్లో ఉన్న వారు ఇక్కడ ఓటరుగా నమోదు చేసుకునేటప్పుడు పాటించాల్సిన నిబంధనలను ఆ ఉత్తర్వుల్లో స్పష్టంగా ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఓటర్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు స్వీకరించడానికి డిసెంబరు 9 చివరి తేదీ అని, అభ్యంతరాలను 26లోగా పరిష్కరించి జనవరి 5, 2024న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపింది. తెలంగాణ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుని తిరిగి ఇక్కడ ఓటరుగా నమోదు చేయిస్తూ టీడీపీ ప్రత్యేకంగా శిబిరాలు పెట్టి చేర్పిస్తుండటంపై వైఎస్సార్‌సీపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. డిసెంబరు 5న ఇచ్చిన ఈ ఫిర్యాదును పరిశీలించి ఈ ఉత్తర్వులను జారీచేస్తున్నట్లు కమిషన్ పేర్కొంది. ఈ ఆదేశాలను జిల్లా కలెక్టర్లతో పాటు అన్ని రాజకీయ పార్టీలకు తెలియజేసింది. ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఉత్తర్వుల్లోని ముఖ్యాంశాలిలా ఉన్నాయి..

- పీపుల్స్ యాక్ట్–1950 సెక్షన్ 17, 18 ప్రకారం ఒక ఓటరు ఒకచోట మాత్రమే నమోదై ఉండాలి. అలా కాకుండా ఒక చోటకు మించి వేరేచోట లేదా మరో ప్రాంతంలో ఓటరుగా నమోదు చేసుకుంటే సెక్షన్–31 (పీపుల్స్ యాక్ట్) ప్రకారం చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తారు.
- ఫాం–6 అనేది మొదటిసారి మాత్రమే నమోదు చేసుకునే వారు వినియోగించాలి. దీని ద్వారా దరఖాస్తు చేసుకునే వారు ఎక్కడా కూడా అప్పటికే ఓటరుగా నమోదు అయి ఉండకూడదు. తమకు ఎక్కడా ఓటు లేదంటూ డిక్లరేషన్ ఇవ్వాలి. ఇలా డిక్లరేషన్ ఇచ్చిన తర్వాత వేరే నియోజకవర్గాల్లో లేదా వేరే ప్రాంతాల్లో ఓటు ఉన్నట్లు దర్యాప్తులో తేలితే వారిపై పీపుల్స్ యాక్ట్ సెక్షన్–31 ప్రకారం శిక్షించడం జరుగుతుంది. వయస్సు 20 ఏళ్లు దాటిన వారు ఫాం–6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవడానికి దరఖాస్తు చేసుకుంటే అలాంటి కేసుల విషయంలో అధికారులు విధిగా క్షేత్రస్థాయి పరిశీలన చేసి బీఎల్ఓలు కారణాలు రాయాలి.
- ఫాం–8 కింద దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించి ఖచ్చితంగా కొన్ని అంశాలను విచారణ చేసి తీరాలని బూత్‌లెవల్ ఆఫీసర్లకు ఎన్నికల కమిషన్ స్పష్టంచేసింది. వాటిలో సంబంధిత వ్యక్తి ఓటరు ఐడిని ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో చెక్ చేయాలి. అలా ఎక్కడైనా వారి పేరు వెబ్‌సైట్‌లో ఉన్నట్లయితే ఆ సమాచారాన్ని ఆ దరఖాస్తుదారుని అప్లికేషన్‌పై కామెంట్‌గా రాయాలి. ఫీల్డ్ వెరిఫికేషన్‌లో తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలి.

వీటికి సంబంధించి బూత్ లెవల్ ఏజంట్ల నుంచిగాని ఇతరుల నుంచి సందేహాలు, అభ్యంతరాలుంటే బూత్ లెవల్ ఆఫీసర్లు నమోదు చేసుకోవాలి. వీటన్నింటిని అంటే డాక్యుమెంట్స్, ఫీల్డ్ వెరిఫికేషన్ మరియు బీఎల్ఓలు బీఎల్ఏల రిమార్కులను పొందుపరిచిన అనంతరమే ఈఆర్ఓలు ఆ దరఖాస్తులపై తుదినిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

- దరఖాస్తుదారుడు తప్పుడు ధ్రువీకరణ/సమాచారం ఇచ్చినట్లు తేలితే వారిపై ఈఆర్వోలు పీపుల్స్ యాక్ట్–1950 కింద కేసులు నమోదు చేసి శిక్షపడేలా చర్యలు తీసుకుంటారు.

ఈసీ నిర్ణయం హర్షణీయం: లేళ్ల అప్పిరెడ్డి

ఇక తమ ఫిర్యాదులను పరిశీలించిన కమిషనర్ శుక్రవారం కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీచేయడం హర్షణీయమని శాసనమండలిలో ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి 'సాక్షి'తో అన్నారు. తెలంగాణ ఓటు వేసిన టీడీపీ మద్దతుదారులు ఏపీలో కూడా ఓటు నమోదు చేసుకుని ఇక్కడ కూడా ఓటు వేసే ప్రయత్నంలో ఉన్నారని తెలిపారు. దొంగ ఓట్లు నమోదు చేయించటంలో చంద్రబాబు సిద్ధహస్తుడని.. అది ఆయన నైజమన్నారు. నిజానికి.. ప్రజాస్వామ్యంలో ఫాం–6 అనేది కొత్తగా ఓటర్లుగా నమోదుచేయడానికి ఉపయోగించేదన్నారు. అదే ఓటర్లు ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వచ్చినట్లయితే ఫాం–8 ఉపయోగించి దరఖాస్తు చేసుకోవాలని.. కానీ, ఫాం–6 ఉపయోగించి 30 సంవత్సరాల పైబడిన ఓటర్లను టీడీపీ నమోదు చేయిస్తోందన్నారు. ఇదంతా ఓ పథకం ప్రకారం చంద్రబాబు చేయిస్తున్నారని అప్పిరెడ్డి మండిపడ్డారు.

రూ.197 కోట్లతో స్విమ్స్ ఆసుపత్రి భవనాల పునరుద్ధరణ

18 వరకు అభ్యంతరాల స్వీకరణ

తిరుపతి(అలిపిరి): తిరుమలకు వచ్చే భక్తులకు వైద్యం, పరిసర ప్రాంత రోగులకు మెరుగైన సౌకర్యాలను అందించడానికి రూ.197 కోట్లతో స్విమ్స్ ఆసుపత్రి భవనాల పునరుద్ధరణ పనులను చేపట్టడానికి టెండరు డాక్యుమెంట్లను జ్యుడీషియల్ ప్రివ్యూకు సమర్పించినట్లు టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పనులకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తెలియజేయాలని కోరారు. ప్రాజెక్టు పనులకు సంబంధించి సలహాలు, అభ్యంతరాలను apjudicialpreview@gmail.comకు, cettdtpt@gmail.com మెయిల్ ద్వారా తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఇతర వివరాల కోసం https://judicialpreview.ap.gov.in, www.tirumala.org వెబ్‌సైట్లను సంప్రదించగలరని కోరారు.

శ్రీవారి ఆలయంలో ఎవరూ అసభ్యంగా ప్రవర్తించలేదు

- రాజకీయాల కోసం మమ్మల్ని ట్రోల్ చేయొద్దు
- వీడియో విడుదల చేసిన భక్తుడు రవికుమార్



తిరుమల: శ్రీవాణి టికెట్ కొనుకున్న తమకు స్వామివారి దర్శనం చాలా బాగా జరిగిందని హైదరాబాద్‌కు చెందిన రవికుమార్ దంపతులు చెప్పారు. దర్శనం అనంతరం టీటీడీ సిబ్బంది తమతో అసభ్యంగా ప్రవర్తించలేదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని మీడియా, సోషల్ మీడియాలు వక్రీకరించి టీటీడీ మీద బురదజల్లేలా ప్రచారం చేయడం తమకు బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం సోషల్ మీడియాలో ఓ వీడియోను పోస్ట్ చేశారు. దర్శనం తరువాత స్వామి వారిని చూస్తూ వెనక్కు వస్తూ తన్మయత్వంతో అక్కడే నిలబడిపోయామని, ఆ సమయంలో అక్కడి సిబ్బంది తమతో గట్టిగా మాట్లాడటంతో తాము బాధపడ్డామని పేర్కొన్నారు. ఈ విషయాలు టీటీడీ దృష్టికి వెళితే సమస్యలు ఏమైనా ఉంటే సరిచేసుకుంటారనే ఉద్దేశంతో తాము అప్పుడు మీడియాతో మాట్లాడామని చెప్పారు. దీన్ని కొందరు లేనివి ఉన్నట్లుగా చూపి రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకునేలా ట్రోల్ చేయడం బాధ కలిగించిందన్నారు. ఇప్పటికి తాము 4 సార్లు శ్రీవాణి దర్శనానికి రాగా, ఎప్పుడూ.. ఎలాంటి ఇబ్బంది కలగలేదని స్పష్టం చేశారు.

కొత్త ఐడియాలతోనే జీవితంలో మార్పు

విజయవాడ ఎస్‌టీపీఐ జేడీ వినయ్‌కుమార్

చేబ్రోలు: జీవితంలో ఎవరైనా మార్పుతోపాటు అభివృద్ధి చెందాలనుకుంటే కొత్త ఐడియాలతోనే అది సాధ్యమవుతుందని విజయవాడలోని ఎస్‌టీపీఐ జాయింట్ డైరెక్టర్ బి.వినయ్‌కుమార్ అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ వర్సిటీలోని టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ (న్యూఢిల్లీ)లోని డీఎస్‌టీ ఆర్థిక సహాయంతో వీఐఐఎస్‌ఏ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ స్టార్టప్ ఫండింగ్ ఏంజెల్ ఇన్వెస్టర్స్ అండ్ వెంచర్ క్యాపటలిస్ట్స్ సదస్సు శుక్రవారం నిర్వహించారు. దీనికి 12 రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన 30 స్టార్టప్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ 30 కంపెనీలు ప్రారంభించాలనుకుంటున్న పలు స్టార్టప్ కంపెనీల ఐడియాలను వివరించారు. ఉత్తమంగా ఉన్న స్టార్టప్ కంపెనీల ఐడియాలకు విజ్ఞాన్ టీబీఐ ఆర్థికంగా తోడ్పాటునందించనుంది. వినయ్‌కుమార్ మాట్లాడుతూ సరికొత్త ఆవిష్కరణలతో ముందుకు వచ్చే వారికి ఆర్థిక తోడ్పాటును అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఎస్‌టీపీఐ డిప్యూటీ డైరెక్టర్ డి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ చిన్న ఆలోచనలకు టెక్నాలజీ జోడించడం ద్వారా పెద్ద బిజినెస్‌గా మార్చుకోవచ్చన్నారు. సద్గురు క్యాటలైజర్స్ సీఈవో పి.గోపాలక్రిష్ణ, రాఘవ గుప్త, రుతిక్ జాదవ్ పాల్గొన్నారు.

27 నుంచి ఆర్జీయూకేటీలో నాక్ అక్రిడిటేషన్ కమిటీ పర్యటన

ఛాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న కేసీ రెడ్డి. పక్కన నూజివీడు డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్

నూజివీడు: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ)ని నాక్ అక్రిడిటేషన్ కమిటీ ఈనెల 27, 28, 29 తేదీల్లో సందర్శించనున్నట్టు ఛాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి తెలిపారు. ఏలూరు జిల్లా, నూజివీడు ట్రిపుల్ ఐటీలో శుక్రవారం నాలుగు ట్రిపుల్ ఐటీలకు చెందిన నూతన డైరెక్టర్‌లతో కలిసి కేసీరెడ్డి విలేకరులతో మాట్లాడారు. నాక్ గుర్తింపు లభించినట్లయితే ఆర్జీయూకేటీకి, విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. యూనివర్సిటీ స్నాతకోత్సవాన్ని జనవరిలో నిర్వహించే అవకాశం ఉందన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ నుంచి గత నెల 5వ తేదీన ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం విద్యార్థినిని రాత్రి సమయంలో బయటకు పంపించిన బాధ్యుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై నియమించిన త్రిసభ్య నిజనిర్ధారణ కమిటీ నివేదికను అందించిందని తెలిపారు.

సీఎం బంధువులు ఎవరూ లేరు: ఆర్జీయూకేటీలో సీఎం బంధువులు ఎవరూ లేరని ఛాన్సలర్ స్పష్టం చేశారు. ఎల్లో మీడియాలో సీఎం బంధువు కీలక పదవిలో ఉన్నారని రాయడం ఆ పత్రిక అవివేకమని అన్నారు. ముఖ్యమంత్రి సరైన భోజనం పెట్టడం లేదనడం సమంజసం కాదని, పత్రికలు ఇలాంటి తప్పుడు రాతలు రాయడం వల్ల ప్రజల్లో వాటి విశ్వసనీయత కోల్పోతాయన్నారు. నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం డైరెక్టర్లు పాల్గొన్నారు.

కుటుంబసమేతంగా తిరుమలకు చేరుకున్న లాలూ



లాలూ కుటుంబ సభ్యులకు స్వాగతం పలుకుతున్న ఓఎస్‌డీ

తిరుమల: బిహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబసమేతంగా శుక్రవారం తిరుమలకు చేరుకున్నారు. ఆయనకు ఓఎస్డీ రామకృష్ణ స్వాగతం పలికారు. లాలూతో పాటు ఆయన సతీమణి, మాజీ సీఎం రబ్రీ దేవి, ఆయన కుమారుడు బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ శనివారం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

సుస్థిర అభివృద్ధిలో ఏపీ అగ్రగామి

'ఓపెన్ మైండ్స్' సెమినార్‌లో వక్తలు



డా॥ఎస్.రాజశేఖర్‌రెడ్డి

వైవీయూ (వైఎస్సార్ జిల్లా): సుస్థిరమైన అభివృద్ధి సాధించడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలుస్తున్నదని, విద్య, వైద్యం, సంక్షేమ రంగాలతో పాటు అన్ని రంగాల్లో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వ చర్యలే ఇందుకు కారణమని 'ఓపెన్ మైండ్స్' స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. కడప నగరంలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో 'విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో వినూత్న మార్పులు–సుస్థిర అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్' అన్న అంశంపై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు, 2019 నుంచి 2023 వరకు జరిగిన అభివృద్ధిని గణాంకాలతో సహా వివరించారు. సంక్షేమం లక్ష్యం అభివృద్ధి అని.. అభివృద్ధి, సంక్షేమం ఏ రాష్ట్రానికైనా రెండు కళ్లలాంటివన్నారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగం, సంక్షేమ రంగాలకు ఇస్తున్న ప్రాధాన్యతను కొందరు విమర్శిస్తున్నారని.. వీటిపై వెచ్చించే నిధులకు సంబంధించిన ఫలితాలు రానున్న రోజుల్లో స్పష్టంగా కనిపిస్తాయన్న విషయాన్ని మేధావులు, ప్రజలు గుర్తించాలని సూచించారు. ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ప్రజల జీవితాలను మార్చేది విద్యేనని, ప్రభుత్వం ఆ రంగానికి అగ్రస్థానం ఇవ్వడం అభినందనీయమన్నారు. సంక్షేమం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని చెప్పారు. ప్రభుత్వం 3 సంవత్సరాల కాలంలో రూ.53వేల కోట్లు విద్యారంగంపై ఖర్చుచేయగా, వైద్యంపై రూ.10వేల కోట్లు వెచ్చించడం చూస్తే ప్రజల పట్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంత బాధ్యతగా ఉంటారో అర్థమవుతుందని తెలిపారు. ఆచార్య గులాం తారీఖ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు, ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ విద్య నిర్ణయాలు చారిత్రాత్మకమని చెప్పారు. సామాన్యుడు సైతం విదేశాల్లోని టాప్ యూనివర్సిటీల్లో చదువుకునేందుకు ఏర్పాటు చేసిన విదేశీ విద్య పథకం అత్యద్భుతమన్నారు. ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ అండ్ ఫార్మా ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ..

విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నడిపిస్తున్నారని తెలిపారు. డిగ్రీ విద్యార్థి అతావుర్ రెహమాన్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన విద్యాపరమైన సంస్కరణలను ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం సైతం ప్రశంసించిందంటే ఇక్కడి అభివృద్ధి ప్రపంచస్థాయికి చేరినట్లేనన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా చదువుకునే సౌకర్యం ఉండడం విద్యార్థులుగా తమకెంతో గర్వకారణంగా ఉందని చెప్పారు.

వీడిన 'బంగారం' మిస్టరీ

- ఏడుగురి అరెస్ట్
- ప్రధాన సూత్రధారి బ్యాంకు డిప్యూటీ మేనేజర్ స్వప్నప్రియ ఆత్మహత్య
- పరారీలో బ్యాంకు క్యాషియర్ సురేష్



మాట్లాడుతున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం జిల్లా గార మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో బంగారం మాయం కేసును పోలీసులు వారం రోజుల్లో ఛేదించారు. మొత్తం రూ.4.7కోట్ల విలువైన 7.146 కిలోల బంగారాన్ని రికవరీ చేశారు. తొమ్మిది మందిపై కేసు నమోదుచేసి ఏడుగురిని అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ జీఆర్ రాధిక శుక్రవారం వివరాలు వెల్లడించారు. బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేసిన ఉరిటి స్వప్నప్రియ తన సోదరుడు కిరణ్‌బాబు, బ్యాంకు క్యాషియర్ ముంజి సురేష్‌తో కలిసి ఈ నేరాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. వీరిలో స్వప్నప్రియ ఆత్మహత్య చేసుకుంది. సురేష్ పరారీలో ఉన్నాడు. బ్యాంకులో ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారాన్ని లోహితాక్షి కన్సల్టెన్సీ సర్వీసు యజమాని పొన్నాడ తిరుమలరావు సాయంతో పలు బ్యాంకుల్లో మారు తాకట్టు పెట్టి డబ్బులు తీసుకునేవారు. దాదాపు 14 నెలలుగా ఈ తంతు జరుగుతున్నట్లు పోలీసులు తేల్చారు. బ్యాంకు మేనేజర్ చెల్లాపు రాధాకృష్ణ అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ చీకటి బాగోతం బయటపడింది. స్టాక్‌లు, మైన్‌లు, రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టి నష్టపోవడం వల్లనే స్వప్నప్రియ, ఆమె సోదరుడు ఈ అక్రమాలకు పాల్పడినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది.

పది మంది 'ఎర్ర' కూలీల అరెస్ట్



మాట్లాడుతున్న టాస్క్ ఫోర్స్ ఎస్పీ చక్రవర్తి

తిరుపతి సిటీ: ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న పదిమంది కూలీలను అరెస్టు చేసినట్లు తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్పీ చక్రవర్తి తెలిపారు. శుక్రవారం కపిలతీర్థంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. భాకరాపేట రేంజ్ పరిధిలోని పింఛా సమీపంలోని జిల్లెల మంద గ్రామం మెయిన్ రోడ్డుకు కూతవేటు దూరంలో రెండు కార్లలో ఎర్రచందనం దుంగలను కొంతమంది కూలీలు లోడ్ చేస్తున్నారు. వారిలో పదిమంది కూలీలను అదుపులోకి తీసుకోగా మరికొందరు పరారయ్యారు. దాదాపు రూ.30 లక్షల విలువజేసే 306కిలోల పది ఎర్రచందనం దుంగలతో పాటు రెండు మారుతీ డిజైర్ టూర్, టయోటా కొరొల్లా, బజాజ్ పల్సర్ ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు

చిత్తూరు అర్బన్: నిద్రిస్తున్న భర్త గొంతుకు తాడు బిగించి, హత్య చేసిన నీలమ్మ (35) అనే నిందితురాలికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ చిత్తూరులోని మొదటి అదనపు జిల్లా, సెషన్స్ న్యాయస్థానం శుక్రవారం తీర్పునిచ్చింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ లోకనాథరెడ్డి కథనం మేరకు.. కుప్పం పట్టణంలోని రామచంద్రారోడ్డుకు చెందిన నీలమ్మ (35), నాగరాజు (45) దంపతులు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. నాగరాజు తన భార్యపై అనుమానం పెంచుకుని తరచూ గొడవ పడేవాడు. పలుమార్లు పంచాయితీ పెట్టినా భర్త తీరులో మార్పు రాకపోవడంతో నీలమ్మ ఓపిక నశించింది. దీంతో 2016 ఫిబ్రవరి 5వ తేదీన ఇంట్లో నిద్రిస్తున్న భర్త మెడకు తాడు బిగించి హత్యచేసి పరారైంది. మృతుడి తమ్ముడు మంజునాథ్ ఇచ్చిన ఫిర్యాదుపై కుప్పం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. హత్య చేసిన నీలమ్మను అరెస్టుచేసి, సాక్ష్యాలను కోర్టుకు అందజేశారు. నేరం రుజువుకావడంతో నిందితురాలికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి రమేష్ తీర్పు చెప్పారు.

శ్రీశైలంలో త్వరలో ధర్మప్రచార మాసోత్సవాలు

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడి



శ్రీశైలం టెంపుల్: డిసెంబర్ చివరి వారం, జనవరిలో శ్రీశైలంలో ధర్మప్రచార మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం శ్రీశైలంలో భ్రమరాంబ అతిథిగృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పునరుద్ధరించిన పంచమఠాల ప్రాంగణంలో ల్యాండ్‌స్కేపింగ్, గార్డెనింగ్, కళాత్మక లైటింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. శ్రీశైలంలో రెడ్డిరాజులు నిర్మించిన పాతాళగంగ పాతమెట్ల మార్గాన్ని పునరుద్ధరిస్తామన్నారు. శ్రీశైల ప్రాకారకుడ్యంపై వేలాది చిత్రాలు ఉన్నాయని, వీటి గురించి భక్తులకు తెలిసేలా నిపుణులతో పరిశోధనలు జరిపి సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లోపు గ్రంథం రూపంలో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. దేవస్థానంలో నూతనంగా నిర్మించనున్న క్యూకాంప్లెక్స్, తదితర పనులకు త్వరలో సీఎం శంకుస్థాపన చేస్తారని చెప్పారు. శ్రీశైలప్రభ ప్రచురణకర్తగా దేవస్థానం ఈవోను నియమిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాల్లో మాసపత్రికను ప్రచురించే ఆలోచన ఉందన్నారు. పీఠాధిపతుల సూచనల మేరకు కుంభోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాల్లో ప్రతి మూడు నెలలకోసారి ఏఈవో, పర్యవేక్షకులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్, ఇతర ఉద్యోగులను అంతర్గత బదిలీ చేయాలని, అలా చేయకపోతే చర్యలు తప్పవన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో ఏ స్థాయి అధికారి, ప్రజాప్రతినిధికి ఏ స్థాయి ప్రోటోకాల్ కల్పించాలనే విషయంపై చర్చించామని, త్వరలోనే ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు.

15న 'తెలుగు గళ' పురస్కారాల ప్రదానం

రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు



మాట్లాడుతున్న విజయబాబు. పక్కన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర అధికార భాషా సంఘం, ఎన్టీఆర్ జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు ప్రసార మాధ్యమాల్లో వ్యాఖ్యాతలుగా, ప్రయోక్తలుగా, న్యూస్ రీడర్లుగా పనిచేస్తున్న ప్రతిభావంతులకు తెలుగు గళ ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15న విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తెలుగు భాషా వికాసానికి కేవలం రచనల ప్రాతిపదికనే కాకుండా మౌఖిక భాషకు కూడా ప్రాధాన్యం పెరిగిన తరుణంలో ప్రతిభావంతులను సత్కరించేందుకు తెలుగు గళ ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. ఆకాశవాణి, దూరదర్శన్‌తో పాటు వివిధ ప్రైవేటు ఛానళ్లలో పనిచేస్తున్న వారిని ఈ పురస్కారాలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. తెలుగు భాషకు సేవ చేస్తున్న వారిని ప్రభుత్వం గుర్తించి, సత్కరిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ఈనెల 19న అనంతపురంలో విస్తృత స్థాయిలో 'అనంత భాషా వైభవ సదస్సు' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. త్వరలో పత్రికా రచయితలకు కూడా అవార్డులు అందజేస్తామన్నారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీ రావు మాట్లాడుతూ మొత్తం 15మంది ప్రతిభావంతులకు ఈ పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు.

తెలంగాణలో డిపాజిట్లు దక్కని పవన్‌కు మతిభ్రమించింది

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు

సాక్షి, అమరావతి: తెలంగాణలో డిపాజిట్లు కోల్పోయిన పవన్ కళ్యాణ్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి మండిపడ్డారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో తన సభలకు జనం వస్తారు కానీ ఓట్లు వేయ్యరని మొన్నటి వరకు పవన్ తెలంగాణాలో చెప్పుకొని తిరిగారన్నారు. తెలంగాణ ప్రజలకు పవన్ నిజ స్వరూపం తెలియడంతో అక్కడ డిపాజిట్లు కూడా దక్కలేదని, ఆ ఫ్రస్టేషన్‌తో ఆంధ్రప్రదేశ్ వచ్చి సభ పెట్టుకుని ఉక్రోషం వెళ్లగక్కుతున్నాడని అన్నారు. తెలంగాణలో బీజేపీ వెంట, ఏపీలో టీడీపీ వెంట తిరుగుతున్నారన్నారు. ఆయనకు ఆంధ్రప్రదేశ్‌లో ఓటు లేదని, ఇల్లు లేదని, చంద్రబాబు ఆయనకు ఎన్ని నియోజకవర్గాలు ఇస్తారో కూడా తెలియదని అన్నారు. ఈ రాష్ట్రానికి పవన్ వల్ల ఒరిగిందేమీ లేదన్నారు. తెలంగాణలో తన వల్లనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చంద్రబాబు ఫీలవుతున్నారని, టీడీపీ అక్కడ ఎందుకు ఒక్క అభ్యర్థిని కూడా పోటీ పెట్టలేదని ప్రశ్నించారు. తెలంగాణాలో టీడీపీ పోటీ చేసి ఉంటే పవన్‌కు పట్టిన గతే చంద్రబాబుకూ పట్టేదని ఎద్దేవా చేశారు.

మత్స్యకారులకు దొరికిన వాయుసేన మిస్సైల్

సూర్యలంక మిలిటరీ ఎయిర్‌ఫోర్సు అధికారులకు అప్పగింత



మత్స్యకారుల బోటులో ఉన్న చిన్నపాటి మిస్సైల్

వేటపాలెం: మత్స్యకారుల వలకు మిలిటరీ వాయుసేనకు చెందిన చిన్నపాటి మిస్సైల్ దొరికింది. ఈ ఘటన శుక్రవారం బాపట్ల జిల్లా, వేటపాలెం మండలం పొట్టిసుబ్బయ్యపాలెంలో చోటుచేసుకుంది. దాన్ని మత్స్యకారులు బోటులో ఒడ్డుకు తీసుకొచ్చారు. మెరైన్ ఎస్ఐ సుబ్బారావు బాపట్ల సూర్యలంకకు చెందిన ఎయిర్‌ఫోర్సు మిలిటరీ అధికారులకు సమాచారం అందించారు.

ఏం జరిగిందంటే...

సూర్యలంకకు చెందిన మిలటరీ అధికారులు ఏటా ఎయిర్‌ఫోర్సుకు చెందిన రిహార్సల్స్ నిర్వహిస్తుంటారు. ఈనెల 3వ తేదీ నుంచి 22వ తేదీ వరకు సముద్ర గగనతలంలో అడ్వాన్స్‌డ్ మిస్సైల్ సిస్టంపై రిహార్సల్స్ నిర్వహిస్తున్నారు. చిన్నపాటి యుద్ధ మిస్సైల్‌ను ప్రయోగించి అది లక్ష్యం చేరుకోక ముందే సూర్యలంక కేంద్రం నుంచి పేట్రియాట్ మిస్సైల్‌తో దాన్ని పేల్చివేసే రిహార్సల్స్ జరుగుతున్నాయి. దీన్లో భాగంగా ప్రయోగించిన ఈ మిస్సైల్ సముద్రంలో మత్స్యకారులకు దొరికింది. దాన్ని మెరైన్ అధికారుల సమక్షంలో ఎయిర్‌ఫోర్సు అధికారులకు అప్పగించారు.

గ్యాస్ కట్టర్లతో లాకర్లు, ఏటీఎంను కట్ చేసి..

- ఎస్‌బీఐలో చోరీకి విఫలయత్నం
- పోలీసుల రాకతో దొంగలు పరార్



కొత్తవలస: కొంతమంది దొంగలు ఎస్‌బీఐ లాకర్లు, ఏటీఎంను గ్యాస్ కట్టర్లతో కట్ చేసి చోరీకి విఫలయత్నం చేసిన ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. చోరీకి యత్నం చేస్తుండగా పోలీసులు రావడంతో దొంగలు పరారు కావడంతో బ్యాంకులోని ఒక్కపైసా కూడా చోరీకి గురికాలేదని బ్యాంకు అధికారులు స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లా కొత్తవలస మండలంలోని చింతలపాలెం గ్రామం సమీపంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఆవరణలోకి గురువారం అర్ధరాత్రి కొంతమంది దొంగలు ప్రవేశించి ఉత్తరం వైపున ఉన్న కిటికీ ఊచలను గ్యాస్ కట్టర్‌తో తొలగించి స్ట్రాంగ్ రూమ్‌లోకి ప్రవేశించారు. అందులోని లాకర్లను గ్యాస్ కట్టర్‌తో కట్‌చేసి ఓపెన్ చేశారు. అందులో కేవలం దస్త్రాలు మాత్రమే ఉండడంతో పక్కన ఉన్న ఏటీఎంలోకి చొరబడ్డారు. గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం డోర్స్‌ను కాల్చి ఓపెన్ చేశారు. అయితే ఏటీఎంకు ముంబయిలోని ప్రధాన కార్యాలయానికి అనుసంధానం చేసిన అలారం మోగడంతో అక్కడ సిబ్బంది బ్యాంకు మేనేజర్ ఒ.వి. చంద్రశేఖర్‌ను ఫోన్‌లో అలర్ట్ చేశారు. ఆయన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించడం, రాత్రి గస్తీ పోలీసులు బ్యాంకు వద్దకు చేరుకోవడంతో దొంగలు పరారయ్యారు. పోలీసులు ఏమాత్రం ఆలస్యం చేసినా ఏటీఎంలో పెట్టిన రూ.20లక్షలు చోరీకి గురయ్యేవని బ్యాంకు మేనేజర్ తెలిపారు. బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు. క్లూస్‌టీమ్ దొంగల వేలిముద్రలను సేకరించింది.

రేవంత్ నా వల్లే గెలిచాడు

- ఈవీఎంలు మార్చకుండా చేశా..
- ప్యాకేజీస్టార్‌ను నమ్మకండి
- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



సీతమ్మధార (విశాఖ ఉత్తర): ఈవీఎంలు మార్చకుండా చీఫ్ ఎలక్షన్ కమిషన్ మీద తాను ఒత్తిడి తేవడం వల్లే రేవంత్‌రెడ్డి గెలిచాడని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ అన్నారు. శుక్రవారం ఆశీల్‌మెట్టలోని కేఏ పాల్ ఫంక్షన్ హాలులో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితమవుతుందని అంతా అనుకున్నారని, కానీ డీజీపీ అంజన్‌కుమార్ ఈవీఎంలు మార్చకుండా స్ట్రిక్ట్‌గా వ్యవహరించారన్నారు. ఇది ఓర్వలేకే ఆయనను సస్పెండ్ చేశారని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని తాను గతంలోనే చెప్పానని గుర్తు చేశారు. తెలంగాణ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ వికాస్‌రాజ్ చరిత్రహీనుడిగా మిగిలిపోతారన్నారు. గత ముఖ్యమంత్రి, ఈ ముఖ్యమంత్రి ఏపీని దోచుకున్నారని విమర్శించారు. పవన్‌కళ్యాణ్‌కు నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయన్నారు. విశాఖలో పవన్‌కు ఏం పనని, ప్యాకేజీస్టార్‌ను అస్సలు నమ్మకండి అని అన్నారు. వేరే ప్రాంతం నుంచి వచ్చిన వాళ్లను ఇక్కడ పోటీ చేయకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. స్థానికుడిగా ప్రజాశాంతి పార్టీ తరఫున తనను ఎన్నుకోవాలని కోరారు. ఈ నెల 13వ తేదీన విశాఖలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సంప్రదాయేతర ఇంధనంతోనే మానవాళికి భవిష్యత్తు

- జేఎన్‌టీయూ(అనంతపురం) వీసీ రంగజనార్దన

వైవీయూ: సంప్రదాయేతర వనరుల నుంచి ఇంధనం తయారు చేసుకుని కర్బన ఉద్గారాలను తగ్గించి, తద్వారా భూతాపం పెరగకుండా జాగ్రత్తపడితేనే మానవాళికి భవిష్యత్తు అని జేఎన్‌టీయూ(అనంతపురం) ఉప కులపతి ఆచార్య రంగజనార్దన అన్నారు. 'మానవాళి సుస్థిర భవిష్యత్తుకు నూతన సంప్రదాయేతర, పునరుత్పాదక ఇంధనాల ప్రాముఖ్యత–2023' అనే అంశంపై కడపలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయస్థాయి సదస్సు శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య రంగజనార్దన మాట్లాడుతూ కర్బన ఉద్గారాలను తగ్గించుకుంటూ సౌరవిద్యుత్, పవన విద్యుత్ వంటి జీవ ఇంధనాల వినియోగాన్ని పెంచుకుంటే భవిష్యత్తుకు మంచి చేసినవారవుతామన్నారు. వైవీయూ ఉప కులపతి ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ శిలాజ ఇంధన వనరుల వాడకం తగ్గించి జీవ ఇంధనాల ఆధారిత వనరుల వినియోగం పెంచగలిగితే మానవాళికి సుస్థిర భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు. ఆచార్య పీఎస్ షావల్లీ ఖాన్ మాట్లాడుతూ ఈ సదస్సులో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 370మంది పరిశోధకులు తమ పరిశోధన పత్రాలు సమర్పించారని తెలిపారు.

ఒంటరి ఏనుగు వీరంగం

- శిక్షణ పొందిన ఏనుగులపై దాడికి యత్నం
- తృటిలో తప్పిన ప్రమాదం

రామకుప్పం (చిత్తూరు జిల్లా): మండలంలోని ననియాల ఎకో టూరిజం పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున ఒంటరి ఏనుగు వీరంగం సృష్టించింది. ఒంటరి ఏనుగు అడవిలోనుంచి బయటకు వచ్చి హఠాత్తుగా ననియాల ఎలిఫెంట్ క్యాంపులో శిక్షణ పొందిన ఏనుగులు వినాయక్, జయంత్‌పై దాడి చేయడానికి ప్రయత్నించింది. సోలార్ కంచె మీద ఎండిపోయిన చెట్టు కొమ్మను వేసి ఒంటరి ఏనుగు లోపలికి వచ్చింది. షెడ్డు కింద గొలుసులతో కట్టి ఉంచిన ఏనుగు వినాయక్‌పై దాడికి పాల్పడింది. భీకర పోరుకు ఏనుగులు పూనుకున్న సమయంలో అప్రమత్తమైన అటవీ సిబ్బంది పెద్ద పెద్ద శబ్దాలు చేసి ఒంటరి ఏనుగును అడవిలోకి తరిమారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. ఎమ్మెల్సీ భరత్ ఎలిఫెంట్ క్యాంపులో ఉన్న ఏనుగు వినాయక్‌ను పరిశీలించారు.

మహువాపై వేటు



లోక్‌సభ సభ్యత్వం రద్దు | నోటుకు ప్రశ్నల ఉదంతంలో స్పీకర్ నిర్ణయం | మూజువాణి ఓటుతో సభ ఆమోదం

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ పార్టీ లోక్ సభ సభ్యురాలు మహువా మొయిత్రాపై బహిష్కరణ వేటు పడింది. ఆమె లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం ప్రకటించారు. డబ్బులు తీసుకుని ప్రశ్నలు అడిగిన కేసులో ఆమెను దోషిగా తేలుస్తూ లోక్‌సభ ఎథిక్స్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై విపక్షాలు అభ్యంతరాలు వెలిబుచ్చగా స్పీకర్ నిర్ణయాన్ని తృణమూల్ కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబట్టింది. తనపై వేటును మొయిత్రా తీవ్రంగా నిరసించారు. స్పీకర్ చర్య అనర్హులైన జడ్జిలతో కూడిన (కంగారూ) కోర్టు ఉరిశిక్ష తీర్పు వెలువరించినట్టుగా ఉందంటూ ఎద్దేవా చేశారు. ఆమె పశ్చిమబెంగాల్‌లోని కృష్ణనగర్ లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

మాట్లాడే చాన్సివ్వని స్పీకర్

మొయిత్రా ఉదంతంపై విచారణ జరిపిన బీజేపీ ఎంపీ వినోద్‌కుమార్ సోంకర్ సారథ్యంలోని ఎథిక్స్ కమిటీ శుక్రవారం మధ్యాహ్నం లోక్‌సభకు నివేదిక సమర్పించింది. ఆమెను దోషిగా తేల్చినట్టు పేర్కొంది. ''మొయిత్రా అనైతిక ప్రవర్తనకు పాల్పడ్డారు. తన లోక్‌సభ పోర్టల్ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను అనధికారిక వ్యక్తులకు ఇచ్చారు. తద్వారా దేశ భద్రతకు తీవ్ర విఘాతం కలిగించే పని చేశారు'' అని తెలిపింది. అనంతరం మొయిత్రాను సభ నుంచి బహిష్కరించాలంటూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ తీర్మానం ప్రవేశపెట్టారు. ''మొయిత్రా ప్రవర్తన ఒక ఎంపీ స్థాయికి తగ్గట్టుగా లేదని తేలింది. ఒక వ్యాపారవేత్త నుంచి డబ్బు, కానుకలు తీసుకుని ప్రతిగా అతని ప్రయోజనాల కోసం ఇలాంటి పనులు చేయడం గర్హనీయం'' అని అందులో పేర్కొన్నారు. మొయిత్రా సభ్యత్వ రద్దుకు కమిటీ చేసిన సిఫార్సును ఆమోదించాల్సిందిగా సభను మంత్రి కోరారు. తృణమూల్‌తో పాటు కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు ఇందుకు తీవ్ర అభ్యంతరాలు తెలిపాయి. మొయిత్రాకు తన వాదన విన్పించే అవకాశమివ్వాలని డిమాండ్ చేశాయి. గత ఉదంతాలను ఉటంకిస్తూ అందుకు స్పీకర్ నిరాకరించారు. ''2005లో నగదుకు ప్రశ్నల కుంభకోణానికి పాల్పడ్డ 10 మంది లోక్‌సభ సభ్యులను నాటి స్పీకర్ సోమనాథచటర్జీ సభ నుంచి బహిష్కరించారు. ఆ సందర్భంగా సదరు ఎంపీలకు తమ వాదన చెప్పుకునే అవకాశమివ్వలేదు. అంతేకాదు, ఈ ఉదంతంపై ఎథిక్స్ కమిటీ నివేదిక సభకు అందిన రోజే దాని సిఫార్సు మేరకు వారిపై అనర్హత వేటు వేయాలని సభను కోరుతూ నాటి లోక్‌సభ నేత ప్రణబ్ ముఖర్జీ తీర్మానం ప్రవేశపెట్టారు'' అని గుర్తు చేశారు. అనంతరం నివేదిక, తీర్మానంపై కాసేపు వాడివేడి చర్చ జరిగింది. నివేదికను విశ్లేషించేందుకు సభ్యులకు కనీసం మూడు నాలుగు రోజుల సమయమివ్వాలని సభ్యుడు అధీర్ రంజన్ చౌదరి (కాంగ్రెస్) కోరగా స్పీకర్ తిరస్కరించారు. ఒక సభ్యున్ని బహిష్కరించాలంటూ సిఫార్సు చేసే అధికారం ఎథిక్స్ కమిటీకి లేదని కాంగ్రెస్ సభ్యుడు మనీశ్ తివారీ వాదించారు. అనంతరం మూజువాణి ఓటుతో తీర్మానాన్ని సభ ఆమోదించింది. దీన్ని నిరసిస్తూ విపక్షాలు వాకౌట్ చేశాయి. అనంతరం మహువాతో కలిసి గాంధీజీ విగ్రహం వద్ద నేతలు నిరసన తెలిపారు.

ఏం జరిగింది?

వ్యాపారవేత్త దర్శన్ హీరా నందానీ నుంచి మొయిత్రా భారీగా డబ్బులు, ఖరీదైన కానుకలు తీసుకుని ఆయనకు లబ్ధి చేకూర్చేలా అదానీ సంస్థ తదితరాలపై లోక్‌సభలో ప్రశ్నలడిగారంటూ బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే గత అక్టోబర్‌లో తీవ్ర ఆరోపణలు చేశారు. అంతేగాక మొయిత్రా తన లోక్‌సభ వెబ్‌సైట్ లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌ను కూడా నందానీకి ఇచ్చారని దూబేతో పాటు ఆమె మాజీ సన్నిహితుడు జై అనంత్ దేహద్రాయ్ కూడా ఆరోపించారు. అది నిజమేనంటూ నందానీ ఎథిక్స్ కమిటీకి అఫిడవిట్ సమర్పించారు. దీనిపై మొయిత్రాను ఎథిక్స్ కమిటీ విచారణకు పిలిచింది. అసభ్యకరమైన ప్రశ్నలడిగారంటూ విచారణను ఆమె బాయ్‌కాట్ చేశారు. ఈ కేసులో సీబీఐ ఇప్పటికే ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసింది.

ప్రజాస్వామ్యానికి ఉరి: మమత

డార్జిలింగ్: మొయిత్రాను బహిష్కరించడం ద్వారా ప్రజాస్వా మ్యాన్ని హత్య చేశారని తృణమూల్ కాంగ్రెస్ చీఫ్, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ మండిపడ్డారు. ఈ చర్య పార్లమెంటుకే మచ్చ తెచ్చిందన్నారు. ''పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఇది దుర్దినం. ఎన్నికల్లో తమను ఓడించలేక బీజేపీ ఇలా కక్షసాధింపు రాజకీయాలకు దిగుతోంది'' అని ఆరోపించారు. మొయిత్రాకు పార్టీ పూర్తిగా మద్దతుగా నిలుస్తుందన్నారు. ''500 పేజీల నివేదిక సభ ముందు పెట్టి, కేవలం 30 నిమిషాల చర్చతో తీర్పు వెలువరించడమా? అంత తక్కువ సమయంలో సభ్యులు నిర్ణయానికి ఎలా రాగలరు?'' అని మమత ప్రశ్నించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమి తథ్యమన్నారు. మొయిత్రాకు దన్నుగా నిలిచినందుకు ఇండియా కూటమికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్‌తో పాటు బీఎస్పీ, ఎస్పీ, సీపీఐ, పీడీపీ తదితర పార్టీల నేతలు కూడా బహిష్కరణను తప్పుబట్టారు.

ప్రశ్నలడిగేది నా పీఏనే!

మొయిత్రా ఉదంతంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో జేడీ(యూ) సభ్యుడు గిరిధారీ యాదవ్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. ''నాకసలు కంప్యూటర్ ఎలా ఆపరేట్ చేయాలో కూడా తెలియదు. అందుకే నేను ఒక్క లిఖిత ప్రశ్న కూడా స్వయంగా అడగలేదు. నా లోక్‌సభ పోర్టల్ లాగిన్‌ఐడీ, పాస్‌వర్డ్ నా పీఏ దగ్గరుంటాయి. నా తరఫున నా ప్రశ్నలన్నింటినీ అతనే అందులో అడుగుతాడు'' అని చెప్పుకొచ్చారు! దాంతో అంతా అవాక్కయ్యారు. అలా ఇతరులతో ప్రశ్నలు తయారు చేయించకూడదంటూ ఎంపీని స్పీకర్ మందలించారు.



30 ఏళ్లైనా పోరాడతా: మొయిత్రా

ఎథిక్స్ కమిటీ నివేదికను మొయిత్రా తూర్పారబట్టారు. నిబంధనలకు పాతరేస్తూ తనపై హడావుడిగా వేటు వేశారని ఆరోపించారు. స్పీకర్ నిర్ణయం అనంతరం విపక్ష ఇండియా కూటమి నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తదితరులతో కలిసి పార్లమెంటు ఆవరణలో మొయిత్రా మీడియాతో మాట్లాడారు. ''రేపు కచ్చితంగా సీబీఐని నా ఇంటిపైకి ఉసిగొల్పుతారు. మరో ఆర్నెల్ల పాటు నన్నిలాగే వేధిస్తారు. కానీ పారిశ్రామికవేత్త అదానీ అక్రమాల మాటేమిటి? ఆయన పాల్పడ్డ రూ.13 వేల కోట్ల బొగ్గు కుంభకోణంకేసి సీబీఐ, ఈడీ కన్నెత్తి కూడా చూడవెందుకు?'' అని ప్రశ్నించారు. మోదీ సర్కారుకు అదానీ ఎంతటి ముఖ్యుడో తనపై వేటుతో మరోసారి నిరూపితమైందన్నారు. ''లోక్‌సభ నుంచి బహిష్కరించి నా నోరు మూయించవచ్చని, పారిశ్రామికవేత్త అదానీ ఉదంతం నుంచి బయట పడొచ్చని భావిస్తే పొరపాటు. నాకిప్పుడు 49 ఏళ్లు. మరో 30 ఏళ్ల దాకా పార్లమెంటు లోపల, బయట మీపై పోరాడుతూనే ఉంటా'' అని ప్రకటించారు.

ఏ ఆధారాలతో వేటు?

తనకు వ్యతిరేకంగా ఏ ఆధారాలూ లేకపోయినా ఎథిక్స్ కమిటీ తప్పుడు సిఫార్సు చేసిందని మొయిత్రా ఆరోపించారు. విపక్షాలను లొంగదీసుకునేందుకు మోదీ సర్కారు చేతిలో ఆయుధంగా కమిటీ పని చేస్తోందని దుయ్యబట్టారు. ''నాకు డబ్బు గానీ, కానుకలు గానీ ఇచ్చినట్టు ఒక్క ఆధారమన్నా ఉందా? పైగా, అసలు ఉనికిలోనే లేని నైతిక నియామవళిని ఉల్లంఘించానని తేల్చడం మరీ విడ్డూరం'' అంటూ ఎద్దేవా చేశారు. ''ఎథిక్స్ కమిటీ నివేదిక నియమావళిలోని ప్రతి రూల్‌నూ ఉల్లంఘించింది. సభ ఆమోదించి ప్రోత్సహించిన రోజువారీ విధానాన్ని పాటించినందుకు నన్ను శిక్షిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించి చరిత్ర సృష్టించిన 17వ లోక్‌సభ 78 మంది మహిళా ఎంపీల్లో ఒకరినైన నన్ను ఫక్తు కక్షసాధింపు రాజకీయాల్లో భాగంగా వెంటాడి వేధించిన ఉదంతానికి కూడా వేదికైంది. బంగ్లాదేశ్ సరిహద్దులను ఆనుకున్న సుదూర లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏ రాజకీయ నేపథ్యమూ లేని నావంటి తొలిసారి ఎంపీని అనుక్షణం వేధించింది'' అంటూ ధ్వజమెత్తారు.

విరుద్ధ వాంగ్మూలాలు

ఫిర్యాదుదారుల్లో ఒకరు తన మాజీ సహచరుడని మొయిత్రా గుర్తు చేశారు. ''అతడు తప్పుడు ఉద్దేశంతో నాపై బురదజల్లాడు. కేవలం ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులిచ్చిన వాంగ్మూలాల ఆధారంగా నాపై వేటు వేశారు. వారి వాంగ్మూలాలు పరస్పరం విరుద్ధంగా ఉన్నా పట్టించుకోలేదు. కనీసం వారిని విచారించను కూడా లేదు. వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీ కూడా పిలిచి విచారించలేదు'' అంటూ ఆక్షేపించారు. ''నందానీ వ్యాపార ప్రయోజనాల కోసం అతని దగ్గర డబ్బులు, కానుకలు తీసుకుని సభలో ప్రశ్నలడిగానని ఎంపీ దూబే తన ఫిర్యాదులో ఆరోపించారు. నందానీ మాత్రం నేనే నా సొంత అజెండాను ముందుకు తీసుకెళ్లడానికి వీలైన ప్రశ్నలు లోక్‌సభ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేలా తనపై ఒత్తిడి తెచ్చానని సుమోటో అఫిడవిట్ దాఖలు చేశారు. వీటిలో ఏది నిజం?'' అని ప్రశ్నించారు.

లాగిన్ రూల్స్ ఉన్నాయా?

లోక్‌సభ పోర్టల్ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను ఇతరులకు ఇచ్చానన్న ఏకైక అభియోగంపైనే తనను బహిష్కరించారని మొయిత్రా గుర్తు చేశారు. కానీ ఈ విషయంలో ఎలాంటి నియమ నిబంధనలూ లేవని వాదించారు.

ఉల్లి ఎగుమతులపై కేంద్రం నిషేధం

సాక్షి, న్యూఢిల్లీ: దేశీయంగా ఉల్లి ధరలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో వాటి ఎగుమతులపై నిషేధం విధిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం ఉల్లి ధర కిలో రూ.60 నుంచి రూ.80 వరకు ఉంది. ధరల కట్టడి చర్యల్లో భాగంగా ఈనెల 8 నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు ఎగుమతులపై నిషేధం విధిస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశీయంగా ఉల్లి సరఫరాను మెరుగుపరిచేందుకు, ధరలను అదుపు చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొంది.

కెనడా స్టూడెంట్ డిపాజిట్ రెట్టింపు

ఒట్టావా: కెనడా ప్రభుత్వం స్టూడెంట్ పర్మిట్ డిపాజిట్‌ను రెట్టింపు చేసింది. రెండు దశాబ్దాలుగా 10 వేల డాలర్లుగా ఉన్న డిపాజిట్ మొత్తాన్ని ఏకంగా 20, 635 డాలర్లకు పెంచుతున్నట్లు కెనడా ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ గురువారం ప్రకటించారు. ఈ నిబంధన వచ్చే జనవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా ఈ మార్పు చేసినట్లు ఆయన వివరించారు.

మిజోరం సీఎంగా లాల్దుహోమా ప్రమాణం

ఐజ్వాల్: మిజోరం నూతన ముఖ్యమంత్రిగా జోరం పీపుల్స్ మూమ్‌మెంట్(జెడ్‌పీఎం) నేత లాల్దుహోమా(73) శుక్రవారం ప్రమాణం చేశారు. గవర్నర్ కంభంపాటి హరిబాబు ఆయనతోపాటు 11 మంది మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించారు. శాసనసభలోని 40 మంది ఎమ్మెల్యేలకు గాను సీఎంతో కలిపి 12 మంది వరకు మంత్రులుండొచ్చు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్‌ఎఫ్) నేత, తాజామాజీ సీఎం లాల్ తన్‌హావ్లా, ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు, కాంగ్రెస్‌కు చెందిన ఒకరు హాజరయ్యారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ఐపీఎస్ లాల్దుహోమాకు చెందిన జెడ్‌పీఎం ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.

నేవీలో 10వేల మందికి పైగా సిబ్బంది కొరత

న్యూఢిల్లీ: రక్షణ రంగంలో కీలక విభాగమైన భారత నావికాదళంలో సిబ్బంది కొరత భారీస్థాయిలో ఉంది. ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా శుక్రవారం పార్లమెంట్‌లో కేంద్రం తెలిపిన వివరాల ఆధారంగా ఈ విషయం వెల్లడైంది. అక్టోబర్ 31వ తేదీ నాటికి నౌకాదళంలో మొత్తంగా 10,896 ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. వీటిలో ఆఫీసర్ ర్యాంక్ పోస్టులే 1,777 దాకా ఉన్నాయని లోక్‌సభలో కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ తెలిపారు.

నకిలీ టోల్‌ప్లాజాతో కోట్లు కొట్టేశారు

- గుజరాత్‌లో రూ.75 కోట్లకు పైగా వసూళ్ల పర్వం
- ఐదుగురి అరెస్ట్

గాంధీనగర్: పూర్వం రహదారిపై దారి దోపిడీలు జరిగేవి. ఇప్పుడు దొంగలు ఏకంగా జాతీయరహదారిపై టోల్‌ప్లాజా ఒకటి తెరిచేసి దర్జాగా టోల్ వసూళ్లు మొదలెట్టేశారు. ఈ దోపిడీ ఘటనకు గుజరాత్ రాష్ట్రంలోని జాతీయరహదారి వేదికైంది. నకిలీ టోల్‌ప్లాజా ద్వారా మోసగాళ్ల ముఠా ఏకంగా రూ.75 కోట్లకుపైగా వసూళ్లకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఏడాదికాలంగా ఇది జరుగుతున్నా పోలీసులకు ఇంతకాలం సమాచారం లేకపోవడం విడ్డూరం. నకిలీ టోల్ ప్లాజా గుట్టుమట్లు తాజాగా స్థానికంగా వెలుగులోకి వచ్చాక చిట్టచివరన పోలీసులకు తెలిశాయి. ప్రస్తుతం కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలెట్టి ఐదుగురిని అరెస్ట్ చేశారు. సంబంధిత వివరాలను పోలీసులు వెల్లడించారు.

తక్కువ రేటు కావడంతో అంతా గప్‌చుప్

మోర్బీ జిల్లా, కచ్ జిల్లాలను కలిపే 8ఏ నంబర్ జాతీయరహదారిపై వాఘసియా టోల్ ప్లాజా ఉంది. దీని గుండా వెళ్లకుండా సమీప ప్రాంతం గుండా వెళ్లొచ్చని వాహనదారులు కనిపెట్టారు. అనుకున్నదే తడవుగా ఆ ప్రాంతం గుండా వెళ్లడం మొదలెట్టారు. ఈ విషయం తెల్సుకున్న ఒక ముఠా ఒక కొత్త పథకంతో రంగంలోకి దిగింది. ఈ మార్గంలో నిరుపయోగంగా ఉన్న 'వైట్‌హౌజ్' అనే సిరామిక్ ఫ్యాక్టరీని అద్దెకు తీసుకున్నారు. దానికి ఇరువైపులా హైవే వరకు కొత్త రోడ్లు వేశారు. ఫ్యాక్టరీలో టోల్ ప్లాజా కౌంటర్ నిర్మించి వసూళ్ల పర్వానికి తెరలేపారు. సాధారణంగా జాతీయ రహదారిపై ఒక్కో వాహనాన్ని బట్టి రూ. 110 నుంచి రూ.595 వసూలుచేస్తారు. కానీ ఈ 'దొంగ' మార్గంలో వెళ్లే వాహనదారుల నుంచి ఈ ముఠా కేవలం రూ.20 నుంచి రూ.200 వసూలుచేసేవారు. ఇంత తక్కువకే టోల్‌గేట్‌ను దాటేస్తుండటంతో తెల్సినవారంతా ఈ మార్గంలోనే రాకపోకలు సాగించేవారు. కొత్త వాహనదారులకు, స్థానికులకు ఇది బోగస్ టోల్‌ప్లాజా అని తెల్సికూడా.. తక్కువ ధరలో పని అయిపోతుందని మిన్నకుండిపోయారు. దాంతో ముఠా వ్యాపారం ఒక ఏడాదిపాటు యథేచ్ఛగా సాగింది. గత 18 నెలల్లో ఈ ముఠా దాదాపు రూ.75 కోట్లు కొట్టేసిందని మాజీ ఐపీఎస్ రమేశ్ ఆరోపించారు.

నిందితుల్లో పటేల్ నేత కుమారుడు

స్థానిక మీడియాలో కథనాలు, విమర్శలు రావడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించి ఐదుగురిని అరెస్ట్‌చేశారు. సిరమిక్ ఫ్యాక్టరీ యజమాని అమర్షీ పటేల్‌తోపాటు అతని నలుగురు అనుచరులు, మరో వ్యక్తినీ అరెస్ట్‌చేశారు. అమర్షీ సౌరాష్ట్ర ప్రాంతంలో కీలకమైన పటీదార్ సామాజిక వర్గానికి చెందిన నేత కుమారుడు కావడం గమనార్హం.

దోచిన ప్రతి పైసా కక్కిస్తాం

- విపక్షాలకు మోదీ హెచ్చరిక
- ఏమిటీ కరెన్సీ గుట్టలంటూ ఎక్స్‌లో పోస్టు

న్యూఢిల్లీ: ''ప్రజల నుంచి గతంలో మీరు దోచుకున్న ప్రతి పైసానూ కక్కిస్తా. దాన్నంతటినీ ప్రజలకు తిరిగిచ్చేయాల్సిందే'' అని విపక్షాలను ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. 'ఇది మోదీ హామీ' అంటూ శుక్రవారం ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జార్ఖండ్ కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహుకు చెందినదిగా చెబుతున్న వ్యాపార సంస్థ నుంచి రూ.200 కోట్లను ఐటీ శాఖ రికవర్ చేసిందన్న వార్తను ప్రధాని ట్యాగ్ చేశారు. పలు అల్మారాల్లో అరల నిండా పేర్చిన కరెన్సీ నోట్లకు సంబంధించిన ఫొటోలు సోషల్ సైట్లలో వైరల్‌గా మార్చడం తెలిసిందే. ఈ కరెన్సీ నోట్ల గుట్టను దేశ ప్రజలంతా చూడాలని మోదీ కోరారు. తర్వాత నిజాయితీపై కాంగ్రెస్ నేతలు దంచే స్పీచులు వినాలంటూ ఎద్దేవా చేశారు. పలు ఎమోజీలను కూడా పోస్టుకు జత చేశారు.


వెడ్ ఇన్ ఇండియా సంపన్నులకు మోదీ పిలుపు

డెహ్రాడూన్: సంపన్నులు డెస్టినేషన్ పెళ్లిళ్లకు దేశీయ లొకేషన్లనే ఎంచుకోవాలని మోదీ కోరారు. ఇందుకోసం మేడిన్ ఇండియా మాదిరిగానే 'వెడ్ ఇన్ ఇండియా' అంటూ విప్లవమే రావాల్సిన అవసరముందని ఆయన అభిప్రాయపడ్డారు. సంపన్న పారిశ్రామికవేత్తలు తమ కుటుంబాల్లో కనీసం ఒక్క పెళ్లినైనా ఉత్తరాఖండ్ వంటి చోటప్లాన్ చేయాలని సూచించారు. తద్వారా ఈ హిమాలయ రాష్ట్రం వెడ్డింగ్ డెస్టినేషన్‌గా మారుతుందని ఆశాభావం వెలిబుచ్చారు. శుక్రవారం ఇక్కడ ఉత్తరాఖండ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమిట్ తొలి సెషన్‌లో మోదీ ప్రసంగించారు. భారత్‌లో సంపన్న వ్యాపార వర్గాలు పెళ్లిళ్లకు విదేశాలనే ఎంచుకోవడం ఫ్యాషన్‌గా మారిందన్నారు. ''పెళ్లిళ్లు స్వర్గంలో నిర్ణయమవుతాయంటారు. మరి వాటిని చేసుకునేందుకు యువ జంటలు దేవ భూమి ఉత్తరాఖండ్‌కు బదులు విదేశాలకు ఎందుకు వెళ్లడం?'' అని ప్రశ్నించారు.

సౌర కళలు సూపర్

అపురూపమైన ఫొటోలు తీసిన ఆదిత్యఎల్1

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): సూర్యునిపై పరిశోధనల నిమిత్తం ఇస్రో ప్రయోగించిన ఆదిత్య ఎల్1 ఉపగ్రహం అపూర్వమైన ఫొటోలను అందించింది. తొలిసారిగా సూర్యుని ఫుల్ డిస్క్ ఇమేజీలను భూమికి పంపింది. ఉపగ్రహంలోని సోలార్ అల్ట్రా వయొలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్ (సూట్) విజయవంతంగా ఈ ఫొటోలు తీసినట్టు ఇస్రో శుక్రవారం పేర్కొంది. వాటిని తన వెబ్‌సైట్‌లో ఉంచింది. ఈ ఫొటోలను 200-400 ఎన్ఎం తరంగదైర్ఘ్య పరిధిలో తీసినట్టు వెల్లడించింది. ఈ ఫొటోల్లో సూర్యుని తాలూకు ఫొటోస్పియర్, క్రోమోస్పియర్‌లను 11 వేర్వేరు శాస్త్రీయ ఫిల్టర్లను ఉపయోగించి ఆదిత్య ఎల్1 బంధించింది. ఆ స్పియర్లపై లోతైన సమాచారాన్ని ఈ ఫొటోలు అందించినట్టు ఇస్రో తెలిపింది. భూ వాతావరణంపై సౌర ధార్మికత ప్రభావం తదితరాలను మరింత లోతుగా అధ్యయనం చేయడానికి తాజా ఫొటోలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపింది. వాటిలో సూర్య వలయాల వంటివి కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి. గత సెప్టెంబర్ 2న ప్రయోగించిన ఆదిత్య ఎల్1 సూర్యుని దిశగా ప్రయాణంలో భాగంగా లాంగ్రేజియన్ పాయింట్1కు చేరింది. దీంట్లోని ఏడు పేలోడ్లను పూర్తిగా దేశీయంగానే రూపొందించారు.



ఆదిత్య ఎల్1 తీసిన సూర్యుని ఛాయాచిత్రాలు

నేను రాజ్యాంగానికి సేవకుడిని

సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ/ముంబై: రాజ్యాంగానికి, చట్టానికి తానో సేవకుడినని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. నిర్దేశించిన స్థానాన్ని అనుసరించాల్సి ఉంటుందని అన్నారు. సీజేఐ సారథ్యంలోని ధర్మాసనం శుక్రవారం కార్యకలాపాలు ప్రారంభించగానే, మాథ్యూస్ జె.నెడుంపర అనే న్యాయవాది ఓ అంశాన్ని ప్రస్తావిస్తూ..సీనియర్ న్యాయవాది హోదా విధానాన్ని రద్దు చేయడంతోపాటు కొలీజియం వ్యవస్థలో సంస్కరణలు తేవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. దీనిపై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ..'మనస్సులో ఉన్న విషయం చెప్పే స్వేచ్ఛ మీకుంది. భారత ప్రధాన న్యాయమూర్తిగా, ఒక జడ్జిగా, నేను చట్టానికి, రాజ్యాంగానికి సేవకుడిని. నాకు నిర్దేశించిన స్థానాన్ని అనుసరించాల్సి ఉంటుంది. అంతేతప్ప, నాకు నచ్చింది కాబట్టి, ఇది నేను చేస్తాను అని చెప్పలేను'అని పేర్కొన్నారు. లాయర్లకు సీనియర్ హోదా ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ నెడుంపర మరో ఏడుగురు వేసిన పిటిషన్‌పై అక్టోబర్‌లో విచారణ చేపట్టిన అప్పటి సుప్రీంకోర్టు బెంచ్.. సీనియర్ న్యాయవాది హోదాను ప్రతిభకు గుర్తింపుగా పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేసింది. అదేవిధంగా, సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్(సీఏటీ) ముంబై ధర్మాసనం కొత్త కార్యాలయాన్ని శుక్రవారం సీజేఐ ప్రారంభించారు. న్యాయమూర్తుల నియామకంపై అంతిమ నియంత్రణ ఎవరిదనే అంశంపై నిత్యం తర్జనభర్జనలు జరుగుతూనే ఉన్నాయని ఈ సందర్భంగా ఆయన అన్నారు. జడ్జీల పోస్టుల ఖాళీలు పెరుగుతుండగా, నియామకాలు పెండింగ్‌లో ఉంటున్నాయని చెప్పారు. కోర్టుల్లో జాప్యాలను నివారించి, సకాలంలో న్యాయం అందించే విషయంలో ట్రిబ్యునళ్లు కీలకంగా మారాయన్నారు.

జడ్జీలు బోధనలు చేయరాదు

బాలికలపై కలకత్తా హైకోర్టు వ్యాఖ్యలకు సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: కౌమార బాలికలు లైంగిక కోరికలను నియంత్రించుకోవాలని, బాలురు మహిళలను గౌరవించడం అలవర్చుకోవాలంటూ కలకత్తా హైకోర్టు చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఇటువంటి తీర్పు ఎంతో అభ్యంతరకరం, అవాంఛనీయమని పేర్కొంది. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తుల వ్యాఖ్యలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం కౌమార వయస్కుల హక్కులను పూర్తి స్థాయిలో ఉల్లంఘించడమేనని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌ల ధర్మాసనం పేర్కొంది. 'సంబంధిత అప్పీల్‌లో న్యాయపరమైన అంశాలను పరిశీలించాలే తప్ప,న్యాయమూర్తులు తమ వ్యక్తిగత అభిప్రాయాలను వ్యక్తపరచరాదని, బోధనలు చేయరాదని ప్రాథమికంగా మేం భావిస్తున్నాం'అని తెలిపింది. ఈ అంశంపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి, సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసింది. సీనియర్ న్యాయవాది మాధవి దివాన్‌ను అమికస్ క్యూరీగాను, ఆమెకు సాయం అందించేందుకు న్యాయవాది లిజ్ మాథ్యూను నియమించింది. 'ప్రతి కౌమార బాలిక లైంగిక కోరికలను నియంత్రించుకోవాలి. అలా కాకుండా, కేవలం రెండు నిమిషాల లైంగిక ఆనందాన్ని ఆస్వాదించడం కోసం లొంగిపోతే సమాజం దృష్టిలో ఆమె ఓడిపోయినట్లే'అని కలకత్తా హైకోర్టు అక్టోబర్ 18వ తేదీన ఓ కేసు తీర్పు సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం సుప్రీంకోర్టు స్వయంగా విచారణ జరిపింది.

ఒడిశాలో ఐటీ దాడులు..156 సంచుల్లో డబ్బు

భువనేశ్వర్/రాంచీ: ఒడిశాకు చెందిన డిస్టిలరీ గ్రూప్‌పై ఆదాయ పన్ను శాఖ అధికారులు కొనసాగిస్తున్న సోదాల్లో కళ్లు చెదిరే రీతిలో కట్టల కొద్దీ అక్రమ నగదు బయటపడుతోంది. గురువారం బొలంగీర్‌లోని బల్దేవ్ సాహు అండ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌లో జరిపిన తనిఖీల్లో రూ.200 కోట్ల నగదు బయటపడింది. శుక్రవారం బొలంగీర్ జిల్లా సుదపడలో జరిపిన సోదాల్లో నిండా కరెన్సీ నోట్లున్న 156 సంచులను గుర్తించారు. వీటిలో ఏడు బ్యాగుల్లో నగదును లెక్కించగా రూ.20 కోట్లుగా తేలిందని అధికారులు తెలిపారు. దీంతో, ఇప్పటి వరకు లభ్యమైన డబ్బు రూ.220 కోట్లకు చేరుకుందన్నారు. లిక్కర్ కంపెనీతో సంబంధాలున్నట్లు అనుమానాలున్న జార్ఖండ్ ఎంపీ సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని పీటీఐ తెలిపింది. రాంచీలోని ఆయన కార్యాలయం సిబ్బంది కూడా ఎంపీ అందుబాటులో లేరని చెబుతున్నారు. పన్ను ఎగవేత ఆరోపణలపై ఐటీ అధికారులు మూడు రోజులుగా డిస్టిలరీ గ్రూప్ సంస్థలకు చెందిన సంబల్‌పూర్, బొలంగీర్, తితిలాగఢ్, సుందర్‌గఢ్, రూర్కెలా, భువనేశ్వర్‌లలో తనిఖీలు సాగిస్తున్నారు.

ఢిల్లీ మద్యం కేసులో బినోయ్‌కి బెయిల్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం విధానం కేసులో నిందితుడు హైదరాబాద్ వ్యాపారవేత్త బినోయ్‌బాబుకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బినోయ్ బెయిల్ దరఖాస్తుపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిల ధర్మాసనం శుక్రవారం విచారించింది. బినోయ్‌బాబుపై ఎలాంటి అభియోగాలు మోపకుండా 13 నెలలపాటు జైలులో ఉంచినందుకు ఈడీపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. 'ఈడీ తీరు సరికాదు. వ్యక్తుల్ని ఎక్కువ కాలం ముందస్తు నిర్బంధంలో ఉంచలేరు. ఈ కేసు ఇంకా ఎంతకాలం సాగుతుంది తెలియదు. బినోయ్‌బాబుపై మోపిన ఆరోపణలకు సంబంధించి ఈడీ, సీబీఐ వాదనలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అనంతరం బినోయ్‌కి బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. ప్రముఖ మద్యం తయారీదారు పెర్నోడ్ రికర్డ్స్ ఎగ్జిక్యూటివ్‌గా ఉన్న బినోయ్‌బాబు, విజయ్ నాయర్‌లను గత ఏడాది నవంబర్‌లో ఈడీ అరెస్ట్ చేసింది.

యూపీఎస్సీ మెయిన్స్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: అఖిల భారత సర్వీసులకు ఉద్యోగుల ఎంపిక నిమిత్తం నిర్వహించిన యూపీఎస్సీ-2023 మెయిన్స్ ఫలితాలు శుక్రవారం వెల్లడయ్యాయి. మెయిన్స్ పరీక్షలను గత సెప్టెంబర్‌లో నిర్వహించడం తెలిసిందే. గత మే నెలలో నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షలను దాదాపు 13 లక్షల మంది రాశారు. 15 వేల మంది మెయిన్స్‌కు ఎంపికయ్యారు. వారిలో దాదాపు 2,500 మంది తాజాగా ఇంటర్వ్యూకు అర్హత సాధించినట్టు సమాచారం. ఇంటర్వ్యూ తేదీలతో త్వరలో నోటిఫికేషన్ వెలువడనుంది. ఈసారి మొత్తం 1,105 మందిని సివిల్ సర్వీసులకు యూపీఎస్సీ ఎంపిక చేయనుంది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం । 9 । డిసెంబర్ । 2023


బెళగావిలో జరుగుతున్న శీతాకాల సమావేశాలను వీక్షించడానికి శుక్రవారం సువర్ణ సౌధకు వచ్చిన వివిధ పాఠశాలల విద్యార్థినులు

న్యూస్‌రీల్

పులి, కూన మృత్యువాత


పులి కళేబరం

మైసూరు : బండీపుర పులుల సంరక్షణ ప్రాంతంలో పులి, దాని పిల్ల(కూన) మృత్యువాత పడ్డాయి. బండీపుర నుంచి కిలోమీటర్ దూరంలో పొదనుంచి దుర్వాసన వస్తుండటంతో అటవీ సిబ్బంది వెళ్లి పరిశీలించగా కుళ్లిన స్థితిలో కళేబరాలు బయట పడ్డాయి. అటవీ శాఖ అధికారులు వచ్చి పరిశీలించారు. పశువైద్యులను పిలిపించి శవపరీక్షలు చేయించగా రెండు వారాల క్రితం అవి మృతి చెంది ఉంటాయని నిర్ధారించారు. శరీర భాగాలను ల్యాబ్‌కు పంపారు. వేటగాళ్ల బారిన పడి మృతి చెందాయా? లేదా ఇతర కారణాలు ఉన్నాయా అనేది పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత తెలుస్తుంది.

దొడ్డ బసవణ్ణ ఆలయ గోపురానికి పగుళ్లు

బనశంకరి: చారిత్రక బసవనగుడి దొడ్డబసవణ్ణ ఆలయ గోపురంలో పగుళ్లు ఏర్పడటంతో భక్తుల్లో భయం నెలకొంది. నాడుప్రభు కెంపేగౌడ హయాంలో నిర్మించిన దొడ్డబసవణ్ణ ఆలయ గోపురంపై రావిచెట్టు మొలవడంతో గోపురంలో పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరుకుంది. రావిచెట్టు తొలగించి మరమ్మతులు చేపట్టాలని పురావస్తు శాఖకు ఆలయ పాలక మండలి లేఖ రాసింది. పురావస్తు శాఖ అధికారులు గోపురం పరిశీలించి మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. కార్తీకమాస చివరి సోమవారం 11 తేదీనుంచి రెండు రోజుల పాటు శెనక్కాయల పరుష నిర్వహించనున్నారు.

ఏనుగు అర్జున సమాధికి పూజలు


పూజలు చేస్తున్న యదువీర్ దంపతులు

యశవంతపుర: మైసూరు దసరా వేడుకల్లో 8 సార్లు అంబారీని మోసి ఇటీవల వీరమరణం పొందిన ఏనుగు అర్జున సమాధిని మైసూరు రాజు యదువీర్ ఒడెయర్ దంపతులు శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్జున్‌కు ఈనెల 5న అంత్యక్రియలు చేశారు. ఆరోజు అనివార్య కారణాలతో రాజదంపతులు వెళ్లలేకపోయారు. శుక్రవారం సకలేశపుర తాలూకా దుబ్బళ్లికట్టెలోని సమాధిని దర్శించుకొని ప్యాలెస్ నుంచి తీసుకెళ్లిన శాలువాను కప్పి పూజలు చేశారు.

వాహనానికి ఎదురొచ్చిన ఏనుగు

- పర్యాటకులకు త్రుటిలో తప్పిన ప్రమాదం



మైసూరు: అడవిలో సఫారీకి వెళ్లిన పర్యాటకులపై ఏనుగు దాడి చేసేందుకు యత్నించింది. ఈ ఘటన చామరాజనగర జిల్లా గుండ్లుపేటె తాలూకా జాతీయ ఉద్యాన వనంలో చోటు చేసుకుంది. అటవీశాఖ ఏర్పాటు చేసిన వాహనంలో పర్యాటకులు అడవిలో పర్యటిస్తూ అడవి అందాలు తిలకిస్తూ మైమరచిపోయారు. ఇంతలో ఒక ఏనుగు వాహనానికి ఎదురుగా వచ్చింది. దీంతో పర్యాటకులు ప్రాణభయంతో గట్టిగా కేకలు వేశారు. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి వాహనాన్ని మరో వైపు తీసుకెళ్లాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

మనో నిబ్బరం ఏదీ?



బనశంకరి: నిబ్బరం కొరవడటం, జీవితంపై సరైన దృక్పథం లేకపోవడం, మానసిక స్థైర్యం లేకపోవడం, చుట్టుముట్టిన సమస్యలనుంచి బయటపడేందుకు మార్గం కనిపించకపోవడం, కుటుంబ కలహాలు, ప్రేమ విఫలం తదితర కారణాలతో క్షణికావేశంలో చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలా రాష్ట్రంలో రోజుకు సరాసరి నలుగురు రైతులు, ఐదుమంది గృహిణులు, ఇద్దరు విద్యార్థులతో పాటు మొత్తం 37 మంది ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఏటా 8 శాతం ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. 2022లో దేశంలో 1,70,924 మంది ఆత్మహత్యకు పాల్పడగా కర్ణాటకలో ప్రాణాలు కోల్పోయినవారు 13,606 మంది ఉన్నట్లు ఎన్‌సీఆర్‌బీ ఇటీవల విడుదలచేసిన నివేదికలో ప్రస్తావించింది. 2021లో 13,056 ఆత్మహత్య కేసులు నమోదు కాగా 2022 నాటికి 4.2 శాతం పెరిగింది. దేశంలోనే కర్ణాటక ఆత్మహత్యల్లో నాలుగో స్థానంలో నిలిచింది.

ఆత్మహత్యలకు అనేక కారణాలు

పరీక్షల్లో ఫెయిల్ కావడంతో 162 మంది విద్యార్థులు బలవన్మరణం చెందగా కుటుంబ కలహాలతో 3,779 మంది ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో పురుషులు 2462 మంది, మహిళలు 1317 మంది ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతో 1,401 మంది ఆత్మహత్య చేసుకోగా వీరిలో పురుషులు 1335, మహిళలు 66 మంది ఉన్నట్లు ఎన్‌సీఆర్‌బీ నివేదికలో పేర్కొన్నారు. ప్రేమవిషయంలో రాష్ట్రంలో 250 మంది పురుషులు, 103 మంది ఆడపిల్లలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇందులో బెంగళూరుకు చెందినవారు 158 మంది ఉన్నారు. దేశంలోని 53 నగరాలపైకి బెంగళూరు నగరంలో ఎక్కువగా ఆత్మహత్య కేసులు నమోదయ్యాయి. 2,313 మంది ఆత్మహత్యలకు పాల్పడగా దేశంలో రెండో స్థానంలో నిలిచింది. 2021లో 2,292 మంది ఆత్మహత్య కేసులు నమోదు కాగా 0.9 శాతం పెరిగింది. ఢిల్లీలో 3,367 ఆత్మహత్యలకు పాల్పడగా మొదటి స్థానంలో నిలిచింది. 1,581 ఆత్మహత్యలతో చెన్నై మూడో స్థానంలో నిలిచింది.

రాష్ట్రంలో సామూహిక ఆత్మహత్యకేసులు 7 నమోదు కాగా ఇందులో 13 మంది వివాహితులు, 3 అవివాహితులు ఉన్నారు. తమిళనాడులో 90 సామూహిక ఆత్మహత్య కేసులు నమోదు కాగా ఇందులో 192 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆత్మహత్యలతో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. కుటుంబ పెద్ద బలవన్మరణం చెందితే అతనిపై ఆధారపడిన అందరూ అనాథలుగా మారిపోతున్నారు. ఇక తల్లిదండ్రుల ఆత్మహత్యలతో వారి పిల్లల భవిష్యత్ అగమ్య గోచరంగా మారుతోంది.

కలకలం రేపుతున్న ఆకస్మిక చావులు

కరోనా సమయంలో హఠాన్మరణాలు భయభ్రాంతులకు గురిచేయగా కరోనా అనంతరం 2021తో పోలిస్తే 2022లో ఆకస్మిక మృతుల సంఖ్య 11.6 శాతం పెరిగింది. 56,653 మంది ప్రాణాలు కోల్పోగా వీరిలో 32,410 మంది గుండెపోటుతో మృతిచెందారు. 24,243 మంది ఇతర కారణాలతో మృతిచెందారు. ఇందులో 45 నుంచి 60 ఏళ్లకు వారు 19,456 మంది ఉన్నారు.

వృద్ధుల పరిస్థితి దయనీయం

వయోవృద్ధులపై నేరకార్యకలాపాలు పెరగ్గా 2022లో 28,545 కేసులు నమోదయ్యాయి. 2021తో పోలిస్తే 9.3 శాతం కేసులు పెరిగాయి. పిల్లలపై జరిగిన నేరాల సంఖ్య 1,62,449 కాగా 2021తో పోలిస్తే 8.7 శాతం పెరగ్గా ఎక్కువ కేసులు కిడ్నాప్ (45.7) శాతం, పోక్సో చట్టం కింద 39.7 శాతం కేసులు నమోదయ్యాయి. ప్రతి లక్ష మంది పిల్లల్లో నేరాల శాతం 36.6 ఉంది.

ఆపలేమా?

- సమస్యలకు చావే శరణ్యమా?
- రాష్ట్రంలో రోజుకు 37 మంది ఆత్మహత్య
- దేశంలోనే కర్ణాటక 4వ స్థానం
- బెంగళూరు రెండో స్థానం
- ఎన్‌సీఆర్‌బీ నివేదికలో వెల్లడి



ఎక్కువ మంది క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుంటారు. ఆ సమయంలో ఎవరైనా వారిని ఆపితే క్షణం గడిచిపోతుంది. వాళ్లు మళ్లీ ఆత్మహత్య గురించి ఆలోచించరు. పనిఒత్తిడి, పరిమితి లేని కోర్కెలు, చిన్న విషయానికే ఆవేశం, మనస్థాపానికి గురవ్వడం, అసూయ వంటి మానసిక రుగ్మతలు తగ్గించుకోవాలి. సమస్యలను ఆత్మీయులతో పంచుకుంటే ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన నుంచి బయట పడవచ్చని నిపుణులు చెబుతున్నారు.

డ్రగ్స్ బానిసలే అధికం

సమాజానికి పెనుభూతంగా మారిన మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలు, సేవనంతో సైతం ఆత్మహత్యలకు ప్రధాన కారణమని నివేదికలో పేర్కొన్నారు. డ్రగ్స్, మద్యపాన వ్యసనపరులు మనోవేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 2022లో రాష్ట్రంలో 1,389 మంది పురుషులు, 16 మంది మహిళలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. బెంగళూరు నగరంలో 5 మంది మహిళలతో పాటు 145 మంది మృతిచెందారు.

బోనులో చిక్కిన చిరుత


కూనలు, బోనులో బందీ అయిన తల్లి చిరుత

మైసూరు: చెరకు తోటలో మూడు కూనలకు జన్మ ఇచ్చిన చిరుతను అటవీశాఖ అధికారులు ఎట్టకేలకు బంధించారు. వివరాలు.. మైసూరు తాలూకా ఆయరహళ్లిలో ద్యావణ్ణ నాయక్ అనే రైతుకు చెందిన చెరుకు తోటలో మూడు చిరుత పిల్లలు కనిపించిన విషయం తెలిసిందే. రైతు ఇచ్చిన సమాచారంతో అటవీశాఖ అధికారులు వచ్చి తల్లిపులి కోసం బోను ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి పిల్లల కోసం వచ్చిన చిరుత బోనులో పడింది. శుక్రవారం ఉదయం గమనించిన రైతు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. బోనులో పడిన చిరుతను బంధించి వాటి మూడు పిల్లలను వెంట తీసుకెళ్లారు.

ఇంజినీర్ ఆత్మహత్య


రమేష్ పవార్(ఫైల్)

రాయచూరు రూరల్: ఉన్నతాధికారుల వేధింపులు భరించలేక ఏసీసీ సిమెంట్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. కలబుర్గి జిల్లా చిత్తాపూర్ వాడి సిమెంట్ కాలనీలో నివాసమున్న రమేష్ పవార్(45) అనే ఇంజినీర్ పాలక మండలిపై చర్య చేపట్టాలని వీడియో రికార్డు చేసి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు వాడి పోలీసులు తెలిపారు. కాగా ఈ ఘటనపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ప్రియాంక్ ఖర్గే చర్యలు తీసుకొని తమకు న్యాయం చేకూర్చాలని మృతుడి కుటుంబ సభ్యులు కోరారు.

ఉభయ సభల్లో వాగ్వాదం

- గ్యారంటీ పథకాలకు ఇతర నిధులు
- ఆరోపించిన బీజేపీ
- విధాన పరిషత్‌లో స్పీకర్ పోడియం వద్ద ధర్నా


సభలో పోడియం వద్ద ఆందోళన చేస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు

శివాజీనగర: బెళగావి శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శుక్రవారం రెండు సభల్లోనూ పాలక, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం, ఆరోపణలు, ప్రత్యారోపణలు చోటు చేసుకున్నాయి. గ్యారెంటీ పథకాలకు ఎస్సీ, ఎస్టీ, టీఎస్‌పీ పథకాలకు కేటాయించిన నిధులు మళ్లించినట్లు బీజేపీ, జేడీఎస్ సభ్యులు ఆరోపిస్తూ విధానపరిషత్‌లో స్పీకర్ పోడియం వద్దకు చేరుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. దీనిపై చర్చకు అవకాశం ఇవ్వనున్నట్లు సభాపతి హామీ ఇవ్వడంతో ప్రతిపక్ష పార్టీలు ధర్నా ఉపసంహరించుకొన్నాయి.

గృహలక్ష్మీ పథకానికి రూ.5075 కోట్లు, అన్నభాగ్యకు రూ.2779.50 కోట్లు, గృహజ్యోతికి రూ.2410 కోట్లు, శక్తి పథకానికి రూ.812 కోట్లు, యువనిధికి రూ.67.5 కోట్లు నిధులు కేటాయించినట్లు బీజేపీ ఎమ్మెల్సీ చలవాది నారాయణస్వామి ఇచ్చిన ప్రశ్నకు ప్రభుత్వం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చింది. దీంతో గొడవ మొదలైంది. సబ్ ప్లాన్ నిధులు గ్యారంటీ పథకాలకు ఎలా మళ్లిస్తారని ప్రశ్నించారు. గ్యారంటీలకు వినియోగించిన ఎస్సీ, ఎస్టీ, టీఎస్‌పీ నిధులు 11 వేల కోట్లు వెనక్కి తీసుకోవాలని చలువాది నారాయణస్వామి డిమాండ్ చేశారు. మంత్రి మహదేవప్ప మాట్లాడుతూ పథకం నిధులు వేరే ఉద్దేశానికి వినియోగించేందుకు సాధ్యమే లేదని చెబుతుండగా బీజేపీ సభ్యులు స్పీకర్ పోడియం వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు. దళిత వ్యతిరేక ప్రభుత్వమని నినాదాలు చేశారు. మంత్రి మహదేవప్ప మాట్లాడుతూ రూ.84 వేల కోట్ల నిధులను గత బీజేపీ ప్రభుత్వమే డీమ్డ్ ఎక్స్‌పెండిచర్ కింద దుర్వినియోగం చేసిందని ఎదురుదాడి చేశారు. దీంతో బీజేపీ, కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వివాదం జరిగి గందరగోళం నెలకొంది. సభ అదుపులోకి రాకపోవడంతో 10 నిమిషాల పాటు సభాపతి బసవరాజ హొరట్టి వాయిదా వేశారు. సభ పునర్ ప్రారంభమైనా బీజేపీ సభ్యులు ధర్నా కొనసాగించారు. బీజేపీ సభ్యులకు జేడీఎస్ సభ్యులు మద్దతు పలికి ధర్నాలో పాల్గొన్నారు.

విధానసభలో

రాష్ట్రంలో కాంట్రాక్టర్లకు గ్రాంట్ విడుదల చేసే విషయం శాసనసభలో అధికార, ప్రతిపక్షాల మధ్య ఆరోపణ–ప్రత్యారోపణలతో కొంతసేపు గందరగోళ వాతావరణం నెలకొంది. బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ జీరో అవర్‌లో మాట్లాడుతూ ప్రజాపనుల శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, చిన్ననీటి పారుదల శాఖ, జలవనరుల శాఖల నుండి కాంట్రాక్ట్‌లకు గ్రాంట్ విడుదల కాలేదన్నారు. దీంతో కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. నిధులు విడుదల చేయాలని హైకోర్టు కూడా సూచించిందన్నారు. బీజేపీ ప్రభుత్వం పే సీఎం, 40 శాతం కమీషన్ అంటూ గతంలో ఆరోపణలు చేసిన కాంగ్రెస్..ఇప్పుడు అధికారంలోకి వచ్చిందని, కమీషన్లు 80 శాతానికి చేరాయని యత్నాల్ ధ్వజమెత్తారు. దీంతో అధికార పార్టీ వైపు నుంచి సభ్యులంతా లేచి నిలబడి యత్నాళ్ వ్యాఖ్యలకు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ దశలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వివాదం నెలకొంది. సభాధ్యక్షుడు మాట్లాడుతూ జీరో అవర్‌లో దీనిపై చర్చకు అవకాశం లేదన్నారు. ప్రభుత్వం సమాధానం చెబుతుందని స్పష్టం చేశారు. మంత్రి హెచ్.కే.పాటిల్ తగిన సమయంలో దీనికంతటికి సమాధానమిస్తామని తెలిపారు.

చర్చకు అవకాశం ఇచ్చినా ఆందోళన చేస్తారా ?

బసవరాజ హొరట్టి

శివాజీనగర: తాను ఈ కుర్చీకి అతుక్కొని కూర్చోలేదు. ఈ క్షణమే రాజీనామా ఇస్తానని సభాపతి బసవరాజ హొరట్టి ఎగువ సభలో అన్నారు. ఐదు గ్యారెంటీ పథకాలకు దళితుల సంక్షేమం కోసం రిజర్వు చేసిన నిధుల వినియోస్తున్న విషయంపై ప్రతిపక్ష పార్టీ సభ్యులు శుక్రవారం విధానపరిషత్‌లో పోడియం వద్దకు వచ్చి ధర్నా చేస్తున్న సమయంలో స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విధానం ముందుకు కొనసాగితే సక్రమంగా సభ, కార్యకలాపాలు జరపటం అవసరం లేదని అనిపిస్తుందన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో చర్చకు అవకాశం కల్పించేందుకు సాధ్యపడదన్నారు. అయినా సోమవారం అరగంటపాటు చర్చకు అవకాశం ఇచ్చామన్నారు. ధర్నా ఉపసంహరించుకొని బయటికి రావాలని రూలింగ్ చేశారు. అయినా ప్రతిపక్ష పార్టీ సభ్యులు పోడియంలోనే ఉన్న కారణాన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ స్థానంలో తనకు కూడా విరక్తి కలిగింది. తాను ఈ కుర్చీకి అతుక్కోలేదు. ఈ క్షణమే రాజీనామా చేసి ఇంటికి వెళతానని తెలిపారు.

క్రమశిక్షణకు కేరాఫ్ గాలి జనార్దనరెడ్డి

- గత శాసనసభ సమావేశాలకు నిత్యం హాజరు
- బహుమతి అందించి అభినందించిన స్పీకర్ ఖాదర్


ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డికి బహుమతి ఇచ్చి అభినందిస్తున్న స్పీకర్ యూ.టీ ఖాదర్

శివాజీనగర: ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక అయిన చట్ట సభలకు గైర్హాజరు కాకుండా చర్చల్లో పాల్గొని కొప్పళ జిల్లా గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధనరెడ్డి తన నిబద్ధతను చాటుకున్నారు. గత శాసనసభ సమావేశాల్లో గాలి జనార్దనరెడ్డి ఒక్కరోజు కూడా గైర్హాజరు కాలేదు. దీంతో విధానసభ స్పీకర్ యూ.టి.ఖాదర్ ఆయనకు బహుమతిని అందజేసి అభినందించారు. గత అసెంబ్లీ సమావేశాలు మొత్తం 14 రోజుల పాటు జరిగాయి. గాలి జనార్దనరెడ్డి రోజూ సమయానికి సక్రమంగా హాజరై సమావేశాలు ముగిసేంతవరకు సభలోనే ఉన్నారు. చట్ట సభలపట్ల ఆయనకు ఉన్న గౌరవాన్ని గుర్తించి బెళగావి సువర్ణ సౌధలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల మధ్యలో స్పీకర్ ఖాదర్.. గాలి జనార్దనరెడ్డిని తన గదికి పిలిపించి బహుమతి అందజేసి అభినందించారు. ఈసారి అసెంబ్లీ సమావేశాలకు ఎవరు సరైన సమయానికి హాజరవుతారో వారికి టీ కప్, సాసర్ బహుమతి ఇస్తామని స్పీకర్ యూ.టీ.ఖాదర్ సోమవారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ టీ కప్, సాసర్ రాష్ట్ర, జాతీయ లోగో కలిగి ఉంటుంది.


మంగళూరు పోర్టులో భారీ నౌక

బహమాస్ దేశానికి చెందిన భారీ నౌక శుక్రవారం మంగళూరు కొత్త పోర్టుకు చేరుకుంది. 500 మంది ప్రయాణికులు, 350 మంది సిబ్బంది ఉన్న ఈ నౌక 173 మీటర్ల పొడవుతో 28,803 టన్నుల బరువు ఉంటుంది.

చదువుకోవాలి.. పెళ్లి వద్దు

- తాళి కట్టించుకోని వధువు
- పీటల మీద మొండికేసిన వైనం
- చిత్రదుర్గ జిల్లాలో ఘటన

సాక్షి,బళ్లారి: కల్యాణ మండపంలో బాజాభజంత్రీలు,మంగళవాయిద్యాలు మోగుతున్నాయి. అటు పెళ్లి కూతురు, ఇటు పెళ్లి కుమారుడి బంధువులు వధువు, వరుడి పక్కన చేరి పెళ్లితంతును వీక్షిస్తున్నారు. తాళికట్టు శుభవేళ పెళ్లి కూతురు అడ్డం తిరిగింది. తనకు పెళ్లి వద్దని మొండికేసింది. ఈఘటన చిత్రదుర్గ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలు.. చిత్రదుర్గ జిల్లా హొసదుర్గ తాలూకా చిక్కబ్యాలదకెరె గ్రామానికి చెందిన సంతోష్‌కు చెళ్లకెరె తాలూకా తిప్పారెడ్డిహళ్లి గ్రామానికి చెందిన ఓ యువతితో వివాహ నిశ్చితార్థం జరిగింది. పెళ్లి తంతును వరుడి స్వగ్రామంలోని బైరవేశ్వర కల్యాణ మంటపంలో జరిపించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాత్రంతా రిసెప్షన్ పూర్తి చేసుకుని 7వ తేదీ వధువు, వరుడిని పెళ్లి పీటలపై కూర్చోబెట్టారు. వరుడు తాళి కట్టే శుభవేళ.. వధువు పెళ్లి పీటల మీద నుంచి లేచి నిలబడింది. తాను ఇంకా చదువుకోవాలని, పెళ్లి వద్దని మొండికేసింది. దీంతో వరుడు, వధువు తల్లిదండ్రులు నిశ్చేష్టులయ్యారు. ఎంత నచ్చజెప్పినా వినకపోవడంతో పెళ్లిని రద్దు చేశారు.

మెట్రోలో ఆకతాయి

బనశంకరి: మెట్రోరైలులో ఒంటరి మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన లోకేశ్ ఆచార్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఉదయం 22 ఏళ్ల మహిళ రాజాజీనగర మెట్రోస్టేషన్ నుంచి ఎంజీ.రోడ్డుకు మెట్రోలో ప్రయాణిస్తుండగా నెలమంగలకు చెందిన లోకేశ్ ఆచార్ మెట్రోలో ఎక్కి సదరు మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె గట్టిగా కేకలు వేసింది. నిందితుడు కెంపేగౌడ మెట్రోస్టేషన్‌లో దిగి పారిపోతుండగా భద్రతా సిబ్బంది పట్టుకుని ఉప్పారపేటే పోలీసులకు అప్పగించారు. రెండు మెట్రో కార్డులు కలిగిన ఈ కామాంధుడు రద్దీ ఉన్న సమయంలో మెట్రోలో ఎక్కి యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు సమాచారం.

సీనియర్ నటి లీలావతి కన్నుమూత


లీలావతి (ఫైల్), ఓ సినిమాలోని పాత్రలో లీలావతి

దొడ్డబళ్లాపురం : బహుభాషా సీనియర్ నటి లీలావతి అశేష అభిమానులను వీడి ఈ లోకం నుంచి నిష్క్రమించారు. కొన్ని నెలలుగా వయోభారం, అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బెంగళూరు సమీపంలోని నెలమంగలలోని ప్రైవేటు ఆస్పత్రిలో శుక్రవారం సాయంత్రం కన్నుమూశారు. 1937లో దక్షిణ కన్నడ జిల్లా బెళ్తంగడిలో జన్మించారు. ఆరు సంవత్సరాల వయస్సులోనే తల్లిదండ్రులను పోగొట్టుకున్నారు. లీలావతి కన్నడ, తెలుగు, తమిళం భాషల్లో నటించారు. సుమారు 600కి పైగా చిత్రాల్లో ఆమె తన నటనతో అశేష అభిమానులను సంపాదించుకున్నారు. కన్నడ భాషలోనే 400పైగా సినిమాల్లో నటించారు. 2006లో ఫిల్మ్‌ఫేర్ అవార్డు, 2000 సంవత్సరంలో డాక్టర్ రాజ్‌కుమార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు తీసుకున్నారు. 2008లో తుమకూరు యూనివర్సిటీ ఆమెకు గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది. కన్నడలో మొదటిసారి మాంగల్యయోగ అనే సినిమాలో నటించారు. తెలుగులో మర్మయోగి అనే సినిమాలో నటించారు. నటిగానే కాకుండా లీలావతి ఒక మంచి రచయితగా కూడా గుర్తింపు తెచ్చుకున్నారు. లీలావతి ఒక్కగానొక్క కుమారుడు వినోద్‌రాజ్ హీరోగా అనేక సినిమాల్లో నటించారు లీలావతి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. నెలమంగల వద్ద ఆస్పత్రులు కట్టించారు. సోలదేనహళ్లి వద్ద ఫామ్‌హౌస్ నిర్మించుకుని అక్కడే నివసిస్తూ స్థానిక పేదలకు అండగా నిలిచారు. నెలమంగల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అంబేడ్కర్ మైదానంలో లీలావతి పార్థివ శరీరాన్ని అభిమానుల అంతిమదర్శనం కోసం తరలించారు. శనివారం సోలదేనహళ్లిలోని ఫామ్‌హౌస్‌లోనే అంత్యక్రియలు జరపనున్నట్టు సమాచారం.

పెళ్లికి వెళ్లి వస్తుండగా మృత్యు పంజా

- కారు–బస్సు ఢీ..ఐదుగురి మృతి


నుజ్జయిన కారు, కేఎస్ ఆర్టీసీ బస్సు

యశవంతపుర: పెళ్లి చూసుకొని ఆనందంగా తిరిగి కారులో వెళ్తున్న వారిపై కేఎస్ ఆర్టీసీ బస్సు రూపంలో వచ్చిన మృత్యువు పంజా విసిరింది. ఐదు మందిని బలి తీసుకుంది. ఈ విషాద ఘటన శుక్రవారం ఉత్తరకన్నడ జిల్లా శిరసి తాలూకా బండల గ్రామం వద్ద జరిగింది. వివరాలు...కుమాటలో జరిగిన వివాహానికి మంగళూరుకు చెందిన నలుగురు, చెన్నైకి చెందిన ఒకరు ఒకే కారులో వెళ్లారు. ఉదయం వివాహం ముగిసిన అనంతరం శిరసికి వెళ్తుండగా బండల గ్రామం వద్దకు రాగానే శిరసి నుంచి కుమాటకు వస్తున్న కేఎస్ ఆర్టీసీ బస్సు ఎదురైంది. రెండు వాహనాలు ముఖాముఖి ఢీకొనగా కారు నుజ్జయ్యింది. దీంతో కారులో ఇరుక్కుపోయిన వారిని స్థానికులు బయటకు తీశారు. మంగళూరుకు చెందిన రామకృష్ణ బాబురావ్(71), విద్యాలక్ష్మి(65), పుష్పా మోహన్‌రావ్(62), సుహాస్‌రావ్(30) అక్కడిక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన చెన్నైకి చెందిన అరవింద(30)ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో చనిపోయాడు. బస్సులో ఉన్నవారికి ఎలాంటి గాయాలూ కాలేదు. శిరసి గ్రామీణ పోలీసులు మృతదేహాలను శిరసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా పరారీలో ఉన్న కేఎస్ఆర్టీసీ బస్సు డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

క్లుప్తంగా

మేఘమథనంపై పరిశీలిస్తాం

బనశంకరి: కరువు పరిస్థితుల నేపథ్యంలో మేఘమథనం చేపట్టాలనే ఉద్దేశంతో ఉన్నామని డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ తెలిపారు. శుక్రవారం శాసనసభ జీరో అవర్‌లో డీకే.శివకుమార్ మాట్లాడుతూ స్వంత ఖర్చుతో మేఘమథనం చేపట్టాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌కోళివాడ మేఘమథనం పట్ల ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. మేఘమథనం చేసే కంపెనీలతో ఇప్పటికే చర్చించామని తెలిపారు. మేఘమథనంపై ప్రభుత్వం కూడా ఆసక్తిగా ఉన్నా కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయన్నారు. టెండర్లు పిలవడంతో పాటు అనేక ప్రక్రియలు చేపట్టాల్సి ఉందన్నారు. ఏవిధంగా చేయాలనేది ఆర్థిక శాఖ అధికారులతో చర్చిస్తామన్నారు. ప్రకాశ్‌కోళివాడ మాట్లాడుతూ ఒకవేళ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఆలస్యమైతే తన స్వంత ఖర్చుతో మేఘమథనం చేస్తామని, ఇందుకు ప్రధాన కార్యదర్శినుంచి అనుమతి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

హుబ్లీ: నగరంలో రెండు రోజుల పాటు జరగనున్న క్రికెట్ టీమ్ చాంపియన్ నెట్ వర్సెస్ కర్ణాటక స్టార్స్ స్పోర్ట్స్ క్లబ్ క్రికెట్ పోటీలను గురువారం వెంకటేష్ కాట్వే ప్రారంభించారు. క్రికెట్ కోచ్ ముఖ్యస్థులు సందేశ బైలప్పనవర్ మాట్లాడుతూ వెంకటేష్ కాట్వే క్రీడా ప్రేమికుడు, క్రికెట్ అంటే ఆయనకు పంచప్రాణాలు, నేటి యువతకు ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. తమ సంస్థ వీఏకే ఫౌండేషన్ ద్వారా ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. సదరు కార్యదర్శి అహ్మద్ కిత్తూర్, సీనియర్ క్రికెటర్ డాక్టర్ లింగరాజ బీళకల్, హెడ్‌కోచ్ చాంపియన్ నెట్ ఇన్ జయరాజ నూల్వి పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

హుబ్లీ: అప్పుల బాధ తాళలేక ఓ అన్నదాత ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలోని నవలగుంద తాలూకా కుమారకొప్ప గ్రామంలో శుక్రవారం వెలుగు చూసింది. ఆ గ్రామానికి చెందిన వీరబసప్ప(48) అనే రైతు ఈసారి ఖరీఫ్‌లో వానలు సక్రమంగా కురవక పంట దిగుబడి లేకపోవడంతో వ్యవసాయం కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలన్న బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన ప్రైవేట్ సంస్థల్లో అప్పులు చేశాడని మృతుడి భార్య సావిత్రి నవలగుంద పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంబేడ్కర్‌కు కొవ్వొత్తులతో నివాళి

కంప్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహా పరినిర్వాణ దినం పురస్కరించుకుని గురువారం అంబేడ్కర్ చిత్రపటంతో కొట్టూరు పట్టణంలోని గాంధీ సర్కిల్ నుంచి ఊరేగింపుగా పాదయాత్ర జాతా. చేపట్టారు. అనంతరం కొవ్వొత్తులలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీ.మరిస్వామి మాట్లాడుతూ తరతరాలుగా దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను ఖండిస్తూ సమసమాజ నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేసిన అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం అన్నారు.

పాల వాహనం పల్టీ.. 9మందికి గాయాలు

మైసూరు : నంజనగూడు తాలూకా ఈరెనగౌడ హుండి గ్రామం వద్ద శుక్రవారం పాలు తీసుకెళ్తున్న టాటా ఏస్ వాహనం పల్టీలు కొట్టింది. ఘటనలో హెడియాల ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులతో సహా తొమ్మిది మందికి గాయాలయ్యాయి. హుల్లహళ్లి పోలీసులు బాధితులను ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.



డిమాండ్ల సాధన కోసం మరహనహోళ నుంచి పాదయాత్ర చేపట్టి శుక్రవారం బెళగావి సువర్ణసౌధ వద్దకు చేరిన కర్ణాటక రాష్ట్ర సమితి ప్రకాశన సభ్యులు

వణికిస్తున్న సీజనల్ వ్యాధులు

- వాతావరణ మార్పుతో పిల్లలకు అనారోగ్యం
- జలుబు, జ్వర పీడితులతో ఆస్పత్రులు ఫుల్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జలుబు, జ్వర పీడితులు

కోలారు: గత 15 రోజులుగా జిల్లాలో అధిక సంఖ్యలో పిల్లలు అనారోగ్యానికి గురవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జలుబు, జ్వరాలతో బాధపడుతూ పిల్లలు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. వాతావరణంలో కలుగుతున్న మార్పుల వల్ల పిల్లలతో పాటు పెద్దలు కూడా అనారోగ్యానికి గురవుతున్నారు. పిల్లలలో జలుబు, దగ్గు, జ్వరం కనిపిస్తుండడంతో ఆస్పత్రులు రోగులతో నిండిపోతున్నాయి. ఇటీవల జిల్లాలో చలిగాలులు అధికంగా వీస్తున్నాయి. ఎండ కనిపించడం లేదు. దీని వల్ల ముఖ్యంగా నాలుగేళ్ల వయస్సు లోపు పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారు. జిల్లాలో దాదాపు 50 శాతం మంది పిల్లలు చలి, జ్వరాలతో భాదపడుతున్నట్లు సమాచారం. కొంతమంది పిల్లల్లో వాంతులు, విరేచనాలు కూడా కనిపిస్తున్నాయి. ఐదు రోజులుగా విడవకుండా జ్వరం కనిపిస్తే పిల్లలకు డెంగీ పరీక్షలు నిర్వహించారు. కొంతమందికి డెంగీ సోకినట్లు తేలడంతో వారిని ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

జిల్లా ఆస్పత్రిలో బెడ్‌ల కొరత

నగరంలోని ఎస్ఎన్ఆర్ జిల్లా ఆస్పత్రిలోని తల్లీ బిడ్డల విభాగంలో పిల్లల కోసం రిజర్వు చేసిన బెడ్‌లు పూర్తిగా నిండిపోయాయి. ఒక్కో బెడ్‌పై ఇద్దరిని ఉంచి చికిత్స చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి బెడ్‌లు లభించక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సామాన్యంగా చలి, జ్వరంతో ప్రారంభమయ్యే వైరల్ జ్వరాలు తదుపరి దశలో న్యూమోనియాగా మార్పు చెందే అవకాశం ఉండడం వల్ల జాగ్రత్తగా ఉండాలని వైద్యులు అంటున్నారు. వరుసగా 5 రోజులు జ్వరం ఉంటే డెంగీ పరీక్షలు చేయించుకోవాలని అంటున్నారు. కఫం ఉండి ఊపిరి తీసుకోవడానికి ఇబ్బందిగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని అంటున్నారు.

నిరంతరంగా జ్వరం ఉంటే డెంగీ పరీక్ష మేలు

రెండు వారాల నుంచి పిల్లలు అనారోగ్యానికి గురవుతుండడం కనిపిస్తోంది. పిల్లల్లో వైరల్ జ్వరాలు, జలుబు, దగ్గు లక్షణాలు కనిపిస్తున్నాయి. వరుసగా ఐదు రోజులు జ్వరం ఉంటే డెంగీ పరీక్షలు చేయించుకోవడం మంచిది.

–డాక్టర్ శ్రీనాథ్, పిల్లల వైద్యనిపుణులు

ఇందిరా క్యాంటీన్లలో ముద్ద, తోటాకు పప్పు

- సంక్రాంతి తరువాత కొత్త మెనూ



శివాజీనగర: సంక్రాంతి పండుగ తరువాత ఇందిరా క్యాంటీన్లలో కొత్త మెనూ చేరబోతోంది. వినియోగదారులకు ముద్ద, తోటాకు పప్పు, చపాతి భాగ్యం లభించనుంది. బీబీఎంపీ పరిధిలోని ఇందిరా క్యాంటీన్‌లలో మధ్యాహ్నం, రాత్రి సమయంలో ముద్ద, చపాతి భోజనం ఇవ్వటానికి తీర్మానించారు. క్యాంటీన్‌లకు వచ్చే అనేక మంది వృద్ధులే కావడంతో వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అన్నం కాకుండా ముద్ద, చపాతి ఇవ్వనున్నారు. మధ్యాహ్నం, రాత్రి సమయంలో ముద్ద, చపాతి ఇవ్వాలని బీబీఎంపీ ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించారు. ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో పాటు ఇందిరా క్యాంటీన్ల వినియోగదారుల సంఖ్యలో గోల్‌మాల్ జరుగుతుందనే ఆరోపణ నేపథ్యంలో ఇందిరా క్యాంటీన్ బిల్లుల డిజిటలీకరణ, పారదర్శక వ్యవస్థ జారీలోకి తీసుకొచ్చేందుకు బీబీఎంపీ సిద్ధమైంది. నగరంలో ఏ ఇందిరా క్యాంటీన్‌లో వినియోగదారులు భోజనం కూపన్ తీసుకున్నారో నేరుగా ప్రధాన కార్యాలయానికి సమాచారం వస్తుంది. ఇందుకోసం ప్రత్యేక యాప్ తయారీకి బీబీఎంపీ సిద్ధవుతోంది.

విద్యార్థుల్లో శాస్త్రీయ స్ఫూర్తిని ప్రోత్సహించాలి



నమూనాలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

బొమ్మనహళ్లి: విద్యార్థుల్లో శాస్త్రీయ స్ఫూర్తిని ప్రోత్సహించడంతో పాటు వారిని అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచేలా కృషి చేయాలని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే.రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని బసవనగుడి నేషనల్ కళాశాల ఆవరణంలో రెండు రోజుల పాటు జరిగే ఎన్ఇఎస్ సూపర్‌నోవా, ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఆయన విద్యార్థుల సైన్స్ ఫెయిర్‌ను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రైవేట్ బస్సులతో పోటీ వద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ రవీంద్ర

చిక్కబళ్లాపురం: కేఎస్ ఆర్టీసీ బస్సులు ప్రైవేట్ బస్సులతో పోటీ పడి నడపరాదని, ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ రవీంద్ర అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రోడ్డు భద్రతా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జిల్లాలో రోడ్ల ప్రమాదాలు పెరిగాయని, సరకు రవాణా వాహనాలు రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. సమావేశంలో ఎస్పీ నాగేశ్, ఆర్టీఓ వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు పరిష్కారం



పరిష్కార పత్రాన్ని అందజేస్తున్న కమిషనర్

తుమకూరు : ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కరించడానికి తుమకూరు మహానగర పాలికె శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అశ్విజ ప్రజల సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. భూముల్లో పేరు మార్పులు, జనన మరణ ప్రతాల్లో పేరు మార్పు, రెవెన్యూ, యూజీడీ ఇలా ప్రజల సమస్యలను ఆమె స్వయంగా తెలుసుకుని వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ...అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు.

అటవీ ప్రాంతంలో ఏనుగు మృతి



కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారి

మైసూరు : ఏనుగు మృత్యువాత పడిన ఘటన మైసూరు జిల్లా గుండ్లుపేటె నాగణాపుర హుణసె తాళకండి అరణ్య ప్రాంతంలో వెలుగు చూసింది. అటవి శాఖ సిబ్బంది గస్తీ తిరుగుతున్న సమయంలో దుర్వాసన రాగా వెళ్లి పరిశీలించారు. కుళ్లిన స్థితిలో ఉన్న ఏనుగు కళేబరాన్ని గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ అధికారి రమేష్‌కుమార్, సహాయక అరణ్య సంరక్షణాధికారి రవీంద్ర, వైద్యాధికారి డాక్టర్ మీర్జా, వాసిం వచ్చి పరిశీలించారు. మరణించినదాన్ని 40 నుంచి 45 సంవత్సరాల వయస్సులో ఉన్న మగ ఏనుగుగా గుర్తించారు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటుందని నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.



మొబైల్ టవర్ కూలిపోతున్న దృశ్యం

కూలిన మొబైల్ టవర్

బనశంకరి: బెంగళూరు నగరంలోని లగ్గెరె పార్వతి నగరలో శుక్రవారం ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన మొబైల్ టవర్ కుప్పకూలిపోయింది. అయితే ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఇంటి పక్కన ఖాళీ స్థలంలో ఇంటి పునాది తవ్వుతుండగా ఒక్కసారిగా టవర్ వాలిపోవడాన్ని గమనించిన స్థానికులు అక్కడి నుంచి పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు.

న్యాయవాది హత్య ఖండనీయం



బీదర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు



హొసపేటెలో వినతిపత్రాన్ని అందిస్తున్న లాయర్లు

రాయచూరు రూరల్: కలబుర్గిలో న్యాయవాది ఈరణ్ణగౌడ పాటిల్ హత్యను శుక్రవారం కలబుర్గి, బీదర్‌లలో జిల్లా న్యాయవాదుల సంఘాలు తీవ్రంగా ఖండించాయి. గురువారం కలబుర్గి కోర్టులో దుండగులు న్యాయవాది ఈరణ్ణగౌడను వెంబడించి హత్య చేయడాన్ని న్యాయవాదులు తప్పుబట్టారు. బీదర్‌లోని బసవేశ్వర సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. బీదర్‌లో ఆ జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మహేష్ కుమార్ పాటిల్ మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదులకు రక్షణ కరువైందన్నారు. భాల్కిలో ధనలక్ష్మి, చిక్కమగళూరులో జిల్లా న్యాయవాదుల సంఘం సభ్యుడిపై పోలీసులు అసభ్యంగా ప్రవర్తించి దాడి చేయడాన్ని ఖండించారు. తప్పు చేసిన వారికి శిక్ష పడేలా చూడాలని, న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరుతూ జిల్లాధికారి గోవిందరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. హేమ, రవికాంత్ పాటిల్, పరమేశ్వర్, కోమల్, అనిల్ కుమార్, శివశంకర్‌లున్నారు.

హొసపేటెలో..

హొసపేటె: చిక్కమగళూరులో న్యాయవాది ప్రీతంగౌడపై పోలీసుల దౌర్జన్యం, దాడిని నిరసిస్తూ నగరంలో శుక్రవారం న్యాయవాదులు మౌన ప్రదర్శన నిర్వహించారు. తమ నిరసన ప్రదర్శనను పునీత్ రాజ్‌కుమార్ సర్కిల్ నుంచి ప్రారంభించి తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ విశ్వజిత్ మెహతాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు సంఘం నేతలు కరుణానిధి, బసవరాజ్ పాల్గొన్నారు.

ఏడు ప్రాజెక్టులకు అనుమతి

శివాజీనగర: గత ఏడాది నవంబర్ నెలలో బెంగళూరులో జరిగిన ఇన్వెస్ట్ కర్ణాటక సమావేశాల ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నట్లు భారీ, మధ్యతరహా పరిశ్రమల మంత్రి ఎం.బీ.పాటిల్ తెలిపారు. శుక్రవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో హొళల్కెర ఎమ్మెల్యే ఎం.చంద్రప్ప అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ ఇన్వెస్ట్ కర్ణాటకలో 57 కంపెనీలతో ఒప్పందం చేసుకోగా రూ.5,41,369 కోట్ల పెట్టుబడి వస్తుందని భావించామన్నారు. హుబ్లీలో జరిగిన ఎఫ్ఎంసీజీ పెట్టుబడిదారుల సమావేశం ద్వారా 16 కంపెనీలతో ఒప్పందం చేసుకోగా రూ.1,275 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేసినట్లు తెలిపారు. 7 ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చామని, ఇవి పూర్తయ్యేందుకు 3–4 సంవత్సరాలు పడుతుందన్నారు.

కిత్తూరు చెన్నమ్మ కోట పనులు వేగవంతం చేయండి

యశవంతపుర: బెళగావి జిల్లా కిత్తూరు అరమనె, కోట అభివృద్ధి పనులను అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని మంత్రి కృష్ణబైరేగౌడ కిత్తూరు అభివృద్ధి ప్రాధికార అధికారులకు సూచించారు. బెళగావి సువర్ణసౌధలో శుక్రవారం జరిగిన అధికారుల సమావేశంలో మంత్రి సూచనలు చేశారు. తెల్లదొరలపై పోరాటం చేసిన కిత్తూరు రాణి చెన్నమ్మ సేన మొదటి గెలుపు సాధించి 2024 అక్టోబర్ నాటికి 200 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కోట, ప్యాలెస్‌ను అభివృద్ధి చేయాలని అధికారులు సూచించారు.

ఆలయంలో కార్తీక దీపోత్సవం



దీపాలు వెలిగిస్తున్న దృశ్యం

తుమకూరు: తుమకూరు నగరం కుణిగల్ రోడ్డులో ఉన్న అమరజ్యోతి నగరలో శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా గురువారం రాత్రి దీపోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఇక్కడ దీపాలను వెలిగించారు.

వార్తా భవనంలో నాగరాజు బుస

మైసూరు : మైసూరు నగరంలో వార్తా భవనంలోకి నాగుపాము వచ్చి బుసలు కొట్టడంతో సిబ్బంది ప్రాణ భయంతో పరుగులు పెట్టారు. శుక్రవారం ఉదయం సిబ్బంది విధులకు వచ్చిన కొద్ది సమయానికి బుస శబ్దాలు రావడంతో పరిశీలించారు. నాలుగు అడుగుల నాగుపాము కనిపించడంతో బయటకు పరుగులు పెట్టారు. స్నేక్ నిపుణుడు స్నేక్ శ్యామ్ వచ్చి పామును బంధించి అటవీ ప్రాంతంలో వదిలేశాడు.

స్వస్థలానికి కార్మికుల తరలింపు

రాయచూరు రూరల్: నగరంలో ఇటుకల బట్టీలో పని చేస్తున్న 30 మంది ఒడిశా కార్మికులను అధికారులు స్వస్థలానికి పంపించారు. శాఖవాది గ్రామంలో పనులు చేసుకుంటూ కాలం గడుపుతున్న కార్మికులు తమను స్వస్థలానికి పంపాలని జిల్లా యంత్రాంగానికి విన్నవించుకోవడంతో గురువారం రాత్రి రాయచూరు రైల్వే స్టేషన్ నుంచి అసిస్టెంట్ కమిషనర్ మెహబూబి, తహసీల్దార్ సురేష్ వర్మ వారిని సురక్షితంగా పంపడంతో పాటు భోజన సదుపాయం కల్పించారు.

10న ఆరోగ్య పరీక్ష శిబిరం

హుబ్లీ: ధార్వాడ జిల్లా కలఘటిగి తాలూకా బిసిగిగట్టి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 10న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత బృహత్ ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి ప్రేరిత క్షమతా సేవా సంస్థ, భారతీయ వైద్య సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరాన్ని మాజీ ఎమ్మెల్సీ నాగరాజ్ ఛబ్బి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా శిబిరంలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కర్ణాటక కార్డులను కూడా నమోదు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు.

తల్లీబిడ్డల బలవన్మరణం



మరణించిన పిల్లలు



తల్లి లత మృతదేహం

చెళ్లకెరె రూరల్: తల్లి, ఇద్దరు పిల్లలు ఆత్మహత్య చేసుకున్న ఘటన తాలూకాలోని యలగట్టి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లత(25) ఉరి వేసుకోగా, ప్రణీత(5), జ్ఞానేష్(18 నెలలు) అనే ఇద్దరు పిల్లలు స్నానాల గదిలోని నీటి తొట్టిలో శవాలయ్యారు. లత భర్త తిప్పేస్వామి ఎప్పటిలానే ఉదయమే పొలానికి వెళ్లాడు. 11 గంటలు గడిచినా భార్య ఇంకా భోజనం తేకపోవడంతో భోజనం చేయడానికి తిప్పేస్వామి ఇంటికి తిరిగి వచ్చి చూడగా భార్య, పిల్లలు శవాలుగా కనిపించారు. గ్రామస్తుల సమాచారంతో చెళ్లకెరె పోలీసులు గ్రామానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం చెళ్లకెరె ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరమే మృతుల మరణాలకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై చెళ్లకెరె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోలారు వార్తలు...

ఎస్సీ వర్గీకరణ కోసం 20న సమావేశం



మాట్లాడుతున్న వెంకటేశప్ప

కోలారు: ఎస్సీ వర్గీకరణ కోసం ఈ నెల 20న నగరంలోని టి.చెన్నయ్య రంగమందిరంలో మాదిగ సముదాయ జిల్లా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కర్ణాటక మాదిగ దండోరా న్యాయ సేవా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు హెచ్ వెంకటేశప్ప తెలిపారు. శుక్రవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. న్యాయమూర్తి సదాశివ కమిషన్ నివేదికను బెళగావి అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశ పెట్టి అమలులోకి తేవాలన్నారు. అనంతరం దీనిని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మాదిగ సముదాయాలు విద్యా, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఎంతో వెనుకబడి ఉన్నాయన్నారు. రాష్ట్ర మాదిగ దండోరా ఉపాధ్యక్షుడు సాహుకార్ శంకరప్ప మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సముదాయ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటస్వామి, జిల్లా గౌరవ అధ్యక్షుడు హూవళ్లి కృష్ణప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల కోసం ప్రత్యేక తరగతులు




మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి కృష్ణప్ప

కోలారు: ఈఏడాది మెరుగైన పదో తరగతి ఫలితాల కోసం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు పదో తరగతి జిల్లా నోడల్ అధికారి కృష్ణప్ప తెలిపారు. మాస్తి పబ్లిక్ పాఠశాలలో టెన్త్ విద్యార్థులతో నిర్వహించిన సంవాద కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉన్నత విద్య పరీక్షా మండలి మొదటి సారిగా మూడు టెన్త్ పరీక్షలను నిర్వహిస్తోందన్నారు. విద్యా శాఖ అందించిన నన్నన్నొమ్మె గమనిసి అధ్యాయం వారీ ప్రశ్నోత్తరాలను, అభ్యాసాలను బాగా చదువుకోవాలన్నారు. టెన్త్ ఫలితాల్లో జిల్లా ఈసారి మొదటి స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి 25 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్నందున ప్రతి విద్యార్థిని పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. పిల్లల్లో అభ్యసనాన్ని మెరుగు పరచడానికి, గుణాత్మక ఫలితాల కోసం విద్యాశాఖ అందించిన సంపన్మూల పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

బాగేపల్లి : చిక్కబళ్లాపురం జిల్లా బాగేపల్లి తాలూకా యల్లంపల్లి గ్రామం వద్ద బుధవారం జరిగిన గజేంద్ర అనే వ్యక్తి హత్యోదంతంలోని మిస్టరీని బాగేపల్లి పోలీసులు ఛేదించారు. కేసుకు సంబంధించి గ్రామానికి చెందిన సురేంద్రబాబు, శ్రీనాథ్, వెంకటేష్ అనే నిందితులను అరెస్ట్ చేశారు. యల్లంపల్లి గ్రామానికి చెందిన గజేంద్రను నిందితులు పాతకక్షల నేపథ్యంలో అతన్ని దొడ్డమ్మ ఆలయం వద్దకు పిలిపించి కొడవళ్లతో దాడి చేసి నరికి హత్య చేసి మృతదేహాన్ని నడిరోడ్డులో వేసి ఉడాయించారు. చిక్కబళ్లాపురం జిల్లా ఎస్పీ నాగేష్, డీసీపీ శివకుమార్ ఆదేశాలతో సీఐ ప్రశాంత్ వర్ని ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు.

విద్యా నిపుణుడు మృతి



శ్రీరామరెడ్డి(ఫైల్)

శ్రీనివాసపురం: తాలూకాలోని ఇమరకుంట గ్రామంలో విద్యా నిపుణుడుగా, కోలారు కలాంగా ప్రఖ్యాతి గాంచిన ఎం.శ్రీరామరెడ్డి(84) గురువారం రాత్రి మృతి చెందారు. గుండెపోటుకు గురైన ఆయనను పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా నివృత్తి అయిన అనంతరం భైరవేశ్వర విద్యా సంస్థను స్థాపించి అభివృద్ధి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆయన చేసిన విద్యా సేవకు గుర్తింపుగా ఆయనకు చుంచశ్రీ అవార్డు లభించింది. ఆయన మృతికి పలువురు ప్రముఖులు సంతాపం వెలిబుచ్చారు.

గోవా గవర్నర్‌కు ఘన స్వాగతం



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

మాలూరు: తాలూకాలోని ఆలంబాడి గేట్ వద్ద ఉన్న క్రిస్ట్ కళాశాలలో నిర్వహిస్తున్న స్నాతకోత్సవంలో పాల్గొనడానికి వచ్చిన గోవా గవర్నర్ పీఎస్ శ్రీధరన్ పిళ్లైకు శుక్రవారం జిల్లా కలెక్టర్ అక్రంపాషా, ఎస్పీ ఎం.నారాయణ ఘన స్వాగతం పలికారు. ప్రోటోకాల్ ప్రకారం కలెక్టర్, ఎస్పీలు వెళ్లి కట్టిగేనహళ్లి క్రాస్ వద్ద గవర్నర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. గవర్నర్ వెళ్లే మార్గంలో కట్టిగేనహళ్లి క్రాస్ నుంచి ఆలంబాడి వరకు ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు ఏర్పాట్లు చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ కె రమేష్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: చట్టాలపై అవగాహన పెంచుకుంటే సమాజంలో సౌహార్దయుత జీవితాన్ని గడపవచ్చని సీనియర్ సివిల్ జడ్జి సునీల్ ఎస్ హొసమని తెలిపారు. శుక్రవారం తాలూకాలోని క్యాలనూరు పబ్లిక్ పాఠశాలలో న్యాయ అవగాహన సహాయ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాజ్యాంగం మనకు అందించిన మౌలిక హక్కులను సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి కూడా అందించాల్సిన బాధ్యత న్యాయ సేవల ప్రాధికారంపై ఉందన్నారు. బాలకార్మికులు, బాల్య వివాహాల గురించి తెలిస్తే 1098కు ఫోన్ చేసి సంబంధిత అధికారుల దృష్టికి తేవాలన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్, రామలింగప్ప, ధన్యకుమార్, రాజేష్, రామాంజప్ప, ఎంఆర్ నాగరాజ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయాల సందర్శనతో మనశ్శాంతి


రథం నమూనాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్ప

బొమ్మనహళ్లి : ఆలయాల సందర్శనతో మనశ్శాంతి లభిస్తుందని బెంగళూరు దక్షిణ ఎమ్మెల్యే ఎం. కృష్ణప్ప అన్నారు. బేగూరు గ్రామంలో చరిత్ర ప్రసిద్ధి చెందిన శ్రీనాగేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి చరిత్ర కలిగిన ఆలయాలను కాపాడుకోవడంతోపాటు ముందు తరాలవారికి తెలియజేయాలన్నారు. అనంతరం చైత్రా డెవలపర్స్ సంస్థ సహకారంతో నిర్మించనున్న నూతన రథం నమూనాను ఆయన పరిశీలించారు. శ్రీనివాస్ రెడ్డి, హుల్లహళ్లి శ్రీనివాస్, రమేష్, ఆరాధ్య, ప్రశాంత్, లోకేష్‌గౌడ, మధుసూధన్ రెడ్డి, అమరేష్ రెడ్డి, హరిష్, సంపత్ పాల్గొన్నారు.

చిత్రకళా పరిషత్‌లో నటి కవిత సందడి


చీరలు ప్రదర్శిస్తున్న నటి కవిత

బనశంకరి: చిత్రకళా పరిషత్‌లో కన్నడనటి కవితాగౌడ సందడి చేశారు. క్రిస్మస్, న్యూ ఇయర్ సందర్భంగా కుమారకృప రోడ్డు చిత్రకళా పరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆర్టిసన్స్ బజార్‌ను నటి కవితగౌడ ప్రారంభించారు. ప్రదర్శనలో చేనేత కళాకారులు తయారు చేసిన విభిన్న రకాల వస్తువులు, అలంకరణ వస్తువులు, దుస్తులు, చీరలు, క్రిస్మస్ బొమ్మలు ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రదర్శన 17 తేదీ వరకు నిర్వహిస్తారు.

దొంగకు దేహశుద్ధి

మైసూరు: కారు డ్రైవర్ కళ్లల్లో కారం చల్లి అతని మెడలో ఉన్న బంగారు చైన్‌ను తస్కరించడానికి యత్నించిన దొంగను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసిన ఘటన మైసూరు నగరంలోని రైల్వే కాలనీలో చోటుచేసుకుంది. నిందితుడు శ్రీరంగ పట్టణానికి చెందిన మంజునాథ్‌గా గుర్తించారు. ఇతను గురువారం సాయంత్రం రైల్వే శాఖ డ్రైవర్ దేవరాజు వద్దకు వచ్చి అతని కళ్లల్లో కారంపొడి చల్లి అతని మెడలో ఉన్న చైన్ లాక్కోడానికి యత్నించాడు. దేవరాజు గట్టిగా అరవడంతో స్థానికులు అక్కడికి చేరుకుని మంజునాథ్‌ను పట్టుకుని దేహశుద్ధి చూసి పోలీసులకు అప్పగించారు.

బిల్డప్ దాసు అరెస్టు

- సెటిల్మెంట్‌కు వెళ్లి ఊచలు లెక్కిస్తున్న రీల్స్ డాన్


బిల్డప్ దాసు

దొడ్డబళ్లాపురం: ఆస్తి తగాదాల్లో తలదూర్చి సెటిల్మెంట్ చేయడానికి రౌడీలను పంపించి మహిళపై దాడి చేయించిన బిల్డప్ దాసును యలహంక పోలీసులు అరెస్టు చేసారు. రీల్స్, ఇన్‌స్టాలో ఇలా అన్ని సోషల్ మీడియాల్లో ఖద్దర్ దుస్తులు ధరించి, ఒంటి నిండా కుక్క చైన్‌లను పోలిన మందపాటి బంగారు చైన్లు, అన్ని వేళ్లకు బంగారు ఉంగరాలు వేసుకుని, పొడవాటి జుట్టుతో చుట్టూ ఓ ఐదుగురు వీధి రౌడీలను వెంటబెట్టుకుని పోజులిస్తూ దాసు తెగ బిల్డప్ ఇస్తుంటాడు. చూసేవారికి అతడో పెద్ద డాన్ అనే రేంజిలో పోజులిస్తుంటాడు. అతడు కూడా తాను ఒక పెద్ద డాన్ అయిపోయాను అనుకున్నాడేమో ఒక మహిళ, మరో వ్యక్తికి మధ్య ఉన్న ఆస్తి తగాదాలో వేలు పెట్టాడు. వ్యక్తికి మద్దతుగా రౌడీలను పంపించి మహిళపై దాడి చేయించాడు. దీంతో బాధిత మహిళ యలహంక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు బిల్డప్ దాసును అరెస్టు చేసి జైల్లో పెట్టారు.

ఉచిత దంత వైద్య శిబిరం


దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

బనశంకరి: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని వీరవనిత ఒణకె ఓబవ్వ, డాక్టర్ రాజ్‌మంటప కన్నడకట్టె అధ్యక్షుడు ఎస్‌జీ.రమేశ్‌రాజు తెలిపారు. జయనగర నాలుగోబ్లాక్‌లో సంస్థ ఆధ్వర్యంలో మొక్కలునాటే కార్యక్రమం, ఉచిత దంత చికిత్స శిబిరాన్ని రమేశ్‌రాజు ప్రారంభించి మాట్లాడారు. నేటి ఆధునిక జీవన శైలిలో ప్రకృతిని సంరక్షించి బెంగళూరు నగరంలో పచ్చదనం కాపాడటానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ఉద్యాననగరికి పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఏడాదికి రెండుసార్లు ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు.

పోలీసులకూ స్టార్ రేటింగ్..!

- క్యూఆర్ కోడ్ సాయంతో ప్రజాభిప్రాయ సేకరణ
- ఉత్తర కన్నడ జిల్లాలో అమలు
- పోలీసు సేవల్లో పెరుగుతున్న పారదర్శకత, నిబద్ధత





సాక్షి బెంగళూరు: సాధారణంగా డెలివరీ యాప్స్‌లో, బ్రాండెడ్ కంపెనీ షోరూమ్‌ల్లో, గూగుల్ రివ్యూల్లో ఫీడ్‌బ్యాక్ ఇవ్వడం, రేటింగ్ ఇవ్వడం చూసి ఉంటాం.. కానీ ప్రభుత్వ సేవలను అందించే వారికి రేటింగ్ ఇవ్వడం చూశామా? అవును ఉత్తర కన్నడ జిల్లా పోలీసు స్టేషన్లలో ఆయా సిబ్బందికి ఇప్పుడు సామాన్య ప్రజలు రేటింగ్ ఇచ్చే వెసులుబాటును కలిపించారు. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో ప్రజా స్పందన కోసం క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేశారు. ఆ కోడ్ ద్వారా ఆయా పోలీసు స్టేషన్లలోని సిబ్బందికి రేటింగ్, ప్రజాభిప్రాయం, సలహాలు, సూచనలను సేకరిస్తున్నారు. ఈ క్యూఆర్ కోడ్ ద్వారా రేటింగ్ విధానానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది.

క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ప్రజలు తమ సలహాలు, సూచనలు, అభిప్రాయాలను పంచుకుంటున్నారు. అన్ని పోలీసుస్టేషన్ల ప్రవేశ ద్వారం వద్ద ఈ క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన తర్వాత సిబ్బంది సేవలపై తమ అభిప్రాయాలను ఇస్తున్నారు. ఈ చర్య వల్ల పోలీసులు ఉత్తమంగా సేవలందించేందుకు, విధుల్లో పారదర్శకత చూపేందుకు ఎంతో ఉపయోగపడుతోంది. పోలీసు స్టేషన్‌కు వస్తున్న ప్రజలు తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సిబ్బంది ప్రవర్తన, ఫిర్యాదులు చేయడం, సమస్యలను వివరించడం చేస్తున్నారు. ఈ ఫిర్యాదులు, ఫీడ్‌బ్యాక్, కామెంట్లు నేరుగా సీనియర్ పోలీసు ఉన్నత అధికారులకు వెళుతున్నాయి. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో ఈ వ్యవస్థ అమల్లోకి వచ్చింది. దీనికి ప్రజల నుంచి అభినందనలు వ్యక్తం అవుతున్నాయి.

పోలీసుల సేవలపై సంతృప్తి

'పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రజలతో సిబ్బంది ఎలా స్పందిస్తున్నారనే విషయం ఈ క్యూఆర్ కోడ్ సాయంతో తెలుస్తోంది. లోకస్పందన కార్యక్రమం కింద పోలీసు స్టేషన్లలో ఈ క్యూఆర్ కోడ్‌ను అమర్చాము. గత ఏడాది మొత్తం 2,982 మంది ప్రజలు వచ్చి తమ ఫిర్యాదులు ఇచ్చారు. అందులో 623 మంది తమ అభిప్రాయాలను పంచుకున్నారు. వీరిలో చాలా మంది 4 నుంచి 5 స్టార్ రేటింగ్‌లను ఇచ్చారు. పోలీసుల సేవలపై సంతృప్తిగా ఉన్నట్లు ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. మరో ముగ్గురు మాత్రమే అసంతృప్తిని వ్యక్తం చేశారు'.

–ఎస్. విష్ణువర్ధన్, ఎస్పీ, ఉత్తర కన్నడ జిల్లా

మృతుల పేరుతో ధ్రువీకరణపత్రాలు

- ఇద్దరు వైద్యుల సస్పెన్షన్

తుమకూరు : మృతుల పేరుతో తప్పుడు ధ్రువీకరణపత్రాలు ఇస్తున్నట్లు ఆరోపణలపై తుమకూరు జిల్లా మధుగిరి ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన డాక్టర్ మహేష్‌సింగ్, డాక్టర్ పురుషోత్తంను సస్పెండ్ చేస్తూ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పీ చంద్రశేఖర్ ఆదేశాలు జారీ చేశారు. మహేష్ సింగ్‌ను హావేరి జిల్లా, సువనూరు ఆస్పత్రికి, పురుషోత్తమ్‌ను కోలారు జిల్లా కేజీఎఫ్ ఆస్పత్రికి బదిలీ చేయాలని ప్రతిపాదనలు ఉన్నాయి. ఇంతలోనే తప్పుడు ధృవీకరణపత్రాలు వెలుగులోకి రావడంతో వీరిద్దరూ సస్పెన్షన్‌కు గురయ్యారు.

11న తెలుగు పాస్టర్ల సమావేశం

శివాజీనగర: నగరంలోని మత్తికెర హెచ్‌ఎంటీ లౌట్‌లో ఉన్న రసెల్ మెమోరియల్ తెలుగు చర్చిలో ఈ నెల 11న సోమవారం కర్ణాటక తెలుగు క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో తెలుగు పాస్టర్ల సమావేశం జరుగనుందని కేటీసీఎంఎఫ్ సంస్థాపక అధ్యక్షుడు బిషప్ రెవరెండ్ ఎం.బెంజిమన్, చైర్మన్ డాక్టర్ రెవరెండ్ ప్రేమానందం, ప్రధాన కార్యదర్శి రెవరెండ్ వీ.సాలోమన్, కోశాధికారి రెవరెండ్ ఏ.జీ.జయానందం శుక్రవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపుర తదితర జిల్లాల్లో సేవలందిస్తున్న పాస్టర్లను ఆధ్యాత్మికంగా బలపరచాలనే ఉద్దేశ్యంతో కేటీసీఎంఎఫ్ పని చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం జరిగే పాస్టర్ల సమావేశంలో ప్రసంగీకులు డాక్టర్ జాన్‌పాల్, డాక్టర్ రెవరెండ్ జే.డీ.మోజస్ దైవ వర్తమానాన్ని వినిపిస్తారని తెలిపారు.

విద్యార్థుల ప్రతిభను గుర్తించాలి


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

బొమ్మనహళ్లి: ప్రతి ఒక్క విద్యార్థిలోను ఏదో ఒక ప్రతిభ ఉంటుందని, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని కిక్ బాక్సింగ్ కోచ్ మంజునాథ్ అన్నారు. శుక్రవారం నగరంలోని బొమ్మనహళ్లి పరిధి హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్‌లోని అటల్ బిహారి వాజ్‌పేయి క్రీడా మైదానంలో శ్రీసాయిరామ్ విద్యాసంస్థల వార్షిక క్రీడా పోటీలను విద్యా సంస్థల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డితో కలిసి కపోతాలను ఎగురవేసి క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ...విద్యకు ఎంత ప్రాధాన్యత ఇస్తామో, క్రీడలకు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ...క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధ్యక్షుడు, డీన్ నితిన్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, శ్రీసాయిరామ్ విద్యామందిర పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర రావు, ఉప ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రికెట్, వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించారు.

న్యాయవాది హత్యను ఖండిస్తూ ఆందోళన

యశవంతపుర: కలబురగి పట్టణంలో గురువారం న్యాయవాది ఈరణ్ణగౌడ పాటీల్ హత్యను ఖండిస్తూ పట్టణంలో న్యాయవాదులు శుక్రవారం ఆందోళన చేశారు. పట్టణంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ సర్కిల్లో టైర్లకు నిప్పుపెట్టి ఆందోళన చేశారు. గురువారం కోర్టు విధులకు వెళ్తున్న ఈరణ్ణను వెంటాడి తలపై బండరాయి వేసి దుండగులు హత్య చేసి పారిపోయారు. అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలలో హత్యా దృశ్యాలు రికార్డయ్యాయి. న్యాయవాది ఈరణ్ణగౌడకు లైసెన్స్ తుపాకీ ఉన్న కాపాడుకోలేకపోయారు. నిందితులను త్వరగా అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ కలబురగి జిల్లా న్యాయవాదుల సంఘం డిమాండ్ చేస్తూ ఎస్‌వీపీ సర్కిల్లో మానవహారంగా ఏర్పాటు చేశారు. నిందితుల కోసం రెండు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు కలబురగి నగర పోలీసు కమిషనర్ చేతన్ తెలిపారు.

క్రీడల్లో రాణించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: విద్యార్థులు ప్రధానంగా క్రీడల్లో రాణించాలని తాలూకా విద్యాశాఖ అధికారి శ్రీనివాసమూర్తి తెలిపారు. శుక్రవారం నగరంలోని శ్రీ రామకృష్ణ శారదాదేవి విద్యామందిరం పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. విశ్రాంత దఫేదార్ సోమశేఖర్ మాట్లాడుతూ... ఉత్తమ ఆరోగ్యానికి, మానసిక దృఢత్వానికి క్రీడలు అవసరమన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వీడీ గణేశ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, హనుమంత రాయప్ప, కౌస్తుభరత్న, అర్చన, రేష్మాతాజ్ తదితరులు పాల్గొన్నారు.

పులిగోర్లు, మత్తు పదార్థాలు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు

యశవంతపుర: దావణగెరె సీఇఎస్ పోలీసులు ఏడుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి పులిగోర్లు, మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. తుమకూరుకు చెందిన దావణగెరె బాలాజీనగరలో నివాసం ఉంటున్న అశోక్‌కుమార్, దావణగెరెలో నివాసం ఉంటున్న రాజస్థాన్‌వాసి రమేశ్‌కుమార్ గాంసి, వినోబ్‌నగరకు చెందిన కార్తీక్, నిజలింగప్ప లేఔట్‌కు చెందిన రామ్ రతన్, బెంగళూరు బసవేశ్వరనగర లేఔట్‌కు చెందిన సునీల్‌కుమార్, కొడిగేహళ్లి అశోక్ కుమార్‌లను అరెస్ట్ చేశారు. వీరిని అరెస్ట్ చేయటంతో మత్తు పదార్థాల అమ్మకంలో పెద్ద ముఠాను గుర్తించినట్లు సీఇఎస్ పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

కృష్ణరాజపురం: బెంగూళూరు గ్రామీణ జిల్లా హోసకోటె తాలూకా మారనగర గ్రామంలో సుమారు 150 మంది కార్యకర్తలు శుక్రవారం బీజేపీని వీడి ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మారనగెరె గ్రామంలో తాను చేసిన అభివృద్ధిని చూసి గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరారన్నారు. గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడు మునికృష్ణ, చంద్రప్ప, కృష్ణప్ప, హరీష్, నంజప్ప, దేవరాజు తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

జనతా దర్శన్‌లో ఫిర్యాదుల వెల్లువ


ఎస్పీకి తన గోడు వినిపిస్తున్న ఓ బాధితుడు

తుమకూరు: తుమకూరు జిల్లాలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన జనతా దర్శన్‌కు అనూహ్య స్పందన వచ్చింది. పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జిల్లా ఎస్పీ కేవీ అశోక్ శిర తాలూకాలోని పట్టనాయకనహళ్లి, తురువెకెరె, కళ్ళంబెళ్ల పోలీస్ స్టేషన్లలో శుక్రవారం జనతా దర్శన్ నిర్వహించారు. స్థానికుల నుంచి 250 అర్జీలు స్వీకరించి కేసులు నమోదు చేయించారు. ప్రధానంగా గ్రామాలలో చిన్న చిన్న దుకాణాలు, కిరాణా షాపుల్లో, టీ స్టాళ్లలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని, పాఠశాలలు, కళాశాలల వద్ద దుండగులు మద్యం తాగి హంగామా సృష్టిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయి. వెంటనే స్పందించిన ఎస్పీ ఆయా స్టేషన్ల ఎస్‌ఐలతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.

శివమొగ్గ జిల్లాలో పోలీసుల ప్రత్యేక గస్తీ

శివమొగ్గ: శివమొగ్గ, భద్రావతి, సాగర, శికారిపుర ప్రాంతాల్లో నిర్జన ప్రదేశాల్లో గురువారం సాయంత్రం నుంచి పోలీసులు ఏరియా డామినేషన్ పేరుతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. శివమొగ్గ నగరంలోని మంజనాథ్ లేఔట్, ఎఎ కాలనీ, రైల్వేస్టేషన్ సమీనకొప్ప, భద్రావతిలోని విద్యా కాలనీ, తమ్మణ్ణ కాలనీ, సాగర, రామనగర, ఇక్కేరి, సర్కిల్ జోగ బజార్, యడెహళ్ళి శికారిపుర, సాగర తాలూకాలోని అనెవట్టి బస్టాండ్, శికారిపుర తాలుకా, శిరాలకొప్ప పట్టణం సమీపంలో పోలీసులు దాడులు నిర్వహించి కొంత మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరు ప్రజలపై దౌర్జన్యం ,మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం అనే కారణాలపై విచారణ చేస్తున్నారు.

సురక్షిత రోడ్లు అవసరం

- నమ్మరోడ్లు ప్రదర్శన సెమినార్ ప్రారంభం


నమ్మరోడ్డు ప్రదర్శనలో క్లాడియా ఆడ్రియాజోలా స్టీల్, తుషార్‌గిరినాథ్ తదితరులు

బనశంకరి: నగర రోడ్లు, ఫుట్‌పాత్ మార్గాలను ప్రజలు సురక్షతను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చేయాల్సి ఉందని బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు. సురక్షిత రోడ్లను నిర్మించే ఉద్దేశంతో బ్లూమ్‌బర్గ్స్ ఫిలాంత్రపిస్ ఇన్షియోటివ్, డబ్ల్యు ఆర్ఐ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో బీబీఎంపీ కేంద్ర కార్యాలయ ఆవరణలోని డాక్టర్ రాజ్‌కుమార్‌గ్లాస్‌హౌస్‌లో శుక్రవారం నుంచి రెండురోజులు పాటు నిర్వహించే నమ్మరోడ్లు ప్రదర్శన సెమినార్‌ను తుషార్ ప్రారంభించి మాట్లాడారు. మనరోడ్లు ప్రదర్శన, సెమినార్ మంచి ఉద్దేశంతో ప్రారంభించామని ప్రజలు ఉపయోగించేలా రోడ్లు, ఫుట్‌పాత్ మార్గాలను ప్రజలు సురక్షత దృష్టితో ఏర్పాటు చేయాలన్నారు. సెమినార్‌లో ప్రజల ఉత్తమ సలహాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి చేస్తామని చెప్పారు. నమ్మరోడ్లు అనే అభియాన్ బ్రాండ్ బెంగళూరు నిర్మాణం చేయడానికి దోహదపడుతుందన్నారు. డబ్ల్యుఆర్ఐ రాస్‌సెంటర్ క్లాడియాఅడ్రియాజోలా స్టీల్, లీవాంటామిల్లర్, చీఫ్ ఇంజినీర్ ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.


నిందితుడి అరెస్ట్

యశవంతపుర: యువతిపై అత్యాచారం చేసి దుబైకి పారిపోయిన నిందితుడిని బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. సీబీఐ, ఇంటర్‌పోల్ సహకారంతో బెంగళూరు పోలీసులు నిందితుడు మిథున్ చంద్రన్‌ను అరెస్ట్ చేసి బెంగళూరుకు తరలించారు. 2020లో మిథున్ చంద్రన్‌పై అత్యాచారం కేసు మహదేవపుర పోలీసుస్టేషన్‌లో నమోదైంది. కేసు నమోదైన వెంటనే నిందితుడు దుబైకి పారిపోయాడు. సీబీఐ ద్వారా రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసి దుబైలో అరెస్ట్ చేశారు. మిథున్ 2016లో బెంగళూరులో ఒక ప్రైవేట్ సంస్థలో పని చేసేవాడు. ఆదే సంస్థలో పని చేస్తున్న యువతిని ప్రేమిస్తున్నట్లు నమ్మించి అత్యాచారం చేశాడు. ఆమె ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

హోంవర్క్ చేయలేదని...

బనశంకరి: హోంవర్క్ చేయలేదని విద్యార్థిపై ఉపాధ్యాయుడు రాడ్‌తో దాడికి పాల్పడిన ఘటన నగరంలోని ప్రైవేటు స్కూల్‌లో చోటుచేసుకుంది. 7వ తరగతి విద్యార్థి పర్దీన్‌ను రక్తం వచ్చేలా రాడ్‌తో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా డాక్టర్లు చేతికి ఆరు కుట్లు వేశారు. ఈ ఘటన జరిగిన మూడు రోజులైనప్పటికి పాఠశాల ఉపాధ్యాయుడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై బీఈఓ శశికళ మాట్లాడుతూ... లార్డ్స్ పాఠశాల ఉపాధ్యాయుడు దాడి విషయంపై ఫిర్యాదు అందిందని చెప్పారు.

వెట్టి నుంచి నేపాల్‌వాసులకు విముక్తి


బాధితురాలు నిర్మలతో మాట్లాడుతున్న అధికారులు

మైసూరు : నిషేధించిన వెట్టి దురాచారం ఇంకా కొనసాగుతోంది. మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకా కైలాసపుర గ్రామంలో నేపాల్‌కు చెందిన మహిళను, ఆమె ఇద్దరు పిల్లలను నిర్బంధించి వ్యవసాయ పనులు చేయిస్తుండగా అధికారులు వారికి విముక్తి కల్పించారు. నేపాల్‌కు చెందిన నిర్మల తన భర్త గోపాల్, ఇద్దరు పిల్లలతో కలిసి ఒక మధ్యవర్తి ద్వారా కైలాసపుర గ్రామానికి వచ్చింది. భర్తకు రూ. 300, నిర్మలకు రూ. 200 కూలి ఇస్తామని చెప్పి ఈరేగౌడ అనే వ్యక్తి వారి నుంచి ఉదయం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు వ్యవసాయ పనులు చేయిస్తున్నాడు. తాము ఇంత కష్టం చేయలేమని నిర్మల తన యజమాని వద్ద వాపోయింది. దీంతో అతను నిర్మల భర్తను మరోచోటకు తీసుకెళ్లాడు. ప్రశ్నించినందుకు నిర్మలను కొట్టేవారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్, సీడీపీఓ ఆశా, సంక్షేమ శాఖ అధికారి రామస్వామి, గిరిజన అభివృద్ధి శాఖ అధికారి నారాయణస్వామి కైలాసపురం చేరుకొని నిర్మల, ఆమె ఇద్దరు పిల్లలను వెట్టినుంచి విముక్తి కల్పించారు.

హోసూరు వార్తలు..

ఉచిత వంటగ్యాస్ పంపిణీ


లబ్ధిదారులకు ఉచిత వంటగ్యాస్‌ను అందజేస్తున్న దృశ్యం

కెలమంగలం: ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ఉజ్వల్ పథకం కింద డెంకణీకోట తాలూకా కెలమంగలం సమితిలోని ఇరుదుకోట గ్రామంలో శుక్రవారం ఉచిత వంటగ్యాస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ యూనియన్ అధ్యక్షులు చంద్రు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షులు ఎం.నాగరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని 50 మంది లబ్ధిదారులకు వంటగ్యాస్‌లు అందజేసి మాట్లాడుతూ... పదేళ్లుగా కేంద్రంలో పరిపాలన కొనసాగిస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వం బీద, బడుగు, బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధికి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, రైతులకు ప్రతి సంవత్సరం రూ. 6000 ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారని, రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో క్రిష్ణగిరి జిల్లా నుంచి పోటీ చేసే అభ్యర్థిని ఎక్కువ ఓట్ల మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాసన్, మాదేశ్, వీరేంద్ర, రవి, వెంకటరాజ్, ఆనంద్, చిన్నముత్తు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గుట్కా స్వాధీనం

హోసూరు: కర్ణాటక నుంచి సేలంకు తరలిస్తున్న నిషేధిత గుట్కా ఉత్పత్తులను గురువారం రాత్రి సిప్‌కాట్ పోలీసులు స్వాధీనపరుచుకొని డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. వివరాలు... సిప్‌కాట్ పోలీసులు గురువారం రాత్రి హోసూరు–బెంగళూరు జాతీయ రహదారి జూజువాడి చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న కారును అడ్డగించి తనిఖీ చేయగా 80 బస్తాలలో 640 కిలోల గుట్కా పట్టుబడింది. కారుతో పాటు గుట్కాను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా సేలంకు చెందిన అజిత్ కుమార్‌గా గుర్తించారు. బెంగళూరు నుంచి సేలంకు గుట్కా తరలిస్తున్నట్లు తెలిసింది. నిందితున్ని అరెస్ట్ చేసి కేసు విచారణ చేస్తున్నారు.

పంచాయతీ మాజీ అధ్యక్షురాలి ఇంట్లో చోరీ

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి జిల్లా మత్తూరు సమీపంలోని కోడిపతి గ్రామానికి చెందిన పంచాయతీ మాజీ అధ్యక్షురాలు ఆదిలక్ష్మి ఇంటిలో చోరీ జరిగింది. రెండు రోజుల క్రితం ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి తీర్థయాత్రకు వెళ్లారు. పసిగట్టిన దుండగులు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. గురువారం రాత్రి ఇంటికి రాగా బీరువాలోని 7.5 పౌన్ల బంగారు నగలు సహా రూ. 5 లక్షల విలువైన నగలు కనిపించలేదు. దీంతో బాధితులు మత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

పూల ఎగుమతి కేంద్రం అభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ శరయు

హోసూరు: తమిళనాడు ప్రభుత్వం ద్వారా రూ. 20 కోట్లతో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ పూల ఎగుమతి కేంద్రం అభివృద్ధికి రైతులు, వ్యాపారులు సహకరించాలని శుక్రవారం జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ శరయు తెలిపారు. క్రిష్ణగిరి జిల్లాలో పూల సాగుకు అనుకూలమైన శీతోష్ణస్థితి ఉండడంతో హోసూరు, డెంకణీకోట, అంచెట్టి, సూళగిరి తాలూకాల్లో పెద్ద ఎత్తున రైతులు గ్రీన్‌షెడ్లను ఏర్పాటు చేసి రోజా, జరబరా, కార్నేషన్, చామంతి తదితర పూలతో పాటు అలంకరణ పూలను సాగు చేస్తున్నారు. రైతులు పండించే ఉత్పత్తులను దేశ విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పండించే పూలను మార్కెట్‌లకు తరలించేందుకు హోసూరు, బెంగళూరు, చెన్నై, మధురై, సేలం తదితర ప్రాంతాలకు తీసుకెళ్లవలసి ఉండేది. హోసూరు ప్రాంతంలో అంతర్జాతీయ పూల ఎగుమతి కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు, వ్యాపారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ విషయంపై స్పందించిన ప్రభుత్వం సకల సౌకర్యాలతో అంతర్జాతీయ ఎగుమతి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రారంభించి రెండేళ్లు గడుస్తున్నా వ్యాపారులు, రైతులు ఎక్కువ సంఖ్యలో రాకపోవడంతో కలెక్టర్ శరయు అధ్యక్షతన శుక్రవారం రైతులు, వ్యాపారులతో కలిసి సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్చించారు. పూల ఎగుమతి కేంద్రాన్ని అభివృద్ధి పరిచేందుకు వ్యాపారులు, రైతులు సహకరించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్, అధికారులు భూపతి, అనిషా రాణి, శ్రీనివాసన్, ప్రభాకర్, జనిఫర్, ఆర్ముగం, పూల ఎగుమతి కేంద్రం అధికారులు, వ్యవసాయ, తోటల పెంపక శాఖాధికారులు, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరాహార దీక్ష


డెంకణీకోట తాలూకా కార్యాలయంలో దీక్షలో ఉద్యోగులు

కెలమంగలం: గత 23 ఏళ్లుగా అందజేస్తున్న కారుణ్య ఉద్యోగ అవకాశాలను ప్రస్తుత ప్రభుత్వం నిలిపి వేసిందని, ఈ పథకాన్ని మళ్లీ కొనసాగించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ ఉద్యోగులు నిరాహార దీక్షను చేపట్టారు. అందులో భాగంగా జిల్లా కేంద్రం క్రిష్ణగిరి తాలూకా కార్యాలయంలో గోవిందస్వామి అధ్యక్షతన, డెంకణీకోట తాలూకా కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు చూడప్ప అధ్యక్షతన నిరాహార దీక్ష కొనసాగింది. ఈ దీక్షలో ఉద్యోగులు మాట్లాడుతూ గత 1999న అప్పటి ప్రభుత్వం విధులు నిర్వహిస్తూ ఆకస్మికంగా మృతి చెందిన బాధిత కుటుంబంలో ఒకరికి కారుణ్య ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ వచ్చిందని, ఈ పథకాన్ని తొలగించడం ప్రస్తుత ప్రభుత్వానికి సమంజసం కాదని, మళ్లీ ఆ పథకాన్ని ప్రవేశపెట్టాలని తదితర 14 అంశాలను ముందుంచి నినాదాలు చేశారు. ఈ దీక్షలో పెద్ద ఎత్తున రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్లస్‌వన్ విద్యార్థిని ఆత్మహత్య

క్రిష్ణగిరి: స్నేహితురాలు మృతి చెందడంతో మనోవేదనకు గురైన ప్లస్‌వన్ విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన ఊత్తంగేరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరికి చెందిన ఉత్తరకుమార్ కూతురు దీపిక(17). గత కొద్ది సంవత్సరాల క్రితం తండ్రి మృతి చెందడంతో తల్లి పూంజోలై సంరక్షణలో ఉంటూ ఊత్తంగేరిలోని ప్రభుత్వ ఉన్నతోన్నత పాఠశాలలో ప్లస్‌వన్ చదువుతోంది. ఈ నేపథ్యంలో గత కొద్ది రోజుల క్రితం స్నేహితురాలు అనారోగ్యంతో మృతి చెందడంతో పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటోంది. ఈ తరుణంలో గురువారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. ఊత్తంగేరి పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

మేకల మందపై చిరుత దాడి

మైసూరు: మేకల మందపై చిరుత దాడి చేసి ఓ మేకను ఎత్తుకెళ్లిన ఘటన మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా శ్రీనగర గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహాదేవయ్య అనే రైతు మేకలను మేపుతున్న సమయంలో ఒక్కసారిగా ఓ చిరుత మందపై దాడి చేసి ఒక మేకను ఎత్తుకుని వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న అటవీ అధికారులు చిరుత కోసం బోనులు ఏర్పాటు చేశారు.

ఘనంగా ఆలయ కుంభాభిషేకం


పూజల్లో ఎమ్మెల్యే వై. ప్రకాష్ తదితరులు

హోసూరు: హోసూరు కార్పొరేషన్ జూజువాడి పారిశ్రామికవాడ నంజప్ప సర్కిల్ వద్ద కొత్తగా నిర్మించిన శ్రీ అంగాళ పరమేశ్వరి, శ్రీ నారాయణిదేవి ఆలయ కుంభాభిషేక మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. గురువారం ఉదయం నుంచి ఆలయంలో నుంచి గంగపూజ, అనుజ్ఞ, స్వస్తివాచన, రక్షాబంధన, గణపతి పూజ, వాసుదేవపుణ్యాహ, నవగ్రహారాధన, దిక్పాలక హోమం, రుద్రహోమం, దుర్గా హోమం, శయాదివాసము మహామంగళారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. శుక్రవారం 6.30 గంటలకు సుప్రభాత సేవ, లలితాసహస్రనామ పారాయణం, ప్రాణప్రతిష్ఠ, మూలమంత్రం, గోపూజ, గంగపూజ, గణపతి హోమం, నవగ్రహ హోమం, మహా కుంభాభిషేకోత్సవం జరిపించారు. కార్యక్రమానికి హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జూజువాడి, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై సీఎం జగన్ ఆరా

- కేసీఆర్ తనయుడు కేటీఆర్‌కు ఫోన్

సాక్షి, అమరావతి: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆరోగ్య పరిస్థితిపై సీఎం వైఎస్ జగన్ ఆరా తీశారు. కేసీఆర్ తనయుడు కేటీఆర్‌కు సీఎం వైఎస్ జగన్ ఫోన్ చేసి పరామర్శించారు. హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్ శుక్రవారం జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ముందు కొచ్చింది. ఈ కేసులో ప్రతివాది కౌంటరు దాఖలు చేయలేదని రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. స్కిల్ కుంభకోణం కేసులో పీడీ చట్టం సెక్షన్ 17ఏ పై తీర్పు ఇంకా వెలువరించలేదని చంద్రబాబు తరపు న్యాయవాది హరీష్ సాల్వే ధర్మాసనానికి తెలిపారు. తీర్పు ఇచ్చేలా ఉంటే వాయిదా వేయాలని, లేదంటే తదుపరి విచారణ తేదీ తెలపాలని ధర్మాసనాన్ని కోరారు. కౌంటరు దాఖలు చేస్తామని ధర్మాసనానికి తెలిపారు. అయితే, తదుపరి విచారణ జనవరి మూడో వారంలో చేపడతామని ధర్మాసనం పేర్కొంది. తేదీ ఖరారు చేయాలని హరీష్ సాల్వే కోరగా.. జనవరి 19కి వాయిదా వేస్తున్నామని, అప్పటి లోగా కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించింది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం రిజాయిండర్ దాఖలు చేయాలని ధర్మాసనం పేర్కొంది.

15మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 15మంది సీఐలకు పదోన్నతిపై డీఎస్పీలుగా పోస్టింగులు ఇచ్చారు. వీరి పదోన్నతులను ప్రభుత్వం ఆగస్టులో ఖరారు చేసింది. కాగా వారికి తాజాగా పోస్టింగులు ఇస్తూ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి: ఎస్.వహీద్ బాషా(సీఐడీ), ఎం.హనుమంతరావు(సీఐడీ), టీవీ రాధా స్వామి (ఎస్‌బీ, గుంటూరు), డి.శ్రీహరిరావు (ఏసీబీ), జి.రాజేంద్ర ప్రసాద్ (ఇంటెలిజెన్స్), బి.పార్థసారథి (సీఎస్‌బీ, విజయవాడ), కె.రసూల్ సాహెబ్ (సీఐడీ), ఎం.కిశోర్ బాబు (విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్), డీఎస్‌వీ ప్రసాద్ (ఇంటెలిజెన్స్), జి.రత్న రాజు (పోలవరం), పి.రవిబాబు (ఇంటెలిజెన్స్), షేక్ అబ్దుల్ కరీమ్ (పీసీఎస్ అండ్ ఎస్), ఎస్. తాతారావు (విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్), కోంపల్లి వెంకటేశ్వరరావు(విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్), సీహెచ్.ఎస్.ఆర్.కోటేశ్వరరావు(ఏసీబీ).

రైతుల వద్దకు వెళ్లి రాజకీయాలా?

- బాబు బెయిల్ షరతులు ఉల్లంఘించారు
- మండలిలో ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి ధ్వజం



సాక్షి, అమరావతి: తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతుల వద్దకు వెళ్లి చంద్రబాబు రాజకీయాల గురించి మాట్లాడటం ఏమిటని శాసన మండలిలో ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎప్పుడైనా వర్షాల వల్ల రైతులకు నష్టం జరిగితే, జిల్లా అధికారులకు కొంత నిధులిచ్చి పంపుతారని, పరిస్థితి కుదుటపడ్డాక సీఎం జగన్ నేరుగా రైతుల వద్దకు వెళ్లి వారికి న్యాయం జరిగిందా లేదా అని స్వయంగా తెలుసుకుంటారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో బెయిల్‌పై ఉండి, ఆ కేసు గురించి బాబు బహిరంగంగా కీలక వ్యాఖ్యలు చేశారని, ఇది బెయిల్ షరతుల ఉల్లంఘనే అని చెప్పారు. కోర్టులన్నా, చట్టాలన్నా బాబుకు గౌరవం లేదా అని ప్రశ్నించారు. వ్యవసాయం దండగ అని మాట్లాడిన దుర్మార్గుడు చంద్రబాబని, ఆయన హయాంలో రైతులు అనేక అవస్థలు పడి, కన్నీరు పెట్టారని అన్నారు. చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

ఆ రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు

ఏపీ సీఆర్డీఏ

సాక్షి, అమరావతి: భూ సమీకరణ పథకంలో భాగంగా ఏపీ సీఆర్డీఏకు భూములిచ్చిన రైతులకు గతంలో నివాస, వాణిజ్య ప్లాట్లు కేటాయించారని, అయితే వాటిలో 2,243 ప్లాట్లు భూ సమీకరణ పూర్తిగాని భూముల్లో ఉన్నట్టు గుర్తించామని ఏపీ సీఆర్డీఏ పేర్కొంది. ఆయా రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించేందుకు తొలి విడతలో 679 మంది రైతులు అంగీకారం తెలపాలని నోటీసులు ఇచ్చినట్టు సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ తెలిపారు. ఆయా రైతులకు రెండోసారి నోటీసులు జారీ చేశామని, ఇప్పటి వరకు 44 మంది రైతులు ప్రత్యామ్నాయ ప్లాట్లు తీసుకునేందుకు అంగీకరించినట్టు పేర్కొన్నారు. వీరికి ప్లాట్లు కేటాయించేందుకు ఈనెల 15న విజయవాడలోని ఏపీ సీఆర్డీఏ కార్యాలయంలో ఈ-లాటరీ తీయనున్నట్టు ఆయన వివరించారు.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..



విజయవాడ కేటీ రోడ్డులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి



శ్రీకాకుళం జిల్లా మంచినీళ్లపేటలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల బోర్డును ఆవిష్కరిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



అన్నమయ్య జిల్లా ముదియం వారిపల్లెలో వైఎస్సార్‌సీపీ పతాకావిష్కరణ చేస్తున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ముఖ్యమంత్రి గురించి ఇష్టమొచ్చినట్లు రాస్తారా?

సీఎంకు, సీఎస్‌కు కులాలు అంటగడతారా?

- ఇలాంటి వ్యాజ్యాలను విచారించరాదని సుప్రీంకోర్టు చెప్పింది
- కార్యాలయాల తరలింపు వ్యవహారం ధర్మాసనం ముందు ఉంది
- ఈ వ్యాజ్యం కూడా ధర్మాసనం వద్దకే వెళ్లాలి
- ప్రభుత్వంపై వ్యూహాత్మకంగా దాడులు చేస్తున్నారు
- మినీ ట్రయల్‌తో కోర్టులపై ఒత్తిడి పెంచుతున్నారు
- హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్
- మా వ్యక్తిగత ప్రయోజనాలు ఉన్నందుకే పిల్ వేయలేదు
- హైకోర్టుకు వివరించిన సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు
- తదుపరి విచారణ సోమవారానికి వాయిదా

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర అభివృద్ధి పర్యవేక్షణ, సమీక్ష నిమిత్తం విశాఖపట్నంలో ప్రభుత్వ క్యాంప్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రదేశాలను గుర్తిస్తూ ఐఏఎస్‌ల కమిటీ ఇచ్చిన నివేదికకు అనుగుణంగా ప్రభుత్వం జారీ చేసిన జీవో 2283ని సవాలు చేస్తూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన రాజధాని రైతులు అందులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి ఇష్టమొచ్చినట్లు రాయడంపై అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. ముఖ్యమంత్రికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జవహర్‌రెడ్డికి కులాన్ని ఆపాదించడాన్ని తప్పుపట్టారు. అమరావతి పరిరక్షణ సమితి మేనేజింగ్ ట్రస్టీ గద్దె తిరుపతిరావు, రాజధాని రైతులు మాదాల శ్రీనివాసరావు, వలపర్ల మనోహరం దాఖలు చేసిన ఈ రిట్ పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు శుక్రవారం మరోసారి విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఏజీ వాదనలు వినిపిస్తూ.. మీడియా దృష్టిని ఆకర్షించడానికే పిటిషనర్లు ఇలా చేస్తున్నారన్నారు. ఇలా ఏది పడితే అది రాసి పిటిషన్ దాఖలు చేయడానికి వీల్లేదని, ఇలాంటి వ్యాజ్యాలను విచారించడానికి వీల్లేదని అన్నారు. వ్యక్తిగత దూషణలు,



అసత్య ఆరోపణలతో నిర్లక్ష్యపూరితంగా దాఖలు చేసే ఇలాంటి వ్యాజ్యాలకు విచారణార్హత లేదని సుప్రీంకోర్టు గతంలోనే చెప్పిందని వివరించారు. ఇలా చేయడం కోర్టు ప్రక్రియను దుర్వినియోగం చేయడమే అవుతుందని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల తరలింపు వ్యవహారం సీజే నేతృత్వంలోని ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉన్నందున, ఈ వ్యాజ్యం కూడా ఆ ధర్మాసనానికే వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఈ విషయం స్పష్టంగా తెలిసి కూడా రిట్ పిటిషన్ దాఖలు చేయడం 'ఫోరం షాపింగ్' కిందకే వస్తుందని వివరించారు. ఈ వ్యాజ్యం విచారణ నుంచి తప్పుకోవాలని మిమ్మల్ని (జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లును) అడగటంలేదని, వ్యాజ్యం ధర్మాసనం ముందుకు మాత్రమే వెళ్లాలని చెబుతున్నామని చెప్పారు. ఒకవేళ విచారణ నుంచి మిమ్మల్ని తప్పుకోవాలని కోరితే (రెక్యూజ్) దాన్ని రాతపూర్వకంగానే కోరతామన్నారు. రాజధాని విషయంలో పిటిషనర్ల వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలనే చూడాలన్నారు.

ఉద్దేశపూర్వకంగానే రిట్ పిటిషన్ వేశాం

అంతకు ముందు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ.. తాము ఉద్దేశపూర్వకంగానే రిట్ పిటిషన్ వేశామన్నారు. ఈ వ్యవహారంలో తమ వ్యక్తిగత ప్రయోజనాలు, ఆస్తి హక్కు ముడి పడి ఉన్నాయని, అందువల్లే పిల్ కాకుండా రిట్ పిటిషన్ దాఖలు చేశామని చెప్పారు. కార్యాలయాల తరలింపుపై గతంలో పిల్ దాఖలు చేసిన పిటిషనర్లు వేరని, వారికీ ప్రస్తుత వ్యాజ్యంలోని పిటిషనర్లకు సంబంధం లేదని తెలిపారు. రాజధాని విషయంలో త్రిసభ్య ధర్మాసనం తీర్పు అమల్లో ఉందని, దాని ప్రకారం కార్యాలయాలను రాజధాని నుంచి తరలించడానికి వీల్లేదన్నారు. ఆ తీర్పునకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో 2283 జారీ చేసిందన్నారు. క్యాంప్ ఆఫీస్ అంటే టెంట్ (గుడారం)లో ఉండాలని, బంగళాల్లో ఉండకూడదని అన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

వైఎస్సార్‌సీపీ నేతలపై కేసు కొట్టివేత

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ప్రజా సమస్యలపై ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులపై అప్పటి టీడీపీ నేతల ప్రోద్బలంతో నమోదైన కేసులను శుక్రవారం న్యాయస్థానం కొట్టేసింది.సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసు కొట్టేస్తూ యలమంచిలి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఈ తీర్పు చెప్పినట్లు న్యాయవాది పి.సుభాషిణి తెలిపారు.ఆ మేరకు.. నక్కపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద 2017లో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ప్రజాసమస్యలు, ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ నాయకుడు వీసం రామకృష్ణ తదితరులు నిలదీశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అప్పటి ఎంపీడీవో జగన్‌మోహన్‌రావును నక్కపల్లిలో నెలకొన్న సమస్యలపై ప్రశ్నించారు. అధికారులకు, నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో వీసం రామకృష్ణ, అల్లాడ కొండ, వీసం శ్రీను, కొల్నాటి దుర్గాప్రసాద్, బాబ్జి తదితరులు తమపై దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ అప్పటి అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు ఎంపీడీవో ద్వారా పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయించారు. పోలీసులు కేసులు నమోదు చేసి నాయకులను అరెస్టు చేశారు. దాదాపు ఆరేళ్లపాటు కోర్టులో వాదోపవాదాలు జరిగాయి. నిందితులపై చేసిన ఆరోపణలకు సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో న్యాయాధికారి.. నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ కేసు కొట్టేశారు.

పచ్చ పత్రికల రాతలు క్షంతవ్యం కాదు

ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని



నెల్లూరు (దర్గామిట్ట): విలువలతో కూడిన జర్నలిజాన్ని పక్కనపెట్టి స్వార్థపూరిత ఆలోచనలతో ఈనాడు పత్రిక వ్యాసాలు రాయడం క్షంతవ్యం కాదని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. సమాజానికి విలువలతో కూడిన జర్నలిజం ఎంతో అవసరమన్నారు. శుక్రవారం ఆయన నెల్లూరులో విలేకరులతో మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు మీద, రాష్ట్ర ప్రజల మీద ఈనాడుకు అభిమానముంటే కేంద్రం అనుమతులు, మంజూరు విషయాలు ఎందుకు ప్రచురించడం లేదని ప్రశ్నించారు. పోలవరం జలాశయం గోడకు బీటలు వారాయని ఈనాడు ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. పచ్చపత్రికలు ప్రభుత్వంపై పగ, ప్రతీకారంతో కూడిన వార్తలు రాయడం, ప్రజలను తప్పుదోవ పట్టించడం సమాజానికి మంచిది కాదని చెప్పారు. రాష్ట్రంపై పగపట్టినట్లు రాయడమే పచ్చపత్రికలు ప్రధాన అజెండాగా పెట్టుకున్నాయని, ఈ తరహా విధానాలు మంచివి కావని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ ఎంతో కృషిచేస్తున్నారన్నారు. పాదయాత్రలో ప్రకటించిన హామీల్లో 99 శాతాన్ని నెరవేర్చారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం తథ్యమన్నారు. తెలంగాణ ఎన్నికల ప్రభావం ఏపీపై ఏమాత్రం ఉండదన్నారు. గాంధీభవన్‌పై టీడీపీ జెండాలు ఎగురవేయడం చూసి కాంగ్రెస్ వాళ్లు అవాక్కయ్యారని చెప్పారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు స్థలాల మంజూరు విషయంలో జీవో సడలింపు గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు.

ఐదు వైద్య కళాశాలల్లో అన్ని పోస్టులు భర్తీ చేయండి

అధికారులకు వైద్య శాఖ మంత్రి విడదల రజిని ఆదేశం



సాక్షి, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్న ఐదు వైద్య కళాశాలల్లో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆదేశించారు. మంగళగిరిలోని వైద్యశాఖ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఐదు వైద్య కళాశాలల్లో పోస్టుల భర్తీపై మంత్రి సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ బోధనా సిబ్బందిని కాంట్రాక్టు విధానంలో నియమించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కాంట్రాక్టు విధానంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లకు వేతనాలు ఇవ్వడం, అదేవిధంగా శాశ్వత బోధనా సిబ్బందికి ప్రోత్సాహకాలు అందించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. సీఎం వైఎస్ జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా 17 కొత్త వైద్య కళాశాలలను నెలకొల్పడం ద్వారా రాష్ట్రంలో వైద్య విద్యను మరింత బలోపేతం చేస్తున్నారని చెప్పారు. ఐదు కళాశాలలను ప్రారంభించామని, ఎన్‌ఎంసీ నిబంధనలకు అనుగుణంగా వైద్యులు, వైద్య విద్యార్థుల హాజరు ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. వైజాగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యశాఖలో ఇప్పటి వరకు 53వేలకు పైగా పోస్టులు భర్తీ చేసినట్టు గుర్తుచేశారు. వైద్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, కార్యదర్శి డాక్టర్ మంజుల, సెకండరీ హెల్త్ డైరెక్టర్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈవో డాక్టర్ వెంకటేశ్వర్, డీఎంఈ డాక్టర్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

ఒక్క తప్పూ చేయని నన్ను లోపలేశారు

- అలా మిమ్మల్ని భయపెట్టొచ్చు అనుకున్నారు
- విర్రవీగితే ఏం అవుతుందో తెలంగాణలో చూశాం
- రేపు ఇక్కడ కూడా అదే పరిస్థితి వస్తుంది
- సీఎంలో కదలిక లేనందున నేను పర్యటిస్తున్నా
- గుంటూరు జిల్లా పర్యటనలో చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/తెనాలి/తాడేపల్లి రూరల్ : 'నలభై అయిదేళ్లుగా టెక్నికల్‌గా, లీగల్‌గా ఒక్క తప్పూ చేయని నన్నే ఉన్నఫళంగా లోపల వేశారంటే మీరు అర్థంచేసుకోవాలి.. చేయని తప్పుకు ఎంత క్షోభకు గురయ్యానో తెలుసు కదా! మీతోపాటు ప్రపంచమంతా ఆవేదన పడింది. నన్నే లోపల వేస్తే మిమ్మల్ని అందరినీ భయపెట్టొచ్చు అని అలా చేశారు'.. అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా మంగళగిరి, తెనాలి, వేమూరు, బాపట్ల నియోజకవర్గాలలో శుక్రవారం ఆయన పర్యటించారు. బాబు మాట్లాడుతూ.. తుపాను బాధిత రైతులను పరామర్శించేందుకు ప్రతిపక్ష పార్టీ ముందుకొస్తే రాజకీయం చేస్తున్నారని అంటారని.. సీఎంలో కదలిక లేనందున, తాను పర్యటన చేపట్టానని అన్నారు. సీఎం చుట్టపు చూపుగా తిరుపతి వెళ్లారని.. 'తుపాను తిరిగేది ఈ పక్క అయితే ఆయన తిరిగేది ఇంకో పక్క'.. అంటూ వ్యాఖ్యానించారు. 'విర్రవీగితే ఏమవుతుందో తెలంగాణలో చూశాం'.. రేపు ఇక్కడి ప్రభుత్వానిదీ అదే పరిస్థితని చంద్రబాబు అన్నారు. తప్పు జరిగితే మాట్లాడాలి, విమర్శించాలి.. నిలదీయాలా లేదా? అంటూ ఆయన ప్రజలను ప్రశ్నించారు.

పంట చేతికొచ్చే సమయంలో నీటిపాలు..

ఇక ప్రస్తుత తుపానుకు రైతులు పూర్తిగా నష్టపోయారని, కౌలు రైతులను చూస్తే గుండె తరుక్కుపోతోందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు చేతికొచ్చే సమయానికి నీటి పాలయ్యాయన్నారు. ఎక్కువగా కౌలు రైతులే నష్టపోయారని చెబుతూ, ఎకరాకు రూ.20 వేల కౌలు, పెట్టుబడి రూ.పాతిక ముప్పై వేలు ఖర్చయిందన్నారు. మరో 15 రోజులుంటే చేతికొచ్చేదని, ఇప్పుడు తీవ్రనష్టం జరిగిందన్నారు. గతంలో తుపాను ఎప్పుడు వస్తుంది? ఎంత వేగంతో ఎంత వర్షపాతం కురుస్తుందన్న వివరాలతో మెసేజ్‌లు పంపే వాళ్లమని ఆయన గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం ఏమీ చేయలేదన్నారు. ఇక ఖరీఫ్‌కు జులై 15కు, రబీకి డిసెంబరు 15కల్లా చేసే బీమా ఇంతవరకూ చేయలేదని చంద్రబాబు ఆరోపించారు. పోర్టల్‌లో చూస్తే కేవలం 16 మంది రైతులకే ఫసల్‌బీమా ఉందన్నారు.

పరిహారం ఇచ్చే బాధ్యత నాదే..

అందరం కలిసి న్యాయం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి చేద్దామని చంద్రబాబు రైతులకు పిలుపునిచ్చారు. 2014లో ఎకరాకు రూ.10 వేల ఇన్‌పుట్ సబ్సిడీ ఉంటే, తాము రూ.20 వేలకు పెంచామని, ఇప్పటి ప్రభుత్వం రూ.40వేలు లేదా రూ.30 వేలైనా ఇవ్వాలా? లేదా? అంటూ ఐదేళ్లలో ఈ ప్రభుత్వం రైతులకు ఏమైనా ఇచ్చిందా? అని ప్రశ్నించారు. మీరింకా మాట్లాడకుండా ఉంటే కుదరదని.. 'మీ మనసులో నేనున్నానని.. బయటకు రావటానికి జంకు'.. అంటూ ఆయన చెప్పారు. అన్యాయంపై కలిసి పోరాడదామని.. అలాచేస్తే మూడునెలల తర్వాత పరిహారం ఇచ్చే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. అనంతరం.. బాపట్ల నియోజకవర్గంలోని అమర్తలూరు, కర్లపాలెం మీదుగా రాత్రి 10.30 గంటలకు బాపట్ల చేరుకున్నారు. చంద్రబాబు పర్యటన రైతులను పరామర్శించినట్లు కాకుండా పర్యటన చీకట్లో రోడ్‌షోలా సాగింది.

రైతుల ముసుగులో టీడీపీ శ్రేణులు..



చంద్రబాబుతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

ప్రభుత్వం అందించే నష్టపరిహారం అందడం లేదంటూ దుష్ప్రచారం చేసేందుకు రైతుల ముసుగులో టీడీపీ నేతలు, కార్యకర్తలు ప్రయత్నించారు. దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో పసుపు తువ్వాళ్లు కట్టుకుని, ఉరితాళ్లు వేసుకుని చంద్రబాబు ఎదుట నిరసన తెలిపారు. ఈ నిరసనలో గతంలో టీడీపీ తరఫున సర్పంచ్‌గా, ఎంపీటీసీగా గెలిచిన వాసిరెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ రేవేంద్రపాడు అధ్యక్షుడిగా పనిచేసిన ఇద్దిగాని శంకరరావు, టీడీపీ గ్రామ ప్రెసిడెంట్ ఇంటూరి శ్రీనివాసరావు, నాయకుడు కాసరనేని శ్రీను (కేబుల్ శ్రీను), కార్యకర్తలు నాగుర్ బాషా, సాంబయ్య ఉన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలతోపాటు ఎరువులు, ఇన్‌పుట్ సబ్సిడీ, విపత్తులు జరిగిన సమయంలో నష్టపరిహారం ఇస్తున్నప్పటికీ అవి అందడం లేదంటూ వారు చంద్రబాబుకు చెప్పారు. వ్యవసాయ శాఖాధికారులు ఓ వైపు పంటనష్టాన్ని అంచనా వేస్తుంటే ఒక్క అధికారి కూడా పొలాల వైపు చూడలేదంటూ తెలిపారు.

బాబు కోర్టు ధిక్కారం

బెయిల్ షరతులు ఉల్లంఘించి మరీ ఉపన్యాసం

- తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనలో తన కేసు గురించి ప్రస్తావన
- స్కిల్ స్కాం గురించి మాట్లాడకూడదని చెప్పిన హైకోర్టు, సుప్రీంకోర్టు
- కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా ప్రసంగం
- తప్పు చేయకుండా తనను జైల్లో పెట్టారంటూ వ్యాఖ్యలు
- బెయిల్ షరతులు చంద్రబాబు ఉల్లంఘించినందున బెయిల్ రద్దును కోరవచ్చంటున్న న్యాయ నిపుణులు

సాక్షి, అమరావతి : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి బెయిల్‌పై బయట ఉన్న చంద్రబాబు బెయిల్ షరతులను యథేచ్ఛగా ఉల్లంఘించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనకు వెళ్లి అక్కడ తన అరెస్టు, జైలు గురించి ప్రసంగించి కోర్టు ఆదేశాలను ధిక్కరించారు. హైకోర్టు, సుప్రీం కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా తన అరెస్టు గురించి మాట్లాడి కోర్టులంటే తనకు లెక్కలేదన్నట్లుగా వ్యవహరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్న చంద్రబాబుకు అక్టోబర్ 31న హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసు గురించి ఎక్కడా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ మాట్లాడకూడదని హైకోర్టు బెయిల్ ఆర్డర్‌లో స్పష్టంగా పేర్కొంది. కేసులోని విషయాల గురించి బయట ఎక్కడా చర్చించవద్దని స్పష్టంచేసింది. అలాగే, హైకోర్టు ఆదేశాలను చంద్రబాబు తప్పకుండా పాటించాలని, స్కిల్ డెవలప్‌మెంట్ కేసు గురించి ఎక్కడా మాట్లాడకూడదని సుప్రీంకోర్టు కూడా ఆదేశించింది. అయితే, చంద్రబాబు మాత్రం వీటిని బహిరంగంగా ఉల్లంఘించారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర మండలం అత్తోటలో శుక్రవారం తుపాను బాధితులను పరామర్శించి అక్కడ రాజకీయ ప్రసంగం చేశారు. తుపాను దెబ్బకు అన్ని విధాలుగా నష్టపోయి రైతులు ఆందోళనలో ఉంటే చంద్రబాబు మాత్రం అక్కడకు వెళ్లి తనను అన్యాయంగా అరెస్టు చేశారని, ఏ తప్పు చేయకుండా జైల్లో పెట్టారంటూ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసు గురించి మాట్లాడారు. ఇలా బెయిల్ షరతులను చంద్రబాబు బేఖాతరు చేసిన నేపథ్యంలో ఆయన బెయిల్‌ను రద్దుచేయాలని కోరవచ్చని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

45 ఏళ్లుగా టెక్నికల్‌గా, లీగల్‌గా తప్పుచేయలేదు..

తనలాంటి వాళ్లను కూడా జైల్లో పెట్టేయగలుగుతున్నారని, బాధ కలగదా అంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారు. 45 ఏళ్లుగా తానెక్కడా ఒక్క తప్పు కూడా చేయలేదని, టెక్నికల్‌గా, లీగల్‌గా ఒక్క తప్పూ చేయకుండా ఉన్నానని, అలాంటి తనను జైల్లో పెట్టారని చెప్పారు. ఎలాంటి తప్పు కూడా చేయకుండా ఉన్న పళంగా కేసు బుక్‌చేసి లోపలేశాడని సీఎంను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తాను కూడా మనిషినేనని, తనకూ బాధలు ఉంటాయని, తనకూ మనసు ఉంటుందని, చేయని తప్పుకి శిక్ష అనుభవిస్తే ఎలా ఉంటుందంటూ ప్రజల సానుభూతి కోసం ఆయన ప్రయత్నించారు. తన కోసం 52 రోజులుగా అందరూ వీరోచితంగా పోరాడారని, తనను అరెస్టుచేస్తే అందరినీ బెదిరించవచ్చనే ఉద్దేశంతో సీఎం ఇలా చేసినట్లు చంద్రబాబు పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

న్యాయకోవిదుల విస్మయం..

బెయిల్ షరతులను ఉల్లంఘించి తాను అరెస్టయిన కేసు గురించి చంద్రబాబు మాట్లాడడంపై న్యాయకోవిదులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. బెయిల్ పొందినప్పుడు కోర్టు ఆదేశాల ప్రకారం నడుచుకుంటానని చెప్పి బయటకు వచ్చాక ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనలో అందుకు సంబంధించిన విషయాల గురించి కాకుండా తాను జైలుపాలవడం, కేసుల గురించి మాట్లాడడం ఏమిటనే ప్రశ్నలు సాధారణ ప్రజానీకం నుంచి వినిపిస్తున్నాయి. ఇక అనారోగ్య కారణాలతో మధ్యంతర బెయిల్‌పై బయటకు వచ్చినప్పుడు కూడా రాజమహేంద్రవరం నుంచి విజయవాడకు గంటల తరబడి ర్యాలీ చేసుకుంటూ వచ్చి ఆయన కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు. తనకు ఆరోగ్యం బాగోలేదని బెయిల్ తీసుకుని భారీఎత్తున ర్యాలీలు చేయడంపై అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే, విజయవాడ ఏసీబీ కోర్టు ఈ కేసులోనే ఆయనకు రిమాండ్ విధించినప్పుడు సైతం న్యాయమూర్తిని లక్ష్యంగా చేసుకుని టీడీపీ నాయకులు, కార్యకర్తలు విపరీతంగా కామెంట్లు చేశారు. సోషల్ మీడియాలో న్యాయమూర్తిని అసభ్యపదజాలంతో దూషిస్తూ పోస్టులు పెట్టారు. చంద్రబాబు జైల్లో ఉన్నన్ని రోజులు ఆయన కుమారుడు లోకేశ్, ఇతర నాయకులు కోర్టులను మేనేజ్ చేశారంటూ న్యాయ వ్యవస్థను కించపరిచేలా మాట్లాడారు. చివరికి అదే న్యాయ వ్యవస్థ నుంచి చంద్రబాబు బెయిల్ పొంది బయటకొచ్చారు. ఇప్పుడు ఆ కోర్టు ఆదేశాలనే ధిక్కరిస్తూ స్కిల్ కుంభకోణం గురించి రాజకీయ ఉపన్యాసం చేయడం గమనార్హం.

తెలంగాణ

జారిపడ్డ కేసీఆర్.. విరిగిన తుంటి ఎముక

- బాత్రూంలోకి వెళ్లే క్రమంలో లుంగీ కాళ్లకు తగలడంతో పడిపోయిన మాజీ సీఎం
- ఎర్రవల్లి ఫాంహౌస్ నుంచి సోమాజిగూడ యశోదకు హుటాహుటిన తరలింపు
- విజయవంతంగా హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ నిర్వహించిన వైద్యులు
- కోలుకొనేందుకు 6 నుంచి 8 వారాలు పడుతుందని హెల్త్ బులెటిన్‌లో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గురువారం అర్ధరాత్రి ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్‌లో కాలుజారి కిందపడిపోయారు. బాత్రూంలోకి వెళ్లే క్రమంలో లుంగీ కాళ్లకు తగిలి పడిపోవడంతో ఆయన ఎడమ తుంటికి తీవ్ర గాయమైంది. ఆయన సతీమణి శోభారాణి కేకలు వేయడంతో అక్కడే ఉన్న ఎంపీ సంతోష్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ హుటాహుటిన వాహనంలో కేసీఆర్‌ను హైదరాబాద్ సోమాజిగూడలోని యశోదా ఆస్పత్రికి తరలించారు. కేసీఆర్‌కు పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆయన ఎడమకాలి తుంటి ఎముక విరిగినట్లు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం ఆయనకు విజయవంతంగా హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ నిర్వహించారు. ఈ మేరకు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై యశోద ఆసుపత్రి హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని... కోలుకునేందుకు 6 నుంచి 8 వారాల సమయం పడుతుందని వెల్లడించింది. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని ఆస్పత్రిలోని వివిధ విభాగాల వైద్యులు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది.

వైద్యులతో చర్చించిన కుటుంబ సభ్యులు...

తమ తండ్రి ప్రమాదం బారిన పడటంతో కుమార్తె కవిత, కుమారుడు కేటీఆర్, మేనల్లుడు హరీశ్‌రావు, మనవడు హిమాన్షు, ఇతర కుటుంబ సభ్యులు హుటాహుటిన యశోదా ఆస్పత్రికి వెళ్లారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడానికి బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం ఉదయం నుంచే యశోదా ఆస్పత్రికి పోటెత్తారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ మాజీ స్పీకర్ పోచారంతోపాటు పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆస్పత్రిలో కేసీఆర్‌ను పరామర్శించారు. అయితే ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉన్నందున కార్యకర్తలు ఎవరూ ఆస్పత్రికి రావొద్దని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ ఆరోగ్యం కోసం అందరూ ఇంటి వద్దే ప్రార్థించాలని కోరారు.

మెరుగైన చికిత్స అందించాలని సీఎం రేవంత్ ఆదేశం

కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఆయనకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ యశోదా ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ ఆరోగ్యంపై తనకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని రేవంత్ ఆదేశించారు. అంతకుముందు గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ క్లియరెన్స్‌తో కేసీఆర్‌ను పోలీసులు ఆసుపత్రికి తరలించారు.

కేసీఆర్ త్వరగా కోలుకోవాలి: ప్రధాని మోదీ

కేసీఆర్ ఆరోగ్యంపై ప్రధాని మోదీ స్పందించారు. కేసీఆర్ గాయపడ్డారని తెలియగానే బాధపడ్డట్లు 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని, ఆరోగ్యంతో ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

డాక్టర్



ఎవరికీ చెప్పుకోలేని వేదన, భావోద్వేగాల ఒత్తిడి శరీరం మీద పడుతుంది. చాలావరకు ఆరోగ్య సమస్యలు మందులతో నయం కావచ్చు. కానీ, కొన్నింటికీ ఎంతకీ పరిష్కారం దొరకకపోతే, అందుకు మూల కారణమేంటో తెలుసుకోవడానికి తగిన శోధన అవసరం. వర్టిగో (కళ్లు తిరగడం) సమస్యకు మూల కారణమేంటో తెలుసుకుంటూ చికిత్స చేస్తూ గుర్తింపు తెచ్చుకున్న హైదరాబాద్ వాసి న్యూరాలజిస్ట్ డాక్టర్ లాస్య సాయి సింధుకు కేంద్రప్రభుత్వం ఇటీవల 'నేషనల్ అచీవర్స్ అవార్డ్ ఫర్ హెల్త్ ఎక్సలెన్స్' అవార్డును ఇచ్చి సత్కరించింది. ఈ సందర్భంగా లాస్య సాయి సింధును సాక్షి పలకరించింది.

సమస్యను గుర్తించడమే అసలైన మందు

నలభైఏళ్లకు పైబడిన ఒక మహిళ... 'మంచం మీద పడుకుంటే కళ్లు తిరుగుతున్నాయి' అనే సమస్యతో వచ్చింది. రెండేళ్లుగా ఈ సమస్యతో బాధపడుతూ మంచం మీద కాకుండా కుర్చీలో కూర్చుని నిద్రపోవడం అలవాటు చేసుకుంది. పూర్తి చికిత్స తర్వాత ఇప్పుడు మామూలుగా మంచం మీద నిద్రపోగలుగుతోంది. 90 శాతం మహిళలు భావోద్వేగాల ఒత్తిడిని ఎదుర్కొంటూ ఉంటారు.

* * *

పదిహేనేళ్ల అబ్బాయి స్కూల్లో బెంచి మీద కూర్చున్న కాసేపటికి కళ్లు తిరిగే సమస్యతో బాధపడుతూ సరిగా చదవలేకపోతున్నాడు. చికిత్సలో అతనికి చదువుకు సంబంధించిన సమస్యనే కాదు, ఇంట్లో కుటుంబ సభ్యుల మధ్య ఉండే విభేదాలు కూడా కారణమని తెలిసింది.

* * *

పనిలో చురుకుగా ఉండే యాభైఏళ్ల వ్యక్తి రెండు నెలలుగా కళ్లు తిరుగుతున్నాయన్న సమస్యను ఎదుర్కొంటూ పరిష్కారం కోసం వచ్చారు. కరోనా తర్వాత వైరల్ అటాక్ అతని మెదడు పనితీరులో సమస్యకు కారణం అయ్యిందని తేలింది.

ఇలాంటివెన్నో ప్రతిరోజూ చూస్తుంటాం. నేను ఈఎన్‌టీ సర్జన్‌ని. వెర్టిగో అండ్ బ్యాలెన్స్ డిజార్డర్‌లో పరిశోధన చేశాను. ఈఎన్‌టీలోనే మరింత ఉన్నతమైన విద్యార్హత ఈ న్యూరాటాలజిస్ట్. 200 మంది వర్టిగో పేషెంట్స్‌పై పరిశోధన చేసినప్పుడు నాకు ఈ విభాగంలో ఆసక్తి పెరిగింది. నాలుగేళ్లుగా న్యూరాటాలజిస్ట్‌గా వైద్య రంగంలో సేవలందిస్తున్నాను. చేస్తున్న కృషికి గుర్తింపుతోపాటు గతంలోనూ రెండు జాతీయస్థాయి అవార్డులు అందుకున్నాను.

వచ్చిన రివ్యూస్...

ఈ సమస్యలో ప్రధానంగా మానసిక ఒత్తిడి ఎక్కువ ఉంటుంది. అందుకని, 5–10 నిమిషాల్లో పేషెంట్ పూర్తి సమస్య అర్థం కాదు. ఈ గంట సమయంలో చేసిన చికిత్సకు రోగిలో సరైన మార్పులు రావడం, వారు ఇచ్చే రివ్యూస్.. మంచి గుర్తింపును తీసుకు వచ్చాయి.

అన్ని వర్గాల్లోనూ...

ఇటీవల చూస్తున్న కేసుల్లో మగవారిలోనూ సమస్య ఎక్కువ గమనిస్తున్నాం. నిజానికి ఆడవాళ్లలోనే స్ట్రెస్ ఎక్కువ ఉంటుంది అనుకుంటాం. కానీ, మగవారు తమ సమస్యలను బయటకు చెప్పుకోరు. భావోద్వేగాలను బయటకు వెలిబుచ్చరు. ఈ సమస్య వర్టిగోకు దారితీస్తుంది. మరో ఆందోళనకర సమస్య ఏంటంటే.. టీనేజ్ పిల్లల్లో వర్టిగో కనిపిస్తోంది. మానసికంగా వారు ఎక్కువ ఒత్తిడికి లోనవుతున్నారు. వీరిలో చదువుకు సంబంధించినవి, కుటుంబ సమస్యలు... కూడా మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి.

ఫ్యామిలీ కౌన్సెలింగ్

ముందు పేషెంట్‌కు సంబంధించిన అన్నిరకాల టెస్ట్ రిపోర్ట్స్ పరిశీలించి చూస్తాం, వారు చెప్పిన ఆరోగ్య సమస్యమీద వర్క్ చేస్తాం. ఆ తర్వాత ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇస్తాం. వైరల్ ఇన్ఫెక్షన్స్ వల్ల కూడా వర్టిగో సమస్యలు పెరిగాయి కాబట్టి ఫిజికల్ హెల్త్ ఆ తర్వాత ఎమోషనల్ హెల్త్ కూడా చూస్తున్నాం. కుటుంబం కూడా ఈ సమస్య పట్ల అవగాహన పెంచుకొని, పేషెంట్‌కు సపోర్ట్‌గా ఉండాలి.

ఆన్‌లైన్ అవగాహన

కాన్ఫరెన్స్, సోషల్‌మీడియా ద్వారా కూడా అవేర్‌నెస్ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాను. విదేశాల నుంచి కూడా ఆన్‌లైన్ కన్సల్టేషన్ తీసుకునేవారున్నారు. ముఖ్యంగా విదేశాలలో ఎమ్మెస్ చేసేవాళ్లు ఉంటున్నారు. జీవితంలో ఎవరికి తగ్గ సమస్య వారికి ఉంటుంది. దానినుంచి బయటకు రావడమే ముఖ్యం. అందుకోసం చేసే ప్రయత్నం ప్రతిరోజూ ఉంటుంది. డాక్టర్‌గా రోజు చివరలో నా నుంచి చికిత్స తీసుకున్నవాళ్లు 'మా సమస్యకు సరైన పరిష్కారం దొరికింది' అనుకుంటే చాలు. అదే పెద్ద అవార్డ్'' అంటారు ఈ డాక్టర్.

– నిర్మలారెడ్డి

కోవిడ్ తర్వాత...



'కళ్లు తిరుగుతున్నాయి..' అనే సమస్యతో వచ్చే వారి సంఖ్య కోవిడ్ తర్వాత బాగా పెరిగింది. గతంలో ఒత్తిడి, భావోద్వేగాలలో మార్పు కారణం అనుకునేవాళ్లం. ఆ తర్వాత వైరల్ ఇన్ఫెక్షన్ కూడా కారణం అని తెలిసింది. వర్టిగో సమస్యకు టాబ్లెట్స్ ఇస్తారు డాక్టర్లు. టాబ్లెట్లు వాడినప్పుడు బాగానే ఉంటుది. ఆ తర్వాత మళ్లీ మామూలే! దీనికి టాబ్లెట్స్‌తోపాటు కౌన్సెలింగ్, కొన్ని ఎక్సర్‌సైజ్‌లు కూడా అవసరం అని గమనించాను. ఒక పేషెంట్‌కి ఇచ్చే చికిత్స 40 నుంచి 50 నిమిషాల సమయం పడుతుంది. వారంలో మూడుసార్లు ఈ సెషన్స్ తీసుకోవాల్సి ఉంటుంది.

– డాక్టర్ లాస్య సాయి సింధు

వంట- విముక్తి

పదికి నలుగురు



పది కుటుంబాలకు నలుగురు వండి పెడతారు. రోజూ బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ వండీ వండీ వండీ అలసిపోయేవారూ ఉద్యోగాల వల్ల టైమ్ లేని వారు డబ్బు ఆదా చేయాలనుకుంటున్నవారు ఇదేదో బాగుందే అనుకుంటున్నవారు కేరళలో కమ్యూనిటీ కిచెన్స్‌ను ప్రోత్సహిస్తున్నారు. అంటే పది కుటుంబాలు కలిసి ఓ నలుగురు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఆ మహిళలు ఆ పది కుటుంబాలకు వంట చేసి పంపిస్తున్నారు. ఇది రోజు రోజుకూ పెరుగుతున్న ట్రెండ్.

'ప్లాన్ చేస్తే పోయేదేమీ లేదు వంట చేసే బాధ తప్ప' అంటున్నారు కేరళ వాసులు. 'వంట గది వద్దు. వంట మీద ఆదాయం ముద్దు' అనే నినాదం కూడా ఇస్తున్నారు. ఇదంతా గత ఒకటి రెండేళ్లలో జరిగిన మార్పు. కేరళలోని 'పొన్నాని' అనే టౌన్‌లో ఇద్దరు స్నేహితుల కుటుంబాలకు వచ్చిన ఆలోచన 'సహకరణ కిచెన్' (కమ్యూనిటీ కిచెన్) ఉద్యమానికి కారణం అయ్యింది.

వంట చేసి పెడతారా?

పొన్నానిలో రమేష్ వలియిల్ అనే బ్యాంక్ ఎంప్లాయే రోజూ వంట కోసం భార్య పడే బాధలు చూసేవాడు. ఉదయాన్నే ఆమె బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు లంచ్ వండి బాక్స్ కట్టివ్వాల్సి వచ్చేది. కొన్నాళ్లకు ఆమె జబ్బు పడింది. డాక్టర్లు వంట చేయవద్దన్నారు. ఏం చేయాలో రమేష్‌కు పాలుపోలేదు. మరోవైపు అదే ఊళ్లో ఉన్న కలీముద్దీన్, అతని భార్య మాజిద అడ్వకేట్లు. ఉదయాన్నే ఇంటికొచ్చే క్లయింట్లను చూసుకోవాలా వంట గొడవలో ఉండాలా అనేది సమస్య అయ్యింది. ఈ కుటుంబాలు రెండూ ఫ్యామిలీ ఫ్రెండ్స్ కనుక తమకెవరైనా వండిపెట్టే వాళ్లుంటే బాగుండు అనుకున్నారు. అది కూడా ఇంటికొచ్చి కాదు. ఎక్కడైనా వండి పెట్టి అందించే వారు కావాలి. అందుకని వారే ఇద్దరు స్త్రీలను వెతికారు. వారికోసమని ఒక ఖాళీ స్థలం వెతికి షెడ్ వేశారు. తమ కుటుంబాలతో పాటు మరో ఎనిమిది కుటుంబాలను కలిపారు. మొత్తం పది కుటుంబాల కోసం అలా కమ్యూనిటీ కిచెన్ మొదలయ్యింది. వంట బాధ నుంచి పెద్ద ఉపశమనం లభించింది.



మొదటి రోజే మెను

రోజూ ఉదయాన్నే 8 గంటలకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్ తయారయ్యి ఈ పది కుటుంబాల గడపలకు చేరేవి. వంట చేసే మనుషులకు ఇలా చేరవేసే మనుషులు తోడయ్యారు. వంట ఖర్చు అన్ని కుటుంబాలు సమానంగా పంచుకున్నా నెలకు వంట చేసి పెట్టేవారికి మంచి గిట్టుబాటుగానే ఉంది. కాకుంటే వీళ్లు ఉదయాన్నే నాలుగ్గంటలకంతా లేచి వంట మొదలుపెట్టాలి. మెనూ వాట్సాప్ గ్రూప్‌లో మొదటిరోజు పోస్ట్ అవుతుంది. బ్రేక్‌ఫాస్ట్‌లో ఇడ్లీ, పూరి, పుట్టు, అపమ్, ఉప్మా లాంటివి ఉంటాయి. భోజనంలో నాలుగు రకాల కూరలు చికెన్, ఫిష్ ఉంటాయి. ఈ కుటుంబాల వాళ్లు ఫోన్లు చేసి వాట్సప్ కాల్స్ చేసి వంటను అజమాయిషీ చేస్తారు. మసాలాలు ఏవి వేయాలో చెప్తారు. అంతా ఆరోగ్యకరమైన తిండి లభించేలా చూస్తారు.

లాభాలు ఎన్నో

వంట తప్పితే మొదట చాలా టైము అందరి దగ్గరా మిగులుతోంది. 'ఇంతకుముందు పిల్లలు స్పెషల్‌గా ఏదైనా చేసిపెట్టమంటే రోజువారి వంటతో ఓపిక లేక చేసేదాన్ని కాదు. ఇప్పుడు చేసి పెడుతున్నాను' అని ఒక తల్లి చెప్పింది. 'పది ఇళ్ల వంట వల్ల అయ్యే ఇంధనం, వచ్చే చెత్త కంటే కమ్యూనిటీ కిచెన్ వల్ల అయ్యే ఇంధనం, మిగిలే చెత్త తక్కువ. డబ్బు ఆదా అవుతుంది కూడా' అంది మరో గృహిణి. అదీగాక దీనివల్ల మరో నలుగురికి పని దొరకడం మంచి విషయంగానే చూస్తున్నారు.

ఊరూరా వ్యాపించాయి

మలబార్ జిల్లాలోని పొన్నాని నుంచి మొదలైన ఈ ట్రెండ్ ఆ వెంటనే పక్క జిల్లా అయిన కోళికోడ్‌కు వ్యాపించింది. ప్రస్తుతం మలప్పురం, బలుస్సేరి, కన్నూర్, చెవరంబలమ్... ఇలా ఒక్కో ఊరిలో కమ్యూనిటీ కిచెన్‌లు వెలుస్తున్నాయి. సూత్రం ఒకటే– నలుగురు కలిసి కిచెన్ నడుపుతారు. కేవలం పది లేదా 11 కుటుంబాలకు వండుతారు. ఈ సంఖ్య వల్ల పెద్ద పెద్ద వంటపాత్రలు, భారీ పొయ్యి, ఎక్కువ శ్రమ, సిబ్బంది అవసరం తప్పుతోంది. ఇద్దరు ముగ్గురు గృహిణులు కలిసి తమ ఇళ్లలోనే వండి బాక్సులు పంపిస్తున్నారు. ఇవి సక్సెస్ అవుతున్నాయి కూడా!

మహిళలే... వండాలా?

ఈ కిచెన్‌ల మీద ఒకటి రెండు విమర్శలు ఉన్నాయి. అవేమిటంటే 'కమ్యూనిటీ కిచెన్స్‌లో కూడా ఆడవాళ్లే వండాలా' అని ప్రగతివాదులు అంటుంటే 'ఇంట్లో వంట మానేసి ఈ వేషాలా' అని మగ దురహంకారులు అంటున్నారు. విమర్శలు ఎలా ఉన్నా ఏదో ఒకరోజు ఇళ్లలో వంట చేయడం కంటే ఇలాంటి కిచెన్‌ల మీద అందరూ ఆధారపడే రోజు తప్పక వస్తుంది. మంచిదే.

బ్యూటిప్స్



పండులాంటి నిగారింపు



- పుచ్చకాయ రసాన్ని ముఖానికి రాసుకుని ఇరవై నిమిషాల తరువాత కడిగేయాలి. ఇది చర్మానికి టోనర్‌గా పనిచేసి, పొడిబారడాన్ని తగ్గిస్తుంది.
- అరటి, యాపిల్, బొప్పాయి, నారింజ పళ్ల గుజ్జును సమపాళ్లల్లో తీసుకుని పేస్టు చేయాలి. ఈపేస్టుని ముఖానికి పూతలా వేయాలి. అర గంట తరవాత కడిగేయాలి. ఈ ప్యాక్ ముఖం మీద పేరుకుపోయిన మృతకణాలు, ట్యాన్‌ను తొలగించి కాంతిమంతంగా మారుస్తుంది.

మహిళా శక్తి

క్వీన్ ఆఫ్ స్టీల్

పెద్ద బాధ్యతను స్వీకరించినప్పుడు గర్వించదగిన క్షణాలు మాత్రమే ఉండవు.

పెద్ద పెద్ద సవాళ్లు కాచుకొని కూర్చుంటాయి. భయపెడతాయి.

ఆ సవాళ్లకు భయపడితే అపజయం మాత్రమే మిగులుతుంది.

వాటిని ఎదుర్కొనే ధైర్యం ఉంటే విజయం సొంతం అవుతుంది.

ఇంజినీరింగ్ చదివే రోజుల నుంచి ఉక్కు పరిశ్రమలోకి అడుగు పెట్టే వరకు, ఉద్యోగ ప్రస్థానంలో రకరకాల సవాళ్లను ఎదుర్కొంది సోమా మండల్. వాటిని అధిగమించి అపురూపమైన విజయాలను సొంతం చేసుకుంది.

తాజాగా...

ఫోర్బ్స్ 'వరల్డ్స్ మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్-2023' జాబితాలో చోటు సంపాదించింది.

భువనేశ్వర్‌లోని ఓ బెంగాలీ మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది సోమా మండల్. తండ్రి అగ్రికల్చర్ ఎకానమిస్ట్. అప్పట్లో చాలామంది తల్లిదండ్రుల ధోరణి 'ఆడపిల్లలను ఒక స్థాయి వరకు చదివిస్తే చాలు. పెద్ద చదువు అక్కర్లేదు' అన్నట్లుగా ఉండేది. సోమా తండ్రిలో మాత్రం అలాంటి భావన లేదు.

'మా అమ్మాయిని పెద్ద చదువులు చదివిస్తాను' అనేవాడు.

అలాంటి వ్యక్తి కాస్తా సోమా ఇంజనీరింగ్ చేయాలనుకున్నప్పుడు 'కుదరదు' అని గట్టిగా చెప్పాడు. ఎందుకంటే ఆరోజుల్లో అమ్మాయిలు ఇంజనీరింగ్ చదవడం అరుదు. తల్లి సహాయంతో నాన్న మనసు మారేలా చేసింది. రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చేసింది.

ఇక కాలేజీ రోజుల విషయానికి వస్తే బ్యాచ్‌లో రెండు వందల మంది ఉంటే ఇద్దరు మాత్రమే అమ్మాయిలు. పాఠం వింటున్నప్పుడు ఏదైనా సందేహం అడగాలంటే అబ్బాయిలు నవ్వుతారేమోనని భయపడేది. అయితే ఒకానొక సమయంలో మాత్రం...

'అబ్బాయిలు, అమ్మాయిలు ఒకే చదువు చదువుతున్నప్పుడు భయపడటం ఎందుకు?' అని తనకు తానే ధైర్యం చెప్పుకుంది...

ఇక అప్పటి నుంచి ఎప్పుడూ ధైర్యం కోల్పోలేదు. ఆ ధైర్యమే తన భవిష్యత్ విజయాలకు పునాదిగా నిలిచింది.

సోమా మెటల్ ఇండస్ట్రీలో అడుగు పెట్టినప్పుడు మహిళా ఉద్యోగులు ఎక్కువగా లేరు. 'మెటల్ ఇండస్ట్రీ అంటే పురుషుల ప్రపంచం' అన్నట్లుగా ఉండేది. ఇక మహిళలు ఉన్నత స్థానాల్లోకి రావడం అనేది ఊహకు కూడా అందని విషయం. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ఎప్పుడూ భవిష్యత్‌పై ఆశను కోల్పోలేదు సోమా మండల్.

నాల్కో(నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్)లోకి గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెనీగా అడుగుపెట్టి ఒక్కో మెట్టు ఎక్కుతూ తొలి మహిళా డైరెక్టర్(కమర్షియల్) స్థాయికి చేరింది. 2017లో సెయిల్(స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా)లోకి వచ్చిన తరువాత ఫస్ట్ ఉమెన్ ఫంక్షనల్ డైరెక్టర్, ఫస్ట్ ఉమెన్ చైర్‌పర్సన్ ఆఫ్ సెయిల్‌గా ప్రత్యేక గుర్తింపు పొందింది.



● సోమా మండల్



● అధికారులతో...

సెయిల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన కాలంలో ఆ సంస్థ వేల కోట్ల అప్పులతో ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని మార్కెటింగ్ ఆర్గనైజేషన్ స్ట్రక్చర్‌లో మార్పులు తీసుకువచ్చింది. మైక్రో–మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించింది. సెయిల్ ప్రాడక్ట్స్‌ను ప్రమోట్ చేయడానికి మార్గాలు అన్వేషించింది. గ్రామీణ ప్రాంతాలలో వర్క్‌షాప్‌లు నిర్వహించింది. కొత్త వ్యాపార వ్యూహాలను అనుసరించింది.

సోమా కృషి వృథా పోలేదు.

అప్పులు తగ్గించుకుంటూ 'సెయిల్'ను లాభాల దిశగా నడిపించింది.

'నా కెరీర్‌లో జెండర్ అనేది ఎప్పుడూ అవరోధం కాలేదు. మహిళ అయినందుకు గర్వపడుతున్నాను. మన దేశంలో వివిధ రంగాలలో మహిళా నాయకుల సంఖ్య పెరుగుతోంది. లీడర్‌కు అసంతృప్తి ఉండకూడదు. ఆశాభావం ఉండాలి. పరిమిత వనరులు ఉన్నా సరే మంచి ఫలితం సాధించే సామర్థ్యం ఉండాలి' అంటుంది సోమా మండల్.

టైమ్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇచ్చే సోమా మండల్ అటు వృత్తి జీవితాన్ని, ఇటు వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లింది.

'సక్సెస్‌కు షార్ట్‌కట్ అనేది లేదు. అంకిత భావం, సమర్థత మాత్రమే మనల్ని విజయానికి దగ్గర చేస్తాయి' అంటుంది సోమా మండల్.



క్లీన్ హెల్ప్

మనకు దండిగా డబ్బులుంటే ఇతరులకు దానం గానీ, సాయం గానీ చేయగలుగుతాం కానీ మనకే లేనప్పుడు ఇతరులకు ఏం సాయం చేయగలుగుతాం అని నిష్ఠూరాలు పోతుంటాము. లోగనాథన్ మాత్రం అలాంటి వ్యక్తికాదు. తన దగ్గర డబ్బులు లేకపోయినా సాయం చేయాలనుకున్నాడు. ఇందుకు కావలసిన డబ్బు కోసం టాయిలెట్స్‌ను శుభ్రం చేయడానికి కూడా వెనకాడటం లేదు లోగనాథన్. అలా వచ్చిన కొద్దిమొత్తాన్ని కూడా నిరుపేద పిల్లల చదువుకోసం ఖర్చు పెడుతున్నాడు. ఈ విషయం తెలిసి ప్రధాని మోదీ సైతం మన్‌కీ బాత్‌లో లోగనాథన్‌ని ప్రశంసించారు.

కోయంబత్తూరులోని కన్నంపాళయంకు చెందిన 55 ఏళ్ల లోగనాథన్ తల్లిదండ్రులు రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలు. ఇంటి పరిస్థితులు అంతంత మాత్రంగా ఉండడంతో ఆరోతరగతితోనే చదువు ఆపేశాడు. తల్లిదండ్రులకు సాయం చేసేందుకు కొబ్బరి బోండాలు అమ్మేవాడు. అలా కొబ్బరిబోండాల దగ్గర ఉన్నప్పుడు లోగనాథన్‌కు.. చిరిగిపోయిన బట్టలు వేసుకుని, చదువుకునే స్థోమత లేక రోడ్ల మీద తిరుగుతున్న పిల్లలు కనిపించేవారు. వారిని చూసి జాలిపడేవాడు. ఇలా చూసి చూసి.. ''పేదరికంతో నాలా మరెవరూ చదువుని మధ్యలో ఆపేయకూడదు. నిరుపేద పిల్లలు చదువు కొనసాగేందుకు చేతనైన సాయం చేయాలి'' అని నిర్ణయించుకున్నాడు. పార్ట్‌టైమ్ పనులు చేస్తూ వచ్చిన డబ్బులను పేద పిల్లలకు ఖర్చుచేయడం మొదలుపెట్టాడు.



టాయిలెట్స్ కడుగుతూ...

కొన్నాళ్లకు లోగనాథన్ తండ్రి చనిపోవడంతో కుటుంబ భారం మొత్తం తనపై పడింది. దాంతో కొబ్బరి బోండాలు అమ్మడంతో పాటు పేపర్‌మిల్‌లో పనికి చేరాడు. అప్పుడు కూడా డబ్బులు సరిపోయేవి కావు. అయినా పేదపిల్లలకు సాయం చేయడం మానలేదు. తనకొచ్చే జీతంలో కొంతమొత్తాన్ని సాయంగా ఇస్తూనే ఉన్నాడు. డబ్బులు చాలనప్పుడు టాయిలెట్స్ క్లీన్ చేసి వచ్చిన డబ్బులను పేద పిల్లలకు ఇస్తున్నాడు. పాతికేళ్లుగా సాయంచేస్తూ పదిహేను వందల మందికిపైగా నిరుపేద పిల్లలకి ప్రాథమిక విద్యను అందించాడు.

సిగ్గుపడకుండా...

వృత్తిపరంగా వెల్డర్ అయిన లోగనాథన్‌కు.. తన ఎనిమిది గంటల డ్యూటీ అయిపోయిన తరువాత ఖాళీ సమయం దొరికేది. వెల్డింగ్ షాపు పక్కనే కొంతమంది శానిటరీ వర్కర్స్‌తో పరిచయం ఏర్పడింది. వాళ్లు టాయిలెట్స్ క్లీన్ చేసి సంపాదిస్తున్నారని తెలుసుకుని, తను కూడా గత పదిహేడేళ్లుగా టాయిలెట్స్ శుభ్రం చేస్తూ నెలకు రెండువేల రూపాయల పైన సంపాదిస్తూ అనాథ ఆశ్రమాలకు విరాళంగా ఇస్తున్నాడు. సంపన్న కుటుంబాల దగ్గర నుంచి పుస్తకాలు, బట్టలు సేకరించి అనాథపిల్లలకు ఇవ్వడం, ఏటా ప్రభుత్వం నిర్వహించే అనాథ ఆశ్రమాలకు పదివేల రూపాయల విరాళంగా ఇవ్వడం వంటి చేస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు లోగనాథన్.

"నాకు సాయం చేయాలని ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు చిన్నప్పటి నుంచి ప్రతికూలంగానే ఉన్నాయి. ఎలాగైనా సాయం చేయాలన్న ఉద్దేశ్యంతో నాకు తోచిన విధంగా చేస్తున్నాను. టాయిలెట్స్ కడగడం మొదలు పెట్టిన తరువాత కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు విముఖత వ్యక్తంచేశారు. చాలాసార్లు హేళనకు కూడా గురయ్యాను. అయినా నాకు ఏమాత్రం బాధలేదు. ఏదోఒక విధంగా పేద పిల్లలకు సాయపడుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. అన్నీ అనుకూలిస్తే చారిటబుల్ ట్రస్టు పెడతాను".

– లోగనాథన్

ఇంటిప్స్






- కొద్దిగా మెంతిపిండి, కొద్దిగా అన్నం వేసి నానిన బియ్యాన్ని గ్రైండ్ చేస్తే అప్పం మరింత మృదువుగా వస్తుంది.
- ఎంతో తియ్యగా ఉండే అరటిపండ్లపై ఫ్రూట్‌ఫ్లైస్ వాలుతూ చిరాకు పెడుతుంటాయి. అయితే మార్కెట్ నుంచి అరటిపండ్లు తెచ్చిన వెంటనే శుభ్రంగా కడిగి తుడిచి పెట్టుకుంటే ఫ్రూట్‌ఫ్లై ఒకటీ వాలదు.
- అరకప్పు వంటసోడాలో నీళ్లు పోసి పేస్టులా కలపాలి. ఈ పేస్టుని అవెన్‌లో లోపలి భాగంలో రాయాలి. హీటింగ్ కాయిల్స్, ఫ్యాన్ బ్లేడ్స్, లైట్స్ మీద రాయకూడదు. కింద, సైడు గోడలకు రాసి రాత్రంతా ఉంచేయాలి. ఉదయాన్నే కాటన్ వస్త్రంతో వంటసోడాని తుడిచేయాలి. సోడా పూర్తిగా పోయిన తరువాత నీటిలో కలిపిన వెనిగర్‌తో మరోసారి తుడవాలి. ఇలా చేస్తే అవెన్‌లో పేరుకుపోయిన మురికి, అవెన్ గోడలకు పడ్డ మచ్చలూ పోయి కొత్త దానిలా మెరుస్తుంది.
- అంగుళం దాల్చిన చెక్క, నాలుగు లవంగాలు, నాలుగు కర్పూరం బిళ్లలను మెత్తగా దంచి పొడిచేయాలి. ఈ పొడిలో కొద్దిగా నీళ్లు, కొద్దిగా నూనె వేసి ద్రవంలా మార్చాలి. ఈ ద్రవాన్ని ఖాళీ అయిన దోమల రిపెలర్స్, ఆల్ అవుట్ లాంటి డబ్బాల్లో వేసి ప్లగ్‌లో పెట్టి స్విచ్ ఆన్ చేస్తే రూమ్ అంతా సువాసన వస్తుంది. ఇది సహజసిద్ధమైన రూమ్ ఫ్రెష్‌నర్‌గా పనిచేస్తుంది.

2023 రౌండప్





• శ్రీకాంత్ ఓదెల • వేణు ఎల్దండి • శౌర్యువ్ • షణ్ముఖ ప్రశాంత్ • కల్యాణ్ శంకర్ • క్లాక్స్ • సెబాస్టియన్

హిట్ డైరెక్షన్

లైఫ్ డైరెక్షన్ బాగుండాలంటే కెరీర్ మంచి డైరెక్షన్‌లో వెళ్లాలి. ఆ డైరెక్షన్‌ని సెట్ చేసుకోవడంలోనే టాలెంట్ ఉంటుంది. సెట్ చేసుకున్నాక హిట్ డైరెక్షన్‌లో వెళ్లడానికి శ్రమ అనుకోకుండా వీలైనంత కష్టపడాలి. ఈ ఏడాది కొందరు డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లోకి గోల్ సెట్ చేసుకుని, ఎంతో తపనతో ఎంటరయ్యారు. ఫస్ట్ మూవీతో నిరూపించుకోవడానికి హార్డ్‌వర్క్ చేశారు. హిట్ అయిన డైరెక్టర్ల శాతం ఎక్కువే ఉంది. అలా 'హిట్ డైరెక్షన్'లో కెరీర్ పరంగా ఒక మెట్టు ఎక్కిన దర్శకులతో పాటు పరిచయం అయిన ఇతర దర్శకుల గురించి తెలుసుకుందాం.

లక్ అంటే శ్రీకాంత్ ఓదెలదే. మరి.. దర్శకత్వం వహించిన తొలి చిత్రమే ('దసరా') పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ అంటే లక్కే కదా. పైగా నేచురల్ స్టార్ నాని సినిమాకి చాన్స్ అంటే చిన్న విషయం కాదు. యాక్చువల్‌గా శ్రీకాంత్ పదో తరగతి చదువుతున్నప్పుడే సుకుమార్ దర్శకత్వం వహించిన 'జగడం' చూసి, సినిమాలపై ఆసక్తి పెంచుకున్నారు. అయితే ఇంజినీరింగ్ పూర్తి చేశాక ఏ దర్శకుడి (సుకుమార్) సినిమా చూసి స్ఫూర్తి పొందారో.. అదే దర్శకుని వద్ద అసిస్టెంట్‌గా చేరేందుకు నాలుగేళ్లు కష్టపడ్డారు. 'నాన్నకు ప్రేమతో', 'రంగ స్థలం' చిత్రాలకు సుకుమార్ వద్ద అసిస్టెంట్‌గా చేశారు శ్రీకాంత్. 'రంగస్థలం' తర్వాత తన నిజ జీవిత ఘటనలతో 'దసరా' కథ రాసుకున్నారు. ఆ కథ నిర్మాత సుధాకర్ చెరుకూరి, నానీలకు నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది. తెలంగాణలోని గోదావరి ఖని సమీపంలో ఉన్న సింగరేణి బొగ్గు గనుల నేపథ్యంలో పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందిన 'దసరా' పాన్ ఇండియా స్థాయిలో విడుదలై, నాని కెరీర్‌లో తొలి వంద కోట్ల సినిమాగా నిలిచింది. శ్రీకాంత్ మలి చిత్రం కూడా నానీతోనే రూపొందనుందని టాక్.

హాస్యనటుడిగా ప్రేక్షకులను అలరించిన వేణు యెల్దండిలో మంచి ఎమోషనల్ డైరెక్టర్ ఉండి ఉంటాడని ఎవరూ ఊహించి ఉండరు. 'బలగం' సినిమాతో తనలోని మంచి దర్శకుణ్ని ఆవిష్కరించుకున్నారు వేణు. వాస్తవానికి దగ్గరగా మరణం, భావోద్వేగాల చుట్టూ కథ రాసుకుని ప్రేక్షకులతో కన్నీళ్లు పెట్టించారు. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్ రామ్ జంటగా 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌లో హర్షిత్ రెడ్డి, హన్షితా రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎవరూ ఊహించని వసూళ్లను రాబట్టింది. ఇక తనకు తొలి చాన్స్ ఇచ్చిన 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌లోనే మలి సినిమా చేసేందుకు కథ సిద్ధం చేసుకుంటున్నారు వేణు.

చదివింది ఇంజినీరింగ్ అయినా డైరెక్టర్ కావాలనే కలతో హైదరాబాద్‌లో అడుగుపెట్టారు షణ్ముఖ ప్రశాంత్. తన సొంత కథలతోనే పలు షార్ట్ ఫిలింస్ తీశారాయన. ఆ సమయంలో సుహాస్‌తో పరిచయం ఏర్పడింది. దీంతో సుహాస్ హీరోగా నటించిన 'కలర్ ఫోటో' చిత్రంలో కొన్నాళ్లు దర్శకత్వం విభాగంలో చేశారు. ఆ తర్వాత సుహాస్ హీరోగా చేసిన 'ఫ్యామిలీ డ్రామా' చిత్రానికి రైటర్‌గా చేశారు. ఆ టైమ్‌లో తాను సిద్ధం చేసుకున్న 'రైటర్ పద్మభూషణ్' కథని సుహాస్‌కి చెప్పడం.. ఆయనకి నచ్చడంతో ఈ సినిమా పట్టాలెక్కింది. సుహాస్, టీనా శిల్పరాజ్ జంటగా నటించారు. మదర్ అండ్ ఫాదర్ సెంటిమెంట్, ఎమోషనల్–కామెడీ డ్రామాతో తొలి హిట్ సాధించారు షణ్ముఖ ప్రశాంత్.

చిత్తూరు జిల్లా మంగళంపేటకు చెందిన కల్యాణ్ శంకర్ 'మ్యాడ్'తో దర్శకుడిగా పరిచయమయ్యారు. స్వగ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలుగు మీడియంలో చదువుకున్న కల్యాణ్ శంకర్ తొలి సినిమాతోనే సూపర్ హిట్ అందుకున్నారు. సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్, శ్రీ గౌరీ ప్రియారెడ్డి, అనంతికా సనీల్‌కుమార్, గోపికా ఉద్యాన్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'మ్యాడ్'. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర నిర్మించారు. విడుదలైన రెండు మూడు రోజుల్లోనే ఈ సినిమా లాభాల బాట పట్టింది.

భీమవరానికి చెందిన క్లాక్స్ (అసలు పేరు ఉద్దరాజు వెంకటకృష్ణ పాండురంగ రాజు) తొలి చిత్రం 'బెదురులంక 2012'తో హిట్ అందుకున్నారు. కార్తికేయ, నేహాశెట్టి జంటగా రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇండస్ట్రీలోకి రాకముందు క్లాక్స్ పలు ఉద్యోగాలు చేశారు. 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' అనే ఇటాలియన్ సినిమా చూశాక ఇండస్ట్రీకి వెళ్లాలనే ఆలోచన కలిగింది. దర్శకులు సుధీర్ వర్మ, రామ్ గోపాల్ వర్మ, దేవా కట్టాల వద్ద అసిస్టెంట్‌గా చేశారాయన. డైరెక్టర్ అజయ్ భూపతి ద్వారా హీరో కార్తికేయ పరిచయం కావడంతో ఆయనతో 'బెదురులంక 2012' తీసి హిట్ అందుకున్నారు.



• పూజా కొల్లూరు

తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళా దర్శకుల సంఖ్య తక్కువగా ఉంటుంది. ఈ ఏడాది 'మార్టిన్ లూథర్ కింగ్' సినిమాతో పూజా కొల్లూరు దర్శకురాలిగా పరిచయమయ్యారు. అమెరికాలో డైరెక్షన్, స్క్రీన్ రైటింగ్, సినిమాటోగ్రఫీ విభాగాల్లో డిగ్రీ పట్టా పొందారు పూజ. 30కి పైగా చిత్రాలు, లఘు చిత్రాలు, డాక్యుమెంటరీలకు పని చేసిన పూజ పలు అవార్డులు సొంతం చేసుకున్నారు. సమాజానికి మంచి సినిమాలు అందించాలన్న లక్ష్యంతో ఇండియా వచ్చారామె. తొలి ప్రయత్నంగా సంపూర్ణేశ్ బాబు హీరోగా 'మార్టిన్ లూథర్ కింగ్' సినిమా తెరకెక్కించారామె. తమిళంలో విజయవంతమైన 'మండేలా'కు తెలుగు రీమేక్‌గా ఇది రూపొందింది. ప్రధానంగా ఓటు విలువని తెలియజెప్పేలా ఈ చిత్రం సాగుతుంది. సమాజంలోని అసమానతల్ని ఎత్తి చూపుతూ ఆలోచింపజేస్తుందీ చిత్రం. తొలి చిత్రంతో దర్శకురాలిగా మంచి మార్కులు తెచ్చుకున్న పూజా కొల్లూరు తన తర్వాతి చిత్రాలకు కథలు సిద్ధం చేసుకుంటున్నారు.

ఈ ఏడాది ఆఖరి నెలలో విడుదలైన 'హాయ్ నాన్న' చిత్రంతో దర్శకునిగా పరిచయమయ్యారు శౌర్యువ్. తొలి సినిమాతోనే హిట్‌ని తన ఖాతాలో వేసుకున్నారాయన. నాని, మృణాల్ ఠాకూర్ జంటగా, బేబీ కియారా ఖన్నా కీలక పాత్రలో నటించిన చిత్రం 'హాయ్ నాన్న'. మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించారు. వైజాగ్‌కి చెందిన శౌర్యువ్‌ని ఇంట్లో వాళ్లు మెడిసిన్ చేయమన్నారు. అయితే సినిమాలపై ఇష్టంతో మూవీ నేపథ్యం లేకున్నా పరిశ్రమలోకి వచ్చారాయన. కన్నడ, తెలుగు భాషల్లో తెరకెక్కిన 'జాగ్వార్', 'అర్జున్ రెడ్డి' తమిళ రీమేక్ 'ఆదిత్య వర్మ' చిత్రాలకు సహాయ దర్శకుడిగా చేశారు. నాలుగేళ్ల క్రితమే 'హాయ్ నాన్న' కథ రాసుకున్నారు. ఈ కథ తొలుత నిర్మాతలకు, ఆ తర్వాత నానీకి నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది. తండ్రీ కూతురు మధ్య ఉండే అనుబంధం, భావోద్వేగాలతో రూపొందిన ఈ చిత్రం హిట్‌తో దూసుకెళుతోంది.

ఇంకా 'వినరో భాగ్యము విష్ణుకథ'తో మురళీ కిశోర్ అబ్బూరు, 'నరకాసుర'తో సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్, 'విమానం'తో శివ ప్రసాద్ యానాల, 'మిస్టర్ ప్రెగ్నెంట్'తో శ్రీనివాస్ వింజనంపాటి వంటి దర్శకులు హిట్ అందుకున్నారు. వీరితో పాటు మరికొందరు కొత్త దర్శకులు తమ ప్రతిభని నిరూపించుకునే ప్రయత్నం చేశారు.

యశ్ టాక్సిక్



• 'టాక్సిక్'లో యశ్

'కేజీఎఫ్' ఫేమ్ హీరో యశ్ నటించనున్న తాజా చిత్రానికి 'టాక్సిక్' అనే టైటిల్ ఖరారైంది. ఈ విషయాన్ని శుక్రవారం ఓ వీడియో ద్వారా యశ్ షేర్ చేశారు. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ట్యాగ్‌లైన్. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో ఈ సినిమాను వెంకట్ కె. నారాయణ నిర్మించనున్నారు. 2025 ఏప్రిల్ 10న ఈ చిత్రం విడుదల కానుంది. ''రెండు వేర్వేరు ప్రపంచాల కలయికగా ఈ చిత్రకథ ఉంటుంది'' అన్నారు గీతూ మోహన్‌దాస్. ''బలమైన భావోద్వేగాలకు మాస్, యాక్షన్ అంశాలను జోడించి ఈ కథ రెడీ చేయడానికి గీతూ కొంత టైమ్ తీసుకున్నారు'' అన్నారు వెంకట్ కె. నారాయణ.

చెన్నైలో స్కై థియేటర్స్ ఏర్పాటు చేస్తున్నాం

– నిర్మాత సి. కల్యాణ్



''దాదాపు 83 చిత్రాలను విజయవంతంగా చేశాం. అయితే రెండేళ్లుగా నా ఏకాగ్రత చెన్నైలో నిర్మిస్తున్న కల్యాణ్ అమ్యూజ్‌మెంట్ పార్క్‌పై ఉంది. ఈ పార్క్ ప్రారంభోత్సవం త్వరలో జరగనుంది. తమిళనాడు సీఎం స్టాలిన్, ఉదయ్‌నిధి స్టాలిన్‌గార్లు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు బాగా సపోర్ట్ చేశారు. తొలిసారిగా స్కై థియేటర్స్ ఏర్పాటు చేస్తున్నాం. ఈ ప్రాజెక్ట్ ద్వారా వచ్చే ఆదాయాన్ని సినిమాలు నిర్మించడానికే వినియోగిస్తాను'' అని నిర్మాత సి. కల్యాణ్ అన్నారు. నేడు (09.12.) ఆయన బర్త్ డే. ఈ సందర్భంగా శుక్రవారం విలేకర్లతో కల్యాణ్ మాట్లాడుతూ– ''జగన్‌గారు ఇండస్ట్రీకి ఏమీ చేయలేదు.. ఏదో అలా చేశారని అంటున్నారు. మరి.. సినిమా టికెట్ ధరల గురించి చంద్రబాబు నాయుడుగారితో తొమ్మిదిసార్లు సమావేశాలు జరిపాం. ఆయన సానుకూలంగా జీవో ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. నేనెవర్నీ వ్యతిరేకించడం లేదు. చిరంజీవిగారితో పాటు మేమందరం ఏపీ సీఎం జగన్‌గారిని కలిసినప్పుడు, ఆయన సానుకూలంగా స్పందించారు. సినిమావాళ్లను వదులుకోనని, వైజాగ్‌లో స్థలాలు కేటాయిస్తానని, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ చేయండని చెప్పారు'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''అవార్డుల వేడుక అంటే పరిశ్రమ అంతా ఒక ఫ్యామిలీలా హాజరవ్వాలి. కానీ ఇప్పుడు అవార్డు వచ్చినవారు తప్పితే మిగతా వారు ఇంట్లోనే కూర్చునే పరిస్థితి. అవార్డు తీసుకున్న ఆర్టిస్టు కూడా తనకి ఓ గౌరవమని భావించే పరిస్థితి లేదిప్పుడు. ఈ పరిస్థితుల్లో అవార్డు వేడుకలు ఎందుకనే ప్రశ్న ఉత్పన్నమౌతోంది'' అని చెప్పుకొచ్చారు.

హారరా? థ్రిల్లరా?



• గోపీచంద్, రాంబాబు, రాజేశ్వరి చంద్రజ, భానుశ్రీ

భాను శ్రీ, సోనాక్షీ వర్మ, అనురాగ్ కీలక పాత్రల్లో రూపొందిన చిత్రం 'కలశ'. కొండా రాంబాబు దర్శకత్వంలో శ్రీమతి రాజేశ్వరి చంద్రజ వాడపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన దర్శకుడు గోపీచంద్ మలినేని మాట్లాడుతూ–''కలశ ట్రైలర్ బాగుంది. ఈ సినిమా థ్రిల్లరా? లేక హారరా? అనే సందేహం కలిగేలా ట్రైలర్‌ను కట్ చేశారు. యూనిట్‌కి ఆల్ ది బెస్ట్'' అన్నారు. ''కలశ చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుంది. థియేటర్స్‌లో చూడండి'' అని యూనిట్ పేర్కొంది.

రహస్యాలెన్నో..



• శ్రీనివాస్ గోపిశెట్టి, ప్రియదర్శి

'కాలగర్భంలో కలిసిపోయిన మన తాంత్రిక శాస్త్రాన్ని తెరిస్తే అందులో ఊహకందని రహస్యాలెన్నో!' అనే వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'తంత్ర' సినిమా టీజర్. శ్రీహరి తమ్ముడి కొడుకు ధనుష్ రఘుముద్రి హీరోగా పరిచయం అవుతున్న ఈ సినిమాలో అనన్యా నాగళ్ల, సలోని, 'టెంపర్' శీను ఇతర ప్రధాన పాత్రధారులు. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వంలో నరేశ్‌బాబు. పి, రవి చైతన్య నిర్మిస్తున్న ఈ సినిమా టీజర్ విడుదలైంది. ''ఇందులో దుష్టశక్తి బారిన పడిన అమ్మాయి పాత్రలో అనన్య, తాంత్రికుడిగా 'టెంపర్ శీను', ఓ మిస్టీరియస్ పాత్రలో సలోని కనిపిస్తారు'' అని యూనిట్ పేర్కొంది.

విశాఖలో అమెరికా దిగ్గజ ఐటీ అనుబంధ సంస్థ

- పెట్టుబడులకు ముందుకొచ్చిన హెల్త్ రైజ్ సంస్థ
- 5 వేల మందికి ఉపాధి
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- మంత్రితో సమావేశమైన సంస్థ ప్రతినిధులు
- విశాఖలో ఐటీ అభివృద్ధిని వివరించిన మంత్రి



హెల్త్ రైజ్, ఏసీఎన్ ఇన్ఫోటెక్ సంస్థ ప్రతినిధులతో సమావేశమైన ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం : ఐటీ రంగంలో దూసుకుపోతున్న విశాఖ నగరంలో మరో దిగ్గజ సంస్థ కొలువుదీరనుంది. అమెరికాలోని ప్రముఖ ఐటీ కంపెనీ ట్రినిటీ సంస్థ హెల్త్‌రైజ్ పేరుతో విశాఖలో ఐటీ అనుబంధ సంస్థ ఏర్పాటుకు ముందుకొచ్చింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఈ విషయాన్ని శుక్రవారం ఇక్కడ వెల్లడించారు. ఎపిటా, ఏసీఎన్ ఇన్ఫోటెక్ అనే బీపీవో సంస్థ సహకారంతో ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆ సంస్థ సుముఖత వ్యక్తం చేసిందని తెలిపారు. ఇక్కడ 5 వేల మందికి ఉపాధి కల్పిస్తుందని చెప్పారు. రుషికొండ ఐటీ హిల్స్‌లో మంత్రి అమర్‌నాథ్‌తో హెల్త్‌రైజ్ సంస్థ సీఈవో డేవిడ్ ఫార్చ్‌మెన్, ఏసీఎన్ ఇన్ఫోటెక్ ఎండీ చమన్‌బైద్, ఎపిటా సీఈవో కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏపీ ఐటీ సలహాదారు శేషిరెడ్డి శుక్రవారం రాత్రి భేటీ అయ్యారు. సంస్థ అందించే సేవలు, కల్పించే ఉద్యోగావకాశాలపై చర్చించారు. ఏపీని అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రమోట్ చేయడంతో అనేక దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయని మంత్రి అమర్‌నాథ్ చెప్పారు. బీచ్ ఐటీ కారిడార్‌ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఏపీలో 300 ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయని, ఏటా 1,20,000 మంది వివిధ కోర్సులు పూర్తి చేసుకుని బయటికి వస్తున్నారని తెలిపారు. ఇక్కడ ఇంజినీరింగ్ కాలేజీల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. అమెరికాలోని వివిధ టెక్ కంపెనీలలో పని చేస్తున్న ప్రతి నలుగురిలో ఒక తెలుగువాడు ఉంటాడని అమెరికా సంస్థ బృందానికి వివరించారు. స్టార్టప్స్‌లోనూ తెలుగు విద్యార్థులు బాగా రాణిస్తున్నారన్నారు. విశాఖలో మెడ్ టెక్ జోన్ మెడికల్ రీసెర్చ్‌కు, వైద్య రంగంలో సరికొత్త విప్లవాన్ని సృష్టించేందుకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. హెల్త్‌రైజ్ సంస్థ సీఈవో డేవిడ్ మాట్లాడుతూ తమ సంస్థ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడిచేందుకు హెల్త్ కేర్ ఆర్గనైజేషన్స్‌కు సహకారం అందిస్తుందన్నారు. రెవెన్యూ సైకిల్ మేనేజ్‌మెంట్, హెల్త్ కోడింగ్, వైద్య సంస్థలకు ఐటీ సర్వీసులు సైతం అందించేలా విశాఖ నుంచి సంస్థ పనిచేస్తుందని తెలిపారు.

జనసేన కంటే బర్రెలక్క నయమని అర్థమైంది

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: తెలంగాణ ఎన్నికల ఫలితాల తర్వాత జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు మతి భ్రమించి.. ఏం మాట్లాడుతున్నాడో తెలియని స్థితిలో ఉన్నాడని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు. స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసిన బర్రెలక్క శిరీషకు వచ్చిన ఓట్లు కూడా తన పార్టీకి రాలేదనే మనస్తాపం పవన్‌ను వెంటాడుతున్నట్టు ఉందన్నారు. ఎక్కడ పర్యటించినా సీఎం వైఎస్ జగన్‌పై, పాలనపై లేనిపోని ఆరోపణలు చేసి ఉనికి చాటుకోవాలని ప్రయత్నిస్తున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విశాఖలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. ఏపీకి, పవన్‌కు అసలు సంబంధమేంటి? ఇక్కడ రాజకీయాలతో ఆయనకెందుకు? అని ప్రశ్నించారు. అబద్ధాలను అల్లేసి చెప్పినంత మాత్రాన ప్రజలు నమ్మేంత పిచ్చోళ్లు కాదని పవన్ తెలుసుకోవాలన్నారు.

రైతులకు అన్ని విధాలా ప్రభుత్వం అండ

- పంట నష్టం అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం
- మంత్రి కారుమూరి



అత్తిలి మండలం స్కిన్నెరపురంలో ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి : తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు ముంపు బారిన పడిన వరిచేలకు పంట నష్టం అంచనా సిద్ధం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం మంచిలి, కంచుమర్రు, స్కిన్నెరపురం, ఈడూరు, కొమ్మర, పాలూరు గ్రామాల్లో శుక్రవారం మంత్రి కారుమూరి పర్యటించి కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని, ముంపులో ఉన్న పంటచేలను పరిశీలించి, రైతులకు భరోసా ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ తుపాను ప్రభావంతో ఏ ఒక్క రైతూ నష్టపోకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు రైతు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 6.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ధాన్యం డబ్బును రైతుల ఖాతాల్లో వెను వెంటనే జమ చేస్తున్నామని చెప్పారు. తుపాను కారణంగా తీర ప్రాంతాల్లో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికార యంత్రాంగాన్ని సీఎం జగన్ సమాయత్తం చేశారన్నారు. నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా వచ్చేలా చర్యలు తీసుకుంటామని, ముంపులో ఉన్న చేలను వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు పరిశీలించి, పంటనష్టం అంచనా సిద్ధం చేయాలని, ఏ ఒక్క రైతుకూ నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు.

ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలి

దగ్గుబాటి పురందేశ్వరి

భీమడోలు: తుపాను వల్ల దెబ్బతిన్న వరి పంటకు ఎకరాకు రూ.50వేలు చొప్పున నష్టపరిహారం ఇచ్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. మిచాంగ్ తుపాను ధాటికి ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గంలోని పూళ్ల, తల్లాపురం గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. తల్లాపురంలోని ఆర్‌బీకేను సందర్శించారు.

టిడ్కో గృహాలపై పదేపదే అసత్య ప్రచారం

మంత్రి ఆదిమూలపు సురేష్ ఆగ్రహం




సాక్షి, అమరావతి: పట్టణ పేదల కోసం నిర్మిస్తున్న టిడ్కో గృహాలపై ఎల్లో మీడియా పదేపదే అసత్యాలను ప్రచారం చేస్తోందని రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మండిపడ్డారు. గత ప్రభుత్వం గాలికొదిలేసిన గృహాలను తమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అన్ని మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అందిస్తోందని, దీనిపై ప్రజలందరూ హర్షిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళగిరి–తాడేపల్లి మునిసిపాలిటీ పరిధిలోని నవులూరు టిడ్కో గృహ సముదాయ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలను లాక్ చేస్తున్నారని, వడ్డీ చెల్లించాలని ఇబ్బంది పెడుతున్నారని, డ్వాక్రా రుణాల నుంచి టిడ్కో ఇళ్లకు కట్టాల్సిన మొత్తాన్ని బ్యాంకు వారు తీసుకున్నారంటూ కొన్ని ఎల్లో మీడియా చానళ్లు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు.

రాజ్యసభ

ఏపీ ఇన్ పార్లమెంట్

ఏపీలో 8.20 కోట్ల మొబైల్ వినియోగదారులు

రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో 8.20 కోట్ల మంది మొబైల్ ఫోను వినియోగదారులున్నారని కేంద్ర కమ్యూనికేషన్లశాఖ సహాయమంత్రి దేవుసిన్హ్ చౌహాన్ తెలిపారు. రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

ఏపీకి 4,484 ట్రాన్స్‌పాండర్స్

నేషనల్ రోల్ అవుట్ ప్లాన్ కింద ఆంధ్రప్రదేశ్‌కు 4,844 ట్రాన్స్‌పాండర్స్ కేటాయించినట్లు విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి పురుషోత్తం రూపాలా జవాబిచ్చారు. నీటినాణ్యత నిర్వహణ మెరుగుపడడం, వ్యాధులు అదుపులోకి రావడం ద్వారా రాష్ట్రంలో చేపల ఉత్పత్తి, ఉత్పాదకత గణనీయంగా పెరిగాయని ఏపీ కేంద్రానికి సమర్పించిన నివేదికలో పేర్కొందని వివరించారు.

పత్తిపంట నష్టం 10 శాతానికి తగ్గింది

పత్తిపంటను ఆశించే గులాబీరంగు పురుగు బెడదను తట్టుకునే కొన్ని కొత్త వంగడాలను, పురుగుమందులను రూపొందించి వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు కేంద్ర వ్యవసాయశాఖ సహాయమంత్రి కై లాష్ చౌదరి జవాబిచ్చారు. గులాబీరంగు పురుగును నిర్మూలించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇస్తున్న ప్రదర్శనలు చూసి, సలహాలు, సూచనలు పాటిస్తున్నందువల్ల గులాబీరంగు పురుగు కారణంగా జరుగుతున్న పత్తిపంట నష్టాన్ని ప్రస్తుతం 10 శాతానికి తగ్గించగలిగినట్లు తెలిపారు. గులాబీరంగు పురుగు కారణంగా 2017–18లో దేశవ్యాప్తంగా 30 శాతం పత్తిపంటకు నష్టం వాటిల్లిందని చెప్పారు.

'కోర్టు' నియామకాల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి

సుప్రీం, హైకోర్టుల్లో జ్యుడిషియల్ నియామకాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 124, 217కు సవరణ చేయాలని కోరుతూ విజయసాయిరెడ్డి శుక్రవారం రాజ్యసభలో ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు. దీంతోపాటు అవాస్తవాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలను ప్రచురించే ప్రకటనకర్తలు, ప్రకటన సంస్థలకు భారీగా జరిమానా విధించేందుకు వీలుగా వినియోగదారుల సంరక్షణ బిల్లులోని సెక్షన్ 89ను సవరించాలని కోరుతూ మరో ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు. అలాగే, విద్యా సంస్థలు–పరిశ్రమల మధ్య అనుసంధానం చేసే ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పడం ద్వారా విద్యా, పరిశోధన సంస్థల పరిజ్ఞానాన్ని పారిశ్రామిక మార్కెట్‌కు తరలించడం సులభతరం చేసే ఉద్దేశంతో కేంద్రీయ వర్సిటీలు ప్రత్యేక అనుసంధాన విభాగాన్ని విధిగా ఏర్పాటు చేయడానికి వీలుగా సెంట్రల్ యూనివర్సిటీస్ చట్టం సవరణ కోరుతూ మరో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ 3 బిల్లులు ప్రవేశపెట్టడానికి సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

ఉద్యానవంటల సాగు, పరిశోధనపై వైఎస్సార్ యూనివర్సిటీ దృష్టి



'మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టీకల్చర్' (ఎంఐడీహెచ్)లో ఉద్యానవంటల సాగుపై ఏపీలోని డాక్టర్ వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్సిటీ దృష్టి సారించినట్లు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తెలిపారు. ఇక్కడి యూనివర్సిటీలో సెన్సార్‌ను ఉపయోగించి 'రోబోటిక్ స్ప్రేయర్' అభివృద్ధి చేసినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఎన్‌ఐసీడీసీ కింద ఏపీకి రూ.533.86 కోట్లు



నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌ఐసీడీసీ) కింద గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీల అభివృద్ధి జరుగుతోందని కేంద్ర వాణిజ్యశాఖ సహాయమంత్రి సోంప్రకాష్ చెప్పారు. ఇందుకుగాను ఏపీకి రూ.533.86 కోట్లు మంజూరు చేసినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ ప్రశ్నకు జవాబిచ్చారు.


ఏపీలో 461 ఎఫ్‌పీవో గ్రూపులు



ఆంధ్రప్రదేశ్‌లో 461 ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో)లు ఉన్నాయని కేంద్ర వ్యవసాయశాఖమంత్రి తోమర్ తెలిపారు. ఎఫ్‌పీవోల ద్వారా నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు వంటివి అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

లోక్‌సభ

మంగళగిరి ఎయిమ్స్‌లోను కేన్సర్‌కు చికిత్స



సాక్షి, న్యూఢిల్లీ: మంగళగిరి ఎయిమ్స్ సహా దేశవ్యాప్తంగా 22 ఎయిమ్స్‌లో కేన్సర్ చికిత్స సదుపాయం ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. లోక్‌సభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. కర్నూలు మెడికల్ కాలేజీలో స్టేట్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో చికిత్స సదుపాయం ఉందని చెప్పారు.

సర్వే బృందం వచ్చినా నిర్ణయం తీసుకోలేదు



కడప జిల్లాలో నేషనల్ యునాని రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు నిమిత్తం హైదరాబాద్‌లోని సెంట్రల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ ఇన్ యునాని మెడిసిన్‌కి చెందిన కమిటీ బృందం 2016లో ప్రతిపాదిత భూమిని పరిశీలించిందని కేంద్ర ఆయుష్ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఏపీలో బల్క్‌డ్రగ్ పార్కు


ఏపీలో బల్క్‌డ్రగ్ పార్క్ కోసం రూ.వెయ్యి కోట్లు అనుమతించి తొలిదశలో భాగంగా రూ.225 కోట్లు విడుదల చేశామని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయమంత్రి భగవంత్ కుబా తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, గొడ్డేటి మాధవి, మార్గాని భరత్‌రామ్, ఎన్. రెడ్డెప్ప, పోచ బ్రహ్మానందరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. బల్క్‌డ్రగ్ పార్కును కాకినాడ నుంచి నక్కపల్లికి మార్చాలని గత అక్టోబరు 13న ఏపీ ప్రభుత్వం కోరితే.. అనుమతించామన్నారు.

పీఎంఎంవీవై లబ్ధిదారుల సంఖ్య 17,40,553

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) లబ్ధిదారులు 17,40,553 మంది ఉన్నారని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధిశాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. 2021–22లో కేంద్ర, రాష్ట్ర వాటాల్లో భాగంగా మెటర్నటీ బెనిఫిట్ కింద లబ్ధిదారులకు రూ.17.70 కోట్లు విడుదల చేసినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.



నిర్భయ పథకం



నిర్భయ పథకంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అభయ ప్రాజెక్ట్ ఫర్ సేఫ్టీ ఉమెన్, గర్ల్, చైల్డ్‌కు సహకారం అందించినట్లు కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటోల్లో లక్ష పరికరాలు, వెయ్యి ఇంటర్‌నెట్ పరికరాలు ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ తలారి రంగయ్య ప్రశ్నకు సమాధానమిచ్చారు. పలు శాఖలు, విభాగాలకు రూ.5,118.91 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు.

సాక్షి బిజినెస్
శనివారం
9-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
304	68
69,826	20,969

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,350	▲	10
డోజోన్స్	36,143	▲	33
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,554	▲	41
డాక్స్	16,759	▲	130
షాంఘై	2,969	▲	3
నికాయ్	32,308	▼	550

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	62,415	▼	47
బంగారం (22 క్యారట్)	62,166	▼	47
వెండి (కిలో)	73,711	▼	117

ఫారెక్స్ రేట్లు రూ.లలో


			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.95	83.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.09	106.45
€	యూరో	ఎస్‌బీఐ	88.90	91.25
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.37	58.68
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.18	56.11
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.38	63.37
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.29	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.69	23.84
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.33

అయిదోసారీ అక్కడే..!

- 6.5 శాతంగా రెపో రేటు కొనసాగింపు
- ఆర్థిక వృద్ధి అంచనాలు 7 శాతానికి పెంపు
- ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ నిర్ణయాలు
- ఫిబ్రవరి 6–8 మధ్య మరోసారి భేటీ

ద్రవ్యోల్బణంపై ఆహార ధరల ఎఫెక్ట్..

సెప్టెంబర్ క్వార్టర్ వృద్ధి గణాంకాలు పటిష్టంగా ఉండి, అందర్నీ ఆశ్చర్యపర్చాయి. ఆహార ధరల్లో నెలకొన్న అనిశ్చితి రాబోయే రోజుల్లో ద్రవ్యోల్బణ అంచనాలపై గణనీయంగా ప్రభావం చూపవచ్చు. వేగంగా మారిపోయే ఆహార ధరల సూచీలన్నీ కూడా కీలక కూరగాయల రేట్ల పెరుగుదలను సూచిస్తున్నాయి. ఫలితంగా సమీప భవిష్యత్తులో రిటైల్ ద్రవ్యోల్బణం పెరగొచ్చు. – శక్తికాంత దాస్, ఆర్‌బీఐ గవర్నర్



ముంబై: ద్రవ్యోల్బణంపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో అంతా ఊహించినట్లే రిజర్వ్ బ్యాంక్ వరుసగా అయిదోసారీ కీలక వడ్డీ రేట్లను యథాతథంగా 6.5 శాతంగానే కొనసాగించాలని నిర్ణయించింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న దేశం హోదాను నిలబెట్టుకుంటూ భారత్ మరింత వృద్ధి నమోదు చేయగలదని అంచనా వేసింది. అటు ఆస్పత్రులు, విద్యా సంస్థలకు యూపీఐ చెల్లింపుల పరిమితిని రూ. 1 లక్ష నుంచి రూ. 5 లక్షలకు పెంచింది. మరోవైపు, రికరింగ్ చెల్లింపుల ఈ–మ్యాండేట్ పరిమితిని రూ. 15 వేల నుంచి రూ. 1 లక్షకు పెంచాలని నిర్ణయించింది. ఫిబ్రవరి 6–8 మధ్య ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ మళ్లీ సమావేశం అవుతుంది. ఆర్‌బీఐ నిర్ణయాలు అధిక వృద్ధి సాధనకు దోహదపడగలవని బ్యాంకర్లు, కార్పొరేట్లు వ్యాఖ్యానించగా .. రేటును తగ్గించి ఉంటే ప్రయోజనకరంగా ఉండేదని రియల్టీ రంగం అభిప్రాయపడింది. వచ్చే సమీక్షలోనైనా తగ్గించాలని కోరింది.

వివరాల్లోకి వెడితే.. బుధవారం నుంచి మూడు రోజుల పాటు సాగిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షకు సంబంధించి మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ శుక్రవారం ప్రకటించారు. ప్రామాణిక రెపో రేటును (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై రిజర్వ్ బ్యాంక్ వసూలు చేసే వడ్డీ రేటు) 6.5%గా కొనసాగించాలని కమిటీలోని సభ్యులందరూ (ఆరుగురు) ఏకగ్రీవంగా తీర్మానించారు. ధరలను కట్టడి చేసే దిశగా 2022 మే నుంచి ఇప్పటివరకు ఆర్‌బీఐ రెపో రేటును 2.5% పెంచింది.



అంచనాల పెంపు సముచితమే..

ప్రథమార్ధంలో సాధించిన వృద్ధి, ఆ తర్వాత రెండు నెలల్లో (అక్టోబర్, నవంబర్) గణాంకాలన్నీ సానుకూల సంకేతాలనే ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో వృద్ధి అంచనాలను ఆర్‌బీఐ పెంచడం సముచితమే. – నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక మంత్రి



రేటు తగ్గించాల్సింది..

వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించడం మంచి నిర్ణయమే. అయితే, ప్రస్తుతం స్థూల–ఆర్థిక పరిస్థితులు సానుకూలంగా ఉన్నందున రేటును తగ్గించి ఉంటే రియల్టీ రంగం, ఎకానమీకి గణనీయంగా ప్రయోజనం కలిగేది. – బొమన్ ఇరానీ, నేషనల్ ప్రెసిడెంట్, క్రెడాయ్



సానుకూల సంకేతాలు

ద్రవ్యోల్బణం స్థిర స్థాయిలో ఉంటూ, ఎకానమీ అధిక వృద్ధి సాధించే దిశగా ముందుకెడుతుందని పాలసీ స్పష్టమైన, సానుకూల సంకేతాలిస్తోంది. వరుసగా మూడో ఏడాది 7 శాతం వృద్ధిని సాధించే అవకాశాలను సూచిస్తోంది. – దినేష్ ఖారా, చైర్మన్, ఎస్‌బీఐ

యూపీఐ పరిమితులు పెంపు..

- ఆస్పత్రులు, విద్యా సంస్థలకు యూపీఐ ద్వారా జరిపే చెల్లింపుల పరిమితి రూ. లక్ష నుంచి రూ. 5 లక్షలకు పెంపు.
- మళ్లీ మళ్లీ చేసే (రికరింగ్) చెల్లింపులకు సంబంధించి ఈ–మ్యాండేట్ పరిమితి రూ. 15 వేల నుంచి రూ. 1 లక్షకు పెంపు.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి అంచనాలు 6.5 శాతం నుంచి 7%కి పెంపు. జీడీపీ డిసెంబర్ త్రైమాసికంలో 6.5%గా, మార్చి క్వార్టర్‌లో 6 శాతంగా ఉంటుందని అంచనా.
- వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం క్యూ3లో 5.6%గా, క్యూ4లో 5.2%గా ఉండొచ్చని అంచనా. 2024–25 జూన్ క్వార్టర్‌లో ఇది 5.2 శాతంగా, సెప్టెంబర్ త్రైమాసికంలో 4 శాతంగా, డిసెంబర్ క్వార్టర్‌లో 4.7 శాతంగా ఉండవచ్చు.
- డేటా భద్రత, గోప్యతను మరింతగా పెంచే దిశగా ఆర్థిక రంగం కోసం ఆర్‌బీఐ క్లౌడ్ సదుపాయాన్ని అందుబాటులోకి తేనుంది.
- ఆర్థిక రంగ పరిణామాలను మరింత మెరుగ్గా అర్థం చేసుకునేందుకు వీలు కల్పించేలా "ఫిన్‌టెక్ రిపాజిటరీ"ని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. 2024 ఏప్రిల్‌లో లేదా అంతకన్నా ముందే రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్ దీన్ని అందుబాటులోకి తేనుంది. ఫిన్‌టెక్ సంస్థలు స్వచ్ఛందంగా సంబంధిత వివరాలను రిపాజిటరీకి సమర్పించవచ్చు.
- డిసెంబర్ 1 నాటికి విదేశీ మారక నిల్వలు 604 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.
- ఇతర వర్ధమాన దేశాలతో పోలిస్తే రూపాయి మారకంలో ఒడిదుడుకులు తక్కువగానే ఉన్నాయి.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో 'జీక్యూజీ'కి 4.7 శాతం వాటా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ జీక్యూజీ పార్ట్‌నర్స్ 4.7 శాతం వాటా చేజిక్కించుకుంది. బ్లాక్ డీల్స్ ద్వారా ఒక్కొక్కటి రూ.59.09 చొప్పున సుమారు 29 కోట్ల షేర్లను రూ.1,672 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసింది. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో శుక్రవారం మొత్తం 3 ప్రధాన బ్లాక్ డీల్స్ ద్వారా ఒక్కో షేరు రూ.58.2–59.25 చొప్పున 12.6% వాటాలు చేతులు మారాయి. వీటి మొత్తం విలువ రూ.4,465 కోట్లు. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో వాటా కొనుగోలు చేసిన కంపెనీల్లో నోమురా ఇండియా ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్, స్టిక్టింగ్ డిపాజిటరీ ఏపీజీ ఎమర్జింగ్ మార్కెట్స్ ఈక్విటీ పూల్ సైతం ఉన్నాయి. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో తనకున్న మొత్తం 7.27 శాతం వాటాలను యూకే కంపెనీ ఏఎస్ఎన్ ఇన్వెస్ట్‌మెంట్స్ విక్రయించింది. ఏ/డీ ఇన్వెస్టర్స్ ఫండ్, వరేనియం ఇండియా అపార్చునిటీ ఫండ్ సైతం వాటాలను విక్రయించాయి.



అన్‌లిమిటెడ్ 'రెడ్ అలర్ట్ సేల్'



న్యూఢిల్లీ: అన్‌లిమిటెడ్ స్టోర్స్ 'రెడ్ అలర్ట్ సేల్ ఆఫర్'ను ప్రకటించింది. అన్ని బ్రాండెడ్ వస్త్రాలపై 50% ఫ్లాట్ డిస్కౌంట్ అందిస్తుంది. అలాగే రూ.3వేల షాపింగ్‌పై అంతే విలువైన ఉత్పత్తులు ఉచితంగా పొందవచ్చు. దేశవ్యాప్తంగా 87 స్టోర్లలో జనవరి 1 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. ఫ్యాషన్ ఇష్టపడే ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

మార్చికల్లా అదే రోజు సెటిల్‌మెంట్

సెబీ చీఫ్ మాధవీ పురి బచ్




న్యూఢిల్లీ: కొత్త ఏడాది(2024)లో ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్లలో లావాదేవీ చేపట్టిన రోజునే సెటిల్‌మెంట్ పూర్తికానుంది. స్టాక్ ఎక్స్చేంజీలలో మార్చికల్లా అదే రోజు సెటిల్‌మెంట్‌కు తెరతీయనున్నట్లు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చీఫ్ మాధవీ పురి బచ్ తాజాగా వెల్లడించారు. వెరసి 2024 మార్చి నుంచి టీప్లస్‌జీరో సెటిల్‌మెంట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) నిర్వహించిన ప్రపంచ ఆర్థిక విధానాల వేదిక 2023లో బచ్ పేర్కొన్నారు. ఈ బాటలో ఇప్పటికే సెబీ స్టాక్ లావాదేవీల సెటిల్‌మెంట్ గడువులను తగ్గిస్తూ వస్తోంది. దీంతో ప్రస్తుతం లావాదేవీ చేపట్టిన మరుసటి రోజు (టీప్లస్1) సెటిల్‌మెంట్ అమలవుతోంది. దీన్ని మరో 3 నెలల్లోగా ఒకే రోజుకు పరిమితం చేయనున్నట్లు బచ్ చెప్పారు. కాగా.. టీప్లస్‌జీరో సెటిల్‌మెంట్ అమలు తదుపరి అప్పటికప్పుడు(ఇన్‌స్టేనియస్) సెటిల్‌మెంట్‌ను తీసుకురానున్నట్లు వెల్లడించారు. అయితే ఇది ఆప్షనల్‌గా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-12-2023	
విశాఖ	550–00
చిత్తూరు	553–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550–00
విజయవాడ	550–00
రిటైల్ ధర (డజను)	72.00
8-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	535–00
వరంగల్	537–00
రిటైల్ ధర	5.95

ఆర్‌బీఐ అండతో మళ్లీ రికార్డుల మోత

- మెప్పించిన రిజర్వ్ బ్యాంకు ద్రవ్య పాలసీ
- కొత్త గరిష్టాలకు సెన్సెక్స్, నిఫ్టీ
- తొలిసారి 21,000ను తాకిన నిఫ్టీ



ముంబై: ఆర్‌బీఐ ద్రవ్య విధాన వైఖరి మెప్పించడంతో స్టాక్ మార్కెట్లో మళ్లీ రికార్డుల మోత మోగింది. రిజర్వ్ బ్యాంకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) వృద్ధి రేటు అంచనాలు పెంచడం, వరుసగా అయిదోసారి కీలక వడ్డీ రేట్ల జోలికెళ్లకపోవడం ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చాయి. ఫలితంగా వడ్డీ రేట్ల ఆధారిత బ్యాంకులు, ఫైనాన్స్ సర్వీసులు, రియల్టీ షేర్లకు భారీ డిమాండ్ లభించడంతో సెన్సెక్స్, నిఫ్టీలు ఇంట్రాడే, ముగింపులోనూ కొత్త రికార్డులు నమోదు నమోదు చేశాయి. సెన్సెక్స్ 304 పాయింట్లు లాభపడి 69,826 వద్ద వద్ద, నిఫ్టీ 68 పాయింట్లు పెరిగి 20,969 వద్ద స్థిరపడ్డాయి. ఉదయం సూచీలు స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి కమిటీ సమీక్షా సమావేశ నిర్ణయాలు వెల్లడి(ఉదయం 10 గంటలు) తర్వాత కొనుగోళ్లు మరింత పెరిగాయి. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఒక దశలో సెన్సెక్స్ 372 పాయింట్లు బలపడి 69,894 వద్ద, నిఫ్టీ 105 పాయింట్లు పెరిగి తొలిసారి 21 వేల స్థాయిపై 21,006 వద్ద కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి.

- ■ బ్లాక్ డీల్ ద్వారా 75.81 కోట్ల షేర్లు చేతులు మారినట్లు డేటా వెల్లడి కావడంతో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ షేరు 12% లాభపడి రూ.69 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్


అర్షిన్

భారత్ శుభారంభం

ఆసియా కప్ అండర్–19 పురుషుల క్రికెట్ టోర్నీలో భారత్ శుభారంభం చేసింది. అఫ్గానిస్తాన్‌తో దుబాయ్‌లో శుక్రవారం జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో భారత్ ఏడు వికెట్లతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ 50 ఓవర్లలో 173 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో అర్షిన్ కులకర్ణి (3/29), నమన్ తివారి (2/30), రాజ్ లింబాని (3/46) రాణించారు. అనంతరం భారత్ 37.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసి విజయం సాధించింది. ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (70 నాటౌట్; 4 ఫోర్లు), ముషీర్ ఖాన్ (48 నాటౌట్; 3 ఫోర్లు) ఆకట్టుకున్నారు.

సెమీస్‌లో పంకజ్ అద్వానీ

జాతీయ బిలియర్డ్స్–స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భాగంగా 6–రెడ్ స్నూకర్ ఈవెంట్‌లో ప్రపంచ చాంపియన్ పంకజ్ అద్వానీ (పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు) సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. చెన్నైలో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో పంకజ్ 6–4 ఫ్రేమ్‌ల తేడాతో బ్రిజేశ్ దమానిపై విజయం సాధించాడు.

దబంగ్ ఢిల్లీ బోణీ



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో దబంగ్ ఢిల్లీ జట్టు గెలుపు బోణీ చేసింది. బెంగళూరు బుల్స్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 38–31తో విజయం సాధించింది. ఢిల్లీ తరఫున నవీన్ అత్యధికంగా 13 పాయింట్లు స్కోరు చేయగా... అశు మలిక్ తొమ్మిది పాయింట్లు సాధించాడు. బెంగళూరు తరఫున భరత్ 12 పాయింట్లు సంపాదించాడు. మరో మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 43–32తో యు ముంబాను ఓడించింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో బెంగళూరు బుల్స్‌తో హరియాణా స్టీలర్స్; యూపీ యోధాస్‌తో తెలుగు టైటాన్స్ తలపడతాయి.


ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
గుజరాత్ జెయింట్స్	4	3	1	0	16
పట్నా పైరేట్స్	2	2	0	0	10
పుణేరి పల్టన్	2	2	0	0	10
బెంగాల్ వారియర్స్	2	1	0	1	8
యూపీ యోధాస్	2	1	1	0	6
యు ముంబా	3	1	2	0	6
తమిళ్ తలైవాస్	1	1	0	0	5
దబంగ్ ఢిల్లీ	2	1	1	0	5
జైపూర్ పింక్ పాంథర్స్	2	0	1	1	4
బెంగళూరు బుల్స్	3	0	3	0	3
తెలుగు టైటాన్స్	2	0	2	0	1
హరియాణా స్టీలర్స్	1	0	1	0	0

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

165 మంది ప్లేయర్లు... 30 స్థానాలు!

- నేడు డబ్ల్యూపీఎల్ మినీ వేలం
- చమరి అటపట్టు, డాని వైట్‌లపై దృష్టి
- మధ్యాహ్నం 3 గంటల నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం




డాని వైట్


చమరి

ముంబై: ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్ (2024) కోసం మినీ వేలానికి రంగం సిద్ధమైంది. వేర్వేరు దేశాలకు చెందిన 165 మంది మహిళా క్రికెటర్లు ఈ లీగ్ వేలంలో పాల్గొంటున్నారు. అయితే డబ్ల్యూపీఎల్‌లో ఉన్న ఐదు జట్ల కోసం కేవలం 30 స్థానాలు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. వీటిలో గరిష్టంగా 9 మంది విదేశీ క్రీడాకారిణులను ఎంచుకునే అవకాశం ఉంది. గత సీజన్‌లో విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్‌తో పాటు రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్, మూడో స్థానంతో ముగించిన యూపీ వారియర్స్ దాదాపు అదే జట్టును అట్టి పెట్టుకొని తక్కువ మందిని మాత్రమే విడుదల చేశాయి. దాంతో ఆర్‌సీబీ, గుజరాత్ టీమ్‌లలోనే ఎక్కువ ఖాళీలు ఉన్నాయి. ఒక్కో జట్టులో గరిష్టంగా 18 మంది ప్లేయర్లు ఉండాలి. ఐదు జట్లకు కలిపి 90 మంది కాగా అన్ని టీమ్‌లలోనూ కలిపి ప్రస్తుతం 60 మంది ప్లేయర్లు ఇప్పటికే ఉన్నారు. ఒక్కో జట్టు ప్లేయర్ల కోసం గరిష్టంగా రూ. 13.35 కోట్లు కేటాయించాల్సి ఉండగా మినీ వేలం కోసం ప్రస్తుతం అత్యధికంగా గుజరాత్ వద్ద రూ. 5.95 కోట్లు ఉన్నాయి. వేలంలో అందుబాటులో ఉన్న అగ్రశ్రేణి ప్లేయర్లలో ప్రధానంగా ఇద్దరిపై అందరి దృష్టి నిలిచింది. శ్రీలంకకు చెందిన చమరి ఆటపట్టు, ఇంగ్లండ్ స్టార్ డాని వైట్ వేలంలో ఎక్కువ మొత్తం పొందే అవకాశం ఉంది. అద్భుతమైన ఫామ్‌లో ఉండటంతో పాటు వీరి అంతర్జాతీయ అనుభవం డబ్ల్యూపీఎల్‌లో కీలకం కానుంది. వీరిద్దరు రూ. 30 లక్షల కనీస ధరతో వేలంలో నిలిచారు. వీరితో పాటు గత సీజన్ ఆడి జట్లు వదిలేసుకున్న తర్వాత మళ్లీ వేలంలో నిలిచిన ప్లేయర్లలో అనాబెల్ (ఆస్ట్రేలియా), షబ్నిమ్ (దక్షిణాఫ్రికా), దేవిక వైద్య (భారత్), తారా నోరిస్ (అమెరికా), సారా బ్రైస్ (స్కాట్లాండ్) చెప్పుకోదగ్గవారు. ఇంకా భారత సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించని యువ క్రీడాకారిణుల్లో ఉమా, మన్నత్ లాంటివారిపై వేలంలో జట్లు ఆసక్తి చూపించవచ్చు.

జట్టు	ఖాళీల సంఖ్య	మిగిలిన మొత్తం
ఢిల్లీ	3	రూ. 2.25 కోట్లు
గుజరాత్	10	రూ.5.95 కోట్లు
ముంబై	5	రూ.2.10 కోట్లు
బెంగళూరు	7	రూ.3.35 కోట్లు
యూపీ	5	రూ.4 కోట్లు
మొత్తం	30	రూ.17.65 కోట్లు

గెలిస్తేనే... సిరీస్‌లో నిలిచేది

- నేడు ఇంగ్లండ్ మహిళల జట్టుతో భారత్ రెండో టి20
- రాత్రి 7 గంటల నుంచి స్పోర్ట్స్–18లో ప్రత్యక్ష ప్రసారం


హర్మన్‌ప్రీత్, హీతెర్ నైట్

ముంబై: మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్ గెలవాలన్నా... రేసులో నిలవాలన్నా భారత మహిళల జట్టు ఈ రెండో మ్యాచ్ కచ్చితంగా గెలవాల్సిందే. లేదంటే ఇంకో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను ఇంగ్లండ్ సొంతం చేసుకుంటుంది. ఈ నేపథ్యంలో హర్మన్‌ప్రీత్ బృందం కీలకమైన మ్యాచ్‌లో సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమైంది. గతితప్పిన బౌలింగ్‌ను, నిలకడ లోపించిన టాపార్డర్‌ను మెరుగుపర్చుకొని ఇంగ్లండ్‌ను ఓడించాలనే లక్ష్యంతో భారత జట్టు బరిలోకి దిగుతోంది. తొలి టి20లో ఓపెనర్ షఫాలీ వర్మ తప్ప ఇంకెవరూ చెప్పుకోదగ్గ స్కోరే చేయలేదు. హిట్టర్లు స్మృతి మంధాన, వన్‌డౌన్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ గత మ్యాచ్ వైఫల్యాన్ని అధిగమించి తాజాగా ఈ మ్యాచ్‌లో చెలరేగితే భారత బ్యాటింగ్ కష్టాలు తీరతాయి. ఎందుకంటే మిడిలార్డర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఆదుకోగలదు. జట్టు మేనేజ్‌మెంట్ బెంగ ఏదైనా ఉందంటే అది బౌలింగే! సీమర్ రేణుక సింగ్ మినహా మొత్తం బౌలింగ్ విభాగం చేతులెత్తేసింది. దీప్తి శర్మ, పూజ ఒక్క వికెట్ తీయకపోగా... పరుగుల్ని అతిగా సమర్పించుకున్నారు. వికెట్లు తీసిన శ్రేయాంక పాటిల్, సైకా ఇషాక్‌లు కూడా పరుగుల వేగాన్ని అడ్డుకోలేకపోయారు. మరోవైపు తొలిమ్యాచ్‌లో శుభారంభం చేసిన ఇంగ్లండ్ అమ్మాయిల బృందం వరుస విజయంతో ఏకంగా సిరీస్‌పైనే కన్నేసింది. బ్యాటర్లు, బౌలర్లు ఫామ్‌లో ఉండటంతో ఇంగ్లండ్ ఆత్మ విశ్వాసంతో ఉంది. ఇక వేదిక (వాంఖెడె) ఒక్కటే కావడంతో పిచ్ గత మ్యాచ్‌కు భిన్నంగా ఉండదు. బ్యాటింగ్‌కు కలిసొచ్చే వికెట్ కావడంతో బౌలర్లకు కఠిన పరీక్ష తప్పదు.

సెమీస్‌లో మాళవిక



గువాహటి: గువాహటి మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత రైజింగ్ స్టార్ మాళవిక బన్సోద్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో మాళవిక 21–12, 21–16తో కరుపతెవన్ లెట్షానా (మలేసియా)పై గెలుపొందింది. మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో (భారత్) ద్వయం 22–20, 21–16తో జెసితా పుత్రి మియాన్‌తారో–ఫెబి సెతియనిన్‌గ్రమ్ (ఇండోనేసియా) జంటను ఓడించి సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో దొడ్డవరపు అచ్యుతాదిత్య రావు–వెంకట హర్షవర్ధన్ (భారత్) ద్వయం 9–21, 14–21తో చూంగ్ హోన్ జియాన్–హైకాల్ (మలేసియా) జోడీ చేతిలో ఓడిపోయింది.

ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ పిచ్ 'యావరేజ్'



దుబాయ్: వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు ఆతిథ్యమిచ్చిన అహ్మదాబాద్ స్టేడియం పిచ్ సాధారణంగా ఉందని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తేల్చింది. ఐసీసీ ప్రమాణాల ప్రకారం దీనికి 'యావరేజ్' రేటింగ్ ఇచ్చింది. అయితే అవుట్‌ఫీల్డ్ మాత్రం అద్భుతంగా ఉందని కితాబిస్తూ 'వెరీ గుడ్' రేటింగ్ ఇచ్చింది. నవంబర్ 19న జరిగిన వరల్డ్‌కప్ ఫైనల్లో ఆస్ట్రేలియా ఆరు వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. భారత్ 240 పరుగులకే పరిమితమైన ఈ పిచ్‌పై ఆ తర్వాత ఆసీస్ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసింది. ఫైనల్ మ్యాచ్‌కు మ్యాచ్ రిఫరీగా వ్యవహరించిన జింబాబ్వేకు చెందిన ఆండీ పైక్రాఫ్ట్ ఈ నివేదిక అందించారు. మరోవైపు ఆసీస్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన రెండో సెమీస్ నిర్వహించిన కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్ పిచ్‌ను కూడా 'యావరేజ్'గానే పేర్కొన్న ఐసీసీ... భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి సెమీస్ జరిగిన ముంబై వాంఖెడే పిచ్‌కు మాత్రం 'గుడ్' రేటింగ్ అందించింది.



కొరియాపై భారత్ గెలుపు

సాంటియాగో (చిలీ): జూనియర్ మహిళల అండర్–21 ప్రపంచకప్ హాకీ టోర్నీలో భారత జట్టు 9–10వ స్థానాల కోసం పోటీపడనుంది. 9–13 స్థానాల మధ్య వర్గీకరణ మ్యాచ్‌లో భాగంగా దక్షిణ కొరియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 3–1 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున రోప్ని కుమారి (23వ ని.లో), ముంతాజ్ ఖాన్ (44వ ని.లో), అన్ను (46వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. కొరియా జట్టుకు జియున్ చోయ్ (19వ ని.లో) ఏకైక గోల్ సాధించింది. 9–10 స్థానాల కోసం శనివారం అమెరికా జట్టుతో భారత్ ఆడుతుంది.


ఫిలిప్స్

న్యూజిలాండ్‌ను ఆదుకున్న ఫిలిప్స్

తొలి ఇన్నింగ్స్‌లో 180 ఆలౌట్

మిర్పూర్: బౌలర్లు, వాన చినుకులు శాసిస్తున్న రెండో టెస్టులో న్యూజిలాండ్‌ను గ్లెన్ ఫిలిప్స్ (72 బంతుల్లో 87; 9 ఫోర్లు, 4 సిక్సర్లు) ఒంటరి పోరాటంతో ఆదుకున్నాడు. దీంతో శుక్రవారం మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 55/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 37.1 ఓవర్లలో 180 పరుగుల వద్ద ఆలౌటైంది. తద్వారా 8 పరుగులతో స్వల్ప ఆధిక్యాన్ని సాధించింది. 5 పరుగుల వ్యక్తిగత స్కోరుతో ఆట ఆరంభించిన ఫిలిప్స్‌కు సహచరులు మిచెల్ (18), సాన్‌ట్నర్ (1), జేమీసన్ (20), కెప్టెన్ సౌతీ (14)ల నుంచి సహకారం తక్కువే అయినా... వన్డేను తలపించే ధాటిని కొనసాగించడంతో కివీస్‌కు ఆ కాస్త ఆధిక్యం లభించింది. మెహదీ హసన్ మిరాజ్, తైజుల్ ఇస్లామ్ చెరో 3 వికెట్లు, నయీం, షోరిఫుల్ రెండేసి వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన ఆతిథ్య బంగ్లాదేశ్ ఆట నిలిచే సమయానికి 8 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 38 పరుగులు చేసింది. ప్రస్తుతం బంగ్లా 30 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఈ టెస్టుకు రెండు రోజుల ఆట మిగిలుంది. కాగా... ఈ రెండు టెస్టుల సిరీస్‌లో తొలి మ్యాచ్ నెగ్గిన బంగ్లా 1–0తో ఆధిక్యంలో ఉంది.

రెండో స్థానంలో కీర్తిక

సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్–13 చెస్ చాంపియన్‌షిప్ బాలికల విభాగంలో తొమ్మిదో రౌండ్ తర్వాత తెలంగాణ అమ్మాయి బి.కీర్తిక 7.5 పాయింట్లతో అక్షయ సాథి (కర్ణాటక)తో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో ఉంది. శుక్రవారం జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్‌లో కీర్తిక 48 ఎత్తుల్లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నైనా గొర్లిపై గెలిచింది. నైనా గొర్లి ఏడు పాయింట్లతో మరో నలుగురితో కలిసి ఉమ్మడిగా మూడో స్థానంలో ఉంది. 8.5 పాయింట్లతో శ్రేయ (మహారాష్ట్ర) టాప్ ర్యాంక్‌లో కొనసాగుతోంది. ఓపెన్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ కుర్రాళ్లు చల్లా సహర్ష, శ్రీరామ్ ఆదర్శ్ 7.5 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నారు.





జీవనోపాధికి కొక్కొరొకో!

పొదుపు మహిళల అభ్యున్నతికి సరికొత్త కార్యక్రమం

- జిల్లాలో నాటు కోళ్ల పెంపకం, ఉత్పత్తి
- హిఫర్ ఇంటర్నేషనల్ సహకారం
- మొదటి విడతలో 10 మండలాల్లో అమలు
- ప్రతి మండలంలో 100 మంది మహిళలకు మినీ పౌల్ట్రీషెడ్లు

గ్రామీణ పొదుపు మహిళల జీవనోపాధులను మరింత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నాటుకోళ్ల ఉత్పత్తి, పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. ఆసక్తి ఉన్న మహిళలకు మినీ పౌల్ట్రీ షెడ్లు మంజూరు చేస్తోంది.

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెట్‌లో నాటు కోడి మాంసానికి, గుడ్లకు డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలోనాటుకోళ్ల పెంపకంలో రాణించేందుకు వందలాది మహిళలు ఆసక్తి చూపుతున్నారు. మహిళల ఆసక్తి గమనించిన రాష్ట్ర ప్రభుత్వం డీఆర్‌డీఏ-వైకేపీ ఆధ్వర్యంలో మినీ పౌల్ట్రీ షెడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. అనంతపురం జిల్లా నార్పలలో మినీపౌల్ట్రీ షెడ్‌ల ద్వారా మహిళలు విజయవంతంగా రాణిస్తున్నారు. కర్నూలు జిల్లాకు చెందిన డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు నార్పలకు వెళ్లి అధ్యయనం చేశారు. మొదటగా జిల్లాలోని 10 మండలాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇక్కడ విజయవంతం అయితే మిగిలిన అన్ని మండలాల్లో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటారు. నాటు కోళ్ల పెంపకానికి హిఫర్(హెచ్ఐఎఫ్ఈఆర్) ఇంటర్నేషనల్ అనే సంస్థ సహకారం అందిస్తోంది. షెడ్ రూపకల్పన, నిర్మాణం, కోడిపిల్లల పెంపకం తదితర వాటిపై ఈ సంస్థ ప్రతినిధులు మహిళలకు మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తారు.

వెయ్యి మంది మహిళలకు మినీ పౌల్ట్రీషెడ్లు

హిఫర్ ఇంటర్నేషనల్ సంస్థ సహకారంతో ఒక్కో మండలంలో 100 మంది మహిళలకు షెడ్లు నిర్మించనున్నారు. జిల్లాలోని 10 మండలాల్లో వెయ్యి మంది మహిళలకు లబ్ధి చేకూరనుంది. సెంటు స్థలంలో రూ.40 వేలతో షెడ్ నిర్మించి.. కోడిపిల్లలను సరఫరా చేస్తారు. షెడ్ చుట్టూ కాంపౌండ్ తరహాలో పిల్లులు, కుక్కల బెడద లేకుండా కంచె ఏర్పాటు చేస్తారు. కోళ్లు షెడ్, కంచె దాటి బయటికి వచ్చే వీలుండదు. షెడ్ నిర్మాణం పూర్తి అయిన తర్వాత తమిళనాడులోని అసిల్ జాతికి చెందిన ఒక్క రోజు వయస్సు ఉన్న 200 నాటు కోళ్ల పిల్లలను సరఫరా చేస్తారు. వీటిని ఎలా పెంచాలనే దానిపై మహిళలకు హిఫర్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు శిక్షణ ఇస్తారు.



పెరటికోళ్ల పెంపకం.. లాభదాయకం

నాటు కోళ్ల పెంపకాన్ని పరిశ్రమ తరహాలో అభివృద్ధి చేస్తూనే మరోవైపు పెరటికోళ్ల పెంపకాన్ని కూడా చేపడుతున్నారు. పొదుపు మహిళల కుటుంబాల్లో పోషకాహార లోపాలను నివారించడంతో పాటు అదనపు ఆదాయాన్ని పొందేందుకు పెరటి కోళ్ల పెంపకాన్ని చేపడుతున్నారు. 2022-23లో దాదాపు 3000 మందితో పెరటి కోళ్ల పెంపకానికి అవకాశం కల్పించారు. 2023-24లో ఇప్పటి వరకు 900 మంది పొదుపు మహిళలకు నాటు కోళ్లు సరఫరా చేశారు. కిలోకుపైగా బరువు ఉన్న అసిల్ జాతి నాటు కోళ్లు పొదుపు మహిళలకు సరఫరా చేస్తున్నారు. ఒక్కొక్కరి రూ.3,250 ధరతో 8 పెట్టలు, 3 పుంజుల ప్రకారం సరఫరా చేస్తారు. ఒక్కో కోడి ఏడాదికి 120 వరకు గుడ్లు పెడుతుంది. గుడ్లను అమ్ముకొని అదనపు ఆదాయం పొందవచ్చు.

చక్కటి అవకాశం



స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధులను మెరుగుపరిచేందుకు పౌల్ట్రీ పరిశ్రమ చక్కగా తోడ్పడుతుంది. ఇప్పటి వరకు వ్యక్తిగతంగా పొదుపు మహిళలకు పెరటికోళ్ల పెంపకానికి మాత్రమే అవకాశం కల్పించాం. తాజాగా జిల్లాలో నాటు కోళ్ల పెంపకం, ఉత్పత్తికి కూడ చర్యలు చేపట్టాం. ఈ ప్రక్రియ ఈ నెలలోనే కార్యరూపం దాల్చనుంది. జనవరి చివరిలోగా లక్ష్యాలను పూర్తి చేయడానికి కసరత్తు చేస్తున్నాం. నాటు కోళ్ల ఉత్పత్తి, పెంపకం ద్వారా ఒక్కో మహిళ నెలకు రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు ఆదాయం పొందవచ్చు.

– సలీమ్‌బాషా, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ-వైకేపీ

నాటు కోళ్ల ఉత్పత్తి కేంద్రాలు



మినీ పౌల్ట్రీ షెడ్

ప్రతి మండలంలో 100 మినీ పౌల్ట్రీషెడ్లు ఏర్పాటు చేసి, ఇందులో నాలుగింటిని నాటు కోళ్ల ఉత్పత్తి కేంద్రాలుగా అభివృద్ధి చేస్తారు. 96 మంది నాటు కోళ్లను పెంచుతూ.. మాంసం, గుడ్లు అమ్ముకోవచ్చు. నలుగురు మాత్రం నాటు కోళ్ల ఉత్పత్తిని చేపట్టాల్సి ఉంది. గుడ్లు సేకరించడం, వాటిని పొదిగించడం, పిల్లలను పెంచడం చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతుంది. నాటు కోళ్ల ఉత్పత్తి కేంద్రాల నుంచే మిగిలిన 96 మందికి ఎప్పటికప్పుడు నాటు కోళ్ల పిల్లలను సరఫరా చేస్తారు.

దాణా తయారీ కేంద్రాలు

నాటుకోళ్ల ఉత్పత్తి, పెంపకాన్ని ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో వీటికి అవసరమైన దాణాపై కూడా డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు దృష్టి సారించారు. సూక్ష్మ పరిశ్రమల కింద దాణా తయారీ ప్రక్రియను చేపడుతున్నారు. యూనిట్ కాస్ట్ రూ.1.50 లక్షల వరకు ఉండగా... సీఎంఎఫ్ఎంఇ కింద 35 శాతం సబ్సిడీ ఇస్తారు. ప్రతి మండలంలో ఒక దాణా తయారీ కేంద్రం ఏర్పాటు చేస్తారు. మండలంలోని పౌల్ట్రీషెడ్‌లకు ఇక్కడి నుంచి దాణా సరఫరా చేయనున్నారు.



అనంతపురం జిల్లా నార్పలలో పౌల్ట్రీపై అధ్యయనం చేస్తున్న అధికారులు (ఫైల్)

వెదురుతో కళాకృతులు

గిరిజన మహిళల ప్రతిభ ప్రోత్సహిస్తున్న ఉద్యాన వర్సిటీ



తయారుచేసిన వస్తువులు పరిశీలిస్తున్న ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: గిరిజన ప్రాంతాల్లోని మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వెదురుతో కళాకృతులు, ఫర్నీచర్, ఇతర వస్తువుల తయారీలో శిక్షణ ఇస్తున్నారు. వెదురుకు సొబగులు అద్ది కళాకృతులను తయారు చేస్తున్నారు. గిరి సృజన వారే పేరిట మార్కెటింగ్ ఏజెన్సీని ఏర్పాటు చేసుకున్నారు. భూ50 నుంచి 60 అడుగుల ఎత్తు వరకు ఎదిగి, ఒకసారి నాటితే 70 ఏళ్లపాటు దిగుబడి నిచ్చే వెదురును అటవీశాఖ నుంచి ఇటీవలే ప్రభుత్వం ఉద్యాన శాఖ పరిధిలోకి చేర్చింది. వెదురు ఏపుగా పెరిగిన ప్రాంతాలలోని వెదురును తీసుకొచ్చి కళాకృతులుగా మార్చే కార్యక్రమానికి ఉద్యాన విశ్వవిద్యాలయం ఇటీవల శ్రీకారం చుట్టింది. ఏలూరు జిల్లా పరిధిలోని బుట్టాయగూడెం మండలం పరిధిలోని గ్రామాల్లోని మహిళలకు ఐటీడీఏ కెఆర్పురం ద్వారా ఉద్యాన వర్సిటీ పర్యవేక్షణలో 90 రోజుల శిక్షణ ఇచ్చారు.





వెదురు ఆకృతుల తయారీలో మహిళలు

ఉద్యానవర్సిటీ పర్యవేక్షణలో 20 మందికి వెదురు ఎంపిక, కోసే విధానం, వస్తువుల తయారీలో నిపుణులైన మచ్చ మారయ్య, కిచ్చా రామిరెడ్డితో శిక్షణ ఇప్పించారు. వెదురు కళాకృతులు, పెన్‌స్టాండ్, పడవ, ఇల్లు, మంచం, టీపాయి, సోపా, కుర్చీ, పూలబుట్ట, కూరగాయల బుట్టల వంటి తయారీలో శిక్షణనిచ్చారు.

గిరి సృజన ద్వారా విక్రయాలు

శిక్షణ పొందిన మహిళలు గిరి సృజన అనే గ్రూపును ఏర్పాటుచేసుకొని వెదురుతో తయారుచేసిన వస్తువులను విక్రయించే ఏర్పాటు చేసుకున్నారు. పళ్ల బుట్ట రూ.200, పెన్‌స్టాండ్ రూ. 200, పడవ ఆకృతి రూ. 500, ఇంటి ఆకృతి రూ.500, ఫ్లవర్‌వాజ్ రూ.300, మంచం రూ.15,000, సోపాసెట్టు రూ.2500గా నిర్ణయించారు.

జీర్ణక్రియను మెరుగుపర్చడానికి వెదురు మొక్కల ఆకులతో తయారు చేసిన టీ అద్భుతంగా ఉంటుంది. ఈశాన్య రాష్ట్రాలలో వెదురు మొక్క లేత కొమ్ముతో ఊరగాయ పడతారు. ఇలాంటి వాటిపై కూడా శిక్షణనిచ్చే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో కూడా వెదురు సాగు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ రూపొందించడంతో వెదురుతో తయారు చేసే వస్తువులు, వాడకం, వినియోగంపై శ్రద్ధ పెట్టారు. కాలుష్యనివారణకు థర్మల్ విద్యుత్ తయారీలో వెదురు వినియోగించే దిశగా అడుగులు పడుతున్నాయి.

ఆత్మస్థైర్యం నింపింది



వెదురుతో వాణిజ్య హంగులు కలిగిన ఉత్పత్తులు తయారు చేయడంలో పొందిన శిక్షణ, వచ్చే ఆదాయం నాలో ఆత్మ స్థైర్యం నింపింది. ఖాళీ సమయాలలో వెదురు ఆధారిత ఉత్పత్తులు తయారు చేస్తున్నాం. వివిధ మార్గాలలో వాటిని విక్రయిస్తున్నాం,. ఉద్యాన వర్సిటీ శిక్షణ అక్కరకు వచ్చింది.

–కొవ్వాసు సుధారాణి, శిక్షకురాల

ఇంటి ఖర్చులకు సంపాదిస్తున్నాను



ఇంటికి ఉపయోగపడేలా ఆదాయం పొందాలని అనుకునేదాన్ని,. ఇలాంటి తరుణంలో వెదురు ఆధారిత ఉత్పత్తులపై ఇచ్చిన శిక్షణ ఉపయోగపడింది. ఇలాంటి అవకాశం కల్పించిన ఉద్యానవర్సిటీకి, కెవికె వారికి ధన్యవాదాలు.

– కొవ్వాసు వెంకటలక్ష్మి, శిక్షకురాలు

బాలికను నిర్బంధించిన ఉపాధ్యాయుడు

- అదేమని ప్రశ్నించిన కుటుంబ సభ్యులపై కత్తితో దాడి
- ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

పెద్దదోర్నాల: మాయ మాటలతో బాలికను నిర్బంధించిన ఓ ఉపాధ్యాయుడు.. అదేమని ప్రశ్నించిన కుటుంబ సభ్యులపై కత్తితో దాడికి పాల్పడిన సంఘటన ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండల పరిధిలోని ఐనముక్కలలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో బాలిక సోదరుడు కోటపాటి పెద్దబాజి కడుపునకు కత్తితో గాయమైంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై అంకమరావు కథనం మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొమరోలు శ్రీనివాస ప్రసాద్ (47) కొన్ని రోజులుగా లెక్కలు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి వివాహమైంది. భార్య విశాఖపట్నంలో ఉండగా.. ఇతను మరో యువకునితో కలిసి ఐనముక్కలలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సెలవు పెట్టిన ఇతను పాఠశాలలోనే 9వ తరగతి చదువుతున్న బాలికను మాయ మాటలు చెప్పి పాఠశాల నుంచి ఇంటికి రప్పించుకుని ఇంట్లోనే నిర్బంధించాడు. దీంతో విషయం తెలిసిన బాలిక తల్లిదండ్రులు, బంధువులు హుటాహుటిన ఐనముక్కలలోని ఉపాధ్యాయుడి ఇంటికి వెళ్లి బాలిక గురించి ప్రశ్నించారు. దీంతో మొదట తనకు తెలియదంటూ బుకాయించాడు. అనంతరం ఎదురు తిరిగి డైనింగ్ టేబుల్ మీద ఉన్న కత్తితో దాడికి పాల్పడ్డాడని బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై అంకమరావు తెలిపారు. ఈ దాడిలో బాలికకు వరుసకు సోదరుడైన కోటపాటి పెద్దబాజికి కత్తి గాయమైంది. దీంతో క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించి చికిత్స నిర్వహించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుడి విషయమై డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వర్‌ను వివరణ కోరగా ఉపాధ్యాయుడు శుక్రవారం సెలవుపై ఉన్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై ఎంఈఓ మస్తాన్‌నాయక్‌ను విచారణకు ఆదేశించినట్లు చెప్పారు. కేసుకు సంబంధించిన వివరాలు తెలియగానే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు.

అండగా ఉన్నా అక్కసేనా..?

- తుపాను సాయంపై 'ఈనాడు' పచ్చ రాతలు
- రైతులను పట్టించుకోవడం లేదని నిందలు
- ప్రభుత్వం అండగా నిలిచినా దుష్ప్రచారం
- విషపు రాతలపై రైతుల మండిపాటు
- రైతులకు వెన్నుదన్నుగా ప్రభుత్వం
- వానలోనూ ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు
- అందుబాటులో అవసరమైనన్ని గోనె సంచులు

జిల్లాలో ధాన్యం కొనుగోలు లక్ష్యం: 2.52 లక్షల మెట్రిక్ టన్నులు
ఇప్పటి వరకు జారీ చేసిన కూపన్లు: 27,598
ధాన్యం విక్రయించిన రైతులు: 17,523
సేకరించిన ధాన్యం: 1,25,031 మెట్రిక్ టన్నులు
చెల్లించిన నగదు: రూ.170.26 కోట్లు
సంచుల ఆవశ్యకత: 63,00,000
ఆర్బీకేలకు ఇచ్చిన సంచులు: 55,82,567



కడియం మండలంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ కె.మాధవీలత

సాక్షి, రాజమహేంద్రవరం: తుపాను సమయంలో అన్న దాతలకు ప్రభుత్వం అండగా ఉడటాన్ని జీర్ణించుకోలేని 'ఈనాడు' విష ప్రచారానికి తెర తీసింది. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నా సన్నద్ధత లేదంటూ తప్పుడు రాతలకు బరితెగించింది. అవసరమైనన్ని గోనె సంచులు అందుబాటులో ఉంచినా.. అవేమీ పట్టనట్టు కట్టుకథ అల్లింది. తుపాను ప్రభావంతో వర్షం కురుస్తున్నా.. కళ్లాల్లో ధాన్యాన్ని కొంటున్నా.. తేమ పేరుతో కొర్రీలు పెడుతున్నారని ప్రచురించిన అసత్య కథనాన్ని రైతులు చీదరించుకుంటున్నారు. తాము కష్టాల్లో ఉన్నప్పుడు టీడీపీ, జనసేన నేతలు పొలాల వైపు కన్నెత్తయినా చూడలేదని విమర్శిస్తున్నారు. ఇలాంటి నేతలపై ఎలాంటి రాతలూ రాయకుండా.. మంచి చేస్తున్న ప్రభుత్వంపై బురద జల్లుతున్న తీరును ఎండగడుతున్నారు.

ఈనాడు ఆరోపణ-1: అధికార యంత్రాంగం అండ లేక తీవ్రంగా నష్టపోయిన రైతులు.

సమాధానం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరి, ఇతర పంటలు నీట మునిగాయి. ఖరీఫ్ కోతలున్న నేపథ్యంలో ధాన్యం తడిసి, రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అండగా నిలించింది. కలెక్టర్లతో సహా జిల్లా స్థాయి అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లను క్షేత్ర స్థాయికి పంపించి, గింజ కూడా నష్టపోకుండా కొనుగోలు చేసి, అండగా నిలిచింది. ఆన్‌లైన్‌లో ప్రక్రియ ఆలస్యమవుతుందనే ఉద్దేశంతో ఆఫ్‌లైన్‌లో కొనుగోళ్లు చేపట్టింది. తేమ ఉన్నా మిల్లులకు తరలించింది. రైతులకు అవసరమైన సదుపాయాలన్నీ కల్పించింది. రాత్రి వరకూ ఉండి మరీ ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రక్రియ చేపట్టింది. కోనసీమ జిల్లాలో తుపాను రెండు రోజుల వ్యవధిలో ఆఫ్‌లైన్‌లో 48,470 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. తూర్పు గోదావరి జిల్లాలో 8,799 మెట్రిక్ టన్నులు కొన్నారు. ముందస్తుగా అప్రమత్తమై కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు సూచనలు అందించారు. ఇవన్నీ పట్టని ఈనాడు తప్పుడు కథనం ప్రచురించింది.

ఆరోపణ-3: తడిసిన ధాన్యం పరిశీలిస్తున్నారే తప్ప తరలింపునకు చర్యలు లేవు.

సమాధానం: ప్రభుత్వం ఆఫ్‌లైన్‌లో కొనుగోలుకు అవకాశం ఇచ్చింది. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని తేమ శాతం నిబంధనతో సంబంధం లేకుండా కొనుగోలు చేశారు. తేమ శాతాన్ని 17 నుంచి 18కి పెంచారు. కనీస మద్దతు ధర ఇచ్చారు. 19 శాతం ఉంటే కేజీ చొప్పున, 20 శాతం ఉంటే 2 కేజీల చొప్పున తీసుకుని కొనుగోలు చేస్తున్నారు. ఈ పద్ధతిలో కోనసీమలో గురువారం ఒక్క రోజే 9,200 మెట్రిక్ టన్నులు కొన్నారు. ఇది ఈనాడు కళ్లకు కనిపించలేదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఆరోపణ-2: ఏ మూలకూ చాలని సంచులు.

సమాధానం: ధాన్యం సేకరణకు అవసరమైన సంచులను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచారు. తూర్పు గోదావరి జిల్లాకు 63 లక్షల గోనె సంచులు అవసరం కాగా, 232 ఆర్‌బీకేల్లో 55,82,567 (88.61%) సంచులు అందుబాటులో ఉంచారు. ఇవేమీ పరిశీలించకుండా తప్పుడు ఆరోపణలతో కథనం అల్లారు.

ఆరోపణ-4: ఆర్‌బీకేలు ఎందుకంట?

సమాధానం: ధాన్యం కొనుగోలు, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించడంలో కీలక భూమిక పోషిస్తున్న ఆర్‌బీకేలు ఎందుకని ప్రశ్నిస్తుంటే రైతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌బీకేల ద్వారా ధాన్యం విక్రయించినా ఒక శాతం తరుగు తీసుకుంటున్నారని, మరికొందరు బస్తాకు రూ.12 వందలే ఇస్తున్నారంటూ అసత్య కథనం వండి వార్చింది. తేమ శాతాన్ని 17 నుంచి 18కి పెంచి, ఆపై వస్తే కిలో మాత్రమే తీసుకుని కొనుగోలు చేస్తున్నా.. కనీస జ్ఞానం లేకుండా అక్కసు వెళ్లగక్కుతోందని రైతులు అంటున్నారు.



పొలాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి వివేక్ యాదవ్



రాత్రి పూట ధాన్యం తరలింపు ప్రక్రియ చేపడుతున్న వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు



చాగల్లు మండలంలో ధాన్యం తరలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

గోనె సంచులు ఇచ్చారు



బ్రాహ్మణగూడెంలో ఐదెకరాల్లో వరి సాగు చేశాను. 180 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. నవంబర్ నెలాఖరుకు ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించాను. రైస్ మిల్లుకు తరలించిన వెంటనే డబ్బులు పడ్డాయి. ధాన్యం తరించేందుకు ట్రాన్స్‌పోర్ట్ డబ్బులు కూడా ఆలస్యం లేకుండా ఇచ్చారు. అవసరమైన గోనె సంచులు ఆర్బీకేల ద్వారా ఇచ్చారు.

ఉండవల్లి నాగేశ్వరరావు, రైతు బ్రాహ్మణగూడెం


ఆఫ్‌లైన్‌లో కొన్నారు



15 ఎకరాల్లో వరి సాగు చేశాను. 360 బస్తాల దిగుబడి వచ్చింది. తుపాను ప్రభావంతో వర్షం కురవడంతో ఎలా అమ్ముకోవాలో దిక్కుతోచని పరిస్థితి. అధికారులను ఆశ్రయించడంతో ఆలస్యం లేకుండా ఆఫ్‌లైన్‌లో కొన్నారు. ఇప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నారు. ధాన్యం సరఫరాకు ట్రాక్టర్, గోనె సంచులు కూడా సమకూర్చారు. ఎలాంటి ఇబ్బందీ లేకుండా, గింజ కూడా నష్టపోకుండా విక్రయించుకున్నా.

– కొత్తపల్లి సత్యనారాయణ, రైతు, సమిస్రగూడెం, తూర్పు గోదావరి జిల్లా

నిబంధనలతో ఇబ్బంది పెట్టలేదు



రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేశాను. 70 బస్తాల దిగుబడి వచ్చింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంటే ధాన్యాన్ని పొలంలోనే పట్టలు కప్పి ఉంచాను. ఆన్‌లైన్ చేయాలన్న నిబంధనలు ఏమీ లేకుండా అధికారులు ధాన్యం కొన్నారు. వర్షం తెరిపివ్వడంతో ఈ రోజు మిల్లులకు తోలేశాను. అవసరమైన సంచులు అందుబాటులో ఉంచారు.

గూడపాటి పోలేశ్వరరావు, రైతు, సమిస్రగూడెం

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

వణికిస్తున్న సీజనల్ వ్యాధులు

● వాతావరణ మార్పుతో పిల్లలకు అనారోగ్యం
● జలుబు, జ్వర పీడితులతో ఆస్పత్రులు ఫుల్


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జలుబు, జ్వర పీడితులు

కోలారు: గత 15 రోజులుగా జిల్లాలో అధిక సంఖ్యలో పిల్లలు అనారోగ్యానికి గురవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జలుబు, జ్వరాలతో బాధపడుతూ పిల్లలు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. వాతావరణంలో కలుగుతున్న మార్పుల వల్ల పిల్లలతో పాటు పెద్దలు కూడా అనారోగ్యానికి గురవుతున్నారు. పిల్లలలో జలుబు, దగ్గు, జ్వరం కనిపిస్తుండడంతో ఆస్పత్రులు రోగులతో నిండిపోతున్నాయి. ఇటీవల జిల్లాలో చలిగాలులు అధికంగా వీస్తున్నాయి. ఎండ కనిపించడం లేదు. దీని వల్ల ముఖ్యంగా నాలుగేళ్ల వయస్సు లోపు పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారు. జిల్లాలో దాదాపు 50 శాతం మంది పిల్లలు చలి, జ్వరాలతో భాధపడుతున్నట్లు సమాచారం. కొంతమంది పిల్లల్లో వాంతులు, విరేచనాలు కూడా కనిపిస్తున్నాయి. ఐదు రోజులుగా విడవకుండా జ్వరం కనిపిస్తే పిల్లలకు డెంగీ పరీక్షలు నిర్వహించారు. కొంతమందికి డెంగీ సోకినట్లు తేలడంతో వారిని ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

జిల్లా ఆస్పత్రిలో బెడ్‌ల కొరత

నగరంలోని ఎస్‌ఎన్‌ఆర్ జిల్లా ఆస్పత్రిలోని తల్లీ బిడ్డల విభాగంలో పిల్లల కోసం రిజర్వు చేసిన బెడ్‌లు పూర్తిగా నిండిపోయాయి. ఒక్కో బెడ్‌పై ఇద్దరిని ఉంచి చికిత్స చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి బెడ్‌లు లభించక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సామాన్యంగా చలి, జ్వరంతో ప్రారంభమయ్యే వైరల్ జ్వరాలు తదుపరి దశలో న్యూమోనియాగా మార్పు చెందే అవకాశం ఉండడం వల్ల జాగ్రత్తగా ఉండాలని వైద్యులు అంటున్నారు. వరుసగా 5 రోజులు జ్వరం ఉంటే డెంగీ పరీక్షలు చేయించుకోవాలని అంటున్నారు. కఫం ఉండి ఊపిరి తీసుకోవడానికి ఇబ్బందిగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని అంటున్నారు.

నిరంతరంగా జ్వరం ఉంటే డెంగీ పరీక్ష మేలు

రెండు వారాల నుంచి పిల్లలు అనారోగ్యానికి గురవుతుండడం కనిపిస్తోంది. పిల్లల్లో వైరల్ జ్వరాలు, జలుబు, దగ్గు లక్షణాలు కనిపిస్తున్నాయి. వరుసగా ఐదు రోజులు జ్వరం ఉంటే డెంగీ పరీక్షలు చేయించుకోవడం మంచిది.
–డాక్టర్ శ్రీనాథ్, పిల్లల వైద్యనిపుణులు

న్యాయవాది హత్య ఖండనీయం



బీదర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు


హొసపేటెలో వినతిపత్రాన్ని అందిస్తున్న లాయర్లు

రాయచూరు రూరల్: కలబుర్గిలో న్యాయవాది ఈరణ్ణగౌడ పాటిల్ హత్యను శుక్రవారం కలబుర్గి, బీదర్‌లలో జిల్లా న్యాయవాదుల సంఘాలు తీవ్రంగా ఖండించాయి. గురువారం కలబుర్గి కోర్టులో దుండగులు న్యాయవాది ఈరణ్ణగౌడను వెంబడించి హత్య చేయడాన్ని న్యాయవాదులు తప్పుబట్టారు. బీదర్‌లోని బసవేశ్వర సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. బీదర్‌లో ఆ జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మహేష్ కుమార్ పాటిల్ మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదులకు రక్షణ కరువైందన్నారు. భాల్కిలో ధనలక్ష్మి, చిక్కమగళూరులో జిల్లా న్యాయవాదుల సంఘం సభ్యుడిపై పోలీసులు అసభ్యంగా ప్రవర్తించి దాడి చేయడాన్ని ఖండించారు. తప్పు చేసిన వారికి శిక్ష పడేలా చూడాలని, న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరుతూ జిల్లాధికారి గోవిందరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. హేమ, రవికాంత్ పాటిల్, పరమేశ్వర్, కోమల్, అనిల్ కుమార్, శివశంకర్‌లున్నారు.

హొసపేటెలో..

హొసపేటె: చిక్కమగళూరులో న్యాయవాది ప్రీతం గౌడపై పోలీసుల దౌర్జన్యం, దాడిని నిరసిస్తూ నగరంలో శుక్రవారం న్యాయవాదులు మౌన ప్రదర్శన నిర్వహించారు. తమ నిరసన ప్రదర్శనను పునీత్ రాజ్‌కుమార్ సర్కిల్ నుంచి ప్రారంభించి తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ విశ్వజిత్ మెహతాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు సంఘం నేతలు కరుణానిధి, బసవరాజ్ పాల్గొన్నారు.

ముస్లింలకు రిజర్వేషన్ కోసం ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌డీపీఐ కార్యకర్తలు, నేతలు

గంగావతి: ముస్లిం సమాజానికి 8 శాతం రిజర్వేషన్ కల్పించాలని నగరంలో ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జై భీమ్ పార్టీ నేత బీఆర్ భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 17 శాతం ఉన్న ముస్లిం జనాభాకు గతంలో 2బీ కేటగిరి కింద 4 శాతం ఉన్న రిజర్వేషన్‌ను బసవరాజ్ బొమ్మై సర్కారు రద్దు చేసిందన్నారు. తిరిగి ఎన్నికల్లో ముస్లిం సమాజానికి రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పిన సీఎం సిద్దరామయ్య 15కు పైగా కేబినెట్ మీటింగ్‌లు జరిగినా ఆ ప్రతిపాదనను అమలు చేయక పోవడంతో అనివార్యంగా పోరాటాన్ని చేపడుతున్నామన్నారు. బెళగావిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో 11న రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం సమాజం వారు, జై భీమ్ సంస్థ, వెనుకబడిన వర్గాలు పెద్ద సంఖ్యలో చేరి ఈ రిజర్వేషన్లపై ఒత్తిడి తెస్తారన్నారు. కాంతరాజ్ నివేదికను ప్రభుత్వం అంగీకరించాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎస్‌డీపీఐ అధ్యక్షులు సలీం మనియార్, నేతలు మెహబూబ్ పాల్గొన్నారు.

స్వస్థలానికి 30 మంది కార్మికుల తరలింపు


రైలులో పంపడానికి ఏర్పాట్లు చేసిన అధికారులు

రాయచూరు రూరల్: నగరంలో ఇటుకల బట్టీలో పని చేస్తున్న 30 మంది ఒడిశా కార్మికులను అధికారులు స్వస్థలానికి పంపించారు. శాఖవాది గ్రామంలో పనులు చేసుకుంటూ కాలం గడుపుతున్న కార్మికులు తమను స్వస్థలానికి పంపాలని జిల్లా యంత్రాంగానికి విన్నవించుకోవడంతో గురువారం రాత్రి రాయచూరు రైల్వే స్టేషన్ నుంచి అసిస్టెంట్ కమిషనర్ మెహబూబి, తహసీల్దార్ సురేష్ వర్మ వారిని సురక్షితంగా పంపడంతో పాటు భోజన సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా బాలకార్మిక శాఖ అధికారులు మంజునాథ రెడ్డి, శ్యాంమూర్తి, ఎస్ఐ ప్రకాష్ డంబల్, రైల్వే అధికారి ప్రకాష్, రాములున్నారు.

రాజ్‌భవన్ చలో పోస్టర్ల విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న కరియప్ప గుడిమని తదితరులు

కంప్లి: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బెంగళూరులోని ఫ్రీడం పార్క్ నుంచి ఈనెల 26 నుంచి 28 వరకు రాజ్‌భవన్ చలో కార్యక్రమం చేపట్టనున్నట్లు భూ వసతి హక్కు వంచితుల పోరాట సమితి నాయకుడు కరియప్ప గుడిమని తెలిపారు. మాయన శుక్రవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్లను విడుదల చేసిన అనంతరం మాట్లాడారు. తమ పోరాటంలో పోలీసులు తమపై తప్పుడు కేసులు బనాయించారన్నారు. వాటిని వాపసు తీసుకొని భూ వసతి లేని వారికి న్యాయం చేసి పట్టాలు అందించాలని ఒత్తిడి చేశారు. జిల్లా సమితి ప్రముఖులు వసంత్‌రాజ్ కహళె, నీలప్ప, ధనుంజయ, డీఎస్ మరెణ్ణ, మల్లికార్జున, కొప్పళ జిల్లా ప్రముఖులు దుర్గేష్, న్యాయవాది హులుగప్ప పాల్గొన్నారు.

10న ఆరోగ్య పరీక్ష శిబిరం

హుబ్లీ: ధార్వాడ జిల్లా కలఘటిగి తాలూకా బిసిగిగట్టి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 10న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత బృహత్ ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి ప్రేరిత క్షమతా సేవా సంస్థ, భారతీయ వైద్య సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరాన్ని మాజీ ఎమ్మెల్సీ నాగరాజ్ ఛబ్బి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా శిబిరంలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కర్ణాటక కార్డులను కూడా నమోదు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు.

తల్లీబిడ్డల బలవన్మరణం


మరణించిన పిల్లలు


తల్లి లత మృతదేహం

చెళ్లకెరె రూరల్: తల్లి, ఇద్దరు పిల్లలు ఆత్మహత్య చేసుకున్న ఘటన తాలూకాలోని యలగట్టి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లత(25) ఉరి వేసుకోగా, ప్రణీత(5), జ్ఞానేష్(18 నెలలు) అనే ఇద్దరు పిల్లలు స్నానాల గదిలోని నీటి తొట్టిలో శవాలయ్యారు. లత భర్త తిప్పేస్వామి ఎప్పటిలానే ఉదయమే పొలానికి వెళ్లాడు. 11 గంటలు గడిచినా భార్య ఇంకా భోజనం తేకపోవడంతో భోజనం చేయడానికి తిప్పేస్వామి ఇంటికి తిరిగి వచ్చి చూడగా భార్య, పిల్లలు శవాలుగా కనిపించారు. గ్రామస్తుల సమాచారంతో చెళ్లకెరె పోలీసులు గ్రామానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం చెళ్లకెరె ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరమే మృతుల మరణాలకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై చెళ్లకెరె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా పల్లకీ ఉత్సవం


పూజల్లో పాల్గొన్న ట్రస్ట్ ప్రముఖులు, భక్తులు

కంప్లి: గత 19 ఏళ్లుగా మహాకార్తీక ఉత్సవం జరుపుతూ ప్రతి ఏటా మాదిరిగా ఈసారి కూడా కార్తీక మాస చివరి గురువారం పట్టణంలోని షిరిడీ సాయి బాబా ట్రస్ట్ పరంగా సహస్ర కార్తీక దీపోత్సవం, పల్లకీ ఉత్సవాన్ని షిరిడీ సాయిబాబా భక్తులు, ట్రస్ట్ సభ్యులు వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రసాదం అందించారు. కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ఉదయం భక్తులు శిరసాభిషేకం జరిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రముఖులు, అధ్యక్షులు రాంగోపాల్ రెడ్డి, బీ.దేవేంద్రప్ప, కే.వెంకటేష్, వెంకటేశ్వర రావు, భట్టా ప్రసాద్, డీవీ.సత్యనారాయణ, బీ.శ్రీనివాస్, జీవీ బాబు, జీవీ వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, ఇతర పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే నేరం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్జి దయానంద్

రాయచూరు రూరల్: బాలకార్మికులను పనిలో పెట్టుకోరాదని జిల్లా ప్రధాన సీనియర్ జడ్జి దయానంద్ బేలూరు సూచించారు. ఆయన గురువారం నగరంలో ఏర్పాటు చేసిన బాలకార్మికత నిర్మూలన సమావేశంలో మాట్లాడారు. పిల్లలను తప్పనిసరిగా బడికి పంపించాలన్నారు. 14 ఏళ్ల లోపు వయస్సు ఉన్న పిల్లలను పనిలో పెట్టుకునే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల కార్మిక శాఖ అధికారులు ఆరతి, మంజునాథ్‌రెడ్డి, ముదుకప్ప, బీఈఓ చంద్రశేఖర్, పాఠశాల హెడ్‌మాస్టర్ రాఘవేంద్రలున్నారు.

మహత్తర పథకానికి మస్కి ఎంపిక

రాయచూరు రూరల్: మహత్వాకాంక్ష పథకానికి జిల్లాలోని మస్కి గ్రామం ఎంపికైంది. దక్షిణ భారతంలో మస్కి ప్రథమం కాగా రెండోది తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా నార్నూరు ఎంపిక కావడం విశేషం. గ్రామాల్లో జీవన విధానం, అభివృద్ధి, పరిపాలనలో మార్పులు, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని మస్కికి నీతి ఆయోగ్ కమిషన్ నుంచి రూ.1.50 కోట్ల ప్రోత్సాహ ధనం లభించింది. దేశంలో 320 జిల్లాల్లో 500 మహత్వాకాంక్ష తాలూకాల్లో మస్కి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఆరోగ్యం, విద్య, పేదల ఆర్థిక పరిస్థితిలో మార్పులు, వ్యవసాయం వంటి వాటిలో అభివృద్ధికి అవకాశం కల్పించారని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ తెలిపారు.

కోలారు వార్తలు...

స్వయం ఉపాధిపై శ్రద్ధ చూపాలి


జ్యోతి వెలిగిస్తున్న వీసీ హరీష్ రామస్వామి

రాయచూరు రూరల్: నేటి ఆధునిక యుగంలో నిరుద్యోగులు స్వయం ఉపాధిపై శ్రద్ధ చూపాలని రాయచూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ హరీష్ రామస్వామి వెల్లడించారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉద్యోగ శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అధ్యాపకులు విద్యార్థులకు పాఠ్యాంశాలకు తోడు పాఠ్యేతర అంశాలనూ బోధించి వారి జీవనోపాధికి బాట వేయాలన్నారు. రిజిస్ట్రార్ ఎర్రిస్వామి, అధికారులు విశ్వనాథ్, రాఘవేంద్ర, శివరాజప్ప, శివయ్య, యంకణ్ణలున్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం 20న సమావేశం


మాట్లాడుతున్న వెంకటేశప్ప

కోలారు: ఎస్సీ వర్గీకరణ కోసం ఈ నెల 20న నగరంలోని టి.చెన్నయ్య రంగమందిరంలో మాదిగ సముదాయ జిల్లా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కర్ణాటక మాదిగ దండోరా న్యాయ సేవా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు హెచ్ వెంకటేశప్ప తెలిపారు. శుక్రవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. న్యాయమూర్తి సదాశివ కమిషన్ నివేదికను బెళగావి అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశ పెట్టి అమలులోకి తేవాలన్నారు. అనంతరం దీనిని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మాదిగ సముదాయాలు విద్యా, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఎంతో వెనుకబడి ఉన్నాయన్నారు. రాష్ట్ర మాదిగ దండోరా ఉపాధ్యక్షుడు సాహుకార్ శంకరప్ప మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సముదాయ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటస్వామి, జిల్లా గౌరవ అధ్యక్షుడు హూవళ్లి కృష్ణప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.


గోవా గవర్నర్‌కు ఘన స్వాగతం


గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

మాలూరు: తాలూకాలోని ఆలంబాడి గేట్ వద్ద ఉన్న క్రిస్ట్ కళాశాలలో నిర్వహిస్తున్న స్నాతకోత్సవంలో పాల్గొనడానికి వచ్చిన గోవా గవర్నర్ పీఎస్ శ్రీధరన్ పిళ్లైకు శుక్రవారం జిల్లా కలెక్టర్ అక్రంపాషా, ఎస్పీ ఎం.నారాయణ ఘన స్వాగతం పలికారు. ప్రోటోకాల్ ప్రకారం కలెక్టర్, ఎస్పీలు వెళ్లి కట్టిగేనహళ్లి క్రాస్ వద్ద గవర్నర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. గవర్నర్ వెళ్లే మార్గంలో కట్టిగేనహళ్లి క్రాస్ నుంచి ఆలంబాడి వరకు ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు ఏర్పాట్లు చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ కె రమేష్ ఉన్నారు.

ఇందిరా క్యాంటీన్లలో ముద్ద, తోటాకు పప్పు

● సంక్రాంతి తరువాత కొత్త మెనూ



శివాజీనగర: సంక్రాంతి పండుగ తరువాత ఇందిరా క్యాంటీన్లలో కొత్త మెనూ చేరబోతోంది. వినియోగదారులకు ముద్ద, తోటాకు పప్పు, చపాతి భాగ్యం లభించనుంది. బీబీఎంపీ పరిధిలోని ఇందిరా క్యాంటీన్‌లలో మధ్యాహ్నం, రాత్రి సమయంలో ముద్ద, చపాతి భోజనం ఇవ్వటానికి తీర్మానించారు. క్యాంటీన్‌లకు వచ్చే అనేక మంది వృద్ధులే కావడంతో వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అన్నం కాకుండా ముద్ద, చపాతి ఇవ్వనున్నారు. మధ్యాహ్నం, రాత్రి సమయంలో ముద్ద, చపాతి ఇవ్వాలని బీబీఎంపీ ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించారు. ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో పాటు ఇందిరా క్యాంటీన్ల వినియోగదారుల సంఖ్యలో గోల్‌మాల్ జరుగుతుందనే ఆరోపణ నేపథ్యంలో ఇందిరా క్యాంటీన్ బిల్లుల డిజిటలీకరణ, పారదర్శక వ్యవస్థ జారీలోకి తీసుకొచ్చేందుకు బీబీఎంపీ సిద్ధమైంది. నగరంలో ఏ ఇందిరా క్యాంటీన్‌లో వినియోగదారులు భోజనం కూపన్ తీసుకున్నారో నేరుగా ప్రధాన కార్యాలయానికి సమాచారం వస్తుంది. ఇందుకోసం ప్రత్యేక యాప్ తయారీకి బీబీఎంపీ సిద్ధమవుతోంది.

టెన్త్ ఫలితాల కోసం ప్రత్యేక తరగతులు


మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి కృష్ణప్ప

కోలారు: ఈఏడాది మెరుగైన పదో తరగతి ఫలితాల కోసం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు పదో తరగతి జిల్లా నోడల్ అధికారి కృష్ణప్ప తెలిపారు. మాస్తి పబ్లిక్ పాఠశాలలో టెన్త్ విద్యార్థులతో నిర్వహించిన సంవాద కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉన్నత విద్య పరీక్షా మండలి మొదటి సారిగా మూడు టెన్త్ పరీక్షలను నిర్వహిస్తోందన్నారు. విద్యా శాఖ అందించిన నన్నన్నొమ్మె గమనిసి అధ్యాయం వారీ ప్రశ్నోత్తరాలను, అభ్యాసాలను బాగా చదువుకోవాలన్నారు. టెన్త్ ఫలితాల్లో జిల్లా ఈసారి మొదటి స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి 25 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్నందున ప్రతి విద్యార్థిని పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. పిల్లల్లో అభ్యసనాన్ని మెరుగు పరచడానికి, గుణాత్మక ఫలితాల కోసం విద్యాశాఖ అందించిన సంపన్మూల పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: చట్టాలపై అవగాహన పెంచుకుంటే సమాజంలో సౌహార్దయుత జీవితాన్ని గడపవచ్చని సీనియర్ సివిల్ జడ్జి సునీల్ ఎస్ హొసమని తెలిపారు. శుక్రవారం తాలూకాలోని క్యాలనూరు పబ్లిక్ పాఠశాలలో న్యాయ అవగాహన సహాయ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాజ్యాంగం మనకు అందించిన మౌలిక హక్కులను సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి కూడా అందించాల్సిన బాధ్యత న్యాయ సేవల ప్రాధికారంపై ఉందన్నారు. బాలకార్మికులు, బాల్య వివాహాల గురించి తెలిస్తే 1098కు ఫోన్ చేసి సంబంధిత అధికారుల దృష్టికి తేవాలన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్, రామలింగప్ప, ధన్యకుమార్, రాజేష్, రామాంజప్ప, ఎంఆర్ నాగరాజ్ పాల్గొన్నారు.

గ్రామ దేవతకు 101 టెంకాయల సమర్పణ


అలంకరణలో గ్రామ దేవత దుర్గాదేవి


టెంకాయలను కొట్టి మొక్కు తీర్చుతున్న దృశ్యం

● కుమార్తె వ్యాధి నయం కావడంతో ముస్లిం మహిళ మొక్కు చెల్లింపు

గంగావతి: లౌకిక వాదానికి సంకేతంగా ఓ ముస్లిం మహిళ తన కుమార్తె ఆరోగ్యం నయం కావడంతో శుక్రవారం 101 టెంకాయలను గ్రామ దేవత దుర్గాదేవికి కొట్టి మొక్కు చెల్లించారు. నగరంలోని జులై నగర్‌కు చెందిన షాజహాన్ అనే మహిళ కుమార్తె అనారోగ్యానికి గురి కావడంతో గ్రామ దేవతకు మొక్కుకున్నానని, అమ్మ కృపా కటాక్షం వల్ల వ్యాధి నయమైందని, అందుకే గ్రామ దేవతకు మొక్కు చెల్లించామని ఆమె తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

బాగేపల్లి: చిక్కబళ్లాపురం జిల్లా బాగేపల్లి తాలూకా యల్లంపల్లి గ్రామం వద్ద బుధవారం జరిగిన గజేంద్ర అనే వ్యక్తి హత్యోదంతంలోని మిస్టరీని బాగేపల్లి పోలీసులు ఛేదించారు. కేసుకు సంబంధించి గ్రామానికి చెందిన సురేంద్రబాబు, శ్రీనాథ్, వెంకటేష్ అనే నిందితులను అరెస్ట్ చేశారు. యల్లంపల్లి గ్రామానికి చెందిన గజేంద్రను నిందితులు పాతకక్షల నేపథ్యంలో అతన్ని దొడ్డమ్మ ఆలయం వద్దకు పిలిపించి కొడవళ్లతో దాడి చేసి నరికి హత్య చేసి మృతదేహాన్ని నడిరోడ్డులో వేసి ఉడాయించారు. చిక్కబళ్లాపురం జిల్లా ఎస్పీ నాగేష్, డీసీపీ శివకుమార్ ఆదేశాలతో సీఐ ప్రశాంత్ వర్మ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా గాలింపు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

విద్యా నిపుణుడు మృతి


శ్రీరామరెడ్డి(ఫైల్)

శ్రీనివాసపురం: తాలూకాలోని ఇమరకుంట గ్రామంలో విద్యా నిపుణుడుగా, కోలారు కలాంగా ప్రఖ్యాతి గాంచిన ఎం.శ్రీరామరెడ్డి(84) గురువారం రాత్రి మృతి చెందారు. గుండె పోటుకు గురైన ఆయనను పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా నివృత్తి అయిన అనంతరం భైరవేశ్వర విద్యా సంస్థను స్థాపించి అభివృద్ధి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆయన చేసిన విద్యా సేవకు గుర్తింపుగా ఆయనకు చుంచశ్రీ అవార్డు లభించింది. ఆయన మృతికి పలువురు ప్రముఖులు సంతాపం వెలిబుచ్చారు.

క్లుప్తంగా

క్రికెట్ పోటీలు ప్రారంభం

హుబ్లీ: నగరంలో రెండు రోజుల పాటు జరగనున్న క్రికెట్ టీమ్ చాంపియన్ నెట్ వర్సెస్ కర్ణాటక స్టార్స్ స్పోర్ట్స్ క్లబ్ క్రికెట్ పోటీలను గురువారం వెంకటేష్ కాట్వే ప్రారంభించారు. క్రికెట్ కోచ్ ముఖ్యస్థులు సందేశ బైలప్పనవర్ మాట్లాడుతూ వెంకటేష్ కాట్వే క్రీడా ప్రేమికుడు, క్రికెట్ అంటే ఆయనకు పంచప్రాణాలు, నేటి యువతకు ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. తమ సంస్థ వీఏకే ఫౌండేషన్ ద్వారా ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. సదరు కార్యదర్శి అహ్మద్ కిత్తూర్, సీనియర్ క్రికెటర్ డాక్టర్ లింగరాజ బిళెకల్, హెడ్‌కోచ్ చాంపియన్ నెట్ ఇన్ జయరాజ నూల్వి పాల్గొన్నారు.

హక్కులను కాపాడుకోవాలి


మాట్లాడుతున్న పీడీఓ సావిత్రి

కంప్లి: తమ సమస్యలపై జీపీల్లో వినతిపత్రాలను అందించాలని, హక్కులను కాపాడుకోవాలని పీడీఓ సావిత్రి తెలిపారు. దేవసముద్రలో పిల్లల హక్కులపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలలో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల దుస్థితిని సరిచేయాలని, బడికి దూరమైన పిల్లలను బడికి రప్పించాలన్నారు. అంగన్‌వాడీ పిల్లలకు ఆట వస్తువులు అందిస్తామన్నారు. పిల్లల అభివృద్ధితో దేశాభివృద్ధి సాధ్యమన్నారు. జీపీ అధ్యక్షులు, సభ్యులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పల బాధతో రైతు ఆత్మహత్య

హుబ్లీ: అప్పుల బాధ తాళలేక ఓ అన్నదాత ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలోని నవలగుంద తాలూకా కుమారకొప్ప గ్రామంలో శుక్రవారం వెలుగు చూసింది. ఆ గ్రామానికి చెందిన వీరబసప్ప(48) అనే రైతు ఈసారి ఖరీఫ్‌లో వానలు సక్రమంగా కురవక పంట దిగుబడి లేకపోవడంతో వ్యవసాయం కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలన్న బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన ప్రైవేట్ సంస్థల్లో అప్పులు చేశాడని మృతుడి భార్య సావిత్రి నవలగుంద పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మురుగుతో దుర్గంధం


నిల్వ చేరిన మురుగునీరు

కంప్లి: తెక్కలకోటె పట్టణంలోని 9వ వార్డులో ఎదురు బసవణ్ణ ఆలయ ముందు, మార్కెట్ కాంప్లెక్స్ పక్కన మురుగు నీరు నిల్వ చేరి దుర్గంధం వెదజల్లుతోంది. మార్కెట్‌కు రాకపోకలు సాగించే ప్రజలు ముక్కు మూసుకొని వెళ్లే దుస్థితి నెలకొంది. ఈ విషయమై పట్టణ పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం శూన్యం. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు ఒత్తిడి చేస్తున్నారు.

అంబేడ్కర్‌కు కొవ్వొత్తులతో నివాళి


కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న దృశ్యం

కంప్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహా పరినిర్వాణ దినం పురస్కరించుకుని గురువారం అంబేడ్కర్ చిత్రపటంతో కొట్టూరు పట్టణంలోని గాంధీ సర్కిల్ నుంచి ఊరేగింపుగా పాదయాత్ర జాతా చేపట్టారు. అనంతరం కొవ్వొత్తులలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీ.మరిస్వామి మాట్లాడుతూ తరతరాలుగా దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను ఖండిస్తూ సమసమాజ నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేసిన అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం అన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


ప్రారంభిస్తున్న జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ సురేంద్రబాబు

రాయచూరు రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, అందువల్ల రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖాధికారి సురేంద్రబాబు పిలుపు ఇచ్చారు. శుక్రవారం నగరంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రాయచూరు వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్)కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడే వారికి, ప్రాణాపాయ సమయంలో ఉన్న వారికి రక్తదానం వల్ల ఎంతో మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అమ్జద్ హుసేన్, మల్లికార్జునలున్నారు.